జాతక కథలు

అయిదవ సంపుటి

పాలీభాషనుండి ఆంధ్రీకరించినది

స్వామి శివశంకర శాస్త్రి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కళాభవన్ - హైదరాబాదు - 4

ప్రథమ ముద్రణము 1971
ప్రతులు 1000

వెల రూ. 6—50

ముద్రణ:
బి. వి. ఆర్. బాల్‌రెడ్డి అండ్ కంపెని,
పార్క్‌లేన్, సికింద్రాబాద్.

అం కి త ము

ఆప్తులు మాన్యశ్రీ

బెజవాడ గోపాల రెడ్డి

మహోదయులకు

ఆశీరాదరపూర్వకముగా

విజ్ఞాపన

బుద్ధుని జాతక కథా సందోహమున 547 కథలు కలవు.

సాహిత్యసృష్టి, సాహిత్యదోహదము, సాహిత్యప్రచారము చేయుచు, ఉత్తమగ్రంథ ముద్రణకు ధనసాహాయ్యముచేయు మహాసంస్థ ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ. ఈ యున్నత పరిషత్తు దీనిముద్రణ, ప్రకటన భారము వహించినందులకు సంస్థకు – విశేషించి, ఏతదధ్యక్షులు మహామాన్యశ్రీ, సాహిత్యాచార్య, బెజవాడ గోపాల రెడ్డి గారికినీ, కార్యదర్శి పూజ్యశ్రీ దేవులపల్లి రామానుజ రావుగారికిని ధన్యవాదములు.

పాలి భాషలోని ఈ కథాసందోహము మాతృక ననుసరించి మూలాతిక్రమణము కాకుండ ఆంధ్రీకరించినాను. పాలిభాషలోని గాథలలో ఛందస్సు ఋజుమార్గమున నడువదు. ఆఛందస్సుల ననుసరించి పద్యరచన చేయుటకు వలను పడదు; చేసినను ఆంధ్ర సాహిత్య సరణికి సరిపడదు. కావున దీర్ఘములు కాని ఆటవెలది, తేటగీతి, మంజరీ ద్విపది, భామినీ షట్పది(ముత్యాల సరము) పంక్తులలో అనువాదము కావించినాను. చెప్పినదే తరుచుగా చెప్పుచుండుట గద్యములో కాని, పద్యములో కాని చమత్కార హేతువగును. ప్రాచీన కథన ధోరణి ఇట్టిది. దేశీయ గీతములలో కూడ ఈవిధానమే గోచరించును. పునరుక్తి అతివేల మయినప్పుడు సందర్భోచితముగా సంగ్రహించినాను. ప్రథానాశయ మేమాత్రము తొలగి పోవకుండ జాగరూకత వహించినాను.

ఆంధ్రప్రదేశములోని అన్నిమండలముల వారికిని నాతిశ్రమతో సుబోధము అగునట్లు సరళగ్రాంధిక భాషను. సరళశైలిని అవలంబించినాను. ఈ విధానము శిష్టవ్యావహారిక భాషాశైలికి సన్నిహితముగా నుండునని విజ్ఞుల యాశయము.

సాహితీ సమితి,
ఒంగోలు: జూన్ 21, 1971

స్వామీ శివశంకరస్వామి

విషయానుక్రమణిక

సంపుటి 5 :   484—521

---

484. సాలి కేదార జాతకము

శాస్త్ర జేతవనములో విహారము చేయుచు, మాతృ సేవ చేయు భిక్షువును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఈ కథ సామజాతకమున, (540) వచ్చును. శాస్త్ర ఆ భిక్షువును పిలిపించి "భిక్షూ, నీవు నిజముగా గృహస్థులను పోషించుచున్నావా ?" అని యడిగెను. "భన్తే, సత్యమే". "వారు నీ కేమగుదురు?" "భన్తే, తలిదండ్రులు". "భిక్షూ, మంచిది, పురాణపండితులు చిలుకకడుపున పుట్టినను వృద్ధమాతా పితలను గూటిలో పరుండబెట్టి ముక్కున ఎర కరచుకొని వచ్చి పెట్టుచుండెడి వారు" అని, శాస్త్ర పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున రాజగృహమున మగధరాజు రాజ్యము చేయు చుండెను. ఆకాలమున నగరమున కీశాన్యదిశలో సాలిందియ మను అగ్ర హారము కలదు. దానికి ఈశాన్యమున మగధదేశ భూములు కలవు. అచట కోసియగోత్ర నామక బ్రాహ్మణుడు, సాలిందియ నివాసి, వేయి కరీషముల భూమి కైకొని, అందు సాలిధాన్యబీజములు చల్లెను. గింజలు మొలక లెత్తగానే గనుములు వేసి ఒకానొకనికి ఏబదికరీషములు, వేరొకనికి అరువది కరీషములు, తనవారికి మొత్తము 500 కరీషముల భూమి అమరకమున కిచ్చి, మిగిలిన 500 కరీషముల భూమి ఒకనికి మక్తా కిచ్చెను. అచట బ్రాహ్మణుడు కుటీరము నిర్మించుకొని నివసింపజొచ్చెను. పొలమున కీశాన్యదిశలో గుట్ట ప్రక్కన పెద్ద శాల్మలీ వృక్ష మున్నది. అందు చిలుక లనేకములు నివసించు చుండును. ఆ కాలమున బోధిసత్త్వుడు ఆశుకమండలికి రాజగువానికి పుత్రు డై పుట్టి, పెరిగి పెద్దవాడై నపిదప సుందరుడు, శక్తిమంతుడు నయ్యెను. అతనిశరీరము బండిచక్రపు కుండంత పరిమాణమున నుండెను.

ఆతనితండ్రి వార్ధకము వచ్చినపిదప "ఇప్పుడు నేను దూరము పోజా లను నీవు ఈ మండలికి నాయకత్వము వహింపుము" అని కుమారునకు ప్రభుత్వము సమర్పించెను. నాటినుండి బోధిసత్త్వుడు తలిదండ్రులను ఆహార మునకై పోవవల దనెను. శుకసమూహముతో హిమాలయమునకు జని అచట స్వయముగా శాలికేదారములలో యథేచ్ఛముగా ధాన్య మారగించి మరలి వచ్చునపుడు తలిదండ్రులకు సరిపోవునంత మేత కొనివచ్చి పోషించు చుండెను. ఒకనా డాతడు చిలుకలతో "ఇదివరలో ఈఋతువున మగధ భూములలో ధాన్యము పంటకు వచ్చెడిది. ఇప్పు డె ట్లున్నది ? పోయి వివర ములు కనుగొని రండు" అని రెండుచిలుకలను పంపెను. అవి పోయి మగధ దేశభూమిపై దిగునపుడు బ్రాహ్మణుడు మక్తా కిచ్చినపొలముపై వాలి, శాలిధాన్యము తిని, ఒక్కగింజ కరచుకొని పోయి బోధిసత్త్వుని చరణ సన్నిధిలో నుంచి, అచటి ధాన్య మి ట్లుండు నని విన్నవించినవి. బోధి సత్త్వుడు మరునాడు శుకసమూహముతో ఆ క్షేత్రమునకు పోయి వాలెను. చిలుకలు ధాన్యము తిన నారంభింపగానే యెచటినుండియో జనులు చిలుక లను తరిమిరి; అయినను వాని నాప లేకపోయిరి. చివరిచిలుక గూడ ధాన్యము తిని వట్టినోటితోడనే చనెను. కాని శుకరాజు తలిదండ్రులకై వలసి నన్నిగింజలు చిలుకలచే పట్టించుకొని పోయెను. మరునాటినుండియు చిలుక లచటి ధాన్యమునే తినజొచ్చినవి.

అప్పుడు పొలముకాపరి తనలో "ఇవి ఈ ప్రకారముగా తినుచో కొలదిరోజులలో పొలమున ధాన్య మేమియు మిగులదు. బ్రాహ్మణుడు ధాన్యముఖరీదు కట్టి నాపై వేయగలడు. పోయి ఆతని కీవిషయము తెలిపె దను," అనుకొని గుప్పెడుధాన్యము పట్టుకొని తగినకానుక కొని, బ్రాహ్మ ణుని సమీపించి, ప్రణామము చేసెను.

"ఏమయ్యా, పొలమున ధాన్యము బాగుగా పండినదా?" అని బ్రాహ్మణు డడిగెను.

అతడు "చిత్తము, బ్రాహ్మణోత్తమా!" అని రెండు గాథలు పలికెను :

సంవన్న మైనట్టి శాలిధాన్యమును
చిలుకలపిండు భక్షించును విప్ర!
చెప్పెద నీకు కోసియ, ఒక్కమాట-
వాని నివారించు వాంఛయే లేదు!

అన్నిపిట్టలకన్న నందమౌ శుకము
తిని యథేచ్ఛగ ధాన్యమును, ముక్కునిండ
గొనిపోవుచున్నది కొన్నిగింజలను.

బ్రాహ్మణు డాతనివాక్కులు విని చిలుకయెడ ప్రీతి కలవాడై కాప రితో "ఓయీ, నీకు వల పన్నుట తెలియునా?" అని వాని నడిగెను.

"చిత్తము, తెలియును" అని వాడు పలికెను.

బ్రాహ్మణు డీగాథ పలికెను :

కేశనిర్మిత మైనపాశంబు వేయ
చిక్కును విహగంబు; జీవంబుతోడ
పట్టి యద్దాని నాపజ్జకు తెమ్ము.

విని కాపరి ప్రసన్నచిత్తుడై, భూమివిలువ లెక్కించి, నెత్తిపై ఋణము పడు ననుభయను లేకుండెను. చని ఆతడు గుర్రపుతోకలో వెంట్రుకలు లెక్కించి, నాడు శుకరాజు దిగుతావు గ్రహించి అచట వల పన్నెను. మరునాడు ప్రాతఃకాలమున నాతడు గొయ్యి త్రవ్వి దానిపై వల పన్ని, కుటీరపుగడపపై కూర్చుండి చిలుకలరాక కెదురు చూడజొచ్చెను. శుకరాజు జిహ్వాచాపల్యము లేనివా డగుటచే వెనుకటిరోజున ధాన్యము తిన్నచోట పన్నినవలలో తెలియక చిక్కుకొనెను. తనపాదమున కురి తగులుకొన్న దని తెలిసికొని ఆతడు తనలో "నేను వలలో తగులుకొన్నట్లు ధ్వని చేసినచో నాసంబంధులు మేత మేయక భయమున పరుగువారుదురు. శుకములు మేత మేయునంతవరకు సహించెదను" అనుకొని చిలుకలు ధాన్యము తిన్నతరువాత వలలో తాను చిక్కుకొని మరణభీతి నొందినట్లు మూడుమారులు కుయ్యి పెట్టెను. పిట్ట లన్నియు నెగిరిపోయినవి. అంతట శుకరాజు తనలో

"నావార లిందరున్నను ఒక్కడుకూడ ఆగి నావైపు చూడలేదు. నే నేమి పాపము చేసితిని!" అని విలపించుచు ఈగాథ పలికెను :

విహగంబు లన్నియు వెడలి పోయినవి
తిని, త్రాగి; నే జిక్కితిని జాలమందు
నొక్కడ- నేపాప మొనరించినానో !

కాపరి శుకరాజు విలాపము విని, ఆకసమున నెగిరిపోవుచున్న చిలుకలచప్పుడు విని యే మిది యని వెరగు చెంది, కుటీరము వెలువడి వల పన్నినచోటు చేరి, శుకరాజు చిక్కువడియుండుటకు సంతసించి, వలలో నుండి చిలుకను వెలువరించి రెండుపాదములు బంధించి శాలిందియ గ్రామము చేరి, దానిని బ్రాహ్మణున కిచ్చెను. బ్రాహ్మణుడు మిక్కిలి ప్రీతి కలవాడగుటచే బోధిసత్త్వుని రెండుచేతులతో బాగుగా పట్టుకొని ఒడిలోనికి చేర్చుకొని సంభాషించుచు ఈగాథలు పలికెను :

ఉదర మన్యుల కైన ఉదరంబు, నీదో
అత్యుదరం బగు ననిపించు శుకమ !
మ్రింగి ధాన్యం బిచ్చమేరకు, గింజ
లెన్నో ముక్కున బట్టి యేగుచున్నావు.

నిజముగా నాతోడ నీకు వైరంబు :
ఏప్రదేశమునకు నీగింజ లెల్ల
కొనిపోయి నింపెదు కొట్టునింపగను ?

విని శుకరాజు మనుష్యవాక్కున మధురముగా ఈగాథ పలికెను :

లేదు విరోధంబు, లేదు కోపంబు;
ఋణవిముక్తుడ నయి, ఋణ మిచ్చువాడ,
సేమరవనము జేరి యచ్చోట
చేకూర్తు నిధిని కోసియ, గ్రహింపు !

అప్పుడు బ్రాహ్మణు డిట్లనెను :

ఎట్టిది నీ విచ్చుఋణము శుకంబ ?
ఋణవిముక్తి ఘటిల్లు టెట్టు ? లేరీతి

నిధి సమకూర్తువో నీవు సూచింప,
పాశవిముక్తిలాభము కల్గు నీకు.

ఈ ప్రకారముగా బ్రాహ్మణుడు ప్రశ్నించినంత శుకరాజు ఆయన కెరుక చేయువాడై ఈ గాథలు పలికెను :

ఉన్నారు పరిపుష్టి నొందని చిన్ని
బిడ్డలు కోసియా, పెరిగిన పిదప
నన్ను పోషింప ఋణం బిత్తు నిపుడు.

నాతలిదండ్రులు లైనారు ముసళ్ళు,
కొనిపోయి వారలకోసమై నేను
చంచూపుటంబున శాలిధాన్యంబు
పూర్వపు ఋణముక్తి పొంద గల్గుదును.

అచ్చోట కలవు విహంగము లెన్నొ
క్షీణపక్షంబులు జీర్ణశక్తులును
ఇత్తు వానికిగూడ నేను పుణ్యాశ-
నిధి యని దాని పండితులు పల్కుదురు.

ఎరుగుము కోసియా, యిదె ఋణదాన,
మిద్దియే ఋణముక్తి, యిద్దియే నిధిగ.

బ్రాహ్మణుడు బోధిసత్త్వుని ధర్మకథనము విని ప్రసన్నచిత్తుడై ఈ గాథలు పలికెను :

ఎంతయు ధార్మిక మీద్విజోత్తమము !
కొందరు మానవులందైన నిట్టి
పరమధర్మము కానబడ దెన్నడేని.

నీజాతి సంబంధి నిఖిలంబుతోడ
ధాన్యంబు తినుము యథారుచి శుకమ !
మరల ఘటిల్లును మనసమాగమము-
మెండుగ ప్రియదర్శనుండవు నీవు !

ఆయన ఈ విధముగా బోధిసత్త్వుని ప్రార్థించి తన ప్రియపుత్రుని చూచినట్లు శుకరాజును చూచుచు పాదబంధము విడిపించి, నూరుపుటములు వేసిన తైలమును పాదములకు మర్దనము చేసి, అందమయిన పీటపై కూర్చుండబెట్టి బంగరుస్థాలిలో మధువు త్రాగించెను. అంతట శుకరాజు "బ్రాహ్మణోత్తమా, అప్రమత్తుడవై యుండుము" అని ఉపదేశ మిచ్చువాడై ఈ గాథ పలికెను :

అన్నపానీయము లారగించితిమి
నీయింట కోసియా, నీయెడప్రీతి !
దాన మొసంగుము త్యక్తదండులకు,
పితరుల వృద్ధుల ప్రీతి బోషించు.

ఆలకించి బ్రాహ్మణుడు ప్రసన్నుడై, యుల్లాసము వెలిబుచ్చుచు ఈ గాథ పలికెను :

ద్విజముల శ్రేష్ఠమున్ వీక్షించినాను,
ఈనాడు లక్ష్మి ప్రాప్తించెను నాకు
శుక సుభాషితములు శ్రోత్రముల్ నిండ
రకరక పుణ్యకార్యంబు లొనర్తు.

బోధిసత్త్వుడు బ్రాహ్మణు డిచ్చిన వేయి కరీషములు స్వీకరింపక కేవలము ఎనిమిది కరీషములు స్వీకరించెను. బ్రాహ్మణుడు ఆయనకు భూమి సమర్పించి చేతులు జోడించి "స్వామీ. దయ చేయుడు. విలపించుచున్న తలిదండ్రులను ఓదార్పుడు" అని సెలవు తీసికొనెను. శుకరాజు ప్రసన్నచిత్తుడై గింజలు కొనిపోయి తలిదండ్రులసన్నిధిలో నుంచి "అమ్మా, నాయనా, లెండు" అని పలికెను. వారు ఊరడిలి ప్రసన్నవదనులైరి. ఆ సమయమున చిలుకలు ఒకచో చేరి "దేవా, ఎట్లు విముక్తి పొందితిరి ?" అని అడిగినవి. శుకరాజు వృత్తాంతము సవిస్తరముగా తెలిపెను.

కోసియ బ్రాహ్మణుడు శుకరాజు చేసిన ఉపదేశప్రకారము నడచుకొనుచు, నాటినుండి ధార్మికశ్రమణ బ్రాహ్మణులకు భూరిదానము లిచ్చుచుండెను.

ఈ యభిప్రాయమును ప్రకటించుటకై శాస్త ఈ గాథ పలికెను:

ఔదార్యము వహించి ఆకోసియుండు
శాంతచిత్తంబుతో శ్రమణ విప్రులను
సంతృప్తహృదయులన్ సలిపినవాడు
అన్నపానము లిచ్చి అధికంబుగాను.

శాస్త ఇట్లు ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ఈ విధముగా తలి దండ్రుల పోషణ పండితపరంపరకు సంప్రదాయము" అని ఆర్యసత్యములను ప్రకటించి, జాతకములు సరిపోల్చెను. సత్యప్రకాశనానంతరము ఆ భిక్షువు శ్రోతాపత్తిఫలమున ప్రతిష్ఠితు డయ్యెను.

ఆ కాలమున శుకమండలి బుద్ధపరిషత్తు; తలిదండ్రులు మహారాజ కులము; కాపరి ఛన్నుడు; బ్రాహ్మణుడు ఆనందుడు; శుకరాజు నేనే.

—):o:(—

485. చంద కిన్నర జాతకము

శాస్త కపిలపుర- ఆశ్రమమునుండి న్యగ్రోధ- ఆరామమున విహారము చేయుచు, రాజభవనమున రాహులమాతవిషయమై చెప్పినది.

వర్తమాన కథ

ఈ జాతకము "నిదానము"నుండి ఆరంభించి ఈయవలసినది. నిదాన కథ లట్ఠివనమున ఊరువేల కస్సపుని సింహానాదము అపణ్ణక జాతకమున చెప్పబడినది. దానికి ముందు కపిలవస్తుగమనము వేస్సంతర జాతకమున వచ్చును శాస్త తండ్రియింట భోజనమునకు పూర్వము మహాధమ్మపాల జాతకము చెప్పెను. భోజనానంతరము రాహులమాత నివాసమందిరమునకు బోయి చందకిన్నర జాతకము చెప్పదలచుకొని, రాజుచేతిలోనిపాత్ర తీసికొని, అగ్రశ్రావకు లిరువురను వెంటనిడుకొని ఆమెనివాసమందిరము చేరెను. ఆ సమయమున నామెయధీనములో నలుబదివేల నర్తకీజన ముండెను. వారిలో వేయిమంది క్షత్రియకన్యలు. తథాగతుడు వచ్చు నని విన్నంతనే ఆమె వారి నందరిని కాషాయాంబరములు ధరింప నాన తిచ్చెను. వా రటులే చేసిరి. శాస్త చనుదెంచి పరచిన కంబళముపై గూరుచుండెను. వా రెల్లరు నొక్కపెట్టున విలపింప సాగిరి. ఆమెను రా జిట్లు ప్రశంసించెను : "భన్తే, మీరు కాషాయము ధరించినట్లు విన్నంతనే మాకోడలు కాషాయవస్త్రములు ధరించినది. మీరు మాల్యాదులు విడనాడి, నేలపై శయనించు చున్నట్లు విన్నంతనే ఈమె మాల్యాదులు తాల్పక, భూశయనము చేయు చున్నది. మీరు ప్రవ్రజించినపిదప ఈమె వితంతువువలె నుండి, అన్యరాజులు సందేశము లంపుచున్నను స్వీకరింపలేదు. ఈమెకు మీయెడ నింతటి దృఢ భక్తి!"

ఈ విధముగా రాజు రకరకముల ప్రశంస చేసెను. అప్పుడు శాస్త ఆయనతో "మహారాజా, ఇం దాశ్చర్య మేమియు లేదు. నాతుదిజన్మలో ఈమె నాయెడ ననురక్తియు, దృఢభక్తియు, అన్యాక్రాంతము కాని

చిత్తములో నుండుట వింత కాదు. మున్ను పక్షికడుపున పుట్టియు నిట్లే యుండెను" అని, రాజు ప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయుచుండగా బోధిసత్త్వుడు హిమాలయ ప్రదేశమున కిన్నరికడుపున పుట్టెను. ఆయనభార్య చంద. వా రిరువురు చందనామక రజతపర్వతమున నివసించుచుండిరి.

ఆ సమయమున వారాణసీ నరేశ్వరు డమాత్యులకు రాజ్య మర్పించి, కాషాయవస్త్రములు ధరించి పంచాయుధములతో ఏకాకిగా హిమాలయమునకు పోయెను. మృగమాంసము తినుచు నదివెంట పోవుచు కొంతదూరమున ఉన్నతప్రదేశము చేరెను చందపర్వతమున నివసించు కిన్నరులు వర్షాకాలమున క్రిందికి దిగరు; వేసవికాలమున దిగుదురు. ఆ సమయమున కిన్నరుడు భార్యతో కూడ క్రిందికి దిగి, పరిమళము వెదజల్లు పుష్పరేణువుల మూచూచుచు, పుష్పవస్త్రములు ధరించుచు లతాడోలికలలో నూగుచు మధురస్వరమున పాటలు పాడుచు. ఆ చిన్ననదిని చేరిరి. పచారు చేయుటకు వీలగుచోటికి దిగి నీటిలో పుష్పములు చల్లుచు జలక్రీడ చేసిరి. ఆవల వారు పూలబట్టలు కట్టుకొని వెండివలె తళతళలాడు నిసుకదిబ్బపై పుష్పశయ్య సిద్ధము చేసి కణుపుల వేణువు తీసికొని పుష్పశయ్యపై గూర్చుండిరి. అపుడు చందకిన్నరుడు పిల్లనగ్రోవిపై మధురస్వరమున పాడెను చంద్రకిన్నరి కోమలహస్తములు చరచుచు ఆతనియెదుట నాట్యము చేయుచు పాడెను. రాజు ఆ మధురధ్వనులు విని తనకాలి యడుగుల సవ్వడి కాకుండ మెల్లమెల్లన చాటు చాటుగా వచ్చి కిన్నరులను చూచెను తోడనే ఆతనికి కిన్నరిపై ఆసక్తి కలిగెను. "ఈ కిన్నరుని బాణముతో కొట్టి చంపి ఈమెతో వసింతును" అనుకొని బాణముతో కిన్నరుని కొట్టెను కిన్నరుడు వ్యథాభిభూతుడై విలపించుచు ఈ గాథలు పలికెను :

ప్రాణముల్ పోయెడి పగిదిని దోచు,
తోచును నెత్తుట దోగుట మూర్ఛ

క్రమ్ము రీతిని చంద్ర ! కంఠరోధమ్ము
ప్రబలుచున్నది- ఎందో పడుచున్న వాడ !

కుమిలిపోవుచు నున్నది మనస్సు తృణము
వలె, నరణ్యముపోల్కి, వాహినిబోలె
శుష్కించు తలప నీశోకవిధమ్ము !

పర్వతానికి నిమ్నభాగాన నున్న
సరసిలోనికి వర్ష జలమట్లు నాదు
బాష్పముల్ ప్రవహించు ప్రబలదుఃఖంబు
కలుగును నీశోకభావనచేత !

బోధిసత్త్వుడు విలపించి పుష్పశయ్యపై బడి స్మృతికోల్పోయెను. రాజుకూడ నిలిచిపోయెను. బోధిసత్త్వుడు విలాపము చేసి నను కిన్నరి ఆనందప్రమత్తతలో అతనికి బాణము తగిలినట్లుకూడ గ్రహింపలేదు. కాని అతడు స్మృతి తప్పి తల క్రిందులుగా పడియుండుట చూచి "నా భర్తకు ఏమివ్యాధి ?" అనుకొని గాయమునుండి రక్తము స్రవించుట చూచి ప్రియ భర్త బాధను సహింప లేక ఆమె బిగ్గరగా విలపింపసాగెను. కిన్నరుడు మృతి చెందియుండు నని నిశ్చయించుకొన్నపిదప రాజు స్వయముగా బయలు పడెను. ఆతనిని చూచినంత నే యామె ఆ చోరుడు నా ప్రియభర్తను బాణముతో కొట్టినవా డని గ్రహించి కంపము నొంది, పరుగెత్తి పర్వతశిఖరముపై నిలిచి, రాజునకు శాపమిచ్చునదై ఈ గాథలు పలికెను :

రాజపుత్రుడు, పాపి, నారాచ మేసి
నాప్రియుని దీను బడగొట్టినాడు విపిన
మూలమున ! ఆత డున్నాడు నేలమీద !

నాహృదయశోక మిపుడు కిన్నరుని చూడ
నుబుకునట్టిది నీతల్లి కొదవుగాక !

చూడ కిన్నరు నుబికెడి శోక మట్టి
బాధ యోరాజపుత్ర, నీభార్య కగుత !

వల్లభుని దోష మెరుగనివాని నకట !
కూల్చితివి రాజపుత్ర, నాకోర్కి మడిసె !

జననియును భార్యయును కనుగొనక యుంద్రు
గాత ని న్నని యిపుడు నాగాఢవాంచ !

రాజు ఈ గాథ పలికెను :

వన తిమిర సన్నిభము లగు కనులదాన !
ఏడ్పు మానవె చంద్ర ! మదీయపత్ని,
పూజ్యతను రాజకులమున బొందగలవు.

చంద్ర ఆతనివాక్కు వినగానే "నీవు నాతో ఏమనుచున్నావు !" అని సింహనాదము చేసి ఈ గాథ పలికెను :

దోష మెరుగని నాపతిం ద్రుంచినావు
రాజపుత్ర, నాయెడ ననురాగమునను !
నేను మరణింతు ననుమాట నిక్కువంబు :
నీకు దక్కదు ననుమాట నిజము కాదు !

ఆమె మాటలు విని నంతనే రాజు రాగరహితుడై ఈ గాథ పలికెను:

పిరికిదాన, ఓజీవనప్రియ, హిమాల
యమ్మునకె ఓసి కిన్నరీ, అరుగవచ్చు-
మృగసమూహమ్ము నీతో రమించు గాక !

ఇట్లు పలికి ఆతడు కోరిక విడనాడి వెడలిపోయెను. కిన్నరుడు చనిపోయినట్లు తెలిసికొన్నంతనే ఆమె బోధిసత్త్వుని కౌగిలించుకొని పర్వతశిఖరమునకు కొనిపోయి సమతలమున పరుండబెట్టి ఆతనిశిరము తనయొడిలో నుంచి మిక్కలి విలపించుచు ఈ గాథలు పలికెను :

అవె పర్వతమ్ములు, నవియె కందరము,
లవె గిరిగహ్వరా, లందులో నీవు
కనబడవపు డేమి కామింపగలను ?

మిగుల నపాయాన; మృగరాజు నీవు—
ఈ తరి మా సుఖదాతవు కమ్ము.

విని సింహ మీ గాథ పలికెను :

నీ పని గృధ్రమా, నే నొనరింతు
నిర్మూలనము చేయ నీ శత్రువులను
పోవుద; మెవ్వండు బుద్ధిమంతుండో
ధర్మజ్ఞుడో వాడు తనవంటివారి
కొరకు ప్రయత్నింపకుండుట యెట్లు?

"నీవు పోయి బిడ్డల నోదార్పుము" అని సింహము దానిని వీడ్కొ కొనెను. సింహము మణివర్ణము కల నీటిని చెదరగొట్టుచు పోయెను. అడివి మానిసులు సింహము వచ్చుట చూచి "ఉక్కుసము మన కాగడా ఆర్పి వేసినది. కచ్ఛపము మన గుడ్డపేలికలను లాగివేసినది. ఇప్పుడో సింహము మన ప్రాణములను కూడ హరించును" అని మరణ భయముచే చెల్లా చెదరుగా పారిపోయిరి. సింహము వచ్చి చూచునప్పటికి వృక్షముక్రింద నెవరును లేరు. ఇంతలో ఉక్కుసరాజు, కచ్ఛపము, గృధ్రము వచ్చి ప్రణా మము చేయగా సింహము వారిమైత్రి మహత్త్వమును చూచి, "నేటి నుండి అప్రమత్తులై మైత్రిధర్మము నఖండరూపమున నిర్వహింపుడు" అని నిజ నివాసమునకు వెడలిపోయెను. అవి యన్నియు తమతమ నెలవులకు వెడలి వవి. ఆడుగ్రద్ద తనబిడ్డలను చూచుకొని 'మిత్రులవలన నాబిడ్డలు దక్కినారు' అనుకొని సంతుష్టచిత్తముతో నివసించుచుండెను. ఒకనాడు ఆడుగ్రద్ద భర్తతో ఇష్టాలాపము లాడుచు మిత్రధర్మమును ప్రకాశింప జేయునదై ఈ గాథలు పలికెను.

ఆర్యుండు మిత్ర సహాయుల గూర్చు
కొనదగు; ఆర్యులం గూర్చుట మేలు
కవచంబు దాల్చిన గాత్ర వంతుండు
బాణంబునుండి సంత్రాణంబు నొందు
భంగి నున్నారము భద్రంబుగాను.

కలకూజితంబులు కావించుచున్న
వండజంబులు, పలాయనము కావింప
నట్టి సన్మిత్ర శౌర్యప్రభావమున.

మిత్ర సహాయ్య సంప్రాప్తిచే గలుగు
బుద్ధిమంతునకును పుత్ర ధనాదు
లీ మిత్రుదయచేతనే సుతుల్ పతియు
నే గూడ నొక్కచో నిలిచి యున్నాము.

పలికయు తూరు డెవ్వాని కుండు
నట్టి మానవునకు నర్థసంసిద్ధి.
సంపద, మైత్రి, యశం బున్నవాడు
బహుళసౌఖ్యము నొందు నిహాలోకమందు.

మిత్రుల గూర్చుట మేలగు పేద
వానికైనను, మిత్రవాత్సల్యమునసె
ఉన్నవారము మన మొక్కతావునను.

బలవంతుడును శౌర్యవంతు డౌవాని
తో మైత్రి నెరప సంతుష్టి చెలంగు
మన కిర్వురకు నున్న మైత్రి విధాన.

వా రందరు అఖండరూపమున యావజ్జీవము మిత్రధర్మపాలన చేసి తుదకు యథా కర్మం గతి (పరలోకమున) కేగిరి.

శాస్త ఈ ధర్మోపదేశనము చేసి "భిక్షువులారా ! అతడు భార్యవలన సుఖము పొందుట ఇప్పుడే కాదు; పూర్వజన్మలో కూడ సౌఖ్యము పొంది నాడు" అని జాతకములు సరిపోల్చెను ఆ కాలమున గృధ్రములు భార్యాభర్తలు, కచ్ఛపపుత్రుపు రాహులుడు, తండ్రి మౌద్గల్యాయనుడు, ఉక్కుస రాజు సారిపుత్రుడు, సింహము నేనే.

487. ఉద్దాలక జాతకము

శాస్త జేతవనమున విహారము చేయుచు ఒకానొక మోసగానిని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఇట్టి కళ్యాణప్రదమైన శాసనమున అతడు ప్రవ్రజించియు నాలుగవసరములకై మూడు విధముల మోసము చేయుచుండెను. ధర్మసభలో భిక్షువులు వానిని నిందించుచుండిరి. శాస్త అచటికి జని విషయము తెలిసికొని "భిక్షువులారా, ఈత డిప్పుడే కాదు, పూర్వముకూడ మోసము చేయుచుండెడివాడు" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయునప్పుడు బోధిసత్త్వుడు ఆయన పురోహితుడుగా నుండి మేధావి, పండితుడు నయ్యెను. ఒక నా డాయన ఉద్యానవనమునకు క్రీడార్థమై వెడలి నపుడు అచ్చట అందమైన గణిక కానబడగా ఆమె యెడ ఆసక్తచిత్తుడై సహవాసము చేసెను. తాను గర్భవతి యైనట్లు తెలిసికొని నంత నే గణిక "స్వామీ నేను శిశువును, ప్రసవించినపిదప బిడ్డనికి అర్యాకు డని పేరు పెట్టదలచినాను" అనెను. బ్రాహ్మణుడు తనలో "గణికాగర్భమున జన్మించు వానికి కులగోత్రము లుండజాలవు" అనుకొని, "భద్రే గాలిదెబ్బ తిన్న వృక్ష మిచ్చట కలదు. దీనికి ఉద్దాలక మని పేరు. శిశు విచట కడుపున బడుటచే ఉద్దాలకు డని పేరు పెట్టవగును. ఒకవేళ పుట్టెడి శిశువు ఆడబిడ్డ యగుచో దానిని పోషింపవలెను. పుత్రుడు పుట్టుచో ఆతడు పెరిగి పెద్దవాడైనపిదప నా కడకు బంపుము" అని అంగుళీయక మిచ్చెను. కాలక్రమమున ఆమె పు తుని గని వానికి ఉద్దాలకు డని పేరు పెట్టెను. బిడ్డడు పెద్దవా డై ఒకనాడు తల్లితో "నా తండ్రి యెవరు ?" అనెను. "నాయనా, రాజపురోహితుడు"

"అట్లగుచో వేదాధ్యయనము చేసెదను" అని ఉద్దాలకుడు ఆచార్యభాగ మును (గురుదక్షిణ), అంగుళీయకమును గ్రహించి, తక్షశిలకు బోయి అచటి ప్రసిద్ధాచార్యునికడ విద్యాభ్యాసము చేయుచుండగా తాపసుల తండము ఒకనా డచటికి వచ్చెను. ఉద్దాలకుడు వారికడ గొప్పవిద్య లుండునని తలచి వారిసన్నిధిలో విద్యలు గ్రహింప గోరి విద్యాలోభముచే ప్రవ్రజించి వారిని సేవించుచు "ఆచార్యులారా, మీకు తెలిసినవిద్య లన్నియు నాకు నేర్పుడు" అని వేడెను. వారు తమకు తెలిసిన వన్నియు నేర్పిరి. ఆచటి ఐదువందల తాపసులలో ఈతనికన్న ప్రజ్ఞావంతు డొకడును లేడు; ఈతడే అధిక ప్రజ్ఞా వంతుడు. వా రందరు సమావిష్టులై ఇతనినే ఆచార్యపదమున నియో గించిరి. ఒకనా డితడు వారితో "మిత్రులారా! మీరు కందమూల ఫలాదులు తినుచు, ఎల్లపుడును అడవిలో నివసించుచున్నారు. పట్టణముల కేల పోవరు ?'' అనెను.

"మారిషా, లోకులు దాన మిచ్చి దానానుమోదనము చేయింతురు, ధర్మకథలు చెప్పింతురు, ప్రశ్నలడుగుదురు. ఈ భయముచే మే మచటికి పోవము."

"మిత్రులారా ! మీరు నన్ను ముందిడుకొని చక్రవర్తి యెదుటి కైనను పోవుడు. ఆయనతో సంభాషించు బాధ్యత నాపై విడువుడు. మీరు భయపడవలదు'' అని ఉద్దాలకుడు వారిని వెంట బెట్టుకొని పర్యటనము చేయుచు క్రమముగా వారాణసి చేరెను. తొలిరోజున రాజోద్యానమున విడిసి, మరునాడు వా రందరిని వెంటబెట్టుకొని యతడు ద్వారగ్రామమున భిక్షాటనము చేసెను. జనులు బాగుగా దానము లిచ్చిరి. తాపసులు మరు నాడు నగరమున ప్రవేశించిరి. లోకులు భూరిదానములు చేసిరి. "ఉద్దాలక తపస్వి దానానుమోదనము చేయును, మంగళప్రవచనము చేయును, ప్రశ్న ములకు సమాధాన మిచ్చును అని జనులు శ్రద్ధా భక్తులతో పదార్థముల నొసంగిరి. నగరమంతయు సంచలన మొందెను. పండితులు, గణశాసకులు ధార్మికులు అగు తపస్వులు వచ్చినారని రాజుకు గూడ వార్త చేరెను. 'వా రెచ్చట నుందురు' అని రా జడుగగా 'ఉద్యానమున' అని తెలిపిరి. 'మంచిది, నేడు వారి దర్శనార్థము వత్తును' అని రాజు పలుక లోకులు చని ఉద్దాల

కునితో "రాజు మిమ్ము జూడ వచ్చుచున్నాడు" అని చెప్పిరి. ఉద్దాలకుడు తాపసులను పిలువ నంపి, "రాజు వచ్చుచున్నాడు. ఐశ్వర్యవంతులను ఒక్క రోజు ప్రసన్నచిత్తులను చేయుచో మన జీవితపర్యంతము సంపద లభించును" అని తెలిపెను.

"ఆచార్యా, ఏమి చేయవలెను ?"

"మీలో కొందరు తల క్రిందులుగా వ్రేలాడవలెను. కొందరు గొంతు కూర్చుండవలెను. కొందరు కంటకశయ్యలపై పరుండవలెను. కొందరు పంచాగ్నులనడుమ ఉండవలెను. కొందరు నీటిలో గొంతువరకు మునిగి యుండవలెను. కొందరు అచ్చటచ్చట కూర్చుండి జపము చేయుచుండ వలెను."

తాపసు లటులే చేసిరి. ఉద్దాలకుడు పదుగురు వాడిపండితులను వెంట గొని గుర్రముపై పుస్తకముల కట్ట లుంచి శిష్యపరివృతుడై ఎల్లరు ప్రశం సించుచుండ పీఠముపై కూరుచుండెను. ఆ సమయమునకే రాజు పురోహిత సహితముగ వైభవముతో వచ్చి దొంగజపములు చేయు వారిని చూచి సంతుష్టచిత్తుడై ప్రజలకు నరకభయ ముండ దని తలచి ఉద్దాలకుని సమీ పించి యోగక్షేమ మడిగి ఒక ప్రక్కన కూర్చుండెను. రాజు ప్రసన్న చిత్తుడై పురోహితునితో సంభాషించుచు ఈ గాథ పలికెను :

తాల్చి ముడిచర్మములు జటాధారు లగుచు
మైల దంతాలతో మోటు వాలకముల
జపము చేసెడివారలు జ్ఞాన మొంది
ముక్తు లగుదురె కర్తవ్యముల నొనర్చి.

విని పురోహితుడు తనలో "ఈ రాజు అయోగ్యస్థానమున శ్రద్ధ చూపుచున్నాడు. మౌనము వహించుట సరి కాదు" అనుకొని బహిరంగ ముగా ఈ గాథ పలికెను :

రాజ, వేదజ్ఞు డైన ధర్మంబు గనక
పాపకార్యాచరణకునై పాలు పడిన,
దుర్లభం బగు వానికి దుఃఖ ముక్తి.

ఉద్దాలకుడు విని తనలో "ఈ రాజు ఎట్లో తాపసులయెడ శ్రద్ధ కలగియున్నాడు. కాని ఈ బ్రాహ్మణుడు ప్రచండునివలె నున్నాడు. కావున నేను ఈతనితో సంభాషింతును" అనుకొని ఈ గాథ పలికెను:

ఆచరించి విశేషవేదాధ్యయనము
నెరపనపుడు ధర్మంబు, నిష్ఫలంబు
అఖిల విద్యాదికమ్ము; సంయమముతోడ
ఆచరణ మొక్కటే సత్య మని తలంతు.

అంతట పురోహితు డీగాథ పలికెను :

వేదములు నిష్ఫలము కావు; వేదవేత్త
యశము నొందును; కాని సంయమముతోడ
నెరపుచో ధర్మకార్యముల్ నిందుశాంతి.

ఆలకించి ఉద్దాలకుడు తనలో "ఇతనితో నేను విరోధము పెట్టుకొని నిలువజాలను. నేను నీ కుమారుడను అను వాక్కులు విన్నప్పుడు ఎవ్వని చిత్త మయినను మెత్తబడును. కావున నేను నీ పుత్రుడను అను సూచన చేసెదను" అనుకొని ఈ గాథ పలికెను :

తలిదండ్రులను బ ధువులను పోషింప
వలయును; జన్మంబు వారిచే గలిగె
ఓ మహారాజ, నే నుద్దాలకుడను,
యుష్మదీయ శ్రోత్రియుండను సుమ్ము.

"నీవు నిశ్చయముగ ఉద్దాలకుడవా?"

"అవును."

"నేను నీ తల్లికి గురుతుగా ఉంగర మిచ్చినాను అది యేది?"

"బ్రాహ్మణోత్తమా, ఇదిగో" అని ఉద్దాలకు డాతని చేతిలో ఉంగర ముంచెను. బ్రాహ్మణు డంగుళీయకమును గురుతుపట్టి "నిశ్చయముగా నీవు

బ్రాహ్మణుడవు; బ్రాహ్మణధర్మము నీకు తెలియునా ?" అని ఈ గాథ పలికెను :

ఎట్లగు బ్రాహ్మణుం ? డెట్లు కేవలియు
నగును ? నిర్వాణంబు నందుట యెట్లు ?
అంద్రు ధర్మస్థితుం డధి యెట్టివాని ?

ఉద్దాలకుడు ప్రత్యుత్తరముగా ఈ గాథ పలికెను :

బ్రాహ్మణుం డగ్ని సంపాదించి, నిరత
మభిషేచనములతో యజ్ఞముల్ చేసి
యూపంబు లెత్తుచునుండు; నాతనికి
కల్యాణ సౌఖ్యముల్ కలుగుచునుండు
ధర్మస్థితుం డని తలతు రవ్వాని.

ఆతడు నిరూపించిన బ్రాహ్మణ ధర్మమును నిందించుచు పురోహితు డీ గాథ పలికెను :

అభిషేచనము చేయ నగునె సంశుద్ధి ?
పారు డైనంత కేవలి యౌట యెట్లు ?
సంయమం బుండదు, క్షమ యుండబోదు—
ఆతడు నిర్వృతుం డనుట యేలాగు ?

ఇట్లు బ్రాహ్మణుడు కానిచో మరియెట్లగును అని అడుగువాడై ఉద్దాలకు డీ గాథ పలికెను :

ఆతండు బ్రాహ్మణుం డగుట యేలాగు ?
ఆతండు కేవలి యగుట యేలాగు ?
అతనికి నిర్వాణ మబ్బుట యెట్లు ?
అతని ధర్మస్థితుం డనుట యేలాగు ?

పురోహితు డీ గాథ పలికెను :

క్షేత్రముల్ కోరికల్ మిత్రబాంధవులు
సంసారబంధముల్ క్షయ మొందువాని

బ్రాహ్మణోత్తమునిగా భావింత్రు జనులు,
ధర్మస్థితుం డని తలతు రవ్వాని.

అంతట ఉద్దాలకు డీగాథ పలికెను :

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులును
చండాల పుల్కసుల్ సర్వమానవులు
అయి సంయముల్, దాంతు లగుచు నిర్వాణ
మందుచో కల్యాణ మగునె యెల్లరకు ?
ఒక్కరికైన కీడొదవక యున్నె ?

అర్హత్వప్రాప్తి యయినపిదప నరుడు మరల క్రిందికి రాడు అనునభి
ప్రాయము వెలిబుచ్చువాడయి బ్రాహ్మణు డీగాథ పలికెను :

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులును
చండాల పుల్కసుల్ సర్వమానవులు
అయి సంయుతుల్ దాంతు లగుచు నిర్వాణ
మందుచు, శాంతి సౌఖ్యంబుల నుండ
కల్యాణమే కాని కష్టమ్ము లేదు,

దానిని నిందించుచు ఉద్దాలకు డీగాథ పలికెను :

ఆ ట్లగుచో శ్రోత్రియత్వమ్మునకును
బ్రాహ్మణత్వమునకు భంగంబు కలుగు.

ఉపమానరూపమున నాతనికి బోధ చేయువాడై పురోహితు డీ
గాథలు పలికెను :

పలురకంబుల వస్త్రములతోడ గలుగు
మంటపంబున నీడ; మరి నీడలోన
వస్త్రంబులకు నుండు వర్ణంబు కనము.

జనులందు సర్వదా సంశుద్ధు లుంద్రు ;
గ్రహించి ధర్మముల్ కడుసంయమమున
వరలువా రడుగరు వారి జాతులను.

ఉద్దాలకుడు హతప్రతిభు డై కూర్చుండెను. అంతట బ్రాహ్మణుడు రాజుతో "మహారాజా, వీ రందరు మోసగాండ్రు. వీరు సమస్త జంబూ ద్వీపమును మోసమున నాశనము చేయగలరు. ఉద్దాలకుని గృహస్థుని చేసి ఉపపురోహితపదవి యొసగుడు. మిగిలినవారికి డాలు, ఆయుధము లిచ్చి గృహస్థులను చేసి మీసేవలో నిలుపుకొనుడు" అని విన్నవించెను. 'మంచిది, ఆచార్య' అని రాజు ఆయన చెప్పినట్లు చేసెను. వా రందరు ఆజన్మాంతము రాజసేవలో నుండి తుదకు పరలోకమున కేగిరి.

శాస్త ఇట్లు ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ఈత డిప్పుడే కాదు, పూర్వము కూడ మాయావిగా నుండెను" అని జాతకములు సరి పోల్చెను ఆ కాలమున మాయావి భిక్షుకుడు ఉదాలకుడు, రాజు ఆనం దుడు, పురోహితుడు నేనే.

———:():———

488. భిస జాతకము

శాస్త జేతవనమున విహారము చేయుచు ఉద్విగ్నచిత్తు డగు భిక్షువును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

కథావస్తువు కుస జాతకమున (531) వచ్చును. శాస్త అప్పుడు "భిక్షూ నీవు నిజముగా ఉద్విగ్నచిత్తుడ వైతివా?" అనెను. "భన్తే, సత్యమే" "ఏ హేతువున?" "భన్తే, కామమువలన" "భిక్షూ, కళ్యాణకర మైన యిట్టి శాసనమున ప్రవజించియు ఏల కామవశమున ఉద్విగచిత్తుడ వైతివి? కాలమున పండితులు, బుద్ధుడు ఉదయింపక పూర్వము బాహ్యప్రవ్రజ్య గ్రహించి కామ, లోభవశమున ఉత్పన్న మగు వికారములను ప్రతిజ్ఞా పూర్వకముగా దూరీకరించినారు" అని శాస్త పూర్వజన్మ కథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయుచుండగా బోధిసత్త్వుడు ఎనుబదికోట్ల కధిపతి యగు బ్రాహ్మణునకు కుమారుడై జన్మించెను. మహాకాంచన కుమారు డని అతనికి పేరు పెట్టిరి. అతనికి నడక వచ్చునప్పటికి తమ్ముడు పుట్టినాడు. వానికి ఉపకాంచన కుమారు డని పేరు పెట్టిరి. ఈ విధముగా కాలక్రమమున బ్రాహ్మణున కేడుగురు పుత్రులును. అందరికన్న చిన్నది ఆడుపిల్లయు పుట్టిరి. ఆమెకు కాంచన (కుమారి) దేవి యని పేరు పెట్టిరి. మహాకాంచన కుమారుడు పెద్దవాడై తక్షశిలకు బోయి విద్యలు నేర్చి మరలివచ్చెను. తలిదండ్రు లతనిని గృహస్థును జేయ నెంచి "నీకు కులగౌరవాదులలో సరిసమానమగు కన్యను తెత్తుము. నీవు యింటనుండుము" అని చెప్పిరి.

"అమ్మా, నాన్నా, నేను గృహస్థును కారాదు. భార్యా సంయోగము వలదు. మీకు వేరు పుత్రు లున్నారు. వారు సంసారు లగునట్లు తెలియజెప్పుడు."

తలిదండ్రులు ఎన్నోసారులు చెప్పిరి; కాని అత డంగీకరింపలేదు. అతనిమిత్రులు "నీ వేపదార్థముపై ఆశ పెట్టుకొని భోగములను ఇచ్ఛగింప కున్నావు ?" అని అడిగిరి. అతడు నిష్క్రమణమును గూర్చి పలికెను. విని తలిదండ్రులు తక్కినపుత్రులను పిలువనంపి విషయము చెప్పగా, వారుకూడ అంగీకరింపలేదు. కాంచన దేవి సయితము సమ్మతింపలేదు. కాలక్రమమున వృద్ధులు చనిపోయిరి. మహాకాంచన పండితుడు తలిదండ్రులకు సముచిత క్రియలు గావించి తన యెనుబదికోట్ల ధనమును పేదలకు, బాటసారులకు నొసంగి, ఆరుగురు సోదరులను, సోదరిని, దాసుని, పరిచారికను, మిత్రుని వెంట గొని మహాభినిష్క్రమణము చేసి, హిమాలయము ప్రవేశించెను. వా రచటి కమలసరోవర రమణీయప్రదేశమున ఆశ్రమము నిర్మించి ప్రవ్ర జించి అరణ్యములోని కందమూల ఫలములతో కాలము గడుపజొచ్చిరి.

వా రడవిలోనికి బోవునపుడు కలిసి పోవుచుండిరి. ఫలము గాని, మూలము గాని కానబడినపుడు ఒకరు రెండవవారిని పిలిచెడివారు. ఎల్లరును ఉల్లాసముతో సంభాషించుచు, ఆహారము భుజించెడివారు. వారు తెచ్చు పదార్థములను జూడ గ్రామములోని కూరగాయల అంగడివలె నుండెడివి. ఒకనాడు మహాకాంచనాచార్య తపస్వి తనలో "ఇట్లు చేయుట ఉచితముగా లేదు ఎనుబదికోట్ల ధనము విసర్జించి ప్రవ్రజించిన మేము లోభులవలె సంచరించుచున్నాము. నేటినుండి నేనే ఫలాదులు తెచ్చెదను" అనుకొని ఆశ్రమమునకు మరలి వచ్చి, తక్కినవారితో ఈ విషయము చెప్పి "మీ రిచ టనే యుండి శ్రమణధర్మము నెరవేర్పుడు. నేనే కందమూలమును తెత్తును" అని తెలిపెను. అంతట ఉపకాంచనాదులు "ఆచార్యా, మే మెల్లరము తమ మూలమున ప్రవ్రజించినాము. తాము ఇచ్చటనే యుండి శ్రమణధర్మము నిర్వహింపుడు మన చెల్లెలు కూడ ఇచటనే యుండును దాసికూడ ఈమె కడనే యుండును మన మెనమండుగురము విడివిడిగా ఫలాదులు తెత్తము. ముప్వురము వంతుచొప్పున పోవుచుందుము" అని చెప్పిరి. ఈ విధానము నకు ఎల్లరు నంగీకరించిరి. ఒక్కొక్కరు వంతుప్రకారము ఫలాదులు తెచ్చుచు, తక్కినవారికి భాగము లిచ్చుచు తమ నివాసస్థానములకు బోవు చుండిరి. అకారణమున వారు ఒక్కచో చేరుటకు వీలు పడెడిదికాదు. ఫలా దులు తెచ్చినవారు అచ్చటి ప్రాకారముప్రక్క పాషాణముపై నుంచి

పంౘ్రెండుభాగములు చేయుదురు. అపుడు గంట కొట్టుదురు అందరును వచ్చి యెవరిభాగము వారు తీసికొని తమతమ నివాసస్థానములకు పోవుదురు. కాలక్రమమున బిసకాండము తెచ్చి తినుచు ఘోరతపస్సు చేయుచుండిరి. ఇంద్రియములను నిగ్రహించి వారు యోగాభ్యాసనిరతులైరి.

వారి సదాభ్యాసము వలని తేజస్సుచే శక్రునిభవనము కంపించెను. వీరు కోరికలు విడిచినఋషులా ? అను సంశయము కలిగి శక్రుడు వీరిని పరీక్షింప దలచెను. తన శక్తిచే శక్రుడు బోధిసత్త్వభాగము మూడు రోజులు కనబడకుండ జేసెను. ప్రథమ దినమున తనవంతు కనబడనపుడు వారు మరచి రేమో యని బోధిసత్త్వ డనుకొనెను. రెండవనాడు భాగము కనబడనప్పుడు తనలోపముచే వా రట్లు చేసియుందు రనుకొనెను. మూడవనాడు సాయంకాలము గంట మ్రోగినది. పోయి చూడగా తనవంతు కనబడలేదు. 'నావలన దోష మేమైన నున్నచో క్షమింపవేడుదును' అనుకొనెను. ఇంతలో అందరు నచ్చటికి వచ్చి యెవరు గంట కొట్టిరని యడుగగా 'నేనే' అని ఆచార్యుడు చెప్పెను. "ఆచార్యా, కారణ మేమి ?" "మూడవనాడు ఫలము లెవరు తెచ్చిరి ?" "ఆచార్యా, నేను తెచ్చినాను" అని ఒకడు ప్రణామము చేసి నిలిచెను.

"నీవు విభాగములు చేసినపుడు నా భాగము విడిగా నుంచితివా ?"

"ఆచార్యా, నేనే పెద్దభాగ ముంచితిని."

"నిన్న తెచ్చిన దెవరు ?"

వేరొకడు లేచి ప్రణామము చేసి నిలిచెను. "విభాగము చేయునపుడు నామాట జ్ఞప్తి యున్నదా ?" అని ఆచార్యు డడిగెను.

"తమకోసము పెద్ద భాగ ముంచినాను."

"నాయనా, మూడురోజులనుండి నావంతు ముట్టుట లేదు. మొదటి నాడు భాగము కానబడనపుడు పంపిణీ చేయువాడు నన్ను మరచియుండునని తలచితిని. రెండవనాడు కానబడనపుడు నావల్ల ఏదోలోప ముండు ననుకొంటిని. మూడవనాడు నాయపరాధ మున్నచో క్షమాపణ వేడదలచి గంటకొట్టి మిమ్ము సమావేశ పరచితిని. మీరు ఆహారభాగము విడిగా పెట్టినా

మన్నారు; కాని నాకు లభింపలేదు. ఎవ్వరు భాగమును హరించుచున్నారో తెలిసికొనవలయును. కోర్కులను, భోగములను విసర్జించి, ప్రవ్రజించియు ఆహారమును హరించుట ఉచితము కాదు '' ఈ వాక్కులు విన్నంతనే అంద రును మహాసాహస మని ఆవేగము చెందిరి. ఆ యాశ్రమమున జ్యేష్ఠవృక్ష ముపై నివసించు దేవతకూడ దిగి వచ్చి వారికడ గూర్చుండెను. అప్పు డా డు ఏనుగు ఋషిమండలి సన్నిధికి వచ్చి నమస్కారము చేయునది కూడ ఒకప్రక్క నిలిచెను. సర్పముతో ఆటలాడు వానరముకూడ వచ్చి కూర్చుండెను. శక్రుడు కూడ ఋషులను పరీక్షించుటకై వచ్చి అదృశ్యరూప మున ఒకయోర నిలిచెను. అప్పుడు చిన్నతమ్ముడు ఉపకాంచన ఋషి బోధి సత్త్వునకు వందనము చేసి, తక్కినవారియెడ ఆదరము చూపి ''ఆచార్యా, ఇతరుల విషయ మెత్తక కేవలము నా నిర్దోషిత్వమును ప్రమాణీకరించు కొన వచ్చునా ?'' అనెను. ''ఆ !'' అతడు ఋషులయెదుట నిలిచి ''నేను భాగమును తినియున్నచో ఇట్లగుదును'' అని శపథము చేసి ఈ గాథ పలికెను :

బ్రాహ్మణోత్తమ, నీదుభాగంబు గొన్న
వానికి గోవులు వారువంబులును
పైడియు, వెండియు, భార్యయు నబ్బు
సంతతితో వాడు సంయుక్తుడగును.

విని ఋషులు చెవులు మూసికొని ''మారిషా, ఇట్లనవలదు. నీ శపథము మహాఘోరము'' అని వా రనిరి. బోధిసత్త్వుడుకూడ ''నాయనా, నీ శపథము మిక్కిలి ఘోరము నీవాభాగము తినలేదు. నీకై పరచిన ఆసనముపై కూర్చుండుము''అనెను. రెండవసోదరుడుకూడ లేని బోధిసత్త్వు నకు ప్రణామము చేసి శపథపూర్వకముగా తన నిర్దోషిత్వమును ప్రమాణీక రించుటకై ఈ గాథ పలికెను :

భాగంబు హరియించు వానికి కాశి
మాలికల్, చందన మబ్బును గాత !
బహుసంతతిని వాడు పడయును గాత !
భోగకాంక్షలు హెచ్చిపోవును గాత !

ఆతడు కూరుచున్న పిదప తక్కినవారు క్రమక్రమముగా ప్రణామములు చేసి ఒక్కొక్కగాథ పలికిరి :

భాగమ్ము హరియించువానికి ధనము
క్షేత్ర, మైశ్వర్యంబు, పుత్రసంతతియు,
సర్వభోగాలలో సదనాన నతడు
నిలుచుత ఆయువుం దలపోయకుండ.

భాగమ్ము హరియించువాడు క్షత్రియుడు
బలవంతుడై యశోవంతుడై మిగుల,
ఏలిక యగుఁగాత నాలుగుదెసల !

భాగమ్ము హరియించువాడు ముహూర్త
నక్షత్రగణనమ్మునందు యశమ్ము
పొందుచు కడు రాజపూజితుం డగుత !

భాగమ్ము హరియించువాని దలంచి
అఖిలవేదజ్ఞు నధ్యాపకుగాను
జనపదంబులు పూజ సలుపును గాత !

భాగమ్ము హరియించువాడు దాగమున
సర్వసంపదలతో సంభృత మైన
గ్రామమ్ము భోగించుగాక ! మృత్యువును
పొందు గావుత భోగమందె యాతండు !

భాగమ్ము హరియించువాడు నితాంత
నృత్యగీతాలతో నిఖిలసౌఖ్యముల
తోడను మిత్రులతోడ గ్రామణిగ
రాజ్యబాధలు లేక రంజిల్లు గాక !

ఆహారభాగంబు హరియించునామె
సకలలోకవిజేత సార్వభౌమునకు

పదునారువేలలో ప్రథమరా లగుచు
సీమంతినులలోన శ్రేష్ఠురా లగుత !

ఆహారభాగంబు హరియించువాడు
ఆగత దాసీ జనాంతరమందు
విచలింపకుండంగ, రుచిరాన్నభుక్తి
చేయుచు, నెంతయు స్వీయలాభంబు
కోసము కోతలు కోయును గాక !

ఆహారభాగంబు హరియించువాడు
ఆవాసికుండు మహావిహారమున
నగుత ! కజంగల నగరాన నూత్న
కార్మిక భిక్షు వౌగాక యాతండు !

ఆహారభాగంబు హరియించువాని
బంధించి దృఢముగా పలుతావులందు
రమణీయవనినుండి రాజధానికిని
గొనిపోయి కంటకాంకుశ శస్త్రమునను
నిర్దయతోడను మర్దింత్రు గాత !

పొడిచి చెవులు శలాకతో, పుష్పమాల
కంఠమున వేసి, కొట్టుచు కట్టెతోడ,
దృఢముగా రజ్జువున గట్టి, తిప్పి త్రిప్పి
సందులం, జేర్పవలయును సర్పముఖము.

ఈ ప్రకారముగా అందరును శపథములు చేసినపిదప బోధిసత్త్వుడు తనలో "నాయెడ కూడ సందేహ మెచ్చటను కలుగరాదు. నేను భుజించియు భుజింపలేదు అను మాట పుట్టరాదు. కావున నేను కూడ శపథము చేయుదును" అనుకొని ప్రమాణము చేసి ఈ గాథ పలికెను :

నష్ట మనునది లేకున్న నష్ట మనుచు
ఎవడు శంకించు మీలోన నెవనినైన

వాడు సంసారియై భూరివాంఛతోడ
భోగముల నందు చందులో పొలియుక !

ఋషులీ ప్రకారముగా ప్రమాణములు చేసినపిదప శక్రుడు "భయము వలదు. వీరిని పరీక్ష చేయుటకై నేనే భాగములను అంతర్ధానము చేసినాను. ఈయన ఉచ్ఛిష్టమును నిందించినట్లు భోగములను నిందించినాడు. ఈయన భోగములను నిందించుటకు కారణ మే మని అడుగుచున్నాను" అని ఈగాథ పలికెను :

వేనికోసము లోకము వెదకుచుండు,
ఏవి యెందరు జనులకో యిష్ట మగును,
అగును మధురమనోజ్ఞము లట్టిభోగ
ముల ప్రశంసింప దేటికి మునిజనంబు ?

ఆయనప్రశ్నమునకు ప్రత్యుత్తర మిచ్చువాడై బోధిసత్త్వుడు ఈ గాథలు పలికెను :

భోగములచేత బద్ధుడై పొలియు నరుడు,
భోగములచేత కలుగును భూరిభయము,
శక్ర, మత్తత నొనరింతు రక్రమములు.

పాపములు పండి మరణించు పాపకర్ము
లవల నరకమ్మునన్ జన్మ మందుచుంద్రు,
వాని దుష్పరిణామంపు జ్ఞానమునను
ఎన్నడు ప్రశంస చేయదు ఋషిగణంబు.

బోధిసత్త్వునివాక్కులు విని శక్రుడు సంవేగయుక్తుడై ఈ గాథ పలికెను :

ఏను ఋషుల పరీక్షించు నిచ్ఛతోడ
తీరమున నిల్చి దాచితి దిగువ బిసము,
లిపుడు గ్రహియించినాడను ఋషులు శుద్ధు
లనుచు ; బ్రాహ్మణ, బిసముల నందుకొనుము.

శక్రుని వాక్కులు విని బోధిసత్త్వు డిట్లు పలికెను :

ఓ నహస్రాక్ష, నీక్రీడ కుపకరించు
సాధనములము, నటులము, స్వజనులమును
కాము; మిత్రుల మైనను కాము, శక్ర,
ఏల నీకు వినోదమ్ము ఋషులతోడ ?

అంతట శక్రుడు క్షమాపణ వేడువాడై ఈ గాథ పలికెను :

ఆచార్యుడవు, తండ్రియట్టి వాడవును
అగుదువు బ్రాహ్మణా! అపరాధమునకు
ఊత యియ్యదె; నాది ఒక్కదోషంబె
కాన భూరిప్రజ్ఞ, క్షమియింపవలయు!
క్రోధబలుల్ కారు కోవిదు లెపుడు.

బోధిసత్త్వుడు దేవరాజ శక్రుని క్షమించి ఋషిమండలిని క్షమాపణ వేడి ఈ గాథ పలికెను :

భూతపతిన్ వాసవుని కనుంగొంటి
ఒకరాత్రి ఋషు లెల్ల నుండుట నిచట
మేలు! ప్రసన్నులు మీ రెల్ల కండు!
పడసె నాహారంబు బ్రాహ్మణుం డితడు.

శక్రుడు ఋషులకు ప్రణామము చేసి, దేవలోకమున కరిగెను. ఋషిమండలి ధ్యానాభిజ్ఞలు పొంది, బ్రహ్మలోకగామి యయ్యెను.

శాస్త ఈ విధముగా ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ఈ ప్రకారముగా పూర్వము పండితులు శపథములు చేసి కోర్కులు విడిచినారు" అని సత్యప్రకాశనము చేసెను. తోడనే ఉద్విగ్నచిత్తభిక్షువు స్రోతాపత్తిఫలమున ప్రతిష్ఠితు డయ్యెను. జాతకములు సరిపోల్చి శాస్త ఇట్లు పలికెను :

ఆ కాలమున నేను, సారిపుత్రుడును, మౌద్గల్యాయనుడు, కాశ్యపుడు, అనురుద్ధుడు, పూర్ణ-ఆనందుడు సోదరులము; ఉత్పలవర్ణ చెల్లెలు; ఖుజ్జతర దాసి; చిత్తుడు గృహాతిదాసుడు; సాతాగిరి యక్షుడు; పారిలేయ్యకము ఏనుగు; మధువా శ్రేష్ఠవానరము; కాలుదాయి శక్రుడు. ఈ ప్రకారముగా జాతకమును గ్రహింపుడు."

489. సురుచి జాతకము

శాస్త్ర శ్రావస్తిలో మిగార మాత ప్రాసాదమున విహారము చేయుచు మహా-ఉపాసిక విశాఖకు లభించిన యెనిమిది వరములను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆమె ఒకనాడు జేతవనమున ధర్మకథ విని భిక్షుసంఘముతోసహా బుద్ధ భగవానుని మరునాడు భోజనమునకు నిమంత్రించి చనెను ఆ రాత్రి గడచు లోగా కుంభవర్షము కురిసెను. భగవాన్ భిక్షువులను సంబోధించి "భిక్షువులారా, జేతవనమున వర్షము కురిసినట్లు నాలుగు ద్వీపములలోను వర్షము కురిసి యుండును. ఇది తుదివర్షము" అని పలికెను. తడిసిన భిక్షువులను గొని తథాగతుడు జేతవనమున అంతర్ధానమై విశాఖయింట ప్రత్యక్షమయ్యెను. ఉపాసిక చూచి "ఆశ్చర్యము! అద్భుతము! తథాగతుడు బుద్ధిమంతుడు! ఎంత ప్రతాపవంతుడు! వర్షము కురియుచున్నను ఒక భిక్షువు కాలు గాని చీవరము కాని తడియలేదు." అనుకొని సంతోషించి ఉద్విగ్నచిత్తయై బుద్ధప్రముఖ భిక్షుసంఘమునకు వడ్డనలు చేసి, భగవాన్ కరణీయము లాచరించినపిదప "భన్తే నేను భగవానుని వరము లడగ వేడుచున్నాను" అని విన్నవింపగా, "విశాఖా, తథాగతులు వరముల కతీతులు," అని భగవానుడు పలికెను.

"భన్తే, యోగ్యములు, నిర్దోషములు అయిన వరములు." "విశాఖా, చెప్పుము" "భన్తే, జీవితాంతమువరకు భిక్షు సంఘమునకు వర్షాకాలమున వస్త్రము లీయవలెను. అతిథులకు భోజనములు పెట్టవలెను. పాంథులకు, రోగులకు భోజనములు పెట్టవలెను. రోగుల కౌషధము లిచ్చి రోగి సేవకులకు భోజనములు పెట్టవలెను. ఎల్లరకును నిత్యము యవాగు పానీయ

మీయవలెను. భిక్షుణీ సంఘమునకు స్నానార్థము వస్త్రము లీయవలెను. ఇవి నేను వేడువరములు.''

''విశాఖా, నీ వేమి యోచించి తథాగతుని ఎనిమిది వరము లడుగు చున్నావు ?''

విశాఖ వరముల మహత్త్వము తెలిపెను. ''విశాఖా, సాధు ! సాధు ! నీవు ప్రయోజన మాలోచించి తథాగతుని ఎనిమిదివరము లడుగుట మే లయ్యెను. విశాఖా, ఎనిమిదివరము లడుగుటకు అనుజ్ఞ ఇచ్చుచున్నాను.'' అని తథాగతుడు వరము లిచ్చి, దానానుమోదనము చేసి చనెను.

ఒకనాడు శాస్త పూర్వారామమున విహారము చేయునపుడు ధర్మ సభలో భిక్షువులు సమావిష్టులై ''ఆయుష్మంతులారా మహా - ఉపాసిక విశాఖ స్త్రీ అయ్యును బుద్ధునివలన అష్టవరములు పొందినది. ఎంత గుణ వంతురాలు !'' అనుచుండిరి. శాస్త అచటికి జని అడిగి విషయము తెలిసి కొని ''భిక్షువులారా, విశాఖ ఇప్పుడే కాదు, పూర్వము కూడ నా వలన వరములు పొందినది.'' అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున మిథిలలో సురుచి యను రాజు పాలన చేయు చుండెను. ఆయనకు పుత్రుడు కలుగగా అతనికి సురుచికుమారు డని పేరు పెట్టిరి. అతడు పెద్దవాడై తక్షశిలా నగరమున విద్యలు నేర్చికొనుటకై బయలుదేరి నగరద్వారముకడ నున్నశాలలో కూర్చుండెను. వారాణసీ నరే శుని పుత్రుడు బ్రహ్మదత్తకుమారుడు కూడ తక్షశిలకు బయలుదేరి సురుచి కుమారుడు ఉపవేశించిన శాలలో తానుకూడ కూరుచుండెను. వారు పరస్ప రము సంభాషించిన పిదప అన్యోన్య విశ్వాసము గలిగి విద్యాభ్యాసార్థము ఒకే ఆచార్యునికడకు బోయిరి. గురుదక్షిణ యొసగి విద్య లభ్యసించి అచిర కాలములోనే ఆచార్యునికడ సెలవు గైకొని బయలు వెడలిరి. కొంత దూరము ప్రయాణము చేసి మార్గములు చీలుచోట ఆగి పరస్పరము ఆ లింగనము చేసికొని మిత్రధర్మము రక్షింప నిశ్చయించి ''నాకు కుమారుడు కలిగి నీకు కుమార్తె కలిగి, ఒకవేళ నీకు కుమారుడు కలిగి, నాకు పుత్రిక పుట్టినయెడల వారికి వివాహము చేయుదము,'' అనుకొనిరి.

వారు రాజ్య పరిపాలన మారంభించిన పిదప సురుచికి కుమారుడు పుట్టెను. వానికి సురుచికుమారు డని పెట్టిరి. బ్రహ్మదత్త కుమారునకు పుత్రిక పుట్టెను. సుమేధ యని పేరుపెట్టిరి. సురుచికుమారుడు పెద్దవాడై తక్షశిలకు బోయి విద్యాభ్యాసము చేసి వచ్చెను తండ్రి అతనికి రాజ్యాభిషేకము చేయదలచి తనలో "నా మిత్రుడు వారాణసీ నరేశునకు కూతురున్నది. ఆమెను నా కుమారుని పట్టపుదేవిని చేసెదను," అని యోచనలు చేసి మంత్రులను పంపెను. వారు రాకపూర్వమే వారాణసీ నరేశుడు తన భార్యతో "భద్రే, స్త్రీకి పురుషునివలన విశేషబాధ ఎట్లు కలుగును ?" అనెను. "దేవా, సవతికోపమువలన దుఃఖము కలుగును. "భద్రే, అట్లగుచో మన సుమేధాదేవికి సవతి దుఃఖము లేకుండ చేయుదము. ఎవడు ఈమె నొక్కతెను మాత్రము పెండ్లి యాడుట కంగీకరించునో అతనికే ఇత్తము." అమాత్యులు వచ్చి తమ రాక నివేదింపగా రా జిట్లనెను: "మంచిది నా మిత్రునితో పూర్వమే చెప్పినాను. నా కుమార్తెను అతని కొడుకున కిత్తునని. కాని ఈమెను స్త్రీజనమునడుమ పడవేయ దలపలేదు. ఎవరు ఈమె నొక్కతెను మాత్రమే పెండ్లి యాడునో ఆతనికే ఈమె నిత్తును." మంత్రులు పోయి తమ ప్రభువున కా సందేశము విన్నవించిరి. రాజు అంగీకరింపలేదు. 'మా రాజ్యము పెద్దది. మిథిలానగరము ఏడు యోజనముల విస్తీర్ణము. మా రాష్ట్రము సరిహద్దు మూడువందల యోజనములు. ఎంత తగ్గించినను పదునాలుగువేల మంది స్త్రీలు కావలయును.' కాని సురుచికుమారుడు సుమేధాదేవి రూపసౌందర్యముల సంగతి విన్నంతనే ఆసక్తచిత్తుడై, నేనామె నొక్కతెనే పెండ్లియాడుదును అని తలిదండ్రులకు కబురంపినాడు, 'ఆడువారల గుంపుతో నాకు పని లేదు. ఆమెనే కొనిరండు.' వా రాతనిని వేధింపక విశేషధనము పంపి మహావైభవముతో ఆమెను కొని వచ్చి వివాహము చేసి రాజ్యాభిషేకము చేసిరి. సురుచి మహారాజు ధర్మానుసారముగా రాజ్యము చేయుచు ఆమెయెడ ప్రీతితో నుండెను. పదివేల సంవత్సరములు కాపురము చేసినను ఆమెవలన పుత్రుడుకాని పుత్రిక కాని కలుగలేదు. అప్పుడు నగరవాసులు రాజాంగణమున చేరి కోలాహలము చేసిరి. ఏమిదియని రా జడుగగా వారు "మరి యేమియు లేదు. మీ వంశము నిలుపుటకు పుత్రుడు లేడు. తమకు దేవి ఒక్కతెయే. ఎంత తగ్గించి

నను రాజకులమున పదునారువేలమంది స్త్రీ లుండవలెను. కావున దేవా, తాము బహుస్త్రీగ్రహణము చేయవలెను. ఎవరో ఒక పుణ్యశాలికి పుత్రుడు పుట్టవచ్చును'' అని విన్నవించిరి.

"ఏమనుచున్నారు. నేను ద్వితీయ స్త్రీని పరిగ్రహింప నని మాట యిచ్చినాను. అపత్య మాడజాలను స్త్రీ సమూహము నాకు వలదు."

అని రాజు నిరాకరించిన పిదప వారు వెడలిపోయిరి. వారి వాక్కులు విని సుమేధ తనలో "రాజు సత్యవాది యగుటచే అన్యస్త్రీని కైకొనడు. నేనే స్త్రీలను ఆయన కొరకు తెప్పించెదను' అనుకొని తనకు నచ్చిన వేయి మంది రాజకన్యలను, వేయిమంది అమాత్యకన్యలను, వేయిమంది పరిసారుల కన్యలను ఎల్లవేళల నృత్యము చేయుటకు వేయిమంది స్త్రీలను మొత్తము నాలుగువేల మందిని తెప్పించినది. వారుకూడ పదివేల సంవత్సరములు రాజకులమున నివాసము చేసిరి; కాని వారికి సంతానము కలుగలేదు. ఈ ప్రకారముగ రాణి మూడు పర్యాయములు నాలుగువేల మందిని తెప్పించెను. అం దెవ్వరికిని సంతానము కలుగలేదు. మొత్తము పదునారు వేల స్త్రీలను కైకొనివచ్చిరి. ఇట్లు నలుబది వేల సంవత్సరములు గడిచెను. మొత్తముమీద ఏబదివేల సంవత్సరములు గడచినవి.

నగరవాసులు సమావిష్టులై మరల ఆందోళన చేసిరి. ఏ మిది యని రా జడుగగా "దేవా, తమదేవేరులు పుత్రులను కనుటకై ప్రార్థనలు చేయ నాజ్ఞాపింపుడు" అని విన్నవించిరి. మంచి దని రాజు పలికి "దేవేరులారా, పుత్రుల కొరకు ప్రార్థనలు చేయుడు" అనెను. వారు ప్రార్థనలు చేయుచు నానావిధ దేవతలకు నమస్కారములు చేయుచు, రకరకముల వ్రతము లాచరించుచుండిరి. సంతానము కలుగలేదు. అంతట రాజు సుమేధతో "భద్రే పుత్రునికై ప్రార్థింపుము" అనెను. మంచిదని ఆమె అంగీకరించి పూర్ణిమ నాడు ఉపోసథవ్రతమునకై అష్టాంగిక శీలము గ్రహించి శయనగృహమున శీలవిచారణ చేయుచు ఉచితాసనముపై గూరుచుండెను. మిగిలిన స్త్రీలు మేషవ్రతమును, గోవ్రతమును సంకల్పించి ఉద్యానమునకు జనిరి. సుమేధా దేవి ధారణ చేసిన శీలమునలని తేజస్సుచే శక్రుని భవనము కంపించెను.

ఆయన ధ్యానబలమున సుమేధాదేవి సంగతి గ్రహించి ఈమెకు పుత్రు నను గ్రహించెదను అని నిశ్చయించెను. కాని యెట్టివానినో ఒకని నిచ్చుట కిష్టము లేక తగిన కుమారునికై యోచించెను. అంత శక్రుడు నడకార దేవపుత్రునివైపు చూచెను, ఆ పుణ్యప్రాణి పూర్వజన్మములో వారాణసి నగరమున నివసించుచు పొలములో విత్తులు చల్లు కాలమున క్షేత్రమునకు పోవుచు ప్రత్యేక బుద్ధుడు దారివెంట చను చుండుట చూచి పాలేర్లతో నాట్లు వేయు డని చెప్పి పంపి, ప్రత్యేక బుద్ధుని తన యింటికి గొనిపోయి భోజనము పెట్టి గంగాతటమునకు దీసికొనిపోయెను. తన పుత్రుని సాయముతో కుటీరము నిర్మించి దానికి తలుపు పెట్టి పచారు చేయుటకు కొంత ప్రాంగణము విడిచి ప్రత్యేక బుద్ధుని అందు మూడు మాసములు నిలిపెను. వర్షాకాలము గడచినపిదప పితా పుత్రులు ప్రత్యేక బుద్ధునకు మూడు చీవరము లిచ్చి వీడుకొల్పిరి. ఈ విధముగా ఏడుగురు ప్రత్యేకబుద్ధులను మూడు మూడు మాసముల చొప్పున కుటీరమున నిలిపి వస్త్రము లిచ్చిరి. రెండు వెదురు గడలతో పని చేయు పితాపుత్రులు ప్రత్యేక బుద్ధుని చూచినంత నే అట్టిపుణ్యకార్యముచేసి వారు తనువులు విడిచినపిదప త్రయః-త్రింశభవనమున జన్మించిరి. అచట ఆరు కామలోకములతో పైనుండి క్రిందికి, క్రింది నుండి పైకి దేవైశ్వర్యముల ననుభవించుచు విచరించుచు అచటినుండి పై దేవలోకములలో జనన మొందగోరిరి. వారిలో నొకడు తథాగతు డగు నని శక్రుడు తెలిసికొని, ఆతని విమాన ద్వారమునకు జని, ఆతడు వచ్చి నమస్కరించినంత "మారిషా. నీవు మర్త్యలోకమునకు పోవలయును" అనెను.

"మహారాజా, మానవలోకము గర్హింపదగినది, నాకు వ్యతిరేకమయినది. అచట నుండువారు దానాది పుణ్యకార్యములు చేసి దేవ లోకమును వాంఛింతురు. నే నచటికి బోయి ఏమి చేయుదును?"

"మారిషా, దేవలోకములోని భోగము లన్ని మనుష్యలోకమున లభించును ఇరువది యైదు యోజనముల యెత్తు కల రత్నప్రాసాదమున నివసింప వలెను. అంగీకరింపుము."

ఆత డంగీకరించెను. శక్రు డాతనిచే ప్రతిజ్ఞ చేయించెను. ఆవల ఋషి వేషము దాల్చి రాజోద్యానము చేరి ఆకాశమార్గమున నిలిచి "ఎవరికి పుత్ర వర మిత్తును? ఎవరికి పుత్రవరము కావలెను" అనెను.

ఒక్కుమ్మడిని వేలకొలది చేతులు పైకి లేచినవి: "భన్తే, నాకు, నాకు, నాకు," అను కేకలు వినబడినవి. "నేను శీలవతి యగునామెకు వర మిత్తును. మీ శీలము లెట్టివి? సదాచారము లెట్టివి?" అనెను. వారు ఎత్తిన చేతులు జోడించి "శీలవతి యగు నామెకు వరమీయ దలచినచో సుమేధా దేవికడకు పొండు" అనిరి. తోడనే యతడు ఆకాశమార్గమున చని ఆమెద్వారముకడ నిలువ "దేవీ, రమ్ము. దేవరాజు నీకు పుత్రవరమిచ్చుటకై ఆకాశమార్గమున నరుదెంచి ద్వారముకడ నిలిచియున్నాడు" అని యెవరో చెప్పిరి. ఆమె లేచి గంభీరముగా నడచి ద్వారము తెరచి "భన్తే సత్యముగా మీరు శీలవతికి పుత్రవర మిత్తురా?" యనెను. "ఔను, ఇత్తును." "అట్లగుచో నా కిండు." "నీ శీలము లెట్టివో తెలుపుము, నాకు నచ్చినచో నీకు పుత్రవర మిత్తును." ఆ వాక్కులు విన్నంతనే ఆమె వినుడు అని తన సదాచార వర్ణనము చేయునదై ఈ గాథ పలికెను :

ప్రథమురాలను శ్రీమహారాజ సురుచి
దేవ వనితల పట్టంపుదేవి నేను.
నన్ను పతి కొనివచ్చిన నాటినుండి
త్రికరణ విశుద్ధిగా నే నతిక్రమింప
లేదు బ్రాహ్మణ, ధర్మము నే దినాన
స్పష్టముగ గాని కడు రహస్యముగ గాని.

సంభవించుత సుతుడు నాసత్యవచన
కారణమ్మున; సత్యమ్ము కాని యెడల
మచ్ఛిరము సప్తధా భిన్న మగు తపస్వి!

అత్తమామలు జీవించి యున్నినాళ్లు
వారిమ్రోల నమ్రతతోడ వర్తిలితిని.

అలసింపక పవలును రేయి వారి
సేవలను ధర్మమార్గాన జేసినాను,
నేను మెలగితి నెపు డహింసానురక్తి.

ప్రభువునకు పట్టమహిషినై పదియు నారు
వేల వనితలతోడ నేవేళ గాని
మెలగినా నీర్ష్యయును క్రోధ మేని లేక

అందు నప్రియ యొక్కతె యైన లేదు
అందరు సపత్ను లన్న నా కధిక కృపయె;
వారిహితమున ప్రీతితో వర్తిలితిని.

దాసులను కర్మకారుల తక్కినట్టి
యాశ్రితుల పోషణము చేసి తాదరమున.

శ్రమణులను బ్రాహ్మణోత్తమ జనుల యాచ
కాళి బోషించితిని ముక్తహస్తములను
అన్న పానీయము లొసంగి యన్నియెడల.

అష్టములలో చతుర్దశులందు, పూర్ణి
మా తిథులయందును, విశేష మగుదినాల
పూని శీలము నష్టాంగపూర్వకముగ
శ్రద్ధతోడ సల్పితి నుపోసథము వ్రతము.

సంభవించుత సుతుడు నాసత్యవాక్య
కారణమ్మున! సత్యమ్ము కానియెడల
మచ్ఛిరము సప్తధా ఛిన్న మగును గాత!

వేయిగాథలలో నైనను వర్ణనము పూర్తి కాని గుణముల నామె పదునైదుగాథలలో పలుకునప్పటికి, కార్యభార ముండుటచే శక్రుడు ఆమె వాక్కుల కడ్డువచ్చి, నీగుణము లనేకములు, అద్భుతములు అని ఆమెను ప్రశంసించువాడై ఈ గాథ పలికెను :

నీవు తెలిపిన గుణములు నిక్కువముగ
కల్గును యశస్వినీ, రాజకాంత! నీకు
పుట్టును కులీనుడు, విదేహపుత్రు, డధిక
ధార్మికుడు, కీర్తివంతు, డుదారమూర్తి

ఆమె ఆతని వాక్కులు విని ప్రసన్నచిత్తురాలై రెండు గాథలు పలికెను :

నీవు ధూసరితం బగు నింగి నిలిచి
పల్కితివి చాల చక్కని భాషణములు.
నాకు హృదయంగమమ్ములు! నాకదూత
వగుదువో, బుద్ధి కల్గు మహర్షి వగుదొ
తెలుపు మాగంతుకా! నీదు తెరగు నాకు.

ప్రత్యుత్తర మిచ్చువాడై ఆత డీ గాథలు పలికెను :

అందురు సహస్రలోచను, డతడె నేను-
శక్రుడను వచ్చినాడ నీ సవిధమునకు.

మర్త్యలోకాన నెవ్వతె మానవతియొ
బుద్ధిమతి చేయుచుండునో పుణ్యకర్మ
లత్తమామలకును సేవ లాచరించు
నట్టిసతి జూడ దేవత లరుగు డెంత్రు.

పూర్వజన్మ సుకృతంబున బుట్టి రాజ
కులములో భద్రురాల, నీకోర్కె లెల్ల
తీర్చికొన జాలినట్టి సుశీలమేత !

రాజపుత్రిక, రెండు కరమ్ములందు
కలవు మంచి ద్రవ్యంబు, లఖండకీర్తి
భూతలంబున వెలయు నీపుట్టువంటె,
కలుగు భావిని దేవలోకమున జన్మ !

సుఖము పొందుము చిరము! విశుద్ధధర్మ
పాలనము చేయుచు సుమేధ! మేలు కలిగె
నాకు నిను జూడ! పోయెద నాకమునకు !

"దేవలోకములో నాకు పని యున్నది, పోవుచున్నాను. నీవు అప్రమత్తురాలవై యుండుము" అని శక్రు డుపదేశ మిచ్చి వెడలిపోయెను.

నడకార దేవుడు బ్రహ్మముహూర్తమున దేవలోకమునుండి చ్యుతుడై రాణి కడుపున బడెను. రాణికి గర్భధారణ మయినట్లు తోచినంతనే రాజుకు సూచించెను. గర్భరక్షణార్థము ఆవశ్యకములైన పను లన్నియు రాజు చేయించెను. పది మాసములు గడిచినంతనే బిడ్డడు పుట్టెను. అతనికి మహాపణాదు డని పేరు పెట్టిరి. రెండు రాష్ట్రముల వారును రాజాంగణమున చేరి. "స్వామీ, పుత్రుని పాలకొరకు ఇది మా కానుక" అని ఒక్కొకరు ఒక్కొక కార్షాపణము తెచ్చిరి. అవి యన్నియు పెద్ద గుట్ట యైనది. రాజు స్వీకరింపకపోయినను వారు "స్వామీ, కుమారుడు పెద్దవాడైనపిదప అతని వ్యయమునకు ఉపకరించును" అని వారు నాణెము లచ్చటనే విడిచి వెడలిపోయిరి. కుమారుడు మహావైభవముతో పెరుగుచుండెను. పదునారు వత్సరములు వచ్చునప్పటి కాతడు సమస్తవిద్యా పారంగతు డయ్యెను. రాజు గమనించి దేవితో "భద్రే, నీ కుమారునకు రాజ్యాభిషేకము చేయదగిన సమయము వచ్చినది. కావున రమణీయప్రాసాదము నిర్మింప జేసి అం దాతనికభిషేకము చేయుదము" అనెను. మంచి దని ఆమె చెప్పగా, రాజు వాస్తుకలాకుశలు రగు ఆచార్యులను పిలువ నంపి "బాబులారా, వడ్రంగులను కొనిపోయి మా నివాస స్థానములకు ఎక్కువదూరము కాకుండా కుమారునికై ప్రాసాదము నిర్మింపుడు. అందు రాజ్యాభిషేకము చేయవలెను" అనెను. మంచి దని వారు స్థలము వెదుకపోయిరి. ఆసమయమున శక్రుని పీఠము వే డెక్కెను. శక్రుడు దానికి హేతువు గ్రహించి విశ్వకర్మను పిలువ నంపి "బాబా! పోయి మహాపణాద కుమారుని కొరకు రత్నప్రాసాదము నిర్మింపుము. దాని పొడుగు వెడలుపు అర్ధయోజన ముండవలెను. కాని యెత్తు మాత్రము ఇరువదియైదు యోజనము లుండవలయును" అని చెప్పెను. విశ్వకర్మ వడ్రంగి వేషము దాల్చి వండ్రుంగులకడకు జని "మీరు ప్రాతఃకాలభోజనము చేసి రండు" అని వారిని పంపి, తన చేతిదండముతో భూమిపై కొట్టెను. తోడనే అతడు పలికినట్లు ఏడంతస్తులమేడ పైకి లేచెను. మహాపణాదుని ప్రాసాదమంగళము, ఛత్రధారణ మంగళము, వివాహ మంగళము ఒక్కమారుగా జరిగినవి. రెండు రాష్ట్రములవారును మంగళ

స్థానమున సమావిష్టులై యేడు సంవత్సరములపాటు మంగళోత్సవములలో పాల్గొనిరి. రాజు వారిని పొమ్మనక వస్త్రములు, అలంకారములు, భోజనములు, పానీయములు అన్నియును వారికి అందజేసెను. ఏడు సంవత్సరముల తరువాత వారు కోలాహలము చేసిరి. సురుచి దానికి కారణమేమని యడిగెను వారు "మహారాజా, మేము ఏడు సంవత్సరముల పాటు మంగళోత్సవములలో పాల్గొన్నాము ఇది యెప్పటికి ముగియును" అని అడిగిరి. రాజు "బాబా! నా కుమారు డింతవరకును నవ్వలేదు. ఇత డెప్పుడు నవ్వునో అప్పుడు మీరు పోవచ్చును" అని రాజు పలికెను. వారు నగరమున చాటింపించి నటులను సమావేశపరచిరి. వేయిమంది నటులు ఏడు గుంపులుగా నేర్పడి నాట్యము చేసిరి. కాని చిన్నరాజుకు నవ్వు తెప్పింపజాలరైరి. దివ్య నాటకమాడినను అతనికి వారి నృత్యము నచ్చలేదు చతురులైన నటులిరువురు– భండుకర్ణ, పండుకర్ణ నామధారులు యోచించి రాజకుమారుని నవ్వింప నెంచిరి. భండుకర్ణుడు రాజద్వారమున సాటిలేని ఆమ్రవృక్షము నిర్మించెను. ఆవల దానిపైకి దారపుటుండ విసరివైచి, వల పన్ని దారము మీదుగా అతుల వృక్షము (మామిడి)పై కెక్కెను. అది కుబేరుని ఆమ్ర వృక్షము, కుబేరుని పరిచారకులు వానిని పట్టుకొని ముక్కలు ముక్కలుగా నరకిరి. రెండవ నటుడు ఆ ముక్కలను ప్రోగు చేసి వానిపై నీరు చల్లెను. ఆతడు పుష్ప వస్త్రములు ధరించి నాట్యము చేయుచు లేచి నిలిచెను. ఇది చూచియు మహాపణాదుడు నవ్వనేలేదు. పండుకర్ణుడు రాజాంగణమున కట్టెలు పేరిపించి తన పరివారముతో అగ్నిప్రవేశము చేసెను. అది చల్లారిన పిదప దానిపై నీరు చల్లిరి. పండుకర్ణుడు తన పరివారముతో కూడ పుష్ప వస్త్రములు ధరించి నృత్యము చేయుచు లేచెను. మహాపణాదుడు దీనికిని నవ్వలేదు. రాజకుమారుని నవ్వింపజాలక మానవులు వెరపు చెందిరి. శక్రుడు చూచి దేవనటులను పంపుచు మీరు పోయి మహాపణాదుని నవ్వించి రండు. అని ఆన తిచ్చెను. వారు రాజాంగణమున చేరి అర్ధాంగనృత్యము చేసిరి. అందు ఒకచెయ్యి ఒకకాలు, ఒకకన్ను మొద లగునవి నృత్యము చేయును; మిగిలిన యంగములు నిశ్చలములుగా నుండును. అది చూచి మహాపణాదుడు చిరునవ్వు నవ్వెను. జనులు నవ్వి నవ్వి ఆపుకొనలేక రాజాంగణమున పడిరి, అంతట మంగళోత్సవము సమాప్తమయ్యెను.

మహాపణాద జాతకానుసారముగా కథ నడచును. అతడు దానాది పుణ్యకార్యములు చేయుచు, మరణానంతరము దేవలోకమునకు చనెను.

శాస్త ఈ ధర్మ నిర్దేశము చేసి "భిక్షువులారా ! ఈ విధముగా విశాఖ పూర్వముకూడ నావలన వరములు పొందెను" అని జాతకములు సరి పోల్చెను. ఆ కాలమున మహాపణాదుడు భద్రజీ; సుమేధ దేవి విశాఖ; విశ్వ కర్మ ఆనందుడు; శక్రుడు నేనే.

490. పఞ్చుపోసథ జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయునపుడు ఉపోసథవ్రత మాచరించు ఉపాసకులైదువందలమందిని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున శాస్త్ర ధర్మసభలో చతుర్విధపరిషన్మధ్యమున అలంకృత బుద్ధాసనముపై కూరుచుండి మృదుచిత్తమున పరిషత్తువంక చూచి ఉపాసకులనుగూర్చి ధర్మోపదేశము జరుగుచున్న దని గ్రహించి "ఉపాసకులారా, మీరు ఉపోసథ వ్రతధారణ చేసితిరా ?" అనెను. "భన్తే, చిత్త"మని వారు విన్నవింపగా, శాస్త్ర "మంచిపని చేసితిరి. ఉపోసథవ్రతము పురాణ పండితుల పరంపరలోనిది. వారు రాగాది చిత్తమలములను దూరీకరించుటకై ఉపోసథవ్రతము నెరపెడివాడు" అని వారి ప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున మగధరాష్ట్రాది రాష్ట్రత్రయము నడుమ అరణ్యముండెను. బోధిసత్త్వుడు ఆ కాలమున మహైశ్వర్యము కల బ్రాహ్మణకులమున జన్మించి, పెరిగి పెద్దవాడై భోగములు విడిచి యా యరణ్యమునకు జని ఆశ్రమము నిర్మించుకొని నివాసము చేయజొచ్చెను, దానికి సమీప ప్రదేశమున వేణువనములో తన భార్యతో పావుర ముండెను. అచట పుట్టలో పాము, తుప్పలో నక్క, వేరొకతుప్పలో ఎలుగుబంటియు కలవు. ఆ నాలుగును అప్పు డప్పుడు ఋషిసన్నిధి కరిగి ధర్మములు వినుచుండెడివి.

ఒకనాడు పావురములు రెండును గూటినుండి వెలువడి మేతకై పోయినవి. ఆవల నవి గూటికి మరలి వచ్చునపుడు ఆడుపావురమును డేగ తన్నుకొని పోయెను. దాని యాక్రందనము విని మగపావురము ఆగి

చూచునప్పటికి డేగ దానిని తన్నుకొని పోవుచుండెను. అరచుచుండగనే పావురమును డేగ చంపి తినెను. భార్యావియోగమున పావురము బాధ పడుచు "ఈ రాగాగ్ని నన్ను మిగుల పీడించుచున్నది. దీనిని దమింపకుండ మేతకు పోవను" అనుకొని మేతకు పోవుమార్గము విడిచి తపస్విసన్నిధి కరిగి రాగాగ్నిని శాంతింప జేయుటకై ఉపోసథవ్రతము పూని ఒకప్రక్క పడియుండెను.

సర్పముకూడ ఆహారము వెదకుటకై నివాసస్థానము వెలువడి సమీప గ్రామమున ఆవులు మేత మేయుతావున ఎరకొరకు తిరుగుచుండెను. అప్పుడు గ్రామాధికారి వృషభము- మంగళకరము, సర్వశ్వేతము నగునది మేత మేసి మరలి వచ్చుచుండెను. అది పుట్టపై పాద ముంచి కొమ్ములతో మన్ను ఎగజిమ్ముచు క్రీడించుచుండెను.

వృషభ పాదఘట్టనము విని సర్పము భయపడి పుట్టలోనికి దూర జొచ్చెను. దానిపై ఎద్దుగిట్ట పడినది. కోపించి పాము వృషభమును కాటందెను. ఎద్దు అచటనే పడి మరణించెను. ఈ వార్త తెలిసినంతనే గ్రామవాసులచ్చటికి జని విలపించి, గ్రంధమాల్యాదులతో పూజించి, గుంట త్రవ్వి దానిని పూడ్చి వెడలిపోయిరి. ఆవల పుట్టలోనుండి పాము ఈవలకు వచ్చి, 'నా క్రోధమువలన వృషభ ప్రాణములు తీసి జనులను శోకాకులచిత్తులను చేసితిని. ఈ క్రోధమును దమింపక నేను ఆహారము తీసికొనను' అనుకొని ఆశ్రమమునకు జని ఉపోసథవ్రతము బూని ఒక ప్రక్కన పడియుండెను.

నక్క వేటకు పోయి చచ్చిన యేనుగును చూచి సంతోషించి పేరాసచే హస్తికళేబరమున ప్రవేశించి బయటికి రాలేక చాల శ్రమపడి చచ్చిచెడి తుద కెట్లో ఈవల బడెను. చర్మముమీది రోమము లూడిపోయినవి. 'లోభముచే నాకీగతి పట్టినది. లోభమును జయింపక ఇక వేటకు పోవను' అని నక్క నిశ్చయించుకొని ఉపోసథవ్రత మాచరించుటకై ఆశ్రమము చేరి ఒక ప్రక్కన పడియుండెను.

ఎలుగుబంటి కూడ పేరాసకు లోనై అడవినుండి వెలువడి సరిహద్దు గ్రామములో ప్రవేశించెను. ఈ సంగతి తెలిసికొని గ్రామవాసులు విల్లంబులు,

కఱ్ఱలు పట్టుకొని యెలుగుబంటి దాగిన పొద చుట్టు ముట్టిరి. గ్రహించి యెలుగుబంటి పొద వెలువడి పరుగిడసాగెను. జనులు దానిపై అలుగులు, కఱ్ఱలు విసరిరి. తలపై దెబ్బ తగిలి రక్తము కారుచుండ నిజనివాసమునకు పరుగెత్తి యెలుగుబంటి తనలో "పేరాసవలన నాకీబాధ కలిగినది. ఆశను గెలువక ఇక వేటకు పోవను" అనుకొని ఆశ్రమమునకు జేరి ఉపోసథవ్రత మవలంబించి ఒక ప్రక్క పడియుండెను.

తాపసి ఉన్నత కులాభిమానముచే ధ్యాననిష్ఠుడు కాజాలకుండెను. ఇంతలో ఒకానొక ప్రత్యేకబుద్ధుడు తాపసి అభిమానవంతు డగుట గ్రహించి "ఇతడు నీచప్రాణి కాడు, బుద్ధంకరుడు. ఈ కల్పములోనే సర్వజ్ఞత్వము పొందగలడు. ఈతని యభిమానము తొలగించి ఇతనికి సమాపత్తిలాభము కలిగించెదను" అనుకొని, తాపసి పర్ణకుటీరములో కూరుచుండి యున్నప్పుడే దిగి వచ్చి ఆతని రాతిపలకపై కూరుచుండెను. తన పీఠముపై వేరొకడు కూరుచుండుట చూచి అభిమానము చెలరేగి అప్రసన్నుడై, చిటిక వేసి "ఓరి చండాలుడా, పాడుమొగమువాడా, ముండితముండకా, శ్రమణకా, నీవు నశించిపోవుదువుగాక! నేను కూర్చుండుతావున ఏల కూర్చున్నావు?" అనెను. "సత్పురుషా, నీకింత అభిమాన మేమి? నాకు ప్రత్యేకబోధి జ్ఞానము కలగినది. నీవు ఈ కల్పముననే సర్వజ్ఞ బుద్ధుడ వగుదువు. నీవు బుద్ధంకరుడవు. దశపారమితలను పూర్తి చేయుచు వచ్చుచున్నావు. కొంత కాలము గడచిన పిదప నీవు బుద్ధుడ వగుదువు బుద్ధత్వము లభించిన జన్మమున సిద్ధార్థనామము పొందుదువు" అని యిట్లు నామకుల గోత్రములు, అగ్రశ్రావకత్వ విశేషములు తెలిపి "నీవు అభిమానమున కఠినుడవై కఠోర వాక్కులేల పలుకుదువు? ఇది నీకు తగదు" అని ఉపదేశించెను. ఆత డిట్లు పలికినను తాపసి ప్రణామము చేయలేదు; నే నెప్పుడు బుద్ధుడ నగుదును అని కూడ అడుగలేదు. అంతట "నీ ఉన్నతజాతికన్న నా గుణములే గొప్ప వని తెలిసికొనుము. నీకు శక్తి యున్నచో నావలె ఆకాశమున విచలింపుము" అని ఆకసమున కెగిరి తన పాదధూళి తాపసి జడలపై రాల్చి, ఉత్తరహిమాలయమునకు వెడలిచనెను. అతడు చనినపిదప తాపసి సంవిగ్నచిత్తుడై తనలో "ఈ శ్రమణుడు ఇంతవలుద శరీరము కలవాడైనను గాలిలో తేలిపోవు దూదిపింజవలె ఆకసమున కెగిరినాడు. జాత్యభిమానముచే నేను ఇట్టి

ప్రత్యేక బుద్ధునకు నమస్కారము కూడ చేయలేకపోతిని. నే నెప్పుడు బుద్ధుడ నగుదు నని యడుగనైతిని. జాతి యేమి చేయును ? ఈ లోకమున సదాచారమే గొప్పది. ఈ యభిమానము వృద్ధి నొందినచో నన్ను నరకమునకు గూడ కొనిపోవగలదు. ఈ యభిమానమును జయింపక, నేను కందమూల ఫలములు ముట్టుకొనను'' అనుకొని, కుటీరములోనికి బోయి ఉపోసథ వ్రతము బూని, కాష్ఠశయ్యపై గూరుచుండెను. మహాజ్ఞానియు, కులపుత్రుడు నగునాతాపసి అభిమానమును జయించి, యోగవిధాన మవలంబించి అభిజ్ఞలు, సమాపత్తులు పొంది ఈవలకు వచ్చి చంక్రమణ భూమిలో శిలాసనముపై గూరుచుండెను. అంతట పావురము మొదలగునవి ఆయనకడకు వచ్చి ప్రణామము చేసి ఒకప్రక్క నిలిచినవి. బోధిసత్త్వుడు పావురముతో "నీవు రెండవనాడు ఈవేళకు రాలేదు. మేతకు పోవలేదా ? ఒకవేళ నేడు ఉపోసథవ్రతము పూనినావా ?'' అనెను. "భన్తే, చిత్తము.'' ఎందుచేత ?'' అని ప్రశ్నించువాడై బోధిసత్త్వుడు ఈ గాథ పలికెను :

ఒకపోతమ, యిప్పు డున్నావు నీవు
నిష్క్రియమ్ముగ; చెప్పు నీకు భోజనము
వలదొకో ? దప్పి యాకలి సహించుచును
ఊనితి వేటికో ఉపవాసనిష్ఠ ?

విని కపోతము ఈ గాథలు పలికెను :

మును కపోతిక యెడ ముగ్ధచిత్తుండ-
ఈ ప్రదేశమునందె యిరువురి కేళి.
దానిని శ్యేనంబు తన్నుక పోయె,
ఏది రుచించుట లేదు నా కిపుడు.

దాని వియోగాన మానసికంబు
లగు బాధ లెన్నియో అనుభవించుచును
క్రమ్మర ననురక్తి కలుగనీకుండ
ఉపవాస మొనరించుచున్నాను నిష్ఠ.

కపోతము తన ఉపోసథవ్రత విషయము చెప్పగా, బోధిసత్త్వుడు సర్పాదుల నొక్కొకదానినే ప్రశ్నించెను :

"చనలేవు ఋజువుగా సర్పమా, నీవు
నీకు నాల్కలు రెండు; నీకాయుధములు
కోరలు; నీ నోట ఘోరవిషమ్ము !
లెక్క సేయక ఆకలియు దప్పికయును
ఇట్లుపవాసమ్ము నేల చేయుదువు ?"

"గ్రామణివృషభంబు కడుశక్తి కలది
బలమును వన్నెయె బాగుగా కలది.
పాదంబు వేయ నాపైన పుంగవము
కరచితి కోపాన; కాలధర్మంబు
గాంచిన దయ్యెది గాఢ వేదనను.

ఆవల గ్రామీణు లరుదెంచి చూచి
దుఃఖభారమ్ముతో తొలగి చన్నారు
క్రమ్మర కోపంబు రాకుండ నాకు
ఉపవాసమును పూని యున్నాను నేను."

"మెండు శ్మశానాన మృతశరీరముల
మాంసంబు నీకు గోమాయువా, రుచ్య
మాకలిదప్పులు త్యజియించియిట్లు
ఉపవాసనిష్ఠలో నుందు వెందులకు ?"

"మాంసలోభంబుచే మాతంగకుక్షి
జొచ్చితి, ఎండకు శుష్కించి యపుడె
బిగుసుక పోయెను మిగుల కరీష
సరణి పూర్ణమ్ముగా; వెడదారి లేదు !
కురిసిన దంతలో కుంభవర్షమ్ము
తనువు మెత్తగ నయ్యె తడిసినకొలది.
అపుడు రాహువునోటియం దుండి శశి
ఘాను డీవలకును బడినట్లు నేను
ద్విపకళేబరమును వీడి వచ్చితిని.

క్రమ్మర లోభంబు కలుగకుండంగ
పూని యున్నాడ ఉపోసథ వ్రతము."

"పుట్టలపై చెదపురుగులు మున్ను
భల్లూకరాజమా, భక్షించుచుండు
వాడ, వుపోసథవ్రతము పూనితివి
త్యజియించి ఆకలి దప్పిక లేల ?"

"నిజనికేతనముపై నిర్లక్ష్యవశత
చనినాడ మలయరాష్ట్రమునకు నన్ను
కర్రలం గొట్టుచు గ్రామమ్ముమండి
బయటికి ద్రోసిరి బలిమిమై జనులు.

స్రవియించుచుండగా రక్తంబు, వగులు
శిరముతో నిజసీమ చేరుకొన్నాను.
అంకురింపకయుండ నధికాశ మరల
పూనితి ఉపవాస పుణ్యవ్రతంబు."

ఈ విధముగా ఆ నాలుగు జంతువులు తమతమ ఉపోసథకర్మలను గూర్చి చెప్పి బోధిసత్త్వునకు ప్రణామము చేసి "భన్తే! అనుదినము తాము ఈ వేళకు కందమూలాదులకై పోవుచుండెడివారు. నేడు పోవలే దేమి? ఏల ఉపోసథవ్రతము పట్టినారు ?" అని యడుగునవై ఈ గాథ పలికినవి :

నీవు భదన్త, ప్రశ్నించిన వెల్ల
తెలియ బల్కితిమి; నీ తెరగు ప్రశ్నింతు-
మీవ్రత మూనితి వేకారణమున ?

అయన వాని కిట్లు చెప్పెను :

అతడు జీవన్ముక్తు డాశ్రమమ్మునకు
ఏతెంచినట్టి ప్రత్యేక బుద్ధుండు.

కొలది కాలముపాటు కూర్చుండి యవల
నాకు గత్యాదులు నామ గోత్రముల
ఆచరణంబుతో నన్నియు దెలిసె.

అభిమానవశమున ఆయన కేను
ప్రణమిల్లలేదే, దేమి ప్రశ్నింప లేదు,
మరల నాలో నభిమానాంకురంబు
పుట్టకుండుటకై పూనితి వ్రతము.

ఈ విధముగా బోధిసత్త్వుడు తన ఉపోసథవ్రతకారణము తెలిపి వాని కుపదేశ మిచ్చి, పర్ణకుటీరములోనికి బోయెను. తక్కిన జంతువులు కూడ యథాస్థానములకు పోయినవి. బోధిసత్త్వుడు ప్రాప్తధ్యానుడై బ్రహ్మలోక గామియయ్యెను.

శాస్త ఇట్లు ధర్మదేశన చేసి "ఉపాసకులారా, ఉపోసథవ్రతము పురాణపండితుల పరంపర. ఉపవాసము చేయవలెను" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున కపోతము అనురుద్ధుడు, ఎలుగుబంటి కాశ్యపుడు, నక్క మౌద్గల్యాయనుడు, సర్పము సారిపుత్రుడు, తపస్వి నేనే.

—: o :—

491. మహామోర జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయుచు, ఉద్విగ్నచిత్తుడగు నొకానొక భిక్షువును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ భిక్షువును పిలువ నంపి శాస్త్ర "భిక్షూ, నీవు సత్యముగా ఉద్విగ్న చిత్తుడవైతివా ?" అనెను. భన్తే, సత్యమే" అని అతడు బదులు పలుకగా శాస్త్ర "భిక్షూ, ఈ నందిరాగము మీవంటివాని నెందులకు కలవర పరుపదు ? సుమేరుపర్వతమును పెరికివేయ గల మహావాయువు చుట్టుప్రక్కల నున్న పురాణ పత్రములకు భయపడునా ? పూర్వకాలమున ఆతనివెంట నూరు వత్సరముల వరకు రాగముతో జీవించియుండ గల ప్రాణులను కూడ చలింపజేసెను" అని శాస్త్ర పూర్వజన్మకథ చెప్పెను :

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు నప్పుడు బోధిసత్త్వుడు సరిహద్దుసీమలో నెమలికడుపున పడెను. ఒకనాడు నెమిలి మేత మేయుచోట గ్రుడ్డు విడిచిపెట్టి వెడలిపోయెను. తల్లికి స్వాస్థ్య మున్నను, సర్పాదులవలన హాని కలుగకున్నను అండము నష్టమైపోవదు. ఇందుచే ఆ గ్రుడ్డు కర్ణికారపుష్పము మొగ్గవలె బంగరువన్నె కలిగి పక్వమై ప్రకృతి నియమప్రకారము విచ్చుకొనెను. అందుండి బంగరువన్నె కల నెమలి పిల్ల ఈవలకు వచ్చెను. దాని రెండుకన్నులు జింజు ఫలములవలెను, ముక్కు పగడమువలెను ఉండెను. ఎర్రని మూడుగీతలు మెడమీదినుండి వీపు నడుమగా సాగిపోయినవి. పెరిగినపిదప సామాను వేసినబండివలె నెమిలి శరీర ముండెను. నీలవర్ణమయూరము లన్నియు సమావిష్టములై అతనిని రాజును చేసినవి. ఒకనాడు మయూరరాజు సరోవరములో జలపానము చేయుచు నీటిలో తన సౌందర్యమును చూచుకొని తనలో "నేను మయూరము లన్నిటికంటె

నెక్కువసౌందర్యము కలవాడను. వీరితోపాటు నే నున్నచో జనులు వచ్చి పోవుటావున నాకు ఆపద సంభవింపవచ్చును. కావున హిమాలయమునకు పోయి ఒంటిగా సుఖప్రదేశమున నివాసము చేయుదును'' అనుకొని రాత్రి వేళ తక్కినమయూరములు నిద్రించుచుండగా ఎట్టిసూచన చేయక హిమాలయయనకు జని, మూడు పర్వత పంక్తులు లంఘించి నాలుగవ దానిలో అరణ్యమున కమలములు విరిసియున్న సరోవర సమీపమున కొండ నానుకొని యొున్న పెద్ద మర్రిచెట్టు కొమ్మమీదికి పోయి వాలెను. ఆ కొండనడుమ అంద మయినగుహ కలదు. అచట నుండ కోరిక కలిగి దాని కెదురుగా నున్నపర్వత తలముపై నివసింపసాగెను. క్రింది నుండి దానిమీది కెవ్వరు నెక్కజాలరు; పైనుండియు దానిమీది కెవ్వరును దిగలేదు. కావున మయూరమునకు పక్షుల వలనను, పిల్లుల వలనను, సర్పాదుల వలనను, మనుష్యుల వలనను భయయ లేకుండెను. ఇది నాకుసుఖస్థానము అనుకొని ఆనాడచటనే యుండెను. మరునాడు కొండగుహ వెలువడి మయూరము పర్వత శిఖరముపై తూర్పుదిక్కుగా కూర్చుండెను. ఉదయ మైనంతనే అది సూర్యుని వీక్షించి పగ లంతయు తన సంరక్షణకై "ఉదేతయం, చక్షుమా, ఏకరాజా'' అని పరిత్రాణ ధర్మదేశనము పఠించును. ఆవల మేత మేయుచోటికి పోవును. సాయం సమయమున మరలి వచ్చి పర్వతశిఖరముపై కూరుచుండి అస్తమించు సూర్యుని విలోకించి రాత్రివేళ తాను సురక్షితముగా నుండుటకై "అపేతయం, చక్షుమా, ఏకరాజా'' అను పరిత్రాణ ధర్మదేశను పఠించును. ఈ విధముగా మయూర మచట నివసించుచుండెను.

ఒకనాడు వ్యాధయువకుడు అరణ్యమున తిరుగుచు పర్వతముపై కూరుచున్న మయూరమును చూచి యావల నింటికి మరలివచ్చెను. చనిపోవు సమయమున నతడు తన కుమారునితో "నాయనా, నాల్గవ పర్వతపంక్తి మీది అరణ్యములో బంగరునెమిలి కలదు. రాజు ప్రశ్నించిన పక్షమున యథార్థము చెప్పుము'' అనెను. ఒకనాడు వారాణసీ నరేశుని పట్టపుదేవి క్షేమ తెల్లవారుజామున కల కనెను. అందులో బంగరునెమిలి ధర్మోపదేశము చేయుచుండెను. తాను 'సాధు, సాధు' అనుచు వినుచుండెను. ధర్మోపదేశానంతరము మయూరము వెడలిపోయెను. రాణి ఈ మాటలు పలుకుచు, కన్నులు తెరచి, "మయూరరాజు పోవుచున్నాడు, పట్టుకొనుడు'' అను

నప్పటికి మెలకువ వచ్చి, అయ్యది స్వప్న మని తెలిసికొనినది. ఆవల 'అయ్యది స్వప్న మని చెప్పినచో రాజు నమ్మడు. గర్భవతి నైతి నని చెప్పినచో ఆదరించును' అని తలపోసి రాణి నటన చేయుచు పండుకొనెను. రాజు ఆమెకడకు జని "భద్రే, యేమి శ్రమ" యని అడిగెను. ఆమె' నాకు గర్భ మేర్పడ్డది' అని చెప్పగా రాజు 'భద్రే, నీ కేమి కోరిక కలదు' అనెను. "దేవా, బంగరు నెమిలి ధర్మోపదేశము చేయగా వినవలతును." "భద్రే, ఇట్టి నెమిలి యెచ్చట లభించును." "దేవా, అది లభింపనిచో నా ప్రాణములు నిలువవు" "భద్రే, చింతింపకుము. నెమిలి యెచ్చట నున్నను దొరకితీరును" అని రాజు ఆమె నోదార్చి సింహాసన మెక్కి అమాత్యులతో 'అమాత్యులారా, దేవి బంగరునెమిలి యుపదేశమును వినగోరుచున్నది. బంగరువన్నె గల మయూరము లుండునా ?" అనెను.

"దేవా, బ్రాహ్మణులకు తెలియును." రాజు బ్రాహ్మణులను పిలువ నంపి ప్రశ్నించెను. వారు "మహారాజా, మా లక్షణము ప్రకారము జల జంతువులలో చేపలు, తాబేళ్ళు, కర్కటములు, బంగరువన్నె కలవి. స్థల జంతువులలో కొన్ని మృగములు, హంసలు, మయూరములు, తీతువుపిట్టలు బంగరువన్నె కలవి యుండును. పశువులలో, మనుష్యులలో బంగరువన్నె యుండును" అని విన్నవించిరి. రాజు తన రాష్ట్రములోని వేటకాండ్రను పిలువ నంపి "మీలో నెవరైనను బంగరునెమలిని చూచినారా ?" అనెను. మే మెవరమును చూడలే దని వారు విన్నవించిరి. తండ్రివలన మయూర వృత్తాంతము విన్నవాడు తాను చూడ లే దనియు, ఐనను ఫలానిస్థానమున బంగరునెమలి కలదు అని మా నాయన చెప్పినా డనియు విన్నవించెను. రాజు వానికి విశేషధన మిచ్చి "సౌమ్యా, నీవు పోయి దానిని కట్టి తెమ్ము. అయ్యది దేవికిని నాకును ప్రాణదాతతో సమ మగును" అని వీడ్కొనెను. వాడు తనభార్యకు బిడ్డలకు ధన మిచ్చి పర్వతశ్రేణికి చేరి బోధిసత్త్వుని కాంచి వల పన్నెను. నేడు వలలో చిక్కును, ఈనాడు వలలో పడును అని వాడు కొంతకాల మెదురు చూచి తుదకు మృతి చెందెను. బోధిసత్త్వుడు జాలములో చిక్కుకొనలేదు. దేవికూడ తనకోరిక నెరవేరకముందే చని పోయెను. రాజుకు క్రోధము కలిగెను. ఆ నెమిలిమూలమున తన ప్రియ భార్య మరణించినది అను వైరమునకు వశీభూతుడై రాజు "హిమాలయ

మున నాలుగవ శ్రేణిలో బంగరునెమలియున్నది. దాని మాంసము తిన్నవారు అజరామరు లగుదురు'' అని బంగరుపట్టముపై వ్రాయించి దానిని గట్టి చందువా పెట్టెలో నిబద్ధము చేయించెను. తరువాత కొంతకాలమున కాతడు చనిపోయెను. పిదప వేరొకరాజు వచ్చెను. ఆతడు బంగరు పలకమీది యక్షరములు చదివి అజరామరత్వము పొంద దలచి మయూరమును పట్టించుటకై వేటకానిని పంపెను. వాడచట కొంతకాల ముండి తుదకు చనిపోయెను. ఈ ప్రకారముగా ఆరుగురు రాజులు పరిపాలన చేసి గతించిరి. ఆరుగురు వేటగాండ్రుకూడ పర్వతశ్రేణిలో చనిపోయిరి. ఏడవరాజు ఏడవ వేటగానిని నెమిలికై పంపెను. వాడు ఏడుసంవత్సరములపాటు వల పన్ని ఈనాడు పడును, ఆనాడు పడును అనుకొనుచు కాలము గడచుట చూచి ''ఈ మయూరరాజు పాదమునకు బంధము పడకపోవుటకు కారణ మేమి ?'' అని యోచించి ప్రయత్నము చేయుచు, నెమిలి ప్రాతః సాయం కాలములందు త్రాణధర్మదేశనము పఠించుచుండుట వలన నని గ్రహించి ''ఇది సామాన్య మయూరము కాదు. ఈయది బ్రహ్మచారి కానోపును. బ్రహ్మచర్య ప్రభావముచేతను, పరిత్రాణ ధర్మపఠన ప్రభావముచేతను ఈ మయూర పాదమునకు ఉచ్చు తగులుకొనుట లేదు'' అని నిర్ణయించుకొని, ఆవల బాగుగా వేచియుండి, సరిహద్దులోని జనపదమునకు జని వల పన్ని ఆడనెమిలిని పట్టి దానికి చక్కని శిక్ష యొసగెను. చిటికలు వేసినంతనే ఆడునెమిలి కూత మొదలు పెట్టి, తాళములు వాయింపగా నృత్యము చేయును. వాడు దానిని బోధిసత్త్వుని కడకు కొనిపోయి, బోధిసత్త్వుడు పరిత్రాణ ధర్మదేశనము పఠింపకపూర్వమే వల పన్ని చిటికలు వేయగా ఆడునెమిలి కూత మొదలు పెట్టెను. ఆ ధ్వని విని యేడు వందల సంవత్సరములనుండి నెమిలిలో అణగియున్న రాగము తోక త్రొక్కిన పామువలెను నిలిచెను. అతడు రాగాభిభూతుడై పరిత్రాణ ధర్మమంత్రము పఠింపనేరక వేగముగా ఆడునెమిలికడకు జని దాని కాలికి తగిల్చియున్న పాశమున పడెను. ఏడువందల సంవత్సరములపాటు పాశము తగుల్కొనని మయూరము ఆ క్షణములో పాశమున చిక్కుకొనెను. వేటకాడు నెమిలినెత్తిపై వల చట్టపుకొయ్యచూచి ''ఈ మయూరరాజును ఇంతకు ముందు ఆరుగురు వేటకాండ్రు పట్టుకొన లేకపోయిరి. ఏడేండ్లు గడుచువరకును నాకు

గూడ సాధ్యము కాలేదు. ఈనాడు ఆడునెమిలిమూలమున రాగమునకు వశీభూతమై పరిత్రాణధర్మ దేశనము పఠింపజాలక వచ్చి ఈ మయూరము వలలో చిక్కుకొన్నది. ఇట్టి సదాచారము గలపిట్టకు కష్టము కలిగించినాను. ఇట్టిపక్షిని మరి యెవ్వరికడకును కొంపోవరాదు. రాజు నాకిచ్చు బహుమతి వలన ప్రయోజన మేమి ? దీనిని విడిచిపెట్టెదను" అనుకొని "ఈ పిట్టకు ఏనుగుబల మున్నది, సామర్థ్య మున్నది. నేను తనకడకు బోవుచో తన్ను సంహరింతు నని తలచి మృత్యుభయముచే ఆందోళన చెంది కాలు విరుగ గొట్టుకొన వచ్చును. కావున దగ్గరకు పోవకుండగనే మాటున నుండి బాణముతో బంధమును ఛేదింతును. అప్పుడు పిట్ట స్వయముగా తన యిచ్చ వచ్చినట్లు ఎగిరిపోవచ్చును" అనుకొని ధనుస్సున బాణము సంధించి నారి లాగ నుండెను. నెమిలి చూచి "ఈ వేటకాడు కామాతురుడనై బంధమున పడిన నన్ను చూచి నిశ్చింతముగా నుండనేరడు. ఈత డెచట నున్నాడు ?" అని ఇటు నటు చూడగా ఎక్కుపెట్టినవిల్లు కానబడినది. తనను వాడు సంహరింప దలచియుండు నని మరణభయముచే జీవనప్రదానము వేడువాడై బోధిసత్త్వుడు ఈ గాథ పలికెను :

ధనముకోసమె నీవు నను బట్టితేని
సంహరింపక రాజసన్నిధానమ్ము
చేరుచుపజ్ఞాన పారితోషికము
నధిపుడు నీ కిచ్చు నని విశ్వసింతు.

వేటకాడు విని తనలో "నన్ను చంపుటకై వేటకాడు బాణ మెక్కుపెట్టియున్నా డని మయూరరాజు భావింప నోపును. ఈతని నోదార్ప వలెను" అనుకొని సాంత్వన మిచ్చువాడై ఈ గాథ పలికెను :

నిన్ను వధింపగా నేడు బాణమ్ము
సంధింపలేదు నే చాపమ్మునందు
నీబంధనంబు ఖండింతు, సుఖాన
ఇచ్చ వచ్చినచోటి కేగుము కేకి !

మయూరరాజు అంతట ఈ గాథలు పలికెను :

సప్తవర్షమ్ములు సహించి యెట్లో
ఆకలి దప్పి. వెంటాడుచు నన్ను
పాశాన నేటికి బంధించినావు!
తలతు వేమిటికి బంధనము ఖండింప ?

ఈనాటినుండి త్యజించితి వొక్కొ
ప్రాణిహింసను ? నాకు పాశవిముక్తి
చేయ నెంతువు, సర్వజీవుల కిప్పు
డభయప్రదానంబు నాచరించెదవో ?

ఆవల ప్రశ్నోత్తరములు. వేటకాడు ఇట్లనెను :

అభయం బొసంగుచు నఖిలజీవులకు
ప్రాణిహింసను మాని, పరలోకమునకు
నేగినవానికి నేమి సౌఖ్యమ్ము
లో మయూరప్రభూ, ఒదవునో చెపుమ !

మయూరరాజు :

అఖిల జీవులకును నభయం బొసంగి
హింస మానినవాని కీలోకమందు
సత్కీర్తి, ఆవల స్వర్గంబు నొదవు.

వేటకా డిట్లనెను :

వాదించుచుంద్రు దేవతలు లే రనుచు,
జీవు డిచ్చోటనే చెందు నాశంబు
నందురు, ఫలితంబు నందును ప్రాణి
సుకృత దుష్కృతముల చొప్పున నంద్రు,
దానంబు బుద్ధివిహీను లౌవారి

కల్పనం బందురు; కాన పట్టుదును
ఆవాక్కులం బట్టి యండజంబులను.

విని బోధిసత్త్వుడు పరలోకము కల దని తెలుపుటకై వలలోనుండి తల కర్ర క్రిందికి వంచి ఈ గాథ పలికెను :

ఆదిత్యుడును చంద్రు డంతరిక్షమున
నరుగుచు కాంతితో నగపడుచుంద్రు
వారి నీలోకమువా రని యంద్రో ?
అన్యలోకమువార లందురో జనులు ?

వేటకాడు ఈ గాథ పలికెను :

ఇహలోకవాసుల కిరువురి యెడల
పరలోక దేవతాభావన కలదు.

బోధిసత్త్వుడీగాథ పలికెను :

ఏహీనమానసు లెంతురో దుష్ట
సుకృత కార్యఫలంబు శూన్యం బటంచు;
దానమ్ము మతి లేనిమానవ భ్రమము
అని యెవ్వ రందురో అవ్వారి వాద
మయ్యె పరాస్త మీ యాభాషణమున.

బోధిసత్త్వుని వాక్కులోని సత్యమును విచారించి, అత డీగాథలు పలికెను :

నీ వన్నమాటలు నిక్కంబు; దాన
సత్కార్య దుష్కార్యజాత మెట్లగును
ఫల విహీనము ? మూర్ఖభాషితం బెట్లు
కాగల్గు దానాదికంబు, వచింపు.

ఏ మాచరించిన, ఎట్టి లోనర్చ,
ఎట్టియభ్యాసంబు, నెట్టితపస్సు

నే జేయవలయును ? నిరయంబునుండి
రక్షణకై కేకిరాజ, వచింపు !

విని బోధిసత్త్వుడు "నే నీప్రశ్నకు ప్రత్యుత్తర మిచ్చినచో ఈ మానవ లోకమున ఉత్తర మీయ గలవా డుండడు. బ్రాహ్మణశ్రమణులకు తగిన మాటలు ఈతనికి చెప్పెదను" అనుకొని ఈ గాథలు పలికెను :

తాల్చి కాషాయవస్త్రము, లనాగారి
యాశ్రమణాళి కాలానుసారముగ
భిక్షాటనార్థము వెడలుచునుండు
ఆలసింపరు శాంతు లగువారు చర్య.

శాంతుల దరి యుక్తసమయాన చేరి
మనసులో నున్నట్టిమాట ప్రశ్నించు
ఇహపరసత్యంబు లెరిగిన రీతి
నీకు వారలు తెల్పనేర్తురు సుమ్ము.

ఇట్లు పలికి వానికి నరకభయము చూపెను. అతడో పారమితలను పూర్తిచేసి ప్రత్యేకబుద్ధుడైన ప్రాణి. సూర్యరశ్మిస్పర్శ అయినంతనే వికసించు పద్మమువలె పరిపూర్ణజ్ఞానియై ఆతడు చరించుచుండెను. నిలుచున్న పాశమున ధర్మకథలు వినుచుండును; అట్లే సంస్కారములను గూర్చి విచారణ సల్పి వానియనిత్యత్వమును దుఃఖము అనాత్మస్వరూపమగుటయును గ్రహించి ప్రత్యేకబోధిజ్ఞానము పొందియున్నాడు. అతనికి జ్ఞానప్రాప్తియు బోధిసత్త్వునకు బంధన విముక్తియు ఒక్కసారిగా సంఘటిల్లినవి. ప్రత్యేక బుద్ధుడు సమస్తచిత్త మాలిన్యములను క్షాళన చేసి సంసారసాగర తీరమున నిలిచి, ఈ గాథ పలికినాడు :

ఉజ్జగించెడిరీతి నురగంబు కుబుస,
మహీరుహము పండుటాకులు రాల్చు
నట్లు లోభము విడనాడితి నేను.

ఆత డుల్లాసవాక్కులు పలికి "నేను సమస్తక్లేశ బంధనములనుండి విముక్తుడనైనాను. కాని మా యింట అనేకపక్షులు బంధనములలో నున్నవి. వాని నెట్లు విడిపింతును?" అనుకొని "మయూరరాజా, మా యింటిలో నెన్నోపక్షులు బంధనములో నున్నవి, వాని నెట్లు విడిపింతును? ప్రత్యేక బుద్ధులకన్న హెచ్చుగా సర్వజ్ఞబోధిసత్త్వులకు ఉపాయశక్తి యుండును" అనుకొని, ఆయనతో "ఏ యుపాయముచే సమస్తచిత్త మాలిన్యములు క్షాళన చేసి ప్రత్యేకబోధిజ్ఞానము పొందితిరో దానితో సత్యక్రియ కావింపుడు. జంబూద్వీప మంతట నేప్రాణియు బంధమున లేకుండుగాక" అనెను. బోధిసత్త్వు డిచ్చిన యుపదేశానుసారముగా నాతడు సత్యక్రియ కావించువాడై ఈ గాథ పలికెను :

ఇంట పంజరముల నెన్నియో పులుగు
లున్నవి, విడిచెద నన్నింటిగూడ.
ప్రాణదానము చేతు వానికి, పిట్ట
లిచ్ఛ వచ్చినచోటి కెగిరి పోవచ్చు.

ఆతని సత్యక్రియవలన ఆ సమయములోనే పక్షు లన్నియు బంధవిముక్తములై ప్రసన్నచిత్తములతో కలకలము చేయుచు తమతమ తావులకు వెడలిపోయినవి. ఆ సమయముననే పిల్లులు మొదలు చిల్లర జంతువు లన్నియు బంధనవిముక్తము లైనవి. ప్రత్యేకబుద్ధుడు చేయి యెత్తి శిరసుపై నిమిరెను. తోడనే గృహస్థవేష మంతర్ధాన మయ్యెను; ప్రవ్రజితవేషము ప్రకట మయ్యెను. అరువది సంవత్సరముల స్థవిరునివలె ఆచ్ఛాదితుడై, అష్ట పరిష్కారధారణ చేసి "నీవు నాకు మిక్కిలి ఉపకారము చేసితివి" అని చేతులు జోడించి, ఆకసమున కెగిరి నందమూల పర్వతమునకు జనెను. మయూరరాజు కర్రపై నుండి యెగిరి ఆహారము కైకొని నిజనివాసస్థానమునకు బోయెను.

వేటకాడు ఏడుసంవత్సరముల పాటు వల చేత పుచ్చుకొని తిరిగినను మయూరరాజు వలననే వాడు బాధావిముక్తు డైనవిషయము ప్రకటీకరించుచు శాస్త ఈ గాథ పలికెను :

చేత పాశముతో ప్రసిద్ధమయూర
రాజు బంధింప నరణ్యాల దిరిగి
వ్యాధు, డావల శిఖావశమును విడిచి
దుఃఖంబు నావలె తొలగించుకొనియె.

శాస్త ఈ ధర్మోదేశనము చేసి సత్యక్రియ కావించి జాతకములు సరి పోల్చెను సత్యక్రియానంతరము ఉద్విగ్నచిత్తభిక్షువు అర్హత్వము పొందెను. ఆ కాలమున మయూరరాజు నేనే.

—[o]—

492. తచ్ఛసూకర జాతకము

శాస్తా జేతవనమున విహారము చేయు నపుడు వృద్ధస్థవిరులను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

మహాకోసల నరేశుడు బింబిసార నృపాలునకు పిల్ల నిచ్చుచు, ఆమె స్నానసామగ్రి ఖర్చులకై కాశీగ్రామ మిచ్చెను. అజాతశత్రువుచే తండ్రిని హత్య చేయించిన పిదప ప్రసేనజిత్తు ఆ గ్రామము హరించెను. దానికై వారికి యుద్ధము జరిగినది. అజాతశత్రువు జయించెను. కోసల నరేశుడు పరాజితుడై అమాత్యులతో "అజాశత్రువు నెట్లు పట్టుకొనగలము?" అనెను.

"మహారాజా, భిక్షువులు రహస్యాలోచనలో నిపుణులు. గుప్తచారులను పంపి విహారములో భిక్షువుల సంభాషణలను విని వచ్చునట్లు చేయవలెను."

రాజు చారులను పిలువ నంపి "మీరు విహార దేశమునకు జని దాగియుండి భదన్తుల రహస్యభాషణలు విని రండు" అని ఆన తిచ్చెను. జేతవనముననే రాజపురుషు లెందరో ప్రవ్రజించియుండిరి. అందు ఇరువురు వృద్ధస్థవిరులు విహారపు పొలిమేరలో పర్ణకుటిరమున నివసించుచుండిరి. ఒకని పేరు ధనుగహ తిస్సస్థవిరుడు, రెండవయాతడు మంతిదత్త స్థవిరుడు. వారు రాత్రి యంతయు నిద్రించి తెల్లవారుజామున నే లేచిరి. ధనుగహస్థవిరుడు నిప్పు రాజేసి "భన్తే దత్తస్థవిరా!" అనెను.

"భన్తే, యేమి?"

"పండుకొనియున్నారా?"

"లేదు, ఏమి చేయవలెను?"

"భన్తే. ఈ కోసలరాజు మహామూర్ఖుడు. కేవలము పాత్రనిండ ఆహారము నింపుకొని భుజించుట తెలిసినవాడు."

"భన్తే, దానివలన నేమి?"

"అతడు అజాతశత్రువుచే పరాజితు డైనాడు."

"భన్తే, ఆయన యేమి చేయవలెను?"

"భన్తే, దత్తస్థవిరా, యుద్ధమున శకటవ్యూహము, చక్రవ్యూహము పద్మవ్యూహము అని మూడు తెరగులు. అజాతశత్రువును పట్ట దలచు వారు శకటవ్యూహము పన్నవలెను. ఫలానిపర్వతఖండముపై ఇరుపార్శ్వము లందు శూరులను నిలిపి యెదురుగా సేన నిలిపి, శత్రువు లోనికి చొచ్చుకొని వచ్చునట్లు తెలియగనే జాలమున చిక్కిపోవు చేపవలె వానిని పిడికిట పట్టుటకు వీలగును."

గూఢచారులు ఈ వాక్కులు విని పోయి రాజుతో చెప్పిరి. రాజు మహాసైన్యము గొనిపోయి ఆ వాక్కులప్రకారమే చేసి అజాతశత్రువును పట్టి సంకెళ్ళు తగిలించెను కొలదిరోజులలో ఈ విధముగా నాతని గర్వ మణచి, 'మరల నెప్పుడు నిట్లు చేయవలదు' అని విముక్తుని చేసెను. అతడు రాజుకు వజ్రకుమారి యను కన్య నిచ్చి వైభవముతో వీడుకొలిపెను.

ధర్మసభలో భిక్షువులు సమావిష్టులై ఈ విషయము చర్చించు చుండగా శాస్త అచటికి జని విషయ మడిగి తెలిసికొని, "భిక్షువులారా, ఇప్పుడేకాదు, ధనుగహ తిస్సస్థవిరుడు పూర్వముకూడ యుద్ధ సంచాలన ములో చతురుడు" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసీ నగర ద్వార సమీపమందలి గ్రామమున వడ్రంగి నివసించుచుండెను. ఆత డొకనాడు కఱ్ఱకొఱకు అడవిలోనికి బోయెను. అచట గుంటలో పడియున్న అడివి పందిపిల్లను చూచి, దానిని కొనివచ్చి తఖక సూకర మని పే రిడి పోషించుచుండెను. అది వాని కెన్నో

పనులు చేయుచుండెను. ముట్టెతో చిన్నచెట్లను దొర్లించుచుండును. దంతమునకు కట్టిన నల్లని దారమును లాగును; నోట పట్టుకొని గొడ్డలి, సుత్తె మొదలగునవి తెచ్చుచుండును. సూకరము పెరిగిన కొలది మహాకాయముతో, మహాబలముతో వానికి తోడ్పడుచుండెను. వడ్రంగి దానిని పుత్రునివలె ప్రీతితో చూచుచుండెను. తనకడ నున్నచో దాని నెవరైన చంపుదు రేమో యను తలపున వడ్రంగి దాని నడవిలోనికి బంపెను. అది అడవిలో నొంటిగా నుండలేననియు, తనవర్గమువారు దొరికినచో వారితో కలిసి యుందు ననియు తలపోసి కారడివిలోనికి బోయి అనేక వరాహములను గనుగొని సంతుష్టచిత్తముతో ఈ గాథలు పలికెను.

జ్ఞాతుల కోసమై చరియించుచుండ
గా పర్వతంబుల కాననంబులను
తుదకు వారలు నాకు దొరికినారు.

కందమూలాదులు కలవు మెండుగను,
భోజన సామగ్రి పుష్కల మిచట
ఈశైల వాహిను లింపుగా నున్న,
విచట సుఖమ్ముగా విహరింపవచ్చు.

లేక యుద్వేగంబు. లేక సంశయము,
భీతి యేమియు లేక జ్ఞాతులతోడ
నిచట సుఖమ్ముగా విచరింపవచ్చు.

విని సూకరము లీగాథ పలికినవి :

వేరొక గుహ నీవు వెదకుట మేలు
వైరు లిచ్చోటికి వచ్చుచు, మంచి
మంచి సూకరముల మడియించు చుంద్రు.

తచ్ఛక సూకర మి ట్లనెను :

జ్ఞాతులారా, మన శత్రు లెవ్వారు ?
మన మూరకున్నను మన వినాశంబు
చేయు వైరి యెవండో చెప్పుడు మీరు.

సూకరము లి ట్లన్నవి :

తన కోరలే యాయుధమ్ముగా గలిగి
భూరిబలం బున్న పులి వచ్చి, మంచి
మంచి సూకరముల గ్రమందించుచుండు.

తచ్ఛక సూకర మి ట్లనెను :

మనకు కోరలు లేవ ? మన శరీరములు
హీనంబులా ? ఏకాకి యైన,
వైరిని మన మెట్లు వధియింపగలము ?

సూకరము లి ట్లన్నవి :

నీ హృదయంగమ నిస్తుల మధుర
వాక్కులు నిక్కముల్; వధియింత మవల
పోరితంబుమ వీడి పోయెడిదాని.

తచ్ఛక సూకరము సూకరము లన్నిటిని ఏకాభిప్రాయములను చేసి వ్యాఘ్ర మెప్పుడు వచ్చును అని యడిగెను. "నేటి యుదయము పులి వచ్చి పంది నొకదానిని ఎత్తుకొని పోయినది. మరల రేపు ప్రాతఃకాలమున వచ్చును" అని ప్రత్యుత్తరము వచ్చెను. వర్ధకసూకరము యుద్ధ నైపుణి కలది. ఎచట నిలిచినచో జయమున కవకాశ ముండునో ఆ యా ప్రదేశ ములు దానికి తెలియును. కావున యుక్త ప్రదేశము నిర్ణయించి సూకర ములు రాత్రి తిండి తిన్నపిదప తచ్ఛకసూకరము శకటవ్యూహాదులగూర్చి చెప్పి 'పద్మవ్యూహము పన్నవలె' ననెను. "నడుమ పాలుత్రాగు పిల్లలనునిలుపుడు. వాని చుట్టును వానితల్లులు నిలువవలెను. వానిచుట్టును పిల్లలులేని సూకర ములు, ఆవల సూకరశాబకములు, చిన్నచిన్న కోరలుకల తరుణసూకరములు, వానికావల పెద్దపెద్దకోరలుకలవియు, వానికావల వృద్ధసూకరములు నిలువ వలెను. వానికావల అక్కడక్కడ పది, పది, యిరువది, యిరువది, ముప్పది. ముప్పది చొప్పున సేనామండలి స్థాపింపవలెను." అని చెప్పి తనకొరకు గుంటయు, పులి పడుటకై గడ్డమువలె నేటవాలుగా నుండు గుంటయు

త్రవ్వించెను. రెండు గుంటలకు నడుమ తాను నిలుచుటకై అరుగు వేయించెను. బలిష్ఠములైన సూకరములను వెంట బెట్టుకొని తక్కినవానికి ధైర్యము పురికొల్పుటకై అచ్చ టచ్చట తిరుగుచుండెను. ఇట్లు చేయుచుండగనే సూర్యోదయ మయ్యెను.

అంతట వ్యాఘ్రరాజము కుటిల తపస్వి కుటీరమునుండి వెలువడి పర్వతతలముపై నిలువబడెను. "భన్తే, మన వైరి వచ్చినది" అని సూకరములు పలుకగా బోధిసత్త్వుడు "భయపడవలదు. అది యేమి చేసిన మీరు కూడ అదియే చేయుడు" అని బోధించెను. వ్యాఘ్రము ఒడలు విరుచుకొని వెనుక కడుగు వేసి మూత్రము విడిచెను. సూకరములు కూడ అట్లే చేసినవి. పులి వానిని చూచి పెద్ద బొబ్బ పెట్టెను. అవికూడ అట్లే చేసెను. అంతట పులి తనలో "ఇవి పూర్వమువలె లేవు. నేడు నాకు విరుద్ధముగా మండలిగా నిలువబడినవి. ఈ యేర్పాటు చేసినవాడు సేనానాయకు డని తోచుచున్నది. నేడు నేను వీని కడకు పోరాదు" అనుకొని మరణభయముచే కుటిలతపస్వి కడకు పరిగెత్తెను. పులి వట్టిచేతులతో వచ్చుచుండుట చూచి ఆత డీ గాథ పలికెను :

శార్దూలమా, నేడు చాలించి నావో
జీవహింస ? సమస్త జీవుల కభయ
దాన మిచ్చితి వొకో ? దంతముల్ శక్తి
కోలుపోయినవో ? మా గుంపు జేరియును
ఏల యోచింతువు కృపణుని రీతి ?

అప్పుడు వ్యాఘ్ర మీ గాథలు పలికెను :

తరిగిపోయినది నా దంతపాటవము,
తనువున దార్ఢ్యము తగ్గిపోయినది,
కనబడు నేడు సూకరముల గుంపు.
కావున చింతతో కాననంబునను
ఏకాకిగా విచరించుచున్నాను.

త్రాసముచే మున్ను తమతమ గుహాల
కొంటిగా పరుగిడుచుండు సూకరము
లేక ప్రదేశాన ఈ నాడు చేరి
నినదముల్ చేయును నిర్భయమ్ముగను.
ఎచ్చోట గుమి గూడె నియ్యవి నేడు.
ఆక్రమింపగజాల నచ్చోట వీని.

వీనికి నాయకుల్ వీనికి నేక
మతము, సంఘీభావ మహిమయు కలవు
ఇయ్యవి నను సంహరింపగా జాలు-
ఇక్కారణముచేత నివి నేడు, వలదు.

విని కుటిలతపస్వి యి ట్లనెనును :

ఇంద్రు డొక్కడె సంహరించు రక్కసుల,
ఖగములన్ డేగ యొక్కటె కొట్టివేయు,
పులి యొంటిదే మృగముల గాంచి, మంచి
వాని గొట్టును; శక్తి వాని కట్టిదియె.

ఆవల వ్యాఘ్రము మి ట్లనెను :

ఇంద్ర శార్దూలము లేని శ్యేనంబు
ఏకత్ర చేరిన సూకరంబులను
పులివంటి వానితో పోరాడ లేరు.

మరల తపస్వి దానిని ప్రోత్సహించుచు ఈ గాథలు పలికెను :

గుంపులై శ్రేణులై కుంభీలకములు
ఎగురుచు నుండును ఖగము లొక్కటిగ
ఆకాశ మార్గాన హ్లాదంబుతోడ.

ఎగురుచు నుండెడి ఖగములందుండి
వెనుకం బడిన యొంటి విహాగంబు బట్టి

చీల్చి వేయుచునుండు శ్యేనరాజంబు :
వ్యాఘ్రరాజమునకు వరుస అయ్యదియె,

ఇట్లు పలికి దాని కుత్సాహము కలిగించి "వ్యాఘ్రరాజమా, నీ బలము నీ వెరుగవు. భయము లేదు. నీవు గంతు వేసి గర్జ చేయుము. ఒక్క సారిగా ఈ రెండు పనులు చేయువారు లేరు" అని కుటిల తపస్వి చెప్పగా పులి అట్లే చేసెను.

ఈ భావమును ప్రకటీకరించుటకై ఈ గాథ చెప్పబడినది :

మెండు లోభియు లౌకికుం డగు తబిసి
పలుకుల నుత్సాహపర మైన ద్వీపి
వెనుకటివలె నున్న వని సూకరములు
తలపోసి, వానిని దాకె ఘోరముగ.

పులి పర్వతతలము నుండి క్రిందికి దిగెను. సూకరములు చూచి తక్షక సూకరముతో "స్వామీ, దొంగ మరల వచ్చెను" అని విన్నవించినవి. బోధిసత్త్వుడు భయపడవలదని రెండు గుంటల నడుమ అరుగుమీద నిలిచెను. పులి తీవ్రతతో బోధిసత్త్వునిపైకి దూకెను. తక్షకసూకరము గిరి వెనుకటి గుంటలో పడెను. పులి వేగము నాపుకొనలేక బురద గుంటలో కుప్పవలె కూలబడెను. తక్షకసూకరము వేగముగా దుమికి దాని మోకాళ్ళ నడుమగా కోరలతో చీల్చి గుండె లాగి పారవైచెను; అవల మాంసము తిని పులిని దంతములతో గుంటపైకి లాగి తెచ్చి 'ఈ తొత్తుకొడుకును తినుడు' అనెను. తొలుత వచ్చినవి నోటినిండ మాంసము తిన్నవి. అవల వచ్చిన సూకరములు పులిమాంస మెట్లుండును అన్నవి. గుంటలోనుండి వెలువడి బోధిసత్త్వుడు వానిని చూచి "మీకు బాగుగా సంతుష్టి కలిగినదా?" అనెను. "స్వామీ, ఇప్పుడు ఒక్కపులిని తిన్నాము. ఇంకొక చచ్చుపులి కూడ బ్రతికియున్నది!" "ఏ దాపులి ?"

"వ్యాఘ్రము మాంసము తెచ్చి పెట్టుచుండగా తినెడి కుటిల తపస్వి !"

'అట్లగుచో వానిని పట్టుకొనుడు' అని వాని వెంట బోదిసత్త్వుడు వేగముగా చనెను. అక్కడ తపస్వి 'పులి ఆలసించుచున్నదేమి?' అని యోచించుచు దానికై యెదురు చూచుచుండెను; కాని సూకరములు వచ్చుచుండుట కాంచి "ఇవి పులిని సంహరించి నన్నుకూడ సంహరించుటకై వచ్చుచున్నట్లు తోచుచున్నది" అనుకొని పరుగెత్తి మేడిచెట్టుపై కెక్కెను. అతడు చెట్టెక్కినాడని సూకరము లన్నవి. "ఏ చెట్టు?" "మేడిచెట్టు." "అట్లయిన విచారము లేదు. ఇప్పుడే వీనిని పట్టుదము" అని బోధిసత్త్వుడు తరుణ సూకరములను పిలిచి చెట్టుమొదట నున్న మన్ను వానిచే తొలగింపజేసెను. అంతట ఆడు పందులు నోళ్ళనిండ నీరు తెచ్చి చల్లినవి. ఈ విధముగా నవి చెట్టుచుట్టును కోరలతో త్రవ్వగా తల్లి వేరు మాత్రము మిగిలినది. తక్కినవి కూడి దంతములతో దానిని కూడ త్రవ్వి వేసినవి. గొడ్డలితో నరకినట్లు వేరు తెగి వృక్షము నేలపై బడెను. కుటిలతపస్వి దానితోపాటు నేల కూలగా సూకరములు వానిని త్రొక్కి, వాని మాంసము తిన్నవి. ఆశ్చర్యకరమైన ఈ ఘటన చూచి వృక్షదేవత ఈ గాథ పలికెను :

కలిసి యుండుట మేలు జ్ఞాతి సంఘంబు-
కాకున్న వృక్షముల్ కారాదె వనిని?
కలిసి యున్నట్టి సూకరములు పులిని
ఉక్కడగించిన వొక దెబ్బతోనె.

పులియు, తాపసియు మరణించుట ప్రకటీకరించుచు శాస్త ఈ గాథ పలికెను :

బ్రాహ్మణున్ వ్యాఘ్రమున్ పరిమార్చి సూక
రములు హర్షంబున రావంబు చేసె.

మరల తక్షక సూకర మిట్లనెను? "మీకు ఇంకను శత్రు వెవరైన ఉన్నాడా?"

"స్వామీ, లేదు" అని సూకరములు బోధిసత్త్వునకు అభిషేకము చేసి రాజును చేయుటకై నీరు తేబోయినవి. తాపసి నీరు త్రాగు శంఖము చూచి ఆ దక్షిణావర్తశంఖ రత్నము నిండ నీరము కొని వచ్చి బోధిసత్త్వుని మేడి

చెట్టుక్రింద గూరుచుండ బెట్టి సూకరము లభిషేకము చేసినవి. అభిషేకానంతరము ఆయనకు సూకరిని పట్టపురాణిని చేసినవి. అంతట వారిని మేడిచెట్టు బోదెపై గూరుచుండ బెట్టి ఉభయులకును దక్షిణావర్త శంఖ జలముతో అభిషేకము చేసినవి !

ఈ భావమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథ పలికెను :

అత్తి నీడను వాని కా సూకరములు
అభిషేక మొనరించి అన్నవి యిట్లు :
మా ప్రభుండవు నీవు, మా దైవతమవు !

శాస్త ఈ ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ధనుగహాస్థవిరుడు ఇప్పుడేకాదు, పూర్వము కూడ యుద్ధ నిపుణుడు" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున కుటిలతపస్వి దేవదత్తుడు; తక్షక సూకరము ధనుగహా తిస్సస్థవిరుడు; వృక్ష దేవత నేనే.

———:():———

493. మహావాణిజ జాతకము

శాస్త జేతవనమున విహారము చేయుచు శ్రావస్తినివాసు లగు వ్యాపారులను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

వారు వ్యాపారార్థము పోవునపుడు శాస్తకు మహాదాన మిచ్చి, త్రిశరణములను పంచశీలములను గ్రహించి "భన్తే, కుశలముగా మేము మరల వచ్చినచో తమచరణసన్నిధిలో ప్రణామము చేయుదుము" అని విన్నవించి, అయిదువందల బండ్లతో ప్రయాణ మయిరి. వారు కాంతారము చేరి త్రోవపై దృష్టి యుంచక పోవుటచే త్రోవ తప్పి ఆహారము కాని, ఉదకము కాని లభింపని యడవిలో ప్రవేశించిరి. అచట తిరుగుచు మేడిచెట్టు చూచిరి. ఆ వృక్షము ఒకానొక నాగునియధీనమున నుండెను. వారు బండ్లు విప్పి మేడిచెట్టు నీడలో గూరుచుండి యుండగా ఆకులు తడిగా నుండుటయు కొమ్మలు నీటితో తడిసియుండుటయు కానవచ్చెను. 'ఈ వృక్షమున నీర మున్నట్లు తోచుచున్నది. దీని తూర్పుకొమ్మనరకిన నుదకము మనకు లభించును' అనుకొనిరి.

అంత నొకడు చెట్టెక్కి కొమ్మ కొట్టెను. తాళప్రమాణమున జలధార లేచెను. వా రందరు అందు స్నానము చేసి నీరు త్రాగిరి. ఆవల దక్షిణదిక్కుకొమ్మ కొట్టిరి. అందుండి రకరకముల రుచ్యాహారము లభించెను. భోజనానంతరము పడమటిదిక్కు కొమ్మకొట్టిరి. అందుండి అలంకృతలగు కామినులు బయలువెడలిరి. ఆవల ఉత్తరదిక్కుకొమ్మ కొట్టిరి. అందుండి సప్తవిధ రత్నరాసులు బయల్వెడలినవి. వానిని అయిదువందల బండ్లలో నింపి వర్తకులు శ్రావస్తి నగరమునకు మరలి వచ్చి వానిని గుప్తపరచి, ధూపమాల్యాదులు కైకొని జేతవనమునకు బోయిరి. అంతట శాస్తకు ప్రణామము చేసి పూజ కావించి ఒకప్రక్కగా కూరుచుండి ధర్మోపదేశము వినిరి. మరునాడు శాస్తకు మహాదాన మిచ్చి "భన్తే, ధనదాతృదేవత లైన

తమను ఈ దానమున భాగస్వాములను చేయుచున్నాము" అని విన్నవించిరి. శాస్త భోజనానంతరము "మీరు ఏ వృక్షదేవతను భాగస్వామిని చేయుచున్నారు?" అనెను. మేడిచెట్టువలన తమకు సంపద లభించిన కథ వారు విన్నవింపగా శాస్త "మీరు మంత్రజ్ఞులగుటచే, తృష్ణకు లోను కాకుండుటచే, ధనము లభించినది. కాని పూర్వకాలమున కొందరు మంత్రజ్ఞులు కాక తృష్ణకు లోనగుటచే ధనప్రాణములు కోల్పోయిరి" అని వారి ప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసీ నగరమున.... ఆ కాంతారమున... అదే మేడిచెట్టు. వ్యాపారులు త్రోవ తప్పి ఆ మేడిచెట్టును చూచిరి. ఆ విషయము శాస్త అభిసంబుద్ధుడై నపిదప చెప్పుచు ఈ గాథలు పలికెను :

చనుదెంచి వివిధరాష్ట్రములనుండి
వర్తకుల్ సమితి స్థాపన చేసి, యొకని
గ్రామణిం గావించి కదలి చన్నారు
సంపద సమకూర్చు సంకల్పమునను.

ఆ యరణ్యంబున నాహారవస్తు
సముదయం బేనియు సలిల మేనియును
చిక్కవు, వారలు శీతలచ్ఛాయ
వెలయించు సుందర వృక్షంబుక్రింద
ఉపగతమోహులై ఉపవిష్టు లయిరి.

జలమయం బీచెట్టు, సలిలంబు జాలు
వారు నిద్దాన, వ్యాపారుల మిపుడు
తూరుపుశాఖను త్రుంచి వేయుదము.

శాఖను ఖండింప స్వచ్ఛోదకంబు
ప్రవహింప సాగెను; వ్యాపారి జనులు
స్నానపానాదులు సలిపినా రందు.

ఆ మూర్ఖ జనులకు నావల దోచె
తరువు దక్షిణశాఖ నరకి వేయంగ.

శాఖను ఖండింప స్వచ్ఛమూపములు
పెసరప ప్పార్ద్రిక విహితంబు, మాంస
సంయుక్త మైనట్టి శాల్యన్న, మల్ప
జలము లభించె నా సమయంబునందు.

వారు యథేచ్ఛగా వ్యంజనాన్నములు
ఉదక మాస్వాదించు పిదప తోచినది
పశ్చిమశాఖను పట్టి ఖండింప

ఆ మూఢమానసు లట్లె కావింప
వెలువడె నందుండి వివిధభూషలను
తాల్చిన సుందర తరుణీ జనంబు.

తాల్చి విచిత్రవస్త్రమ్ములు మేలి
భూషణమ్ములు, మణిపూర్ణ కుండలము,
లొక్కొక వణిజున కొకతె లభించె.

ఆ తరుచ్ఛాయలో నన్ని వైపులను
ఆక్రాంతు లై వార లందరుగూడ
స్వేచ్ఛావిహారముల్ చేసినవారు.

ఆలోచనలు చేసి రామూర్ఖ జనులు
నరకివేయంగ నుత్తరదిక్కు శాఖ.

ఆ శాఖ నరకినయంత వెల్వడియె
వైడూర్యములు, వెండి, వస్త్రముల్, శ్వేత
కంబళమ్ములు, మౌక్తికములు, హాటకము.

కాశివస్త్రంబు, లుద్యానకంబళము
లెన్నొ మూటలు కట్టి రిచ్చకోలంది.

ఆవల తలచినా రా మూర్ఖజనులు
తరువుమూలమ్మును తరిగినయెడల
భూరిలాభమ్మును పొందుదు మనుచు.

సార్థవాహుండు హస్తములను మోడ్చి,
మీకు వణిక్కులు, మే లగుగాక !
ఏ యపరాధంబు నీయత్తి చేసె ?

ఒసగెను తూరుపుకొమ్మ యుదకంబు మీకు
తగినయాహారంబు దక్షిణశాఖ
సమకూర్చె, పశ్చిమశాఖ యొసంగె
ఉత్తమవనితల, ఉత్తరశాఖ
నెరవేర్చినది కదా నిఖిలవాంఛలను !
మే లగుం గావుత మీకు వణిక్కు !
లే యపరాధంబు నీయత్తి చేసె ?

విశ్రమించితిరి యీ వృక్షంబునీడ,
తరుగుదురేని యీ తరువుమూలము
అగును మిత్రద్రోహ, మధికపాపమ్ము !

లెక్కచేయక వార లొక్కనిమాట
వాడిగొడ్డలితోడ మేడివృక్షంబు
దునియలు చేయగా దొరకొనినారు.

వారు వృక్షమును ఖండించుటకై క్రిందికి చేరునప్పటికి నాగరాజు తనలో 'వీరికి దప్పి తీర్ప నీరిచ్చితిని, దివ్యభోగ మొసగితిని, శయ నాసన శుశ్రూషలకు వనితల నిచ్చితిని, ఐదువందల బండ్లు నిండు రత్నముల

నిచ్చితిని. ఇప్పుడు వీరు నా వృత్తమును సమూలముగా నాశము చేయ గోరుచున్నారు'' అనుకొని నిజసేన కాజ్ఞ యిచ్చెను. తోడనే శస్త్రధారులు- ధనుస్సు, ఖడ్గములు, డాలులు ధరించినవారు- బయలువెడలిరి.

ఈ విషయము ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథ పలికెను :

వెడలినారలు పంచవింశతి నాగ
వీరులు. మున్నూరు విలుకాండ్రు, నారు
వేల కత్తులవారు డాలులతోడ.

అంతట నాగరాజు ఇట్లాజ్ఞాపించెను :

బంధించి వీరిని పరిమార్చ వలయు-
వదలగారాదు జీవముతో నెవని
సార్ధవాహునితప్ప; సర్వజనంబు
జేయంగవలయు భస్మీపటలమ్ము.

నాగులు ఆ ప్రకారమే చేసిరి. ఐదువందల బండ్లలో ఆస్తరణములు వేసి సార్ధవాహుని వెంట గొని బండ్లు స్వయముగా తోలుకొనిపోయి వారాణసి చేర్చి ధన మాతనియింట భద్రపరచి నాగరాజ భవనమునకు మరలి వచ్చిరి.

ఈ యర్థము గ్రహించి శాస్త ఉపదేశ మిచ్చువాడై ఈ గాథలు పలికెను :

నిజహితముమీదనే దృష్టి నిలుపవలయు,
లోబడగరాదు యోగ్యుండు లోభమునకు
ఆత్మలోభి మన స్సను నట్టి ఘోర
వైరివిదళనమును జేయవలసి యుండు.

సంభవించును తృష్ణచే సకలదుఃఖ
జాల మనుమాట గ్రహియించి సజ్జనుండు

విడిచి యాసక్తి తృష్ణను వీడి, పొంది
స్మృతిని, భిక్షువుగా ప్రవ్రజింపవలయు.

శాస్త ఇట్లు ధర్మదేశనముచేసి "ఉపాసకులారా, ఈ విధముగా పూర్వ కాలమున వ్యాపారులు లోభమునకు వశీభూతులై మహావినాశము బొందిరి. కావున లోభమునకు లోబడరాదు" అని సత్యప్రకాశనము కావించి జాతకములు సరిపోల్చెను. సత్యక్రియానంతరము ఆ వ్యాపారులు స్రోతాపత్తి ఫలమున ప్రతిష్ఠితులైరి. ఆ కాలమున నాగరాజు సారిపుత్రుడు; సార్థవాహుడో నేనే.

———:():———

494. సాధీన జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయుచు ఉపోసథవ్రతము పూను ఉపాసకులను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున శాస్త "ఉపాసకులారా, ఉపోసథ వ్రతకారణమున పురాణపండితులు మానవదేహములతోనే దేవలోకము చేరి, చిరకాలమచట నుండి, ..." అని వారి ప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను

అతీత కథ

పూర్వము మిథిలలో సాధీననాముడగు రాజు ధర్మానుసారముగా రాజ్యము చేయుచుండెను నగరద్వారములు నాలిగింటికడను, నగరమధ్యమునను, రాజభవనద్వారముకడను ఆరు ధర్మశాలలు నిర్మించి, జంబూద్వీపము చలించునట్లు భూరిదానములు చేయుచుండెను. దినమున కారులక్షల ధనము వ్యయ మగుచుండెను. ఆయన పంచశీలములు రక్షించుచు, ఉపోసథవ్రత మాచరించుచుండెను. రాష్ట్రవాసులు ఆయన యుపదేశానుసారముగా ప్రవర్తించుచు, దానాదిపుణ్యకార్యములు చేయుచు, మరణానంతరము దేవలోకముల జన్మించుచుండిరి. దేవరాజు సుదర్శనసభలో నుపవిష్టుడై సదాచారాది గుణములనుగూర్చి ప్రశంస చేయుచుండెను. విని దేవతలు సాధీనరాజును జూడగోరిరి. దేవరాజు శక్రుడు వారి మనసులలోని మాటను గ్రహించి "మీరు సాధీనరాజును జూడ నభిలషించుచున్నారా!" అని యడిగెను.

"చిత్తము దేవా!"

శక్రుడు మాతలిని పిలువనంపి "నీవు పోయి వైజయన్తిరథములో సాధీనరాజును గొని రమ్ము" అని యానతిచ్చెను. చిత్తమని మాతలి రథ

ముతో విదేహరాష్ట్రమునకు బయలుదేరెను. ఆనాడు పూర్ణిమ. జనులు రాత్రిభోజనము చేసి తమతమ వాకిళులందు విశ్రాంతి చెందుచు చంద్ర మండలమువైపు చూచుచుండువేళ మాతలి రథమును చంద్రమండలము వెంట నడపుచుండెను. జనులు చూచి రెండవచంద్రమండల ముదయించె ననుకొనిరి. కాని, మాతలి మండలమును విడిచి ఈవలకు వచ్చుచుండుట గమనించి "ఇది చంద్రుడు కాదు— రథమున వచ్చువాడు దేవపుత్రు డని తోచుచున్నది. మనోమయ సైంధవయుక్త మయినరథము ఎవరికై వచ్చు చున్నదో! మరెవ్వరికి కాదు, మన రాజుకొరకే కానోపును. మనరాజు ధార్మికుడు— ధర్మరాజు" అని వారు ప్రసన్నచిత్తములతో చేతులు జోడించి ఈ గాథ పఠికిరి :

అద్భుతము రోమహర్షణ మైనవార్త
వెలువడె విదేహ విఖ్యాతవిభునికొరకు
దేవరాజ శక్రుడు పంపె దివ్యరథము.

మాతలి రథము కొనివచ్చెను. జనులు గంధమాల్యాదులు చేత గొని ఆయనను సత్కరించిరి. మాతలి నగరమునకు ముమ్మారు ప్రదక్షిణము చేసి రాజద్వారము చేరి అచట రథ మాపి వెనుకవైపు రహస్యద్వారముకడ వసారాలో నిలిచి రాజు రథ మెక్కుటకై యేర్పాటు చేసెను. ఆనాడు రాజు కూడ దానశాలను చూచువాడై ఈ విధముగా దానము చేయుడు అని ఆన తిచ్చి, ఉపోసథవ్రతము పూని రోజు గడపుచు అమాత్యపరివేష్టితుడై అలంకృతమహాసనముపై పూర్వద్వారమువైపు ముఖము పెట్టి కూరుచుండి ధర్మప్రసంగములు చేయుచుండెను. మాతలి ఆయన నాహ్వానించి రథ మెక్కించుకొని వెడలిపోయెను.

ఈ యభిప్రాయమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథలు పలికెను:

దేవపుత్రుడు, బుద్ధిమంతుడు,
దేవసారధి యైన మాతలి
అరుగుదెంచి విదేహవిభుతో
ననియె నీరీతిన్ :

ఓహో దిశాంపతి, ఓ రాజసింహా,
అరుగుదేరగదయ్య ! అరదంబు నెక్కి
ఎదురు చూచుచు నుందు రింద్రునితోడ
అఖిలదేవతలు, త్రయఃత్రింశ జనులు
సిందు సుధర్మలో నీ దర్శనేచ్ఛ !"

గుర్రాలు వేయింటి గూర్చినయట్టి
రథమునం దెక్కి యారాజముఖ్యుండు
చనె శేర దేవతాసన్నిధానంబు.

నరపతిరాక కానందించి వారు
"అరుదెంచినావు మహారాజ, మాదు
సన్నిధానమునకు : స్వాగతం బార్య !
ఇంక గూర్చుండుమీ యింద్రుసన్నిధిని."

ఆలోకనము చేసి యామిధిలేశు
నానందమున శక్రు డర్ధాసనమున
గూరుచుండగ బిల్చి, కోర్కుల నెల్ల
తీర్చుకొమ్మని యాన తిచ్చినవాడు.

"వశవర్తు లగువారి వాసమ్మునకును
నీరాక మే లయ్యె ! నిఖిలమ్ములైన
దేవలోకాలలో దివ్యసౌఖ్యముల
ననుభవించుచు పొందు మానందగరిమ !"

దేవరాజ శక్రుడు పదివేల యోజనముల దేవనగరము, రెండున్నర కోట్ల అప్సరసలను, అర్ధమై జయంత ప్రాసాదమును నడుమగా విభజించి అతని కిచ్చెను. ఈ ప్రకారముగా ఆ సంపదల ననుభవించుచు మానవమాన ప్రకారము ఏడువందల సంవత్సరములు అతడు గడిపెను. మానవదేహముతో దేవలోకమున నున్నపుడు ఆతనిపుణ్యము క్షీణించెను, అరతి జనించెను. అంత నాతడు శక్రునితో సల్లాపము లాడుచు ఈ గాథ పలికెను :

ప్రప్రథమమునందు నేను
స్వర్గమ్మును జేరినపుడు
నృత్యగీతవాద్యమ్ముల
నిజముగ మోదంబు గంటి !

స్వర్గమున న్నేడు నాకు
స్వారస్యము కానరాదు.
క్షీణించినదా ఆయువు ?
చేరుచున్నదా మృత్యువు ?
అట్లు కానియెడల ఇంద్ర,
అయితిన మూఢాత్మకుండ ?

అంతట శక్రు డి ట్లనెను :

కాలే దాయుక్షయమ్ము,
కలదు మృతియు దూరమందె.
కావు నీవు మూఢుండవు,
భోగంబున తరిగెను నీ
పుణ్యకర్మఫలం బిచట.

దేవతానుభావముతో
నీవు త్రయస్త్రింశ లోక
దివ్యభోగ పరంపరను
దిశాంపతీ, అనుభవించు !

బోధిసత్త్వుడు అంగీకరింపక ఇ ట్లనెను :

పరుల కుద్దిష్ట మైనట్టి బండివోలె
అన్యజనులకు దలపెట్టి నట్టిధనము
సరణి, నొరులకు దాన మొసంగుదాని
చందమున దోచుచున్న దిచ్చటిది నాకు !

ఒరులు దానస్వరూపాన నొసగునట్టి
దేదియును నాకు వలదు; నిజేచ్ఛనల్పు
నట్టి పుణ్యపరంపర యగును ధనము.

ఇందులకె మర్త్యలోకాని కేగువాడ,
నిండుగా పుణ్యకర్మలు నెరపువాడ,
సౌఖ్య మొందుచు ననుతాపరణి జనక
సంయమముతోడ యత్నముల్ సలుపువాడ.

ఆయన వాక్కులు విని శక్రుడు మాతలితో "నీవు సాధీనరాజును మిథిలా నగరమునకు గొనిపోయి ఉద్యానవనమున దింపుము" అని ఆనతి యీయగా, ఆత డటులే చేసెను.

రాజు ఉద్యానమున పచారు చేయుచుండగా తోటమాలి చూచి నారదరాజున కీవార్త తెలిపెను. ఆతడు మాలితో "నీవు ముందుగా పోయి మా కుభయులకును ఆసనములు రెండు పరపుము" అనగా వా డట్లే చేసెను. రాజు చూచి "యెవరికోసము రెండాసనములు పరచినావు" అనెను.

"ఒకటి తమకొరకు, ఒకటి రాజుకొరకు."

"నా ప్రక్కన ఆసనముపై కూరుచుండ గల రెండవ్యక్తి యెవరు ?" అని రాజు ఒకదానిపై కూరుచుండి, రెండవదానిపై పాదములు పెట్టెను. నారదరాజు వచ్చి ఆయన చరణములకు ప్రణామము చేసి ఒకప్రక్క నిలిచెను. అతడు ఏడుతరములలో ఆయన బంధువుగా నుండి ఇప్పటి కేడువందల సంవత్సరముల వా డయ్యెను. తన పుణ్యప్రభావముచే ఇంతకాలము గడపెను. రాజు నారదుని చేయి పట్టుకొని ఉద్యానమున విహరించుచు ఈ గాథలు పలికెను :

ఇవ్వి యాహేత్రంబు, లివ్విగోశాకార
జలనాళికలు, రెంచు చక్కులం బచ్చ నౌ
పొలములున్, ప్రవహించు సలిలవాహిను లివ్వి.

చక్రవాకములు పుష్కరిణుల మీద
మధురమ్ముగా కూయు, మందాలకములు
పద్మమ్ము లిందు సంభవ మొందుచుండు,
ఆప్రియవస్తువు లన్ని యేమాయె ?

ఇవ్వి యా క్షేత్రంబు, లివ్వి యాభూము,
లస్మదీయ మనోహరారామములును,
మామకీన విహారసీమలు నివియు.
అయినను నారదా, ఆనాజనంబు
లో నొక్కడుంగూడ కానరాకుండ
శూన్యంబుగా దోచుచున్నవి దిశలు !

అప్పుడు నారదు డిట్లనెను : "దేవా, తాము దేవలోకమునకు జని యేడువందల సంవత్సరములు గడచినవి. నేను ఏడవతరము బంధువును. తమ సేవకు లెల్లరు మృతి నొందిరి. ఇది తమరాజ్యము. దీని ననుభవింపుడు."

రాజు "నాయనా, నారదా, రాజ్యపరిపాలనమునకై నే నిచటికి రాలేదు. పుణ్యకార్యములు చేయుటకై వచ్చినాను. అట్టి కార్యములే చేయుదును" అని ఈ గాథలు పలికెను :

కాంచినాను నల్వంకల
కాంతు లీనువిమానముల
సమ్ముఖమున దేవేంద్రుని
సకలదేవతలను గంటి.

నా కొదవెను త్రయఃత్రింశ
లోకంబున దివ్యభవన
నివాసంబుతోడ దివ్య
నిఖిలభోగానుభవము.

చనుదెంచితి నిటకు నేను
సత్కార్యము లొనరింపగ

ఇంక నాకు వలదు రాజ్య,
మిచట ధర్మ మనుష్ఠింతు.

సర్వబుద్ధు లరిగినట్టి
సమ్యక్ సంబుద్ధుం డుప
దేశించిన- అష్టాంగ-
స్థిరమార్గం బనుసరింతు.

ఈ ప్రకారముగా బోధిసత్త్వుడు సర్వజ్ఞజ్ఞానముచే ఈ గాథలను సంక్షేపించి పలికెను. నారదుడు మరల "దేవా, రాజ్యపాలనము చేయుడు" అని విన్నవించెను. "నాయనా, నాకు రాజ్యముతో పని లేదు. ఎడువందల సంవత్సరములలో పూర్తి చేయదగిన దానధర్మములు ఏడు రోజులలో ముగించెదను" అని రాజు పలుక నారదరాజు సమ్మతించి ఆయన కోరినట్లు మహాదానములు చేయించెను. ఏడవనాడు రాజు దేహము చాలించి త్రయస్త్రింశభవనమున జన్మించెను.

శాస్త్ర ఈ ధర్మోపదేశనము కావించి, ఈ విధముగా ఉపోసథవ్రత మాచరించుట యుక్తము అని నిర్దేశించి సత్యప్రకటనము చేసి జాతకములు సరిపోల్చెను. సత్యక్రియానంతరము ఉపాసకులలో కొందరు స్రోతాపన్నులు, కొందరు సకృదాగాములు నైరి. ఆ కాలమున నారదరాజు ఆనందుడు; శక్రుడు అనురుద్ధుడు; సాధీనరాజు నేనే.

--(౦)--

495. దస బ్రాహ్మణ జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయునపుడు అసదృశదానమును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఈ కథ యెనిమిదవ నిపాతములోని సుచిర జాతకమున సవిస్తరముగా వచ్చినది. రాజు దానమిచ్చుచు శాస్త్ర ప్రముఖముగా ఐదువందల మంది భిక్షువులను ఎన్నుకొని, మహాక్షీణాసవులకే దానము చేసెను. ఆయన గుణములను గూర్చి ధర్మసభలో భిక్షువులు చర్చ చేయుచు "ఆయుష్మంతులారా, రాజు అశదృశదాన మిచ్చువాడై తగినవారి నెన్నుకొని, మహాఫల ప్రాప్తికే స్థాన మిచ్చెను" అనుచుండిరి. శాస్త్ర అచటికి జని విషయ మడిగి తెలిసికొని "భిక్షువులారా, ఇందాశ్చర్య మేమియు లేదు. కోసల నరేశుడు నాకు తుల్యుడగు బుద్ధుని సేవించి వివేకముతో దాన మిచ్చుచున్నాడు. పురాణ పండితులు బుద్ధుడు లేకున్నను వివేకపూర్వకమైన దానము లిచ్చినారు". అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున కురురాష్ట్రము నందలి ఇంద్రప్రస్థ నగరమున యుధిష్ఠిర గోత్రములోని కురురాజు రాజ్యము చేయుచుండెను. ఆతనికి విధురుడను పేరుగల అమాత్యుడు ధర్మార్థములలో అనుశాసనము చేయుచుండెను. సమస్త జంబూద్వీపమున కోలాహలము పుట్టునట్లు రాజు దానధర్మములు చేయుచుండెను. ఆ దానములు పొందువారిలో పంచశీలములను రక్షించువారలు లేకపోవగా దుశ్శీలురే యుండిరి. తాను చేయు దాన ధర్మముల వలన రాజుకు సంతుష్టి కలుగలేదు. రాజు యోచించి సదాచారపరులకే దాన మీయదలచి ఆలోచనచేసి విధురపండితునితో సంప్రదింప నెంచెను.

అమాత్యుడు తనను జూడవచ్చినప్పుడు రాజు అతనిని పీఠముపై కూరుచుండ బెట్టి ప్రశ్నించెను. ఈ విషయమును ప్రకటీకరించుటకై శాస్త అర్ధగాధ పలికెను. ఇక రాజు, విధురుడు జరిపిన ప్రశ్నోత్తరములు :

ధర్మకామి యుధిష్ఠిర ధరణిపుండు
విధురునిం గాంచి యిట్లనె: "వెదకు శీల
వంతులను, బహుశ్రుతులను, బ్రాహ్మణులను.

మిధున కృత్యములను విరమించువారి
కేను భోజన దక్షిణ లిచ్చువాఁడ,
అట్టి దక్షిణ ఫలవంత మగును కాదె !"

"అట్టివారు లభించుట అరుదు దేవ !
బ్రాహ్మణుల యందు కనవచ్చు పది తెరగులు,
విస్తరంబుగ దెలిపెద వినుదు దేవ !

నిండుగా మూలమూలికల్ నింపి సంచి
మందు పొట్లము లిత్తురు మానవులకు.
స్నానము లొనర్చి జపములు సలుపుచుంద్రు
వైద్య తుల్యులు నిజముగా వారు దేవ !
అట్టివారలు బ్రాహ్మణు లనబడుదురు.
వర్తమానము చేసితి వారి గూర్చి,
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణ్యదూరు, లవ్వారి విప్రు
లనము విధుర, మహాయోగ్యులైనవారి
బిలువు, మిచ్చెద దక్షిణ ప్రీతితోడ"

ముందరికి చిరుగంటల మ్రోతతోడ
నరుగుచుందురు సందేశ హారులగుచు,

అరదముల దోలగా నేర్తు; రట్టివారు
సేవక సమాను లగుదురు దేవ ! కాని

అట్టివారలు బ్రాహ్మణు లనబడుదురు.
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

వారు బ్రాహ్మణ్యదూరు, లవ్వారి విప్రు
లనము విధుర ...."

"కొందరు కమండలములను, కొంకి కఱ్ఱ
లను గ్రహించుచు ప్రభుసేవ లాచరింత్రు
పల్లె గ్రామాల; బాసెన పట్టు వేసి
పణము లిచ్చినచే లేతు మనెడివారు–
అరయ వారు కరగ్రాహు లట్టివారు
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణ్యదూరు, లవ్వారి విప్రు
లనము విధుర ! ...."

"నఖములన్ కేశముల బెంచి, నల్ల కప్పు
నేసి దంతములకు, ధూళి బూసికొనుచు
దేహమున, నెత్తిమీనను, తిరుగుచుంద్రు
ముష్టి యెత్తుచు కొందరు : మ్రోడులు గద !
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణదూరు, లవ్వారి విప్రు
లనము విధుర ! ...."

"రకరకము లైన యడవి కఱ్ఱలును, చెరకు,
తేనె మొదలగు వస్తువుల్ తెచ్చి, చాల
హెచ్చు చౌకలుగా విక్రయించుచుంద్రు :
వారు దేవ, వణిక్కుల వంటివారు.
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణ్యదూరు, లవ్వారి విప్రు
లనము విధుర ! ...."

"కావించుచున్ వ_ర్తకమ్మును, కృషియు.
పోషణ జేయుచు మేషాలికముల.
ధనికుల కొసగుచు తమ పుత్రికలను
పెండ్లి పేరంటాలు ప్రీతి జేయింత్రు :
సంసారులకు దేవ, సదృశులు వారు
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ"

"వారు బ్రాహ్మణ్యదూరు లవ్వారివిప్రు
లనము విధుర ! ...."

"తింద్రు పురోహితుల్ తినరానివాని
కొందరు గ్రామమ్ములందున దేవ !
వారి జేరుచు తిధి వార నక్షత్ర
ఫలములు పృచ్ఛింత్రు పశుఘాతి జనము.
లవ్వారితో సములా బ్రాహ్మణులును.
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణ్య దూరు ...."

"ఖడ్గముల్ డాలులు గ్రహియించివారు
గహన మార్గంబులకడ నిల్చియుండి,
యాత్రికులం జేర్చి యావలివైపు
సమకూర్తురి ధనము; నిషాదులతోడ
యాదవ జనముతో నవ్వారు సములు
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !"

"వారు బ్రాహ్మణ్య దూరు .... "

"వని కుటీరాలు నిర్మించి, వలులు పన్ని,
బల్లు, లుడుములు, కుందేళ్ళు పట్టుకొంద్రు
సలిలముల, తాబేళ్ళ, మత్స్యముల గూడ-

వారు లుబ్ధ సంకాశులు వాస్తవముగ,
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !''

''వారు బ్రాహ్మణ్య దూరు ...... ''

''బ్రాహ్మణులు కొంద రర్థ లోభమ్ముచేత
ఎత్తు మంచెలక్రింద వర్తించుచుంద్రు.
సోమ యజ్ఞావసరమున భూమిపతులు
స్నానములు చేయుచుందురు వానిపైన
మంచెలకు క్రిందనున్న బ్రాహ్మణులుదేవ,
మైల తానాలు చేసిన మనుజులె కద ?
అరుగుదున తన్నిమంత్రణ కొరకు దేవ !''

''వారు బ్రాహ్మణ్య దూరు ...... ''

విధురపండితుడు సద్బ్రాహ్మణుల విషయము ప్రకాశింప జేయువాడై యీ గాథలు పలికెను :

''మిథున కార్యంబులను విరమించు శీల
వంతులు, బహుశ్రుతులు నగు బ్రాహ్మణోత్త
ములు, కలరు, వారు మద్యము ముట్టుకొనరు
ఏక భుక్తము చేయుదు రిట్టివారి
వార్త గనుగొన బంపితి; వారి నిపుడు
దేవ, పోవుదునా నిమంత్రించు కొరకు ?''

రాజు ఆతని వాక్కులు విని ''మిత్రమా, విధురా ! ఇట్టి బ్రాహ్మణోత్తములు అగ్రదక్షిణ పొందదగినవారు. ఎచ్చట నుందురు ? అనెను.

''మహారాజా, ఉత్తర హిమాలయమున నందమూల పర్వతముపై మన్నారు.''

"అట్లయినచో పండితోత్తమా, నీ సామర్థ్యముతో నా కొరకు బ్రాహ్మణుల నన్వేషింపుము," అని రాజు ప్రసన్నచిత్తుడై ఈ గాథ పలికెను :

విధుర, నీవు నిమంత్రింప వేగము చని
బ్రాహ్మణోత్తములం గొని రావలయును.

బోధిసత్త్వుడు మంచిదని అంగీకరించి "మహారాజా, నగరమంతయు అలంకరింపజేసి నగరవాసులెల్లరు దానములిచ్చి, ఉపోసథవ్రత మవలంబించి శీలగ్రహణము గావింపవలయును" అని చాటబంపుడు. "తాముకూడ పరిజనముతో పాటు ఉపోసథవ్రతధారులు కండు," అని విన్నవించి స్వయముగా ఉషఃకాలముననే భోజనపానీయములు ముగించి ఉపోసథవ్రతము పూని చమేలీ పుష్పముల గంప తెప్పించి ఐదంగముల భూమిపై ప్రతిష్ఠించి నమస్కారము చేసెను. రాజుకూడా అట్లే చేసెను. ఆవల విధురుడు ప్రత్యేక బుద్ధుల గుణానుస్మరణము చేసి ప్రణామము కావించి యెనిమిది గుప్పెళ్ళ పూలు ఆకసమున చల్లి "ఉత్తర హిమాలయమున నందమూలక పర్వతమున నివసించు ఐదువందల ప్రత్యేకబుద్ధులు రేపు మా నిమంత్రణమును గ్రహింతురుగాక !" అని పలికెను. ఆ సమయమున పర్వతమున సరిగా ఐదువందల మంది ప్రత్యేకబుద్ధు లుండిరి. ఆకసమున చల్లిన ఈ పుష్పములు పోయి వారిపై బడినవి. వారు ధ్యానబలమున నిమంత్రణము సంగతి గ్రహించి "మిత్రులారా, మనలను విధురపండితుడు నిమంత్రించినాడు. ఈతడు సామాన్యప్రాణి కాడు. బుద్ధాంకురుడు, యీ కల్పముననే యితడు బుద్ధుడగును. మన మంగీకరింతము" అని స్వీకరించిరి. పుష్పములు తిరిగి రాకుండుటచే నిమంత్రణము అంగీకృత మయ్యెనని బోధిసత్త్వుడు గ్రహించి "మహారాజా, రేపు ప్రత్యేకబుద్ధులు దయచేయుదురు, సత్కార సామగ్రులు సంసిద్ధము చేయుదురుగాక" అని చెప్పెను. మరునాడు సమ్మానమేర్పాటు చేసి, రాజు ఉన్నతస్థానమున అమూల్యాసనములు నిలిపించెను. ప్రత్యేక బుద్ధులు అనోతత్తసరోవరమున స్నానాదులు ముగించి సమయమగుట గ్రహించి ఆకాశమార్గమున నరుదెంచి రాజాంగణమున దిగిరి. రాజు, బోధిసత్త్వుడు ప్రసన్నచిత్తములతో వారి చేతులనుండి భిక్షాపాత్రలు గ్రహించి

ప్రాసాదమునకు గొనిపోయి కూరుచుండబెట్టి హస్తోదకమిచ్చి ఉత్తమ భోజనము వడ్డించిరి. ఇట్లే యేడురోజులు మహాదానములిచ్చి సర్వ పరిష్కారములు కావించిరి. వారు దానానుమోదనము చేసి ఆకాశమార్గమున యథాస్థానమునకు పోయిరి. పరిష్కారములు కూడ వారివెంటనే వెడలినవి.

శాస్త ఈ ధర్మోపదేశనముచేసి "భిక్షువులారా, ఇందాశ్చర్య మేమియును లేదు. నన్ను సేవించు కోసలనరేశుడు వివేకపూర్ణము లగు దానములిచ్చినాడు. పూర్వము బుద్ధుడు జన్మింపకముందు పురాణ పండితులు ఇట్టి దానము లిచ్చినారు," అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున రాజు ఆనందుడు; విధురపండితుడు నేనే.

———:():———

496. భిక్షా పరంపరా జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయునపుడు ఒకానొక గృహస్థుని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

అతడు శ్రద్ధావంతుడు, భక్తుడు. తథాగతునకు సంఘమునకు నియమ ప్రకారము విశేషముగా ఆతిథ్య మిచ్చుచుండెను. ఒకనాడతడు తనలో "బుద్ధరత్న సంఘరత్నములకు ప్రతిదినము యుక్తభోజనము, హెచ్చుగా వస్త్రములును ఇచ్చి భూరి సత్కారము చేయుచున్నాను. ఇక ధర్మరత్నమునకు సత్కారము చేయుదును. ధర్మరత్నమునకు సత్కారము చేయువాడేమి చేయవలెను" అనుకొని సుగంధద్రవ్యములు, మాల్యములు కైకొని జేతవనమునకు జని తథాగతునకు ప్రణామముచేసి "భన్తే, నేను ధర్మరత్న సత్కారము చేయగోరుచున్నాను. ధర్మరత్న సత్కారము చేయువాడు ఏమి చేయవలెను?" అని యడిగెను. "ధర్మరత్న సత్కారము చేయగోరువాడు ధర్మ భాండారియగు ఆనందుని సత్కరింపవలెను." అని శాస్త్ర చెప్పగా ఆతడు చిత్తమని, స్థవిరుని నిమంత్రించి మరునాడు భూరి సత్కారమునకు తన యింటికి గొనిపోయెను. బహు మూల్యముగల ఆసనముపై కూరుచుండబెట్టి సుగంధము, మాల్యాదులు నొసగి పూజించి వివిధ ప్రకారముల రుచ్య భోజనము పెట్టెను. బహుమూల్యముగల మూడు చీవరముల నిచ్చెను స్థవిరుడు తనలో "ఈ సత్కారము ధర్మరత్నముకొరకు చేసినది, ఇది నాకొరకు కాదు. ఇది అగ్రస్థానీయుడైన ధర్మసేనాపతి సారిపుత్రున కీయదగినది." అనుకొని భిక్షయు, వస్త్రములును విహారమునకు గొనిపోయి సారిపుత్రున కొసగెను. ఆయన కూడ తనలో "ఇది నిశ్చయముగా ధర్మరత్నముకొరకే. కావున ధర్మస్వామియగు సమ్యక్ సంబుద్ధునకే యోగ్యము" అనుకొని దానిని బుద్ధునకొసగెను. తనకన్న అధికుడు లేకుండుటచే శాస్త్ర భిక్షను, చీవరములను స్వీకరించెను. భిక్షువులు ధర్మసభలో సమావిష్టులై ఈ

విషయము చర్చించుచుండగా అచ్చటికి శాస్త చని విషయమడిగి తెలిసికొని "భిక్షువులారా. ఇప్పుడే కాదు, పూర్వముకూడ సత్కారము క్రమముగ యోగ్యులకడకు నడచినది" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు నాలుగు అగతులలో పడక, దశరాజధర్మములకు విరుద్ధముగా జనక, న్యాయానుసారముగా రాజ్య పాలన చేయుచుండెను. ఇట్లున్నను ఆతని న్యాయశాల ఇంచుమించు శూన్య ముగా నుండెను. అంతట రాజు తన దుర్గుణములను వెదకుటకై బయలు వెడలెను. ఆయన తన ప్రాసాదము, నగరము, గ్రామము, మొదలగు ప్రదేశములలో తన దుర్గుణములను గూర్చి పలికెడివారు దొరకకపోవుటచే జన పదములలో అట్టివారిని వెదకుటకై రాజ్యపాలనము అమాత్యుల కప్పగించి వేషము మార్చి పురోహితుని వెంటబెట్టుకొని బయలుదేరెను. కాశీ రాష్ట్రి మంతట తిరిగినను దుర్గుణఘోష చేయువాడు లభింపక, రాజు సరిహద్దు దేశములోని ఒకానొక నిగమము చేరి గ్రామద్వారము వెలుపలి శాలలో చుండెను. సరిగా ఆ వేళకు అచ్చటి బ్రాహ్మణ గృహస్థు- ఎనుబదికోట్ల కధి కారి-సన్నాహముతో స్నానార్థము చనుచుండెను. అప్పుడు సువర్ణవర్ణము కలిగిన సుకుమారదేహుడగు రాజు కానబడగా బ్రాహ్మణుని హృదయమున స్నేహ ముదయించెను. ఆతడు లోనికి జని రాజు నక్కడనే యుండుమని చెప్పి, ఇంటికి జని వివిధరుచ్య పదార్థములు వంటచేయ నాజ్ఞాపించి వైభవ ముతో భోజనపాత్రలను తెప్పించెను. ఆ సమయమున హిమాలయ నివా సులు ప్రాప్త పంచాభిజ్ఞులు నగు తాపసులు ౬00ల మంది వచ్చి కూరు చుండిరి. నందమూలక పర్వతమునుండి ప్రత్యేకబుద్ధులుకూడ వచ్చియుండిరి. గృహస్థు రాజుచేతులు కడిగించి వివిధభోజనపదార్థములును, సూపవ్యంజనము లతోనిండిన పాత్రలును తెప్పించి రాజునకొసగెను. రాజు స్వీకరించి పురోహిత బ్రాహ్మణునకిచ్చెను బ్రాహ్మణుడు తాపసునకిచ్చెను. తపస్వి ప్రత్యేకబుద్ధుని కడకుజని కుడిచేత కమండలువుపట్టుకొని హస్తోదకమిచ్చి భిక్షాపాత్ర లోసగెను. అతడెవ్వరిని నిమంత్రింపక, ప్రశ్నింపక, భోజనము చేసెను. అతని భోజనానంత రము గృహస్థు తనలో "నేను రాజుకిచ్చితిని; రాజు బ్రాహ్మణున కిచ్చినాడు;

బ్రాహ్మణుడు తాపసికిని, తపస్వి ప్రత్యేక బుద్ధునకును ఇచ్చినారు. ప్రత్యేక బుద్ధుడు యెవ్వరి నడుగకుండ భుజించినాడు. వీరందరికన్న ఈయనకే ముట్టుటకు కారణమేమి? ఈయన యెవ్వరిని ప్రశ్నింపక భుజించుటకు హేతువేమి? క్రమముగా నడిగి తెలుసుకొందును'' అనుకొని, గృహస్థు ఒక్కొక్కరి కడకుపోయి ప్రణామముచేసి అడిగెను. వారు ఇట్లు ప్రత్యుత్తరము లిచ్చిరి :

''నీవు సుకుమారమూర్తివి, నిజనగరము
విడిచి యరుదెంచినాడవు విజనమునకు
కూరుచుండెడి వాడవు గొప్ప సౌధ
మందమూల్యమహాశయనాసనమున
ప్రీతి నీ యెడ గల్గుట చేత నీకు
ఉత్తమంబైన భోజన మొసగినాను.
శుద్ధ శాల్యన్నమది, పరిశుద్ధమాంస
కలిత మద్దాని భుజియింపక యొసగితివి
నీవు విప్రున, కెట్టిది నీదు ధర్మ
సరణి వివరింపవలె, నమస్కారమయ్య!''

''ఇతడు సద్బ్రాహ్మణుడు, మదీయ గురువు
మంచి చెడ్డలు తెలిపెడి మాన్యమూర్తి,
యోగ్యు డితడు, నిమంత్రణ కుచిత మగును
ఇతని కాహారపాత్రిక నిచ్చునెడల.''

''అడిగెదను రాజపూజితు డైనవాని
బ్రాహ్మణుని గోతముని, నీకు ప్రభువొసంగు
నుత్తమాహారమును ఋషి కొసగినావు
దాన పాత్రత నెరుగని ధర్మమార్గ
శైలి యెట్టిదియో నమస్కారమార్య!''

''పోషణము చేయుదును దారపుత్రకులను,
కలదు గార్హస్థ్యమున నాకు కాంక్ష, మనుజ

భోగములతోడ, శాసింతు భూమిపాలు,
వృద్ధు, డారణ్యకుండైన యీ తపస్వి
కొసగు పక్షాన నాహార, ముత్తమంబు,"

"చిక్కి యెముకలగూడయి, శిరము మీద
వెండ్రుకలు, వ్రేళ్ళ నఖములు పెరిగిపోయి,
దంతములు నల్లబడి, ధూళి దట్టముగను
శిరసుపైనున్న ఋషిని ప్రశ్నించువాడ !
కాననంబున నొంటిగా గడపు నీకు
జీవనాపేక్ష లేదొకో ? నీ వెవనికి
పెట్టితివొ భోజనంబు, తద్భిక్షు వెట్లు
శ్రేష్ఠతరు డయ్యె నీకన్న, చెప్పు మార్య. !"

"చామలన్, నివ్వరిన్, బిసశాకములను.
ఆరగింతును మధుమాంస మాదిగాగ.
సర్వము పరిగ్రహింతును, సంచనయనము
పాకము; నకించనులకు నపాలకులకును
నప్రతి గ్రహీతలకును నాదు భోజ
నమ్ము నొసగుట మిగుల యుక్తమ్ము సుమ్ము !"

"సువ్రతుడు మౌని యైన భిక్షువును ప్రశ్న
చేయువాడ నియ్యెడను: ఋషిప్రదత్త
భుక్తి గ్రహించి, మౌనమ్ము బూని తిందు
నొంటిగా పిల్వకుండనే యొరుల, నీకు
సలుపుదు నమస్సు, నీ ధర్మసరణి దెలుప !"

"ఏను వండ, పాకమ్ము చేయింప, తరగ,
తరగనీయ నకించన ధర్మపరుడ
నని యెరింగిన ఋషి వామహస్తమునను
పాత్రికన్, కుడిచేత పవిత్రమైన
సత్కమండులువు గొని యొసంగినారు

సంగ్రహ పరిగ్రహమ్ముల శక్తి యుండ,
నాకు నద్దాని నిచ్చుట న్యాయమె యగు-
అన్నదాతకు పాల్గొను మనుట తగదు."

ఆయన వాక్కులు విని, గృహస్థు ప్రసన్నచిత్తుడై యీ గాథలు పలికెను :

ఇటకు చనుదెంచినారు మదీయ శుభము
కొరకు భూపు డితఃపూర్వ మెరుగ నేను
ఎచట దానము చేసిన పెచ్చుఫలమొ.

రాజునకు నుండు నాసక్తి రాష్ట్రముపయి,
మంచి చెడ్డల యెడల బ్రాహ్మణుల దృష్టి,
కందమూల ఫలాలపై కాంక్ష ఋషికి,
భిక్షువగువాని కెదాన ప్రీతి లేదు.

ప్రత్యేకబుద్ధు డాతని కుపదేశమిచ్చి, నిజ నివాసస్థానమున కరిగెను. రాజుమాత్రము కొలదికాల మాయనకడనే యుండి, యావల వారాణసి కేగెను.

శాస్త యిట్లు ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, యిప్పుడేకాదు, పూర్వముకూడ నతడు క్రమముగా యోగ్యస్థానము కేగెను" అని చెప్పి, జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున ధర్మరత్న సత్కారముచేసిన గృహస్థు ఇప్పటిగృహస్థే. రాజు ఆనందుడు; పురోహితుడు సారిపుత్రుడు; హిమాలయతపస్వి నేనే.

———:():———

497. మాతంగ జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయునపుడు ఉదయనవంశ రాజులనుగూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున ఆయుష్మాన్ పిండోలభారద్వాజుడు జేతవనము నుండి ఆకాశమార్గమున తరచుగా కోశాంబీనగరములోని ఉదయన నరేశుని ఉద్యానమున పగటివేళ గడపుటకై పోవుచుండును. పూర్వజన్మమున స్థవిరుడు రాజ్యము చేయుచు బహుకాలము ఆ యుద్యానముననే భోగము లనుభవించుచుండెను. పూర్వజన్మ పరిచయముచే ఉద్యానమున పగలు గడపుటకై ఫలసమాపత్తి సుఖమున ఆతడు సపరివారముగా కాలక్షేపము చేయుచుండును. ఒకనాడాతడు పూచిన సాలవృక్షముక్రింద కూరుచున్నప్పుడు ఉదయన నరేశుడు సప్తాహకాలము పానగోష్ఠిలో గడిపి ఉద్యానమున క్రీడించుటకై విశేషపరివారముతో అచటికి జేరి మంగళశిలాఫలకముపై ఒకానొకతెయొడిలో దొరలుచు మద్యపుమత్తుచే నిద్రించెను. సమీపమున కూరుచుండి పాటలు పాడుచున్న స్త్రీలు వాద్యములు విడిచి ఆరామములోనికి పోయి పుష్పములు ఫలములు సంగ్రహింపజొచ్చిరి. అంతలో స్థవిరుడు కానబడగా వారాయనకడకు పోయి ప్రణామము చేసి ఒకప్రక్క కూరుచుండిరి. స్థవిరుడు ధర్మకథ చెప్పుచుండెను. తనయొడిలో తల పెట్టుకొని రాజు నిద్రించుచున్న సంగతి మరచి ఆ స్త్రీ కదలుటచే మెలకువ వచ్చి రాజు లేచి "దౌర్భాగ్యురాండ్రు ఎచటికి పోయినారు?" అనెను. "ఒకానొక శ్రమణునిచుట్టును జేరినారు" అని ఆమె పలుకగా, రాజు కోపముతో లేచిపోయి స్థవిరునితో ఇచ్చవచ్చినట్లు మాటలాడి, "మంచిది, శ్రమణుని యొడలినిండ ఎఱ్ఱచీమలు పట్టించెదను" అని ఎఱ్ఱచీమలను దొన్నెలనిండ నింపించి ఆతని శరీరముపై కెక్కించెను.

స్థవిరుడు ఆకాశమున కెగసి నిలిచి రాజునకుపదేశ మిచ్చి జేతవనములోని గంధకుటీద్వారముకడ దిగెను. తథాగతుడు చూచి యెచటినుండి

వచ్చుచున్నావు అని అడుగగా స్థవిరుడు వృత్తాంతము వివరించెను. "భారద్వాజా, ఉదయను డిప్పుడే కాదు, పూర్వముకూడ ప్రవ్రజితులకు శ్రమ ఇచ్చుచుండెను" అని, శాస్త అతని ప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు సమయమున బోధిసత్త్వుడు నగరమువెలుపలి చండాలకులమున నుద్భవించెను. అతనికి మాతంగు డని పేరు పెట్టిరి. పెరిగి పెద్దవాడైన పిదప అతడు మాతంగపండితు డని ప్రసిద్ధి చెందెను.

ఆ కాలమున వారాణసీ శ్రేష్ఠి పుత్రిక శకునములను పాటించునది. ఒకనా డామె విశేషపరివారముతో ఉద్యానమునకు పోయి క్రీడించుచుండెను. బోధిసత్త్వ డానా డేదోపనిమీద నగరములోనికి పోవుచుండగా నగరద్వారములోపల దిట్ఠమాంగలికకు కానబడెను. అత డొక ప్రక్కకు పోయి నిలిచెను. ఆమె ముసుగులోనుండి చూచి "ఇత డెవడు?" అనెను. "అమ్మా, చండాలుడు."

"చూడ దగనిదృశ్యము కానబడుచున్నది" అని ఆమె సుగంధజలముతో నేత్రములు తుడుచుకొని మరలిపోయెను. ఆమెవెంట వచ్చుపరిజనులు కోపముతో "ఒరి దుష్టచండాలా, నీ మూలమున నేడు ఊరకే మాకు లభించుమద్యము, ఆహారము లేకుండపోయినవి" అని మాతంగపండితుని కాలుసేతులతో తన్ని, కొట్టి స్మృతి కోలుపోవునట్లు చేసిరి. కొలదిసేపటిలో తెలివి వచ్చి ఆయన "దిట్ఠమాంగలికపరిజనులు నిర్దోషి నైననన్ను నిష్కారణముగా కొట్టినారు. ఆమె ఇప్పు డిచటికి వచ్చినచో లేచెదను; రానిచో లేవను" అనుకొని దృఢనిశ్చయము చేసికొని అత డామె తండ్రి నివాసమునకు జని ద్వారముకడ పడియుండెను. ఆమెతండ్రి చూచి "యేల పడియున్నావు?" అని అతని నడిగెను.

"మరేకారణము లేదు. నాకు దిట్ఠమాంగలికతో పనియున్నది." ఒకరోజు గడచినది; రెండు, మూడు, నాలుగు, ఐదు, తుదకు ఆరవరోజు

కూడ గడచినది. బోధిసత్త్వుల సంకల్పము నెరవేరితీరును. కావున నేడవ నాడు ఆమె ఈవలకు వచ్చి ఆయనకు కానబడి "స్వామీ, లెండు. తమ యింటికి దయచేయుడు" అని పలికెను

"భద్రే, నీ పరిజనులు నన్ను బాగుగా కొట్టినారు. బలము పోయినది. నన్ను లేవనెత్తి వీపున వేసికొని చనుము" అని బోధిసత్త్వుడు పలికెను. ఆమె అటులే చేసి, నగరవాసుల సమక్షమున నగరము వెలువడి చండాల గ్రామము చేరెను. బోధిసత్త్వుడు జాతిభేదమర్యాదలను అక్షుణ్ణముగా నిర్వహించుచు కొలదిదినములామెను తనయింట నిలిపి తనలో "నేను ప్రవ్రజించి ఈమెకు లాభము యశము సమకూర్పగలను. వేరొకయుపాయము లేదు" అనుకొని ఆమెను పిలిచి "భద్రే, నేను అడవినుండి యేమైనను తీసికొని రాకున్నచో మనకు గడవదు. నేను వచ్చువరకు భయపడవలదు. నేను అడవికి బోవుదును" అని యింటిలోని వారితో ఆమెను కనిపెట్టియుండు డని చెప్పి అడవికి బోయి శ్రమణప్రవ్రజ్య గ్రహించి అప్రమత్తుడై యేడవనాడు అష్ట సమాపత్తులను, పంచ-అభిజ్ఞలను పొంది "ఇక మాంగలికకు తోడ్పడగలను" అని తలచి బుద్ధిబలముచే చని చండాలగ్రామ ద్వారమున దిగి ఆమెవాకిట నిలువబడెను ఆతడు వచ్చినవార్త విని ఆమె వెలుపలికి వచ్చి యేడ్చి మొత్తుకొనుచు "స్వామీ, నన్ను అనాధను చేసి ప్రవ్రజించితిరా?" అనెను.

"భద్రే, చింతింపకుము. నీ పూర్వసంపదకన్న అధికసంపద కలుగునట్లు చేసెదను. కాని నీవు పరిషన్మధ్యమున నా భర్త మాతంగుడు కాడు, మహాబ్రహ్మ అని చెప్పగలవా?" అనెను.

"స్వామీ, చిత్తము, చెప్పగలను."

"ఇప్పుడెవరైనను నీ స్వామి యెచట నున్నాడని అడిగినచో బ్రహ్మలోకమునకు వెళ్ళినా డని చెప్పవలయును. ఎప్పుడు వచ్చును అని యడిగినచో నేటి కేడవనాడు పున్నమిచంద్రుని భేదించుకొని వచ్చును అని చెప్పవలెను." ఆమె కిట్లు చెప్పి ఆతడు హిమాలయమునకు జనెను. మంగళిక వారాణసిలో పరిషన్మధ్యమున స్వామి చెప్పినట్లే చెప్పెను. లోకులు విశ్వసించి "ఆయన మహాబ్రహ్మ, ఇందుచేతనే మాంగలికకడకు పోవడు. ఇది

ఇట్లే'' అనిరి. బోధిసత్త్వుడు పున్నమినాడు చంద్రుడు ఆకాశమధ్యమున నున్నపుడు బ్రహ్మరూపము ధరించి కాశీరాష్ట్రి మెల్లెడను వెలుపల పండ్రెండు యోజనముల వరకును ఒక్క వెలుగు వెలిగి చంద్రబింబమును భేదించుకొని దిగి వారాణసిపై ముమ్మారు ప్రదక్షిణము చేసెను. లోకులు తనను గంధ మాల్యాదులతో పూజించిన పిదప చండాలగ్రామమువైపున కరిగెను. బ్రహ్మ భక్తులు గుమిగూడి ఆ గ్రామము చేరిరి. మాంగలికగృహము శుద్ధవస్త్రము ఖతో కప్పబడెను. చతుర్విధ సుగంధద్రవ్యములతో నేల అలికిరి. పుష్పములు చల్లియున్నవి. పెగళ్ళు వేసిరి. వస్త్రములతో చాందినీ కట్టి, క్రింద మహా శయనము పరచిరి. సుగంధతైలములతో దీపములు వెలిగించి వెండివలె తళ తళలాడు నిసుక ద్వారముకడ చల్లిరి. పుష్పమాలికలు వేసి జండాలు కట్టిరి. ఇట్లలంకృత మయిన గృహమున బోధిసత్త్వుడు దిగి లోనికి పోయి కొంలది సేపు శయ్యపై కూరుచుండెను. ఆ సమయమున మంగళిక ఋతుమతి, బోధిసత్త్వుడు అంగుళితో ఆమె నాభి స్పృశించెను. దాన ఆమె గర్భమున శిశువు చేరెను. అంత నాత డామెను సంబోధించి "భద్రే, నీ కడుపున శిశువు పడినది. అది పుత్రు డగును. నీవును, నీ కొమరుడును విశేషలాభము, యశము పొందుదురు. నీ పాదోదకము సమస్త జంబూద్వీపములోని రాజుల కభిషేక జలము కాగలదు. నీవు జలకమాడిన నీరు అమృతౌషధము కాగలదు. ఈ యుదకమును శిరములపై చల్లుకొనినవారు సర్వదా రోగరహితులై యుందురు; మృతులు జీవింతురు. నీ పాదములపై శిరసులుంచి ప్రణామము చేయువారు వేలకొలది కానుక లిత్తురు. అల్లే కూతవేటుదూరములో నిలుచు వారు నాణెము లిచ్చి ప్రణామము చేయుదురు. కనుచూపుమేరలో నిలిచి ప్రణామము చేయువారు కార్షాపణ మిత్తురు. నీవు అప్రమత్తురాలవై యుండుము'' అని యుపదేశ మిచ్చి, ఇలు వెడలి, యెల్లరు చూచుచుండ గనే పై కెగసి చంద్రమండలమున ప్రవేశించెను. బ్రహ్మభక్తులు నిలిచినవారు నిలిచినట్లే రాత్రి గడిపిరి. ప్రాతఃకాలమున మంగళికను బంగరు పల్లకిలో కూరుచుండబెట్టి నగరమున నూరేగించిరి. మహాబ్రహ్మకు భార్యయని గ్రహించి లోకులు సుగంధమాల్యాదులతో ఆమెను పూజించిరి. ఆమె పాద ములపై శిర ముంచి ప్రణామము చేసెడి యవకాశము దొరికినవారు వేయి నాణెము లిచ్చిరి; కూతవేటుదూరములోని వారు వేయినాణెము లిచ్చిరి;

చూపుమేరలోని వారు ఒక్కొక్క కార్షాపణము చొప్పున నిచ్చిరి. ఈవిధముగా ఆమెను పండ్రెండు యోజనముల విస్తీర్ణముకల వారాణసిలో త్రిప్పగా పదునెనిమిదికోట్ల ధనము సమకూడెను.

ప్రదక్షిణముచేసి వారు నగరమధ్యమున మహామంటపము నేర్పాటు చేసి, చాందినీ కట్టి మహావైభవముతో ఆమెను మంటపమున కూరుచుండ బెట్టిరి. దానిపార్శ్వమున నేడువాకిళ్ళ కోష్ఠములు, ఏడంతస్తుల మేడయు నిర్మింప నిందుప్రయత్న మారంభ మయ్యెను. మంగళిక మంటపముననే పుత్రుని కనెను. నామకరణమునాడు బ్రాహ్మణులు సమావిష్టులై మండప మున పుట్టుటచే మండవ్యు డని పేరు పెట్టిరి. ప్రాసాదము పదిమాసములలో సమాప్త మయ్యెను. నాటినుండి వా రిరువురు మహైశ్వర్య మనుభవించు చుండిరి. మండవ్యకుమారుడు ఎనిమిదేండ్లవా డయినప్పుడు జంబూద్వీపము లోని ఉత్తమాచార్యులను కొనివచ్చిరి. వా రాతనికి మూడు వేదములు చెప్పిరి. పదునారేళ్ళవయసున బ్రాహ్మణభోజన మేర్పాటు చేసిరి. ఆనాడు పదునారువేల బ్రాహ్మణులకు విందు జరిగెను. నాల్గవ ద్వారకోషమున బ్రాహ్మణసంభావన జరిగినది.

ఒకనాడు మహోత్సవము జరుగుచుండ విశేషముగా పాలు కాచిరి. పదునారువేలమంది బ్రాహ్మణులు నాల్గవద్వారకోష్ఠమున కూరుచుండి బంగరువన్నె నెయ్యి, తేనె, ఖండశర్కర కలిపినపాలు ఆరగించుచుండిరి. కుమారుడు సర్వాలంకారభూషితుడై బంగరుపాదుకలు తొడుగుకొని, చేత బంగరుదండము పట్టుకొని ఇక్కడ నేయి, ఇక్కడ తేనె వడ్డింపుడు, అనుచు ఇటు నటు తిరుగుచుండెను. ఆ సమయమున మాతంగపండితుడు హిమా లయమున నిజాశ్రమమున గూరుచుండి మంగలికాపుత్రుడు ఎట్లున్నాడో యని యోచించెను. ఆకాశమార్గమున అనోతప్తసరోవరముచేరి ముఖప్రక్షాళ నాదికము కావించి మనశ్శిలాఫలకముపై నిలిచి, యెఱ్ఱనివస్త్రములు దాల్చి, మృణ్మయపాత్ర చేబూని ఆకాశమార్గమున జని చతుర్ద్వారకోష్ఠ దాన శాలలో దిగి ఒకప్రక్క నిలిచెను. మండవ్యుడు ఇటు నటు చూచుచు బోధి సత్త్వుని కనుగొని ఇంతచక్కని యతుడు ఎట్లు ప్రవ్రజించెనో అనుకొని 'ఇచ్చటి కెచ్చట నుండి వచ్చితివి' అని అడుగువాడై ఈ గాథ పలికెను :

ఎవ్వడవు నీవు ? వచ్చితి వెచటినుండి ?
బూడిదన్ బొర్లు దయ్యముపోల్కితోడ,
తాల్చి మెడమీద మలినవస్త్రమ్ముతునుక.

విని బోధిసత్త్వుడు కోమలచిత్తముతో సంభాషించుచుచు ఈ గాథ పలికెను :

జనుల కోయి యశస్వి నీసదనమునను
అన్నపానీయముల లబ్ధి యనుచునున్న;
దన్యదత్తాన్నజీవుల మగుట మేము
ఈ వెరింగినవిషయమే; ఇంక లెమ్ము,
పిండముల్ శ్వపాకునకు లభించు గాక !

అంతట మండవ్యుడు ఈగాథ పలికెను :

అవనిసురులకొరకె అన్నంబు మాయింట,
ఆత్మహితముకొరకె యగును శ్రద్ధ
ఇచటినుండి కదలు, మేల నిల్తువు దుష్ట !
నీకు దాన మీరు మాకొలదులు.

అప్పుడు బోధిసత్త్వ డీగాథ పలికెను :

చల్లుచుండు ఫలాశఁ గర్షకుడు బీజ
ముల ననూపము, లున్నతములును, నిమ్న
ములు నగుపొలంబులన్ : దానములను మీరు
శ్రద్ధతో జేయవచ్చును సర్వులకును.

నిక్కముగ దానయోగ్యుల నొక్కొకతరి
సత్కరింపగవచ్చును శ్రద్ధతోడ.

అవల మండవ్య డీగాథ పలికెను :

నే నెరుంగుదు క్షేత్రముల్, వానిలోనె
చల్లుచుందును బీజముల్; జాతి, మంత్ర
సంయుతబ్రాహ్మణుల్ క్షేత్రసత్తమములు.

పిదప బోధిసత్త్వుడీగాథలు పలికెను :

జాతిమదము, లోభమ్ము, ద్వేషమ్ము, మూర్ఖ
తయును, నతిమానితయు. నిల్చుతావు లెల్ల
కానె కావు సత్‌క్షేత్రముల్ దానమునకు.

ఇట్టి యవగుణములు లేనియట్టి మంచి
తావు లగును సత్‌క్షేత్రముల్ దానమునకు.

ఈ ప్రకారముగా బోధిసత్త్వుడు మాటిమాటికిని పలుకుచుండుటచే కోపము వచ్చి మండవ్యుడు "ఇతడు మిక్కిలి బకవాదము చేయుచున్నాడు. ద్వారపాలకు లెచటికి పోయిరి ? ఈ చండాలుని వెలువరింప లేరా ?" అనుచు ఈ గాథ పలికెను :

ఎచటి కేగినార లీతిండిపోతులు ?
వీని చావగొట్టి వేయు డోరి !

వా రాతని మాటలు విని వేగముగా చేరి "దేవా, యేమి చేయుదుము ?" అని విన్నవించిరి.

"ఈ దుష్టచండాలుని మీరు చూచుచున్నారా ?"

"దేవా, కానబడుట లేదు. ఎక్కడనుండి వచ్చినాడో తెలియదు. ఇతడు మాయావియో మాంత్రికుడో కావచ్చును."

"నిలుచున్నారేమి ?"

"దేవా, యేమి చేయుదుము ?"

"మెడ పట్టి యిచటనుండి వెడల నడువుడు."

అంతవరకును వారు బోధిసత్త్వుని సమీపమునకు రాలేదు. ఆయన ఆకసమున నిలిచి ఈ గాథ పలికెను :

ఎవని నిందింత్రు మీర లాబుుషివరుండు
త్రవ్వివేయును గోళ్ళతో ధరణిధరము,

కరకులోహంబు దంతాల గోరికివేయు,
పితిహోత్రుని కబళించి వేయగలడు.

ఈ గాథ పలుకుచు బోధిసత్త్వుడు ఆ మానవకుడు, బ్రాహ్మణులు చూచుచుండగనే ఆకసమున కెగసెను.

ఈ యర్థమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథ పలికెను :

ఈ క్రమంబున సత్యపరాక్రముండు
పలికి మాతంగు, డచ్చటి బ్రాహ్మణంబు
కనులయెదుటనె చేరెను గగనమునకు.

బోధిసత్త్వుడు తూర్పుదిక్కుగా పోయి ఒకానొక చిన్నివీథిలో దిగి, తనపాదచిహ్నములు కనబడునట్లు చేయ దృఢసంకల్పము చేసికొని, పూర్వ ద్వారముకడ నున్న భోజనశాలకు బోయి, నలుగురితో కలిసి మెలిసి భోజనము చేసినాడు. ఆర్యునకు రాజు బాధ కలిగించినట్లు తెలియగానే నగర దేవతలు వచ్చినారు. పెద్దయక్షుడు రాజుమెడ పట్టి పిసికినారు. తక్కిన దేవతలు మిగిలిన బ్రాహ్మణుల మెడలు నులిమినారు. బోధిసత్త్వుని చిత్తము కోమల మగుటచే వారు రాజును సంహరింపక బోధిసత్త్వుని పుత్రు డని దయదలచి వేధించినారు. మండవ్యుని శిరము తిరిగిపోయి వీపున వాలెను; కాలుసేతులు కొయ్యబారెను; నేత్రములు వెలికివచ్చెను. అతడు మృతునివలె నయ్యెను. నోట చొంగ కారుచుండ బ్రాహ్మణులు ఇటు నటు దొరలు చుండిరి. నీ పుత్రున కేమో జరిగినదని దిట్ఠమంగలిక కెవరో సూచించిరి. తోడనే యామె వచ్చి, పుత్రుని జూచి, ఏమిది యని యీ గాథ పలికెను :

వీపుమీదికి వ్రేలాడు వీని శిరసు,
తిరుగు బాహువు లూరకే, తెల్లబడియె
నయనములు మృతుకనులట్లు, నా కొమరున
కెవడు కల్గించినాడొకో యిట్టిగతిని :

అచటనే నిలిచియున్న జను లామెకు వృత్తాంతము తెలుపుటకై యీ గాథ పలికిరి :

మలినవస్త్రంబు దాల్చు శ్రమణు డిచటికి
వచ్చె బూడిదదయ్యంబువాలకమున
పిలికం జుట్టి మెడను; నీ బిడ్డకిట్టి
దుర్గతిం గలిగించినదుష్టు డతడె.

విని యామె తనలో "మరి యెవ్వరికిని ఇట్టి సామర్థ్యము లేదు. నిస్సందేహముగా మాతంగపండితుడే, ఆయన ధీరుడు, మైత్రీభావనా సంయుతుడు. ఇందరు జనులకు వ్యథ కలిగించి పోవడు. ఆయన యెటు వైపు చనెనో" అనుకొని ఈ గాథ పలికెను :

మాణవకులార, తెలుపు డామహితశక్తి
సంయుతుం డెటు పోయెనో! చని తదీయ
సన్నిధికి, వేడుకొందుము క్షమ యతనిని!
పుత్రునకు జీవనప్రాప్తి పొసగవచ్చు.

అచ్చట నున్నయువకు లిట్లనిరి :

అరిగినాడు మహాప్రజ్ఞు డాకసమున
పూర్వదిక్కున, కాతండు పూర్ణ చంద్రు
వడువున విహాయసమునకు నడుమగాను.

వాక్కులు విని యామె నిజభర్త నన్వేషింప నిశ్చయించుకొనెను. బంగరుకలశమును, బంగరు పళ్ళెమును పట్టుకొని దాసీజనమును వెంటబెట్టుకొని, తన పాదచిహ్నములను ప్రదర్శింప బోధిసత్త్వుడు దృఢసంకల్పము చేసిన చోటికి జేరి, తదనుసారముగా నామె చని బోధిసత్త్వుని కనుగొనెను. ఆ సమయమున నాతడు పీఠముపై గూరుచుండి భోజనము చేయుచుండెను. ఆమె యతనిని సమీపించి, ప్రణామము చేసి, యొకప్రక్క నిలిచెను, ఆత డామెను చూచి, పాత్రలో కొంత యుచ్ఛిష్టము విడిచెను. మంగళిక బంగరు కలశముతో ఆయనకు నీర మిచ్చెను. ఆతడు చేతు లందులో కడిగికొని ముఖప్రక్షాళనము కూడ చేసెను. నా పుత్రుని యాకృతిని విరూపము చేసినవా రెవరని యమె యాతని నడుగునదై యీ గాథ పలికెను :

వీపుమీదికి వ్రేలాడు వీని శిరము,
తిరుగు బాహువు లూరకే, తెల్లబడియె
నయనములు మృతుకనులట్లు; నా కొమరున
కెవడు కల్పించినాడొకో యిట్టిగతిని !

ఇకమీద వచ్చుగాథలు వారల ప్రశ్నోత్తరములు :

సాధుబుషులను గన్గొని శక్తిమంతు
లైనయతులు వారల ననుసరించి
చేసినా రిట్టు లీ దుష్టచిత్త, క్రోధ
పూరితస్వాంతు భవదీయపుత్రు గాంచి.

యతులకు నా కుమారుపై నాగ్రహంబు
కలిగిన, నీవు కోపింపవలదు భిక్షు !
పుత్రశోకాన శరణమ్ము పొందుదాన.

అప్పుడైన నామనసున నిప్పుడైన
లేదు ద్వేష మించుకయేని; వేదమత్తు
డగుచు నెరుగడు నీ సుతు డర్థ మేమి.

క్షణములో మోహ మొందును జనునిబుద్ధి;
వానిదోషము క్షమియింపవలయు భిక్షు !
పండితులు లోకమున క్రోధబలులు కారు.

ఈ విధముగా నామె క్షమాపణ వేడగా బోధిసత్త్వుడు "అగుచో యతులను నివారించుటకు అమృతౌషధము చూపుదును" అని ఈ గాథ పలికెను :

ఈ మూఢ మండవ్యు డిపుడు మదీయ
భోజనోచ్ఛిష్టంబు భుజియించునేని
వ్యథపాలు చేయరు యక్షు లితనిని—
సితనూజాతుండు నీరోగి యగును

విని యామె బంగరుపళ్ళెము ముందరికి చాపి, "స్వామీ! అమృతౌషధము నొసంగుడు" అని వేడెను బోధిసత్త్వుడు ఎంగిలిగంజి అందులో బోసి, "ప్రథమమున నిందులో సగము నీ పుత్రునినోట బోసి, తక్కినదానిలో నీరు కలిపి బ్రాహ్మణులపై జల్లుము. ఎల్లరును నీరోగు లగుదురు" అని చెప్పి, ఆకసమున కెగసి, హిమాలయమునకు బోయెను ఆమె యా పళ్ళెము నెత్తిపై బెట్టుకొని "నాకు అమృతౌషధము లభించినది" అనుచు గృహమున కేగి తొలుత పుత్రునినోట బోయగా యక్షుడు తొలగిపోయెను. కుమారు డొడలు దులుపుకొనుచు లేచి అమ్మా, యే లది యనెను. "నాయనా, నీవు చేసినది నీకే తెలియును. నీ దక్షిణలు పుచ్చుకొన్నవారిస్థితి యెట్లున్నదో చూడు" మని తల్లి చెప్పగా, నాతడు వారిని విలోకించి పశ్చాత్తాపము చెందెను.

అంతట తల్లి కుమారునితో "నాయనా, నీవు మూర్ఖుడవు. దాన మిచ్చినచో మహాఫలము కలుగుతావు గుర్తింపవైతివి. ఇట్టి జనులు దానము పొంద నర్హులు కారు. నేటినుండి యీ దుశ్శీలురకు దానమీయ వలదు; శీలవంతులకే యొసగుము" అని యీ గాథలు పలికెను:

అరయగా లేవు పుణ్యక్షేత్రములను
మండవ్య, నీ వల్పమతివి కావునను
ఇత్తు వసంయుతచిత్తు లౌవారి,
కత్యంతదుష్టుల కధిక దానములు.

కొందరు కేశముల్, కొందరు జడలు,
మరికొంద రజినముల్ ధరియించువారు;
మలినాంబరుల జూడుమా! అల్పశక్తు
లగువారలకు జడ, లజినాంబరములు
అగునె మోక్షప్రదాయకములు చెపుమ!

ద్వేషమ్ము, రాగమ్ము, విడిచినవారు,
క్షీణాసవు, లవిద్య చెందనివారు,
అర్హతు లగువారికర్పించునట్టి
దానంబు బహుఫలదాయి మండవ్య!

"కావున నాయనా, నేటినుండి యిట్టివారికి దాన మీయక, అష్ట సమాపత్తులను, పంచాభిజ్ఞలను పొందిన ధార్మికశ్రమణ బ్రాహ్మణులకును, ప్రత్యేకబుద్ధులకును దానము లిమ్ము. నాయనా, రమ్ము. వీరందరికిని అమృత మిచ్చి నీరోగులను చేయు"మని యామె యెంగిలి గంజి తెప్పించి అందు నీరు కలిపి పదునారువేలమంది బ్రాహ్మణుల ముఖములపై చల్లించెను. ఒక్కొక్కడే దుమ్ము దులుపుకొనుచు లేచి నిలబడెను.

చండాలుని యుచ్ఛిష్టమువలన అబ్రాహ్మణుల మయితి మని వారు సిగ్గుపడి వారాణసి విడిచి మేదరాష్ట్రమునకు బోయి నివసింపజొచ్చిరి. మండవ్యుడు అచటనే యుండెను.

ఆ కాలమున వేత్రవతీనగరి ప్రక్కగా ప్రవహించు వేత్రవతీనదీ తీరమున జాతిమంతు డను పేరు గల బ్రాహ్మణు డొకడు ప్రవ్రజించి యుండెను. అతనికి జాత్యభిమానము మెండు. బోధిసత్త్వు డతని యభిమానమును విదళింప దలచి అచ్చటికి బోయి నదీతీరముపైన నివసింపసాగెను. ఒకనాడు బోధిసత్త్వుడు పండ్లు తోమికొని పుడక నీట వైచుచు అది పోయి బ్రాహ్మణునిజటలలో చిక్కుకొనునట్లు సంకల్పించెను. బ్రాహ్మణుడు నదిలో స్నానము చేసి ఆచమనము చేయువేళకు పలుదోముపుల్ల సూటిగా పోయి, ఆయనజడలలో చిక్కుకొనెను. అతడు చూచి "నీ మొగము మండ! ఈ పిశాచము ఎచటినుండి వచ్చినది! దీని సంగతి కనుగొందును" అనుకొని నదీతీరమున పైయెత్తున కరిగెను. అచట బోధసత్త్వుడు కానబడగా బ్రాహ్మణు డతనితో "నీ వేజాతివాడవు?" అనెను. "చండాలుడను." "నదిలో పలుదోము పుల్ల పడవైచినది నీవేనా?" "అవును, "నేనే పడ వేసినాను." "నీ మొగము మండ! చండాలపిశాచమా, నీ విచట నుండ వలదు. ప్రవాహముక్రిందికి పోయి యుండుము."

బోధిసత్త్వుడు నది దిగువభాగమునకు పోయి నివసించుచున్నను ఆయన పడవేయు దంతకాష్ఠము ఎటి కెదురీది బ్రాహ్మణుని జటలలో చిక్కుకొనుచుండెను. బ్రాహ్మణుడు కోపించి "నీ మొగము మండ! నీ విచటనే యున్నచో నేడవనాడు నీ తల యేడుముక్కలగును" అని శపించెను. బోధిసత్త్వుడు తనలో "నేను ఈతనిపై కోపించితినేని నాశీలము వ్యయమగును.

ఉపాయముచే ఈతని యభిమానమును విదళింతును" అనుకొని యేడవనాడు సూర్యోదయము కాకుండ నిలిపెను. లోకులు కుపితులై జాతిమంతునికడకు బోయి "భన్తే, సూర్యోదయము మీరు కానీయరా ?" అనిరి. "ఇది నాపని కాదు. నదీతీరము దిగువను చండాలు డున్నాడు, ఇది వాడు చేసినపని కావచ్చును" అని తపస్వి పలుకగా, వారు బోధిసత్త్వుని చేరి "భన్తే, మీరు సూర్యోదయము కానీయరా ?" అనిరి. "ఆయుష్మంతులారా, ఔను" "ఎందుచేత ?" "మీ విశ్వాసపాత్రుడైన తపస్వి అపరాధము చేయని నాకు శాప మిచ్చినాడు. ఆయన వచ్చి నా పాదములపై బడి క్షమాపణ వేడిననే కాని సూర్యోదయము కానీయను." వారు పోయి అతనిని లాగుకొని వచ్చి బోధిసత్త్వుని పాదములపై పడవైచి, క్షమాపణ వేడించి "భన్తే, సూర్యోదయము కానిండు" అని ప్రార్థించిరి.

"నేను సూర్యోదయము కానీయ జాలను. కానిచ్చినచో ఆయన శిరసు ఏడుముక్క లగును."

"భన్తే, యేమి చేయుదుము ?"

పెద్దమట్టిగడ్డ తెమ్మని చెప్పి "ఇది తాపసితలపై పెట్టి ఆయనను నీటిలోనికి దింపు" డని పలికి బోధిసత్త్వుడు సూర్యోదయము కానిచ్చెను. సూర్యరశ్మి తగులగానే మట్టిగడ్డ యేడుముక్కలై పడెను. బ్రాహ్మణుడు నీట మునిగెను. బోధిసత్త్వ డాతనిని పట్టుకొని "పదునారువేలమంది బ్రాహ్మణు లెక్కడ నున్నారు ?" అనెను. వారు మేదరాష్ట్రమున నున్నారని తెలిసికొని వారి గర్వము నణచుటకై బుద్ధిబలమున నచటికి చని నగరములోనికి దిగి భిక్షాపాత్ర చే బూని భిక్షార్థము బయలువెడలెను. బ్రాహ్మణులు తమలో "ఈతడు ఒక్కపూట ఇచట నున్నను మనపరువు దక్కనీయడు" అనుకొని రాజుకడకు బోయి "దేవా, ఒకానొకమాయావి, ఇంద్రజాలికుడు వచ్చి నాడు. వానిని పట్టింపుడు" అని విన్నవించిరి. మంచి దని రాజు స్వీకరించెను. బోధిసత్త్వుడు గోడప్రక్కన అరుగుమీద కూర్చుండి భోజనము చేయుచుండెను. ఆయన పరధ్యానములోనున్న సమయమున రాజపురుషులు వచ్చి ఖడ్గముతో కొట్టిరి. బోధిసత్త్వుడు మృతి నొంది బ్రహ్మలోకమున బుట్టెను.

ఈ జాతకములో బోధిసత్త్వుడు కోండును దమించు వాడయ్యెను. వాడు ఈ విశ్వాసముతో మృతి నొందెను. కోపము వచ్చి దేవతలు మేద రాష్ట్రముపై వేడిబురద వర్షించి నాశము చేసిరి. ఇందుచేతనే యిట్లు చెప్ప బడినది :

ఆ యశస్విని మాతంగు నడచుకతన
నమసె మేదరాజ్యము పరిషత్తుతోడ.

శాస్త్ర ఇట్లు ధర్మోపదేశము చేసి "ఇప్పుడే కాదు, పూర్వముకూడ ఉదయనుడు ప్రవ్రజితులకు బాధ కలిగించినాడు" అని జాతకములు సరి పోల్చెను. ఆ కాలమున మండవ్యుడు ఉదయనుడు; మాతంగ పండితుడు నేనే.

—[ ]—

498. చిత్త సంభూత జాతకము

శాస్త జేతవనమున విహారము చేయుచు ఆయుష్మాన్ మహాకాశ్యపుని వెంట ప్రీతితో నుండు నిరువురు భిక్షువులను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

వారి పరంపర విశ్వాసముతో కూడినది. ఉన్నది కొంచెము అందరును సమానముగా పంచుకొనుచుండిరి. ఎల్లరును కలిసియే భిక్షాటనమునకు పోవుచుండిరి; కలిసియే మరలి వచ్చుచుండిరి. విడివిడిగా నుండెడివారు కారు. వారల పరస్పర విశ్వాసమును గూర్చి ధర్మసభలో చర్చ జరుగుచుండెను. శాస్త యచటికి జని విషయము తెలిసికొని "భిక్షువులారా! ఇందాశ్చర్య మేమియులేదు. ఇది ఒక్క జన్మపరంపరలోని విశ్వాసము; పూర్వకాల పండితులు మూడు నాలుగు జన్మలలో కూడ మిత్రభావము విడనాడలేదు" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున అవంతిరాష్ట్రములోని ఉజ్జయినీ నగరమున అవంతి మహారాజు పాలనము చేయుచుండెను. ఆ కాలమున నగరము వెలుపల చండాలగ్రామ ముండెను. బోధిసత్త్వుడు అచట జన్మించెను. వేరొక ప్రాణి కూడ అతని పినతల్లి కడుపున పడెను. ఒకనిపేరు చిత్తుడు. రెండవవాడు సంభూతుడు. ఇరువురును పెరిగి పెద్దవారైన పిదప చండాల కులమునకు తగిన విద్య నేర్చికొనిరి. ఒకనాడు ఉజ్జయినీ నగరమున తమ విద్య చూపదలచి ఒకడు ఉత్తరద్వారముకడను, రెండవాడు తూర్పు వాకిటను తమ నేర్పును ప్రదర్శించిరి.

ఆ నగరమున నిరువురు దృష్టమాంగళికలు కలరు: ఒకతె శ్రేష్ఠి కూతురు, రెండవది పురోహితుని పుత్రిక. ఒకనాడు వారు ఖాద్యములు

వెంటగొని ఉద్యానమున క్రీడించు కోర్కె కలుగగా ఒకతె ఉత్తరద్వారమున, రెండవది తూర్పువాకిటను బయిల్వెడలిరి. ఉభయులును చండాల పుత్రుల కళాప్రదర్శనము చూచి, వీ రెవరని యడిగిరి. "చండాలపుత్రులు." వెంటనే వారు సుగంధజలముతో కన్నులు తుడుచుకొని, చూడగూడనిది చూచినాము అని వెనుకకు మరలిపోయిరి. లోకులు వారిని చూచి కొట్టి తన్ని "ఓరి దౌర్భాగ్య చండాలులారా! మాకు ఊరకే లభించు నాహారము, మద్యము మీ మూలమున పోయినవి" అని నిందించి పోయిరి. తెలివి వచ్చిన పిదప నుభయు లొకచోటికి చేరి కష్టసుఖములు చెప్పుకొని, "ఏమి చేయుదము? ఈ వ్యథ మన జాతిమూలమున వచ్చినది. మనము చండాల కుల కర్మలు చేయజాలము. జాతిని మరుగుపరచి బ్రాహ్మణ విద్యార్థులమని తక్షశిలకు పోయి అచ్చట విద్యలు నేర్చికొందము" అని నిశ్చయించుకొనిరి. ఆవల వారు తక్షశిలా నగరమునకు చని గురుదక్షిణ ఈయజాలని ధర్మ శిష్యులుగా ప్రసిద్ధాచార్యుని కడచేరి విద్యాభ్యాసము చేయజొచ్చిరి. 'ఎవరో యిరువురు చండాలురు జాతిని కప్పిపుచ్చి విద్య లభ్యసించుచున్నారు' అను జనశ్రుతి జంబూద్వీపమున వ్యాపించెను. అందులో చిత్తపండితుడు విద్యాభ్యాసము ముగించెను; సంభూత పండితుని చదువు ఇంకను పూర్తి కాలేదు.

ఒకనాడు ఒకానొక గ్రామవాసి పాఠము కొరకు ఆ యాచార్యుని నిమంత్రించెను. ఆ రాత్రియే పెద్ద వర్షము కురిసి మార్గములోని గుంట లన్నియు నిండిపోయినవి. ఆచార్యుడు ప్రాతఃకాలముననే చిత్తపండితుని పిలువనంపి "బాబా, నే నచటికి పోజాలను నీవు విద్యార్థులతో చని అచట మంగళపాఠము జేసి నీ భాగము భుజించి నా భాగము కొనిరమ్ము" అని చెప్పెను. అతడు చిత్తమని విద్యార్థులను వెంటగొని అచటికి పోయెను. బ్రహ్మచారులు స్నానములు చేయునంతలో పాలు చల్లారుటకై విభాగములు చేసిరి. అవి చల్లారకముందే బ్రహ్మచారులు వచ్చి కూరుచుండిరి. గృహస్థులు వారికి హస్తోదకమిచ్చి క్షీరస్థాళులు వారి యెదుట నుంచిరి. పాలకోవా చల్లారినదని తలచి సంభూతపండితుడు దానిని ఒక్కమారుగా నోటవేసికొనెను మండుచున్న లోహగోళము లోనికి బోయినట్లుండెను. అతలు కంపము పొందుచు స్మృతి కోలుపోవునట్లయి చిత్తపండితునివైపు

చూచి చండాలభాషలో అయ్యో యిట్లయినది అనెను. అతడు పరధ్యాన ములోనుండి చండాలభాషలో ప్రత్యుత్తర మిచ్చెను. బ్రహ్మచారులు ఒకరి మొగము ఒకరు చూచుకొనిరి. చిత్తపండితుడు మంగళపాఠము కావించెను. బ్రహ్మచారులు ఆవలకు జని విడివిడిగా యోచించి అది చండాల భాషయని తెలిసికొని "ఓరి దుష్టచండాలురారా, యిన్నినాళ్లును మేము బ్రాహ్మణుల మని మమ్ము మోసగించితిరి!" అని ఉభయులను కొట్టిరి. అంతలో నొక సత్పురుషుడు అగుడని ఆపి వారిని బ్రతికించి "ఇది మీ జాతిదోషము. మీ రెచ్చటికయినను పోయి ప్రవ్రజింపుడు" అని ఉపదేశించెను. పిదప బ్రహ్మ చారులు ఆచార్యుని కడకు బోయి ఈ విషయము తెలిపిరి. వా రిరువురు అరణ్యమునకు జని ఋషుల రీతిని ప్రవ్రజించిరి. ఆవల కొలది కాలమునకే మృతినొంది నీరంజరా నదీతీరమున లేడి కడుపున బుట్టిరి. పుట్టినదాది రెండు నెల్లపుడు నొకటిగా నుండెడివి.

ఒకనాడు మేతమేసిన పిదప అవి దగ్గరగా నిలుచుండి ఒడళ్లు రాచు కొనుచుండ వేటకాడు శక్తిని ప్రయోగించి ఒక్క దెబ్బతో రెండిటి ప్రాణ ములు హరించెను. అనంతరమవి నర్మదాతీరమున పక్షులై పుట్టినవి. అవి పెరిగిన వెనుక ఒకనాడు మేత మేయుచు ముక్కు ముక్కు కలియునట్లు దగ్గర దగ్గరగా నుండెను. అప్పుడు పిట్టలు పట్టువాడు వానిని జూచి ఒక్క యూపున పట్టి వానిని చంపెను. అయినను అచ్చట చ్యుతి కెంది చిత్తపండి తుడు కౌశాంబీ నగరమున పురోహిత పుత్రుడై పుట్టెను. సంభూత పండి తుడు ఉత్తర పాంచాల రాజకుమారుడై పుట్టెను. నామకరణము నాడు సంభూత పండితునకు జన్మాంతరములో చండాల జన్మము మాత్రము జ్ఞప్తికి వచ్చెను. చిత్తపండితునకు క్రమముగా నాలుగు జన్మలు జ్ఞప్తికి వచ్చినవి. అతడు పదునారేండ్ల వయసున నిలు వెడలి ఋషి ప్రవ్రజ్య గ్రహించి ధ్యాన అభిజ్ఞలు పొంది ధ్యానానందము నొందుచు కాలము గడుపుచుండెను. సంభూతపండితుడు పితృ మరణానంతరము ఛత్రధారణము చేసెను. ఆనాడు మంగళగీతా రూపమున ఉల్లాసవాక్య ఫణితిలో రెండు గాథలు పలికెను. విని యిది మన రాజుగారి మంగళగీతము అని రాణివాసములోని స్త్రీలు, గంధర్వులు నా గీతము పాడసాగిరి. క్రమక్రమముగా నగర వాసులు ఇది మన మహారాజుగారి ప్రియగీతమని గ్రహించి పాడజొచ్చిరి.

చిత్త పండితుడు హిమాలయమున నివసించుచు సోదరుని సంగతి తలపోయగా ఆతడు ఛత్రధారణము చేసినట్లు తోచెను. అంతట నాతడు తనలో "రాజ్యము నూతనము. ఇప్పుడే ఉపదేశింపలేను. ఆతడు వృద్ధుడైన పిదప అచటికి పోయి నేను ధర్మోపదేశము చేసి, అతనిని ప్రవ్రజితుని కావించెదను" అనుకొని యేబదిసంవత్సరముల తరువాత రాజు కొడుకులు, కూతుళ్లు పెద్దవారైన పిదప బుద్ధిబలమున అచటికరిగి, ఉద్యానమున దిగి మంగళశిలా తలముపై స్వర్ణప్రతిమవలె కూరుచుండెను.

ఆ సమయమున ఒకానొక బాలుడు ఆ గీతము పాడుచు కర్రలు పేర్చుచుండెను. చిత్తపండితుడు వానిని పిలిచెను. వాడు వచ్చి ప్రణామము చేసి నిలువగా "నీవు ఉదయముననే పాట పాడుచున్నావు. ఇది కాక వేరొక పాట రాదా ?" అని చిత్తపండితుడు ప్రశ్నించెను.

"భన్తే, నాకు ఇంకను ఎన్నో పాటలు వచ్చును. ఈ గీతము మా రాజుగారి ప్రియగీతమగుటచే నిదియే పాడుచున్నాను."

"రాజుగారి గీతముకాక వేరు గీతములు పాడువారు లేరా ?"

"భన్తే, లేరు."

"నీవు రాజుగారి గీతము కాక వేరొకటి పాడగలవా ?"

"తెలిసినచో పాడుదును."

"అగుచో నీవు రాజుగారి గీతములు రెండు పాడిన పిదప నిది మూడవగీతముగా పాడవలెను. రాజసన్నిధికి పోయి పాడవలెను. ప్రభువు ప్రసన్నుడై నీకు సంపద లిచ్చును." అని ఆయన వానికి గీతము చెప్పి పంపెను. వాడు వేగముగా తల్లికడకు జని శుభ్రవస్త్రములు ధరించి రాజ ద్వారము చేరి "ఒకానొక బాలుడు తమతోపాటు ప్రతిగీతము పాడును" అని రాజుకు విన్నప మంపెను. ప్రభు వనుమతి యిచ్చిన పిదప వాడు చని ప్రణామము చేసెను. వానిని చూచి రాజు "బాబా, నీవు ప్రతి గీతము పాడుదువా ?" అనెను.

"చిత్తము దేవా, రాజ్యపరిషత్తు సమావేశము చేయింపుడు."

పరిషత్తుసమావేశమైన పిదప బాలుడు రాజుతో "దేవా, తాము తమ గీతము పాడుడు. నేను ప్రతిగీతము పాడుదును" అని విన్నవించెను.

రాజు రెండు గాథలు పలికెను :

ఫలము లొందవును చేసెడి పనుల వలన,
కాదు వ్యర్థము చేసినకర్మ మెపుడు,
కానవచ్చుచు నుండు మహానుభావ
భూత నిజకర్మచే గల్గు పుణ్యఫలము.

జనములకు నన్నికర్మ లొసంగుచుండు
ఫలము, లొనరించు కర్మ నిష్ఫలము కాదు.
మన్మనమ్మట్లు చిత్తుని మానసంబు
ఒక్కొకప్పుడు స్మృతి నందుచుండుగాక !

రాజు గీతిక తరువాత బాలుడు ఈ గాథ పలికెను :

జనములకు నన్నికర్మ లొసంగుచుండు
ఫలము; లొనరించు కర్మ నిష్ఫలము కాదు,
దేవ, మీ మానసమ్మట్లు తెలిసికొనుడు
చిత్తుని మనస్సు వెలయును స్నిగ్ధముగను.

విని రా జీ గాథ పలికెను :

చిత్తుడవొ నీవు. కాకున్న చిత్తభావ
మున్నవాని కడను వింటి వొక్కొ గాథ ?
కానిచో చిత్తు గనుగొన్న వాని వలన
నాలకించితివో ? గాథ అచ్చ మనుట
నాకు సంశయమే లేదు– నీకు నేను
ఉత్తమ గ్రామ శతకంబు నొసగువాడ.

అంతట బాలు డీ కథ పలికెను :

దీని నన్యత్ర వింటిని దేవ, నేను
చిత్తుడంగాను; ఋషి నాకు చెప్పినాడు
పాడుమా యని గాథను ప్రభువునికడ :
ఆత డొసగును సంతుష్టుడయి వరములు.

విని రాజు తనలో "ఇతడు నా సోదరుడు చిత్తపండితుడు కానో పును. ఇప్పుడే పోయి ఇతనిని జూచెదను" అనుకొని పరిజనుల కానతిచ్చు వాడై యీ గాథలు పలికెను :

సురచిర పతాకములతోడ నరదములను,
కుథములన్, పూలదండలన్, కుంజరముల

వేగ సజ్జీకరింపుడు :
ప్రోగవలయు
శంఖముల్, మృదంగములును :
సాగవలయు
తోడనే యానముల్ కూడ :
చూడవలయు
ఋషివరుని యాశ్రమమ్మున కేగి నేడె.

ఇట్లు పలికి రాజు శ్రేష్ఠరథ మెక్కి, శీఘ్రముగా జని, యుద్యాన వనముకడ నరదము నాపి, చిత్తపండితుని కడకు బోయి, ప్రణామము చేసి, యొక ప్రక్క నిలిచి, ప్రసన్నచిత్తముతో ఈ గాథ పలికెను :

పరిషత్తు నడుమను పలికిన గాథ
వలనను లాభంబు కలిగెను నేడు.
ఋషిని, శీలవ్రతు నీనాడు చూచి
సంప్రీతుడను సుప్రసన్నుడ నైతి.

చిత్తపండితుని జూచినంతనే రాజు ప్రసన్నమనస్కుడై నా సోదరునికి మంచము వేయుడు అని యానతిచ్చువాడై యీ గాధ పలికెను :

ఆసనంబును, పాద్య మంగీకరింపు,
డర్ఘ్యము విషయమై యడుగుచున్నాను–
గ్రహియింత్రుగాక అర్ఘ్యమ్మును మీరు.

ఈ విధముగా మధురస్వాగతము పలికి, రాజు రాజ్యమును రెండు భాగములు చేయువాడై యీ గాధ పలికెను :

నిర్మితంబగు మీకునై నిరుపమాన
రమ్య సౌధమ్ము, చేయును రమణి గణము
సేవ, లా జ్ఞప్తులను దయచేయవలయు :
ఇచట రాజ్యము చేయుద మిరువురమును.

ఈ వాక్కులు విని చిత్తపండితుడు ధర్మోపదేశము చేయువాడై యీ గాధలు పలికెను :

కర్మల ఫలాఫలంబుల గాంచి, రాజ,
అగుదు సంయుత చిత్తుండ : ఆత్మజులును
పశుగణంబులు, ధనరాశి వలదు నాకు.

జీవితమ్మున పదిదిశల్ చేరకమును,
విరిగి నేలను బడినట్టి వెదురువోలె
జీవలోకము శుష్కించి పోవుచుండు.

ఇట్టి స్థితిలోన ఆనంద మేమి యుండు ?
ఏటికి మీసములు, క్రీడ లేల ? ధనము
భార్య, పుత్రులతోడ లాభమ్ము లేదు :
బంధమోచన మయ్యెను ప్రభువ, నాకు,

మరవదని మృత్యుదేవత యెరిగినాను;
నెత్తిపై నాడుచుండగా మిత్తి యెపుడు
ఏమిటికి రతి! ధనకాంక్ష! యెందుకొరకు!

మానవులకును చండాలయోని యన్న
అతి నికృష్టము, నధమంబు; నస్మదీయ
పూర్వకర్మలచే నందు పుట్టు వొందవె,

తొలుత చండాల జన్మ మావలను మృగము,
అవల డేగయు, నిపుడు బ్రాహ్మణము, క్షత్రి
యమ్ము జన్మ; మవంతిలో. ఆ నిరంజ-
రా తటిని గట్టునను, నర్మదా తటమున.

ఈ విధముగా పూర్వకాలము నందలి నికృష్ట జన్మలను ప్రకటీకరించి, యీ జన్మలో కూడ ఆయుస్సంస్కారముల పరిధినిగూర్చి చెప్పి, పుణ్యకార్య ప్రేరణ చేయువాడై యీ గాథలు పలికెను :

జీవులను మృత్యు సన్నిధి జేర్చుచుండు
నల్పమాయువు; వార్ధక మందుటకయి
లేదు త్రాణమ్ము, వినవలె నాదువాక్కు
దుఃఖఫల మిచ్చు కర్మకై తొందర వలదు.

... .
దుఃఖఫల మిచ్చుకర్మకై తొందర వలదు.

... ...
చేయకు రజశ్శిరంబగు చెడ్డ పనిని.

... .
నరకమున ద్రోయు కర్మ యొనర్ప వలదు.

బోధిసత్త్వుడిట్లు పలుకగా రాజు ప్రసన్నచిత్తుడై యీ గాథలు పలికెను :

నిశ్చయమ్ముగ సత్యముల్ నీవు పల్కు
వాక్కు; లైనను భిక్షువు వదలలేని
కామములు, భోగ సాధనల్ కలవు నాకు.

కర్దమమ్మున జిక్కిన గజము, మంచి
నేల జూపిన గ్రహియింప జాలనట్లు
భోగ పంకమ్ములో దిగి పోయినట్టి
నేను నీ త్రోవ గ్రహియింపలేను భిక్షు !

తనయు సౌఖ్యమ్ము గోరుచు తల్లిదండ్రు
లెట్లు పుత్రుని శాసింతు, రట్లె నాదు
మేల కొరకె శాసింపుడు మీరు నన్ను,

అంతట బోధిసత్త్వు డిట్లు పలికెను :

నీకు భోగాలు విడనాడ నేరలేని
ధర్మము సమాచరింపు, మధర్మ మెద్ది
రాజ! జరుగగరాదు నీ రాష్ట్రమందు.

అన్ని దిశలకు దూతల నంపి, శ్రమణ
విప్రులను పెల్లుగా బిలిపింపవలయు,
అన్నపానీయ శయనాసనాదికమ్ము
సిద్ధమొనరించి, సేవలు చేయవలయు.

శ్రద్ధ నన్నాదిక మొసంగి శ్రమణులకును
బ్రాహ్మణులకు యథాశక్తి భక్తి యుక్తి
దానమిచ్చెడు వారు నిందారహితులు
గా జరించుచు స్వర్గమ్ము గాంచగలరు.

స్త్రీ గణమ్ము నీ చుట్టును జేరి యుండ,
ప్రభు మదమ్మావరించిన పక్షమందు
స్మరణకుం దెచ్చికొని నీవు సకల పారి
షదుల యెదటను తద్గాథ చదువవలయు.

ఈ ప్రకారముగా బోధిసత్త్వు డాయన కుపదేశించి "నీకు నే నుప దేశమిచ్చినాను. ఇపుడు నీ విచ్చవచ్చినచో ప్రవ్రజింపవచ్చును. నా కర్మ ఫలము నే ననుభవింతును" అని, ఆకసమున కెగసి, యాతని శిరముపై ధూళి

చల్లుచు హిమాలయమునకు జనెను. ఇది చూడగా రాజునకు వైరాగ్యము కలిగెను. జ్యేష్ఠపుత్రునకు రాజ్యము సమర్పించి. సైన్యమున కెరుకపరచి, హిమాలయమునకు జనెను. బోధిసత్త్వున కీతనిరాక తెలిసినంతనే ఋషిగణముతో నెదురువచ్చి రాజును గొనిపోయి ప్రవ్రజితుని గావించి యోగవిధి బోధించెను. ఆతడు ధ్యానలాభము పొందినాడు. ఈ విధముగా నుభయులును క్రమముగా బ్రహ్మలోకగాము లయిరి.

శాస్త యిట్లు ధర్మదేశన చేసి, "భిక్షువులారా, యిట్లు పురాణ పండితులు మూడు జన్మల వరకును పరస్పర ధృఢవిశ్వాసముతో నుండిరి" అని చెప్పి, జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున సంభూతపండితుడు, ఆనందుడు; చిత్తపండితుడు నేనే.

—: o :—

499. శిబి జాతకము

శాస్త్ర జేతవనమున విహారము చేయుచు, అసదృశ దానమును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

(ఇది ఎనిమిదవ నిపాతములోని సౌవీర జాతకమున వచ్చియున్నది.) ఆ సమయమున రాజు ఏడవనాడు సమస్త పరిష్కారము లిచ్చి, దానాను మోదమునకు ప్రార్థన చేసెను. శాస్త్ర దానాను మోదనము చేయకుండనే వెడలిపోయెను. రాజు ప్రాతఃకాల భోజనముచేసి, విహారమునకు బోయి "భన్తే, అనుమోదన మేల చేయలేదు ?" అని యడిగెను. "మహారాజా, పరిషత్తు శుద్ధముగా లేదు." "నవే కదరియా దేవలోకం వజన్తి" అను గాథాద్వారమున శాస్త్ర ధర్మోపదేశముచేసెను. రాజు ప్రసన్నుడై, సహస్ర ముద్రల విలువ గలిగి శిబి దేశమున నేసిన వస్త్రములతో తథాగతుని పూజించి నగర ప్రవేశము కావించెను.

మరునాడు ధర్మసభలో సంభాషణ జరుగుచుండెను. "ఆయుష్మంతు లారా, కోసల నరేశుడు అసదృశమైన దానము చేసినాడు. కాని, అట్టి దానమువలన కూడ ఆయనకు సంతుష్టి కలుగలేదు. దశబలధారి ధర్మోప దేశము చేసిన పిదప ఆయన మరల లక్షలకొలది మూల్యము కల శిబిదేశ వస్త్రములిచ్చెను. ఆయుష్మంతులారా, రాజుచేసిన దానములచే సంతోషము కలుగలేదు" అని వారు చెప్పుకొనుచుండగా శాస్త్ర అచటికి జని విషయము గ్రహించి "భిక్షువులారా, వెలుపలివస్తువులను దానముచేయుట తేలిక. పూర్వకాలమున పండితులు జంబూద్వీప మంతయు ఆందోళన చెందునట్లు దానములు చేసినారు. కాని బాహ్య వస్తుప్రదానముచే అసంతుష్టులై, ప్రియవస్తువు నొసంగిన వానికి ప్రియవస్తువు ప్రాప్తియగును అని గ్రహించి వచ్చిన యాచకులకు తమ నేత్రములను పెకల్చి యిచ్చినారు," అని పూర్వ జన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున శిబిరాష్ట్రములోని అరిష్టపురమున శిబిమహారాజు పాలన చేయుచుండెను. ఆ సమయమున బోధిసత్త్వుడు ఆయన పుత్రుడై పుట్టెను. ఆతనికి శిబికుమారుడని పేరుపెట్టిరి. అతడు పెద్దవాడై తక్షశిలకు జని విద్య లభ్యసించి వచ్చి తండ్రికి విద్యాప్రదర్శనముచేసి ఉపరాజయ్యెను. తండ్రి మరణానంతరము తాను రాజై నాలుగగతులలో పడక, దశ రాజ ధర్మములకు విరుద్ధముగా కాక న్యాయానుసారముగా పరిపాలనము చేయ జొచ్చెను. అతడు నాలుగు నగరద్వారముల కడను, నగర మధ్యమునను రాజభవన ద్వారము కడను మొత్తము ఆరు ధర్మశాలలు నిర్మించెను. ప్రతి దినము వానిలో నేడువేలు ఖర్చు చేయించి దానధర్మములు కావించు చుండెను. అష్టమి, చతుర్దశి, పూర్ణిమలలో రాజు దానశాలలకు స్వయముగా పోయి చూచుచుండువాడు. ఒకసారి యాతడు పూర్ణిమనాడు ప్రాతఃకాలమున శ్వేతచ్ఛత్రముక్రింద సింహాసనముపై కూరుచుండి తాను చేయు దానములను గూర్చి తలపోయుచు "నేను దానము చేయని బాహ్య వస్తువు లేదు. అయినను అట్టివాని నొసగుటవలన సంతుష్టి కలుగుటలేదు నేత్రదానము చేయవలెనని నా కోరిక. ఈనాడు నేను ధర్మశాలకు బోయి నపుడు ఎవరైనను బాహ్య పదార్థము కానిది యడిగినచో బాగుండును. ఎవడైనను గుండెలోని మాంసము నడిగినచో నేను చురకత్తితో ఉరము కోసి స్వచ్ఛ జలమునుండి నాళముతో కూడ కమలమును పెకలించిన రీతిని రక్త బిందువులు కారుచుండగా నా హృదయ మాంసఖండమును పెకలించి వానికిత్తును. ఎవరైనను శరీరమాంసము కోరుచో అక్షరములు చెక్కినట్లు శరీరము చెక్కి, మాంసము వెలికిదీసి యిత్తును. ఎవడయినను నా రక్తమును కోరినచో నోటిలోనికి గిన్నెదూర్చి గిన్నె నిండుగా రక్తము తీసి యిత్తును ఎవడైనను తనయింటిలో పనులు సాగుటలేదు అన్నచో, రాజ వేషము తొలగించి వానియి టికి బోయి దాసునివలె ఇంటిపనులు చేసి పెట్టుదును ఎవడయినను నా నేత్రములు కోరినచో వానిని పెలించి యిత్తు" ననుకొనెను

నే నొసగలేని మానవ దాన మేది
యుండ, దొకవేళ నాకన్ను లొడలు వేడు
పక్షమున నిత్తు వాని కంపమ్ము లేక.

అతడు పదునారు సుగంధ జలఘటముల నీరు స్నానము చేసి, సమస్తాభరణములు ధరించి, నానావిధ రుచిర భోజనముల చేసి, అలంకృతహస్తి నెక్కి దానశాలకేగెను.

శక్రున కీ సంగతి తోచి, 'శిబిరాజు నేడు వచ్చిన యతిథికి నిజముగా నేత్రములు పెకలించి యిచ్చునా యీయడా' యని పరీక్ష చేయగోరి, అంధబ్రాహ్మణుని వలె దానశాల చేరి ఉన్నతస్థానమున నిలిచి, చేతులెత్తి రాజును దీవించెను. ఏనుగును రాజాయన కడకు గొని పోయి "బ్రాహ్మణోత్తమా, ఏమి కావలెను?" అని యడిగెను. "మహారాజా, మీ దానసంకల్పము సమస్త లోకములకు వ్యాపించినది. నేను అంధుడను. మీకు రెండు నేత్రములు కలవు" అని నేత్రము యాచించువాడై బ్రాహ్మణు డీ గాథపలికెను.

దూరదేశస్థుడైన వృద్ధుండు వచ్చి
నాడు నేత్రము నొకదాని వేడు కొరకు
దయ నొసంగిన క, న్నట్టి దాత యున్న
నేక నేత్రులమే మొదు మిరువురమును.

విని బోధిసత్త్వుడు తనలో "ఈవేళనే ప్రాసాదమున గూరుచున్నప్పుడు నేత్రవిషయమై తలపోసితిని ఏమి యదృష్టము! నేడు నా మనోరథము నెరవేరును. ఇంతకుమున్ను నే నీయని దానము నే డిత్తును" అనుకొని ప్రసన్నచిత్తుడై యీ గాథ పలికెను :

ఎవరు చెప్పుటచే వచ్చి తిటకు నేత్ర
మడుగ యాచక, ఉత్తమమైన యింద్రి
యమ్ము, నతికష్ట దేయమ్ము నైనదాని ?

యాచకు డీ గాథ పలికెను :

అందు రెవరు సుజంపతి నాకమందు,
మనుజ లోకాన నెవ్వని మఘవు డంద్రు,
తెలుప నాతండు, నే నరుదెంచినాను.

అన్నిటన్ భూరి కష్టదమైన యట్టి
యుత్తమోత్తమ దానంబు నొసగవలయు.

అప్పుడు రా జీ గాథ పలికెను :

నీ కోర్కు లన్నియు నెరవేరు గాక
బ్రాహ్మణా, నేత్ర సంప్రాప్తియా నీకు
నీ వాక్కుచే వేడ నేను రెండిత్తు
నేత్రవంతుడ వౌదు నిఖిల లోకులకు.

ఇట్లు పనికి రాజు "నా నేత్రము లిక్కడ పెకలించి యిచ్చుట సరి కాదు" అనుకొని, బ్రాహ్మణుని వెంట బెట్టుకొని రాణివాసమునకు జని, సింహాసనమున గూరుచుండి, సీవకుడను వైద్యుని బిలువనంపి యాత డరుదెంచిన పిదప "నా నేత్రములు సేకరింపుము" అనెను. ఈ వార్త నగరమున తోడనే వ్యాపింపగా కల్లోలము పుట్టెను రాణులు, సేనాపతి, నాగరకులు, రాజాంగణమున సమావిష్టులై, రోదించుచు రాజుతో నీ గాథలు పలికిరి :

ఈయవలదు నేత్రంబుల; నెల్లర మము
వీడవలదు మహారాజ, వీని కొసగు
డధిక ధనమైన, రత్నముక్తాదికమ్ము
లైన, రథములనైన. హయాదులైన,
ఏనుగులనైన సజ్జీకరించి మిగుల.

అరదముల, శకటాల మే మందరమును
శిబినివాసులు మీ చుట్టు జేరియుండ
సర్వులను రాజ ! దాన మొసంగవచ్చు,

అంతట రాజీ గాథలు పలికెను :

ఇత్తునని పలికి యావల నీయ దలపు
విడిచిపెట్టిన మానిసి వేసికొమను
నేలపై నున్న నిగళంబు నిజగళమున.

ఇత్తుననిపల్కి తొలుదొల్త, నీయదలపు
నవల విడిచినవాడు పాపాత్మకుండు
అగుటయే గాక, చేరును యమసదనము.

అడుగుదానినె యావలె, అడుగనట్టి
దాని నీయగ రాదంద్రు : దాని నిత్తు
నన్ను విప్రుడు యాచించినాడొ దేని.

అమాత్యులంతట రాజుతో“ ఏ పదార్థమడుగగా మీరు నేత్రము లీయమన్నారు ?” అనువారై యీ గాథ పలికిరి :

వర్ణ, మాయువు, సౌఖ్యము, బలము– వీని
లోన నెద్దాని గోరగా లోచనముల
నిచ్చుచున్నావు పరలోక హేతువునను.

రాజు వారితో నీ గాథ పలికెను :

కాదు సుత ధన రాజ్యాధి కాంక్షచేత,
పూని కీర్తికి గాదు, సత్పురుష ధర్మ
మగుట, ఈ దానమున నాకు హర్షమొదవు.

సమ్యక్ సంబుద్ధుడు కూడ ధర్మసేనాపతి సారిపుత్రునకు చర్యాపిటకోపదేశ మిచ్చుచు, “నా రెండు నేత్రములకన్న సర్వజ్ఞతా జ్ఞానము ప్రియతర” మని ప్రకటించుటకై ఈ గాథ పలికెను :

ద్వేషమే లేదు నేత్రాల, స్వీయ దేహ
మప్రియము కాదు, సర్వజ్ఞ తఖిలషితము,
కాన చేయుదు నే నేత్ర దాన మిపుడు.

బోధిసత్త్వుని వాక్కులు విని యమాత్యు లప్రతిభులయినంతనే ఆయన వైద్య సీవకునితో నీ గాథ పలికెను :

సీవకా, వైద్యమున సుశిక్షితుడ నీవు.
మత్సఖుండవు, వినుము నా మాట : పెరికి
కనుల నుంచుము యాచకు కరమునందు.

అంతట సీవకుడు "దేవా, నేత్రదానము చేయుట మిగుల గొప్ప విషయము. యోచింపుడు" అని విన్నవించెను.

"నేను యోచించియే యున్నాను. నీ వాలసింపకుము. నాతో నెక్కువ మాటలాడవలదు."

"నావంటి వైద్యునకు ఈ పని ఉచితముకాదు. రాజునేత్రములను శస్త్రముతో తీయజాలను" అనుకొని నానావిధౌషధములు నూరి చూర్ణము చేసి, దానిని నీలకమలమున నింపి దక్షిణ నేత్రమున నూదెను. కన్ను తిరిగెను. బాధ ఆరంభమయ్యెను. "రాజా, యోచింపుడు, నేత్రమును సరి చేయగలనను విశ్వాసమున్నది"

"బాబా, ఆలసింపకుము" వైద్యుడు కమలమున చూర్ణము నింపి మరల నూదెను. కంటిలో పోటు ప్రారంభించెను. వేదన హెచ్చెను. "మహారాజా, యోచింపుడు. నేత్రమును పూర్వమువలె మండునట్లు చేయగలను" "ఆలసింపవలదు" అని రాజు పలికెను. బాధ హెచ్చెను. రక్తము కారజొచ్చెను. కట్టుకొన్న బట్ట నెత్తుట తడిసెను. రాణులును అమాత్యులును ఆయన పాదములపై బడి ఏడ్చి మొత్తుకొనుచు "దేవా, నేత్రము తీయవలదు" అని విన్నవించిరి. రాజు వేదన భరించుచు వైద్యునితో "బాబా, ఆలసింపకుము" అనెను. అతడు చిత్తమని యెడమ చేతితో కన్ను పట్టుకొని కుడిచేత శస్త్రము దాల్చి నేత్రసూత్రమును కోసి గ్రుడ్డురాజుచేత బెట్టెను. రాజు ఎడమకంటితో కుడికన్ను చూచి బాధ సహించుచు, బ్రాహ్మణుని పిలువనంపి "బ్రాహ్మణోత్తమా, రమ్ము ఈ కంటి కన్న నూరు రెట్లు, వెయ్యిరెట్లు సర్వజ్ఞతారూపమగు నేత్రము నాకు ప్రియము. అందుచే ఈ నేత్రము నీ కిచ్చుచున్నాను" అనెను. బ్రాహ్మణుడు దానిని కైకొని తన

నేత్రకోటరములో సంధించుకొనెను. నిజప్రభావముచే ఆ నేత్రము వికసించిన నీలోత్పలమువలె నయ్యెను. బోధిసత్త్వుడు ఎడమకంటితో ఆ నేత్రము చూచి "ఓహో! నా నేత్రదానము సఫలమయ్యెను" అనుకొని ఆంతరిక ప్రీతిచే సంస్పృష్టుడై రెండవ కన్ను కూడా తీసి యిచ్చెను. శక్రుడు దానిని కూడా తన నేత్రకోటరమున సంధించుకొని రాజభవనము వెలువడి జన సమూహము చూచుచుండ నగరము దాటి దేవలోకమున కరిగెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త ఈ గాథ పలికెను:

శిబి నరేశుని నేత్రముల్ శివకు డూడ్చి
యిచ్చె, బ్రాహ్మణునకు చూపు వచ్చె, కాని
ఆ నిమేషంబులో శిబి అంధుడయ్యె!

కన్నులు బొత్తలవలె నుండక చుట్టు కుదురువలె మాంసపిండముతో నిండినట్లుండెను. బాధ తగ్గెను. బోధిసత్త్వుడు కొలది దినములు ప్రాసాదముననుండి "అంధునకు రాజ్యమేల? అమాత్యులకు రాజ్యమిచ్చి ఉద్యానమునకు పోయి ప్రవ్రజించి శ్రమణధర్మ మాచరింతును" అనుకొని అమాత్యులను పిలువనంపి తన యభిప్రాయము తెలిపి "ముఖము కడుగుకొనుట నీరు తెచ్చి, పనులు చేసిపెట్టు సేవకు డొకడు నావద్ద నుండుగాక. దొడ్డిలోనికి బోవుటకు త్రాడు కట్టుడు." అని సారథిని పిలువనంపి రథము సంసిద్ధముచేయ నానతిచ్చెను. అమాత్యులు ఆయనను రథ మెక్కనీయక బంగరు పల్లకిలో నెక్కించి చెరువుగట్టున కూరుచుండబెట్టి నలుప్రక్కల సంరక్షణ కేర్పాటు చేసిరి. రాజు శరీరదానమును గూర్చి యోచింప జొచ్చెను. అప్పుడు శక్రుని పీఠము వేడియెక్కెను. శక్రుడు యోచించి చూడ కారణము బోధపడెను. "మహారాజునకు వరమిచ్చి పూర్వమువలె కన్ను లుండునట్లు చేసెదను" అనుకొని శక్రుడు బోధిసత్త్వునికడకు బోయి యిటు నటు తిరుగజొచ్చెను.

ఈ యర్థమునే ప్రకాశింప జేయుటకై శాస్త యీ గాథ పలికెను:

ఆవల కతిపయ దినముల కక్షియుగ్మ

ముదయ మొందగ శిబి నరేశో త్తముండు
ప్రియుని విశ్వాసి సారథి బిలువ నంపె.

చేయు మరదము సారథీ ! సిద్ధ, మేను
పోదు నుద్యాన భూమికి, పుష్కరిణికి
వనమునకు నని సూచన వలయు చేయ,

అంత పుష్కరణీ తీరమందు కూరు
చుండ దేవరా జాతని దండ నిలిచె.

బోధిసత్త్వుడు శక్రుని పదధ్వని విని, ఇది యేమి యని యడిగెను. శక్రుడు గాథాద్వారమున ప్రత్యుత్తర మిచ్చెను :

నేను శక్రుడ రాజర్షి ! నీ సముఖము
చేరవచ్చితి, తెలుపు నీ కోరికలను.

ఇట్లాతడు పలికినమీద రాజీ గాథ పలికెను :

కలవు శక్ర, మదీయాంతికమ్మునందు
ధనము, బహుసేన, ఈ గ్రుడ్డితనము నందు
పోవు మృతిమీదికే బుద్ధి దేవరాజ !

అప్పుడు శక్రుడు "శిబిరాజా, నీవు మరణము కోరియే మరణింప దలచుచున్నావా ? అంధుడ నగుదునను భీతిచేతనా ?" అనెను. "దేవా, అంధుడ నగుదునను కారణమున." "మహారాజా, దానము కేవలము పరలోకము కొరకే కాదు. ఇహ జన్మమున కూడ దానిఫలిత ముండును. కన్నడిగినంతనే నీవు ఇచ్చివేసినావు. ఇందుచేత సత్యక్రియ కావింపుము" అని శక్రు డీ గాథ పలికెను :

ఓయి క్షత్రియ, పలుకుమీ ఉన్నవరకు
నీదు సత్యమ్ములన్, వచ్చు నేత్రయుగళి.

విని బోధిసత్త్వుడు "శక్రదేవా, నీవు నాకు నేత్రము ప్రసాదింప దలచినచో మరి యే యుపాయ మవలంబింపవలదు. నా దానమునకు ప్రతి

ఫలముగా నేత్రము నాకు లభించుగాక !" అనెను. అప్పుడు శక్రుడు "మహా రాజా, నేను శక్రుడను, దేవరాజును. అన్యుల నేత్రము తెచ్చి యీయ నేరను. నీదానమునకు ప్రతిఫలముగా నీకు నేత్రము లభించును" అనెను. "అట్లగుచో, నా దానము సఫలమగుగాక !" అని బోధిసత్త్వుడు సత్యక్రియ చేయువాడై ఈ గాథ పలికెను :

ఎందరో యాచకుల్ వచ్చుచుందు, రెన్నొ
గోత్రములవారు మత్ప్రీతి పాత్రులెల్ల :
చక్కబడుగాక నయన మీ సత్యమునకు !

ఇట్లు పలికినంతనే మొదటి నేత్రము సరియయ్యెను. అంతట ద్వితీయ నేత్రోత్పత్తికై యాత డీ గాథలు పలికెను :

అతులం గోరు బ్రాహ్మణ యాచకునకు
నయనముల నిచ్చువేళ మానసమునందు
అంకురించెను సౌమనస్యంబు, ప్రీతి :

ఆ క్షణముననే ద్వితీయనేత్ర ముత్పన్నమాయెను. ఆ రెండు నేత్రములు స్వాభావికముగా లేవు, దివ్యముగాను లేవు. బ్రాహ్మణున కిచ్చిన కన్నులు మరల తెచ్చుటకు శక్యము కాలేదు. ఉపహత వస్తువులపై దివ్య చక్షువు లుదయింపవు. ఆ నేత్రములు సత్యపారమితా చక్షువులని పేర్కొనబడినవి. నేత్రములు వచ్చినంతనే శక్రుని ప్రభావముచే రాజ్యపరిషత్తు సమావిష్టమయ్యెను. శక్రుడు జనసమూహ సమక్షమున రాజును ప్రశంసించువాడై యీ గాథలు పలికెను :

శిబి నరేశ్వర, నీవు వచించుగాథ
లధిక ధర్మానుసారమ్ము లగుటవలన
అమరు చున్నవి దివ్యనేత్రములు నీకు.

కుడ్యముల, ప్రస్తరంబుల, కుధరములను
నాల్గు వంకల శతయోజనముల వరకు
జొచ్చుకొని పోవగలవు నీ చూపులు శిబి !

శక్రుడాకసమున నిల్చి, అప్రమత్తుడవై యుండుమని బోధిసత్త్వున కుపదేశించి, దేవలోకమునకు చనెను. జనులు పరివేష్టించి యుండ రాజు వైభవముతో కదలి, చందన ప్రాసాద మెక్కెను. రాజుకు నేత్రములు మరల వచ్చిన వనువార్త శిబిరాష్ట్రమునం దంతటను వ్యాపించెను. రాష్ట్రవాసు లాయన దర్శనమునకై గుంపులు గుంపులుగా వచ్చిరి. అంతటి జనసమూహమునకు దానమహిమనుగూర్చి చెప్పదలచి, రాజు రాజద్వారము కడ గొప్ప మండపము వేయించి శ్వేతచ్ఛత్రము క్రింద సింహాసనముపై గూరుచుండి, నగరమున చాటబంపి సర్వశ్రేణులవారిని సమకూర్చెను. అప్పుడు వారితో "శిబి రాష్ట్రవాసులారా, నా దివ్యనేత్రములను గాంచి నారు కదా ! నేటినుండి దానము చేయకుండ భుజింప వలదు." అని ధర్మోప దేశము చేయువాడై ఈ గాథలు పలికెను :

వేడినం గూడ నీయగా వీలు కాని
ధనము ప్రియము కాకుండునే తనకు మిగుల ?
శిబి నివాసులు నే డిట జేరినట్టి
సర్వు లీక్షింపు డీ, దివ్య చక్షువులను !

కుడ్యముల, ప్రస్తరంబుల, కుధరమునను
నలుకెలంకుల శత యోజనముల దాక
చొచ్చుకొని పోయి నా కనుల్ చూచు నిపుడు.

త్యాగమును మించి యీ జీవితమున నేది
యుండు ? నాచర్మ చక్షువు లొసగుకతన
దివ్య నేత్రద్వయంబు పొందితిని నేను.

రాష్ట్ర జనులార, ఓ శిబిరాజ, కాంచి
దీని, దానము లొసగుచు తిని తిరుగుచు
ఆర్యమార్గాన స్వర్గంబు నంద గలరు.

రాజావల ప్రతిపక్షమునను పదునైదవనాడు జనమును సమకూర్చి యీ గాథలద్వారా ధర్మోపదేశము చేయుచుండెను. విని జనులు దానాది పుణ్యకార్యములు చేయుచు తుదకు పరలోకమున కరిగిరి.

శాస్త యిట్లు ధర్మోపదేశము చేసి,'' భిక్షువులారా, పురాణ పండితులు బాహ్యావస్తుదానమున సంతుష్టులు కాక, యాచకులకు తమ నేత్రములను పెకలించి యిచ్చిరి'' అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున సీవకవైద్యుడు ఆనందుడు శక్రుడు అనురుద్ధుడు; పరిషత్తు బుద్ధపరిషత్తు; శిబిరాజు నేనే.

---

500. సిరిమంద జాతకము

సిరిమంద ప్రశ్న మహా - ఉమ్మగ (546)

జాతకమున వచ్చును.

——:():——

501. రోహంత మిగ జాతకము

శాస్త వేళువనమున విహారము చేయుచు, ఆయుష్మాన్ ఆనందుని జీవన పరిత్యాగమును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

అతనిజీవన పరిత్యాగకథ క్షుద్ర హంస జాతకమున (533) ధనపాలుని దమనమున వచ్చును. ఈ విధముగా శాస్తకొరకు ఆయుష్మంతుడు ప్రాణ త్యాగము చేసిన పిదప ధర్మసభలో "ఆయుష్మంతులారా, ఆయుష్మాన్ ఆనందుడు శైక్షజ్ఞానము పొంది తథాగతునికొరకు జీవములు విడచినాడు" అనుచుండిరి. శాస్త అచటికి జని, సంగతి తెలిసికొని "భిక్షువులారా, ఇప్పుడే కాదు, ఈతడు పూర్వజన్మమున కూడ నా కొరకు జీవము లర్పించినాడు" అని పూర్వజన్మ కథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు నపుడు ఆయన పట్టపుదేవి క్షేమ. ఆ సమయమున బోధిసత్త్వుడు హిమా లయమున మృగమై పుట్టి, స్వర్ణవర్ణముతో సుందరముగా నుండెను. అతని తమ్ముడు చిత్తమృగము కూడ సువర్ణ వర్ణముతో నుండెను. చెల్లెలు సుతనా మృగము కూడ బంగరువన్నె కలది. బోధిసత్త్వుడు రోహంతనామమున మృగములకు రాజయ్యెను. అతడు హిమాలయములోని పర్వతపంక్తులను లంఘించి రోహంతసరస్సుకడ ఎనుబదివేల మృగములకు నేతయై వృద్ధులు, అంధులు నైన తలిదండ్రులకు సేవలు చేయుచుండెను.

వారాణసికి కొలదిదూరములో నున్న నిషాదగ్రామమున నిషాద పుత్రు డొకడు హిమాలయమున బోధిసత్త్వుని కనుగొని నిజగ్రామమునకు

మరలి వచ్చి కాలక్రమమున తన మరణసయమున కుమారుని పిలిచి "నాయనా, మన కర్మభూమిలో సలానిప్రదేశమున స్వర్ణవర్ణమృగ మున్నది. రాజు ప్రశ్నించినచో ఈ సంగతి చెప్పుము" అని పలికెను.

ఒకనాడు క్షేమాదేవి, తెల్లవారుజామున కల కనెను. స్వర్ణమృగము బంగరుపీఠముపై కూరుచుండి బంగరుమువ్వల నాదమువంటి మధురస్వరమున దేవికి ధర్మోపదేశము చేయుచుండెను. ఆమె సాధు, సాధు అనుచు ఉపదేశము వినుచుండెను. ధర్మకథ సమాప్తము చేయకుండగనే స్వర్ణమృగము లేచి వెడలిపోయెను, ఆమె మృగమును పట్టుకొనుడు అనుచు నిద్ర లేచెను. ఆ కేక విని పరిచారికలు నవ్వుచు 'ద్వారములు, కిటికీలు బాగుగా మూసియున్నవి. గాలి వచ్చుటకు కూడ వీలులేదు. దేవి యిట్టి సమయమున మృగమును పట్టుకొమ్మనుచున్నది.' అది స్వప్నమని తెలిసికొని రాణి తనలో "స్వప్నమని చెప్పినచో రాజుగారు ఆదరింపరు. నాకు కోరిక పుట్టినది అని చెప్పినచో ఆదరించి మృగముకై అన్వేషింతురు. అప్పుడు స్వర్ణమృగము వలన ధర్మకథ వినగలను" అనుకొని ఆరోగ్యము లేని విధముగా నటించుచు పండుకొనెను. రాజు వచ్చి చూచి "భద్రే, నీ కేమి బాధ ?" అని యడిగెను.

"దేవా, మరి యేమియును లేదు. కాని కోరిక ఉత్పన్నమయినది?"

"ఏమికావలెను ?"

"దేవా, స్వర్ణవర్ణమృగము చేయు నుపదేశము వినవలె నని కోరిక."

"భద్రే, లేనిదానిపై నీకు కోరిక పుట్టినది, స్వర్ణవర్ణనామక మగు మృగము లేనే లేదు."

ఆమె రాజువైపు వీపుపెట్టి 'లభింపనిచో నా మరణ మిచ్చుటనే' అనెను. రాజు యోచించి "ఉన్నచో లభించును" అని పలికి, పరిషత్తునకు జని మోర జాతకమున చెప్పినట్లు అమాత్యులను బ్రాహ్మణులను ప్రశ్నించెను. వేటకాండ్రను పిలువనంపి, 'అట్టిమృగ మెవరికైన గనబడినదా' యని యడిగెను. ఆ నిషాదపుత్రుడు తన తండ్రికడ విన్న వాక్కులు వివరింపగా రాజు

"మిత్రమా, నీవు చెప్పినమృగమును గొనివచ్చినచో నీకు మిగుల బహుమానము లభించును. పోయి పట్టుకొని రమ్ము" అని ధన మిచ్చి పంపెను. వాడు "దేవా, నేను దానిని పట్టుకొని రాలేనిచో దాని చర్మము నైన తెత్తును; అదికూడ లభింసనిచో దాని రోమములు తెత్తును. చింతింపవలదు" అని యింటికి బోయి, భార్యాపుత్రులకు ధన మిచ్చి, హిమాలయమునకు వెడలిపోయెను. ఆవల వారు స్వర్ణమృగమును గాంచి, యెచట వల పన్నినచో నది పట్టుపడునో యని యోచింపగా నీరు త్రాగుచోటు మంచి దని తోచి, చర్మముతో దృఢముగా త్రాడల్లి బోధిసత్త్వుడు జలపానము చేయుచోట మేకులతో వల పన్నెను. మరునాడు ఎనుబదివేల మృగములతో పాటు బోధిసత్త్వుడు మేతకై వచ్చి ,నిత్యము నీరు త్రాగుచోట దిగినంతనే ఉచ్చున బడిపోయెను. ఇప్పుడు నే నరచితినేని మృగములు నీరు త్రాగక భయమున బరుగెత్తును, అని తలపోసి నీరు త్రాగుచున్నట్లు నటించుచుండెను. మృగము లన్నియు జలపానము చేసి, పైకి బోయినంతనే, బోధిసత్త్వుడు బంధనము త్రెంచుటకై ముమ్మారు యత్నించెను. తొలిసారి చర్మము పిగిలెను, రెండవమారు మాంసము కోసుకొని పోయెను; మూడవ మారు నరములు పిగికి యెముకలలోనికి బంధనము దిగఁబొచ్చెను. జాలము తెగకపోవుటచే తాను పట్టుబడినట్లు ఆక్రోశించెను. మృగములు మూడు గుంపులై పరుగెత్తినవి. ఆ మూడు గుంపులలో బోధిసత్త్వుడు కనబడ నందున చిత్తామృగము తన సోదరుని యాక్రోశమే యని తలచి యా తావునకు వచ్చి బందెమున నున్న సోదరుని గాంచెను. బోధిసత్త్వుడు "సోదరా, నీ విచ్చట నాగవలదు. ఇది యపాయస్థానము" అని అతనిని బంపివేయుటకై యీ గాథ పలికెను :

ఓయి చిత్తక, మృగయూథంబు మరణ
భీతిచే పరుగెత్తు; వీతశంకముగ
నీవు పో, జీవించు నీ తోడ నివ్వి.

ఇవి వారి సంవాద గాథలు :

నిను విడనాడను నేను రోహంత !
రోహంత, లాగును నా హృదయమ్ము

నేను పోవుట లేదు ని న్విడనాడి—
ఇదె నిజ జీవితం బిచ్చుచున్నాను !

సేవకాభావంబుచే నాదు తల్లి
దండ్రులు మరణింత్రు తప్పకుండంగ
విడు శంక, వారు జీవింత్రు నీతోడ.

ఓయి చిత్తక, మృగయూథంబు మరణ
భీతిచే బరుగెత్తు : వీతశంకముగ
నీవు పో, జీవించు నీతోడ నివ్వి.

అతడు బోధిసత్త్వుని దక్షిణపార్శ్వమున తోడు నిలిచెను. అంతనా మృగము గుంపులలో తన సోదరులను గానక వారి కపాయమొదవి యుండు నని తలచి వెనుదిరిగి వా రున్నచోటికి వచ్చెను. ఆమె వచ్చినంతనే బోధిసత్త్వు డీ గాథ పలికెను :

పట్టువడితి లోహబంధాన నేను—
సత్వరమ్ముగ బొమ్ము శంకలేకుండ,
వా రెల్ల జీవించువారు నీతోడ.

అట్లు పారిపోవుట కామె యంగీకరింపక, వాని వామపార్శ్వమున తోడుగా నిలిచి, ఓదార్చుచుండెను. మృగములు పరుగెత్తుట చూచి స్వర్ణ మృగము పాశమున తగుల్కొనుట గ్రహించి వేటకాడు కాసె బిగించి శస్త్రము ధరించి శీఘ్రముగా నచటకి జేరెను. వానిరాక చూచి బోధి సత్త్వు డీ గాథ పలికెను :

అదె వచ్చు లుబ్ధకు డాయుధసహితు
డై రుద్రరూపాన. నలుగులతోడ
శక్తితో మనలను జంపును నేడు.

వానిని చూచియు చిత్తమృగము పరిగెత్త లేదు, కాని సుతనా మృగము సంబాళించుకొన లేక మరణభీతిచే కొలదిదూరము పరుగిడి, తన

సోదరు లిరువురను విడిచి తా నెచ్చటికి పోగల నని యెంచి ప్రాణములమీది ఆశ విడిచి వచ్చి సోదరుని యెడమవైపున నిలిచెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త ఈ గాథ పలికెను :

భయముచే నించుక పరుగెత్తి మృగము
అవల దుష్కరకార్య మాచరించినది-
నిధనంబు కోసమే నిలిచిపోయినది.

వేటకాడు ఏకగర్భజనితు లైనముువ్వురను ఒకచో గాంచి మైత్రిభావ ముతో "స్వర్ణమృగము పట్టుబడినది. ఈ రెండు మృగములును లజ్జాభయ బంధనముల కట్టువడినవి. ఇతనికి వీ రేమి కావలెను ?" అనుకొని వారి నిట్లు ప్రశ్నించెను :

ఈ మృగమ్ములు నీకు నేమి కావలెను ?
స్వేచ్ఛ కల్గియు బద్ధు జేరి నిల్చినవి
ఆత్మరక్షణకైన యత్నింపకుండ !

బోధిసత్త్వు డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను :

ఓయి లుబ్ధక, వీర లుభయులు నాకు
అగుదురు సోదరు, లాత్మరక్షణము
కైనను నను విడనాడకున్నారు.

విని వేటకాడు సౌమనస్యమున మరింత మెత్తబడెను. చిత్తమృగము వానికోమలత్వము గ్రహించి "మిత్రమా, ఈ స్వర్ణమృగమును కేవలము మృగ మని భావింప వలదు. ఈతడు ఎనుబదివేల మృగములకు ప్రభువు; సదాచారసంపన్నుడు, సమస్తప్రాణులయెడ దయకలవాడు, మహాప్రజ్ఞా వంతుడు. అంధులు, వృద్ధులు నగు తలిదండ్రులను పోషించువాడు. ఇట్టి ధార్మికుని నీవు సంహరించినచో తలిదండ్రులను నన్ను, మా చెల్లెలిని సంహ రించినవాడ వగుదువు. నా సోదరునకు ప్రాణదాన మిమ్ము, మాయయి దుగురకు ప్రాణదాన మిచ్చినవాడ వగుదువు" అని ఈ గాథ పలికెను :

సంరక్షకులు లేక చచ్చిపోవుదురు
అంధులు, సోదరు బంధవిముక్తు
జేసి యిద్దఱ రక్షింపుము బోయ !

వేటకాడు ఆ ధర్మకథనము విని ప్రసన్నచిత్తుడై "స్వామీ, భయపడ వలదు" అని ఈ గాథ పలికెను :

జననీజనకరక్ష చేయు మృగంబు
విడిచెద, బంధంబు విడిపోవు తెరిగి
హర్ష మొందును గాక అంధజనమ్ము !

"రాజు నాకిచ్చుసంపద యెందులకు ? ఈ స్వర్ణమృగమును సంహరించితినేని నా పాదముల క్రింద భూమి బ్రద్దలగును, నెత్తిపై పిడుగైన పడును. ఈ మృగమును విడిచి పెట్టుదును" అనుకొని వేటకాడు బోధిసత్త్వుని సమీపించి మేకులు లాగి చర్మపుత్రాడు కోసెను; పిదప స్వర్ణమృగమును లేవనెత్తి నీటికడకు కొనిపోయి పరుండబెట్టి బంధము విప్పి నరములు నిమిరి నీటితో రక్తము కడిగి మైత్రితో మాటిమాటికిని శరీరము నిమిరెను. వాని మైత్రీభావము చేతను బోధిసత్త్వుని పారమితాప్రభావము చేతను నరములు, మాంసము, చర్మము బాగుపడినవి. పాదమున రోమములు క్రమ్ముకొన్నవి. ఆ తావున కట్టుగీటుకూడ లేకుండ పోయి కాంతి యొదవెను. కాంచి చిత్తమృగము ప్రసన్నమై వేటకాని ననుమోదించు నదై ఈ గాథ పలికెను :

ఈ మహామృగము నే నీక్షించి నేడు
సంతసించెడిరీతి జ్ఞాతులం గూడి
నీవు పొందెదవోయి, నిండుహర్షమ్ము.

అప్పుడు బోధిసత్త్వుడు తనలో "ఈ వేటకాడు నన్ను బంధించుట తన కొరకా, అన్యుని యాదేశమువలననా?" అనుకొని వాని నీ విషయమై ప్రశ్నించెను. "స్వామీ, నాకు మీతో ప్రయోజనము లేదు. రాజుగారి పట్టపురాణి క్షేమాదేవి మీవలన ధర్మప్రసంగము వినగోరుచున్నది. ఆమె కొరకు రాజాజ్ఞవలన మిమ్ము పట్టినాను" అని చెప్పెను.

"మిత్రమా. యిట్లగుచో నన్ను విముక్తిని చేసి గొప్పకార్యము చేసితివి. రమ్ము, నన్ను రాజసన్నిధికి కొనిపొమ్ము దేవికి ధర్మోపదేశమిత్తును."

"స్వామీ, రాజులు కఠోరచిత్తులు. ఏమగునో యెవరు చెప్ప గలరు? రాజొసగు సంపదతో నాకు పనిలేదు. మీరు యథాసుఖముగా పొండు."

బోధిసత్త్వుడు తనలో "వేటకాడు నన్ను విడిచి పెట్టుట ఘనకార్యము. ఈతని కైశ్వర్యము లభించు నుపాయము చూచెదను" అనుకొని "మిత్రమా, నా వీపు నీ చేతితో నిమురుము" అని పలికెను. ఆత డట్లే చేయగా, చేతి నిండుగా బంగరురోమములు లభించెను. "స్వామీ, ఈ రోమను లేమి చేయుదును?"

"ఈ రోమములు కొనిపోయి, యివి స్వర్ణమృగరోమములు అని చెప్పి రాజునకు దేవికిని చూపి నా బదులచట నీవు నిలిచి ఈ గాథలతో దేవికి ధర్మోపదేశము చేయుము. వినినంతనే ఆమె కోరిక తీరును."

వేటకాడు "ధమ్మం చర మహారాజా" ఇత్యాది దశధర్మాచరణ గాథలు నేర్చికొని, పంచశీలములు పొంది అప్రమత్తుడై యుండుటకు ఉపదేశము పొంది సెలవు తీసికొనెను. వ్యాధకుమారుడు బోధిసత్త్వుని ఆచార్యునిగా స్వీకరించి ముమ్మారు ప్రదక్షిణము చేసి, నాలుగుతావుల నమస్కరించి, స్వర్ణకేశములను కమలపత్రమున నిడుకొని బయలుదేరెను. ఆ మూడు మృగములును కొలదిదూరము వానివెంట నరిగి మేత మేసి నీరు త్రాగి తలితండ్రులకడ కరిగినవి. తలిదండ్రులు "నాయనా, రోహంతా, నీవు బందెమున బడితివి గదా, యెట్లు విముక్తుడవైతివి" అని యడుగువారై ఈ గాథ పలికిరి :

దరిసితి మృత్యుసన్నిధి తండ్రి, యెట్లు
లబ్ధమయ్యె విముక్తి? ఆ లుబ్ధకుండు
ఎట్లు కూటబంధంబు తప్పించినాడు ?

విని బోధిసత్త్వుడు ఈ గాథలు పలికెను :

ఇచ్ఛి కర్ణసుఖంబు హృదయోద్భవంబు
హృదయంగమం బైన మృదుభాషణమ్ము
లాడి, చిత్తకుడు నన్ వీడి చన్నాడు.

ఇచ్ఛి కర్ణసుఖంబు హృదయోద్భవంబు
హృదయంగమం బైన మృదుభాషణమ్ము
లాడుచు సుతను నన్ వీడిపోయినది.

ఇచ్ఛి కర్ణసుఖంబు హృదయోద్భవంబు
హృదయంగమం బైన మృదుభాషణమ్ము
విని లుబ్ధకుడు నన్ను వీడి చన్నాడు.

తలిదండ్రు లనుమోదించుచు ఈ గాథ పలికిరి :

వేంచేయు రోహంతు వీక్షించి మేము
సంతసించెడురీతి జ్ఞాతులతోడ
వ్యాధుండు సంతోష మందును గాక !

వేటకాడు అడవి వెలువడి రాజకులము చేరి, రాజుకు ప్రణమిల్లి ఒక ప్రక్క నిలిచెను. వానిని చూచి రా జిట్లనెను :

కొనివత్తు మృగచర్మ మనలేద వ్యాధ ?
మరి, కొనిరావు చర్మమ్ము నెందులకు ?

వేటకా డిట్లనెను :

చిక్కిపోయినది నా చేతిలో మృగము
పట్టుపడ్డది కూటబంధంబునందు.
బంధములో నున్న ప్రభునిపార్శ్వంబు
చేరి నిలబడినవి స్వేచ్ఛమృగాలు.
వీక్షించినంత సంవేగమ్ము కలిగె,
పొటమరించెను మేను; పోవు ప్రాణమ్ము
లనిపించె మృగమును దునిమెదునెడల.

ఆశ్చర్యముతో రాజు మాటిమాటికి నిట్లడుగసాగెను :

మృగములన్ మిక్కిలి మెచ్చుకొన్నావు,
వానివర్ణంబులు వానిధర్మములు
వానిశీలము లెట్టివో నిరూపించు !

వేటకాడు బోధిసత్త్వుని స్వర్ణకేశములు రాజుహస్తమున నుంచి ఆ మృగశరీరవర్ణమును ప్రకటీకరించుచు నిట్లనెను :

శ్వేతశృగంబులు శ్వేతరోమములు
చంద్రసమం బైన చర్మంబు, శోణ
చరణముల్, మంజులచక్షువుల్ కలవి
ఆ మృగమ్ములు దేవ ! అట్టివి ! మిగుల
ధర్మము పాలించి, తల్లిదండ్రులను
రక్షించుచుండు కారణమున నేను
తేలేదు వానిని దేవ, యిచ్చుటకి,

ఇట్లు వాడు బోధిసత్త్వ, చిత్తమృగ, సుతవామృగీ గుణవర్ణనము కావించి "మహారాజా, ఆ స్వర్ణమృగము తన కాంచనకేశములు నాకిచ్చి, బదులుగా దేవికి ధర్మాచరణగాథ లుపదేశింపవలె నని ఆజ్ఞ యయినది" అని స్వర్ణపీఠముపై గూరుచుండి, యీ గాథలు పలికెను. కోరిక నెరవేరి, దేవి శాంతించెను. రాజు ప్రసన్నుడై, వ్యాధకుమారునకు బహుధన మొసగు వాడై యీ గాథలు పలికెను :

నీకు లుబ్ధక! శతనిష్కంబు లిత్తు,
మరి, యమూల్యము లైన మణికుండలములు
ఉమ్మపుష్పాభతో నొప్పుచు నాల్గు
పాదాలు కలిగిన పర్యంక మిత్తు.

సరిసమానం బైన జాయాద్వయంబు
వందగోవులు, బలీవర్దముల్ వంద
ఇచ్చెద : ఉపకృతి యెంతో చేసితివి.

పాపకర్మంబు లీపైన చేయకయె
కృషియొ, వాణిజ్యంబో, ఋణదాన, ముంఛ
చర్య, గుటుంబపోషణ చేసికొమ్ము.

వాడు రాజువాక్కులు విని "దేవా, నేను గృహస్థుగా నున్న లాభము లేదు. ప్రవ్రజింతును. ఆజ్ఞ యొసగుడు" అని అనుమతి వడసి రా జిచ్చినధనము కొనిపోయి భార్యాపుత్రుల కొసగి హిమాలయమునకు జని ఋషి ప్రవ్రజ్య స్వీకరించి అష్టసమాపత్తులు పొంది తుదకు బ్రహ్మలోకగామి యయ్యెను. రాజు బోధిసత్త్వుని యుపదేశానుసారముగా ప్రవర్తించుచు తుదకు స్వర్గగామి యయ్యెను.

శాస్త ఈ ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ఆనందుడు పూర్వము కూడ నా కొరకు జీవనపరిత్యాగము చేసినాడు" అని జాతకములు సరి పోల్చెను. ఆ కాలమున వేటకాడు ఛన్నుడు; రాజు సారిపుత్రుడు; దేవి ఖేమాభిక్కుని; తలిదండ్రులు మహారాజకులమువారు; సుతన ఉత్పలవర్ణ; చిత్తమృగము ఆనందుడు; ఎనుబవేల మృగసమూహము శాక్యగణము; రోహంతమృగము నేనే.

———:():———

502. హంస జాతకము

శాస్త్ర వేళువనమున విహరించుచు, ఆనందస్థవిరుని జీవనపరిత్యాగమును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున ధర్మసభలో స్థవిరుని గుణములను గూర్చి చర్చ జరుగుచుండెను. శాస్త యచటికి జేరి "భిక్షువులారా, ఇప్పుడే కాదు, పూర్వము కూడ ఆనందుడు జీవనత్యాగము చేసెను" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బహుపుత్రకు డను రాజు పరిపాలన చేయుచుండగా ఖేమ ఆయనకు పట్టపుదేవిగా నుండెను. ఆ సమయమున బోధిసత్త్వుడు స్వర్ణహంస కడుపున బుట్టి, తొమ్మిదివేల హంసలకు నేతయై చిత్రకూటమున నివసించుచుండెను. ఉక్తప్రకారము దేవి కల గాంచి, స్వర్ణ హంసమువలన ధర్మోపదేశము వినవలెనను కుతూహలము రాజుకు తెలిపెను. రాజు ప్రయత్నింపగా స్వర్ణహంసము చిత్రకూటపర్వతమున నున్నట్లు తెలిసెను. రాజు ఖేమ యను సరోవరము నిర్మించి, అచ్చట వివిధ ధాన్యబీజములు చల్లించెను; ప్రతిదినము నలుమూలల అభయఘోషణ చేయించెను. హంసలను పట్టుకొమ్మని వేటకాని కానతి యయ్యెను. తక్కిన విషయములన్నియు మహాహంస జాతకమున (534) వచ్చును. ఇందుగూడ బోధిసత్త్వుడు మేకులు దింపిన వలలో జిక్కుకొని, మెడసారించి, హంసలుపోయిన వైపు చూచెను. హంససేనాపతి సుముఖుడు వచ్చి కానబడినంతనే యతనిని పరీక్షించుటకై బోధిసత్త్వుడీగాథలు పలికెను :

పారిపోవును హంసలు భయవశాన
వక్రతనువులు. హే హేమవర్ణ, హరిత
చర్మ, తల పున్న నీవును చనుము సుముఖ !

నాదు జ్ఞాతిజనంబు బంధమున నున్న
ఒంటివారిని యోచింప కుజ్జగించి
ఎగిరి చనె, నీ వొక్కడ వేల పోవు ?

మే లగుం జారిపోవుచో, జాలమందు
సుముఖ, తోడ్పాటు దొరకదు, సుఖముకొరకు
జతనమున్ మాన కెగిరి పో సత్వరముగ.

అప్పుడు సుముఖుడు పంకముపై గూరుచుండి యీ గాథ పలికెను :

నే విడనాడను నిన్ ధృతరాష్ట్ర !
దుఃఖాన నున్న నీ తోడనే సాగు
మజ్జీవితము కాని, మరణమ్ము కాని.

సుముఖు డిట్లు సింహనాదము చేసినపిదప, ధృతరాష్ట్ర డిట్లనెను :

ఇపుడు నీ వన్నవి యెల్ల ఆర్యునకు
శుభదాయకం బగు సుముఖ, పొమ్మనుచు
నే నన్నమాటలు నిను పరీక్షింప.

ఈ విధముగా వారు సంభాషించుచుండ వేటకాని కొమరుడు కర్ర పట్టుకొని వచ్చెను. సుముఖుడు ధృతరాష్ట్రు నోదార్చి, వేటకానియెదుటకు పోయి, ఆదరము ప్రకటించి, హంసరాజు గుణములను వివరించెను. తోడనే వానిమనసు మెత్తపడెను. ఇది గ్రహించి సుముఖుడు హంసరాజునెదుటకు పోయి నిలిచెను. వేటకాడు కూడ హంసరాజుకడకు బోయి యీ గాథ పలికెను:

పదములు లేకుండ పయనించునట్లు
పక్షు లాకాశాన పారుచునుండు
అవుదు హంసశ్రేష్ఠుడవు నీవు, కాని
అరయ లేదా దూరమందుండి వలను ?

బోధిసత్త్వుడి ట్లనియె :

జీవిత సంశయస్థితియందు జనుడు
అవనతి కల్గిన నరయంగ జాల
డాసన్నపాశ జాలాదికంబులను !

హంసరాజువాక్కుల నభినందించి కిరాతుడు సుముఖునితో సంభాషించువాడై యీ గాథలు పలికెను :

పారిపోవును హంసలు భయవశాన
వక్రతనువులు- హేహేమవర్ణ, హారిత
చర్మ, నిలిచితి వొకడవే చనకయిచట.

పక్షు లన్నియు తిని, త్రాగి పరుగువారె
నీవు యోజింప కన్యము, నిలిచినావు !

ఈ విహంగము నీకు నేమి కావలెను ?
పులుగు లన్నియు వీడిపోవుచునున్న,
స్వేచ్ఛ పొందియు రుద్ధుచెంత నిల్చితివి ?

సుముఖు డిట్లనెను :

అస్మదాదుల రాజు హంసమ్ము, ప్రాణ
మిత్రమ్ము, సఖుడు, నామేని ప్రాణములు
విడువనందాక నే వీడ నీతనిని.

విని కిరాతుడు ప్రసన్నచిత్తుడై తనలో "ఇట్టి శీలవంతుని విషయమున పాపము తలపెట్టినయెడల నన్ను భూదేవి కబళించును. రాజువలన వచ్చు ధనము నా కేల ? ఈయనను విడిచిపెట్టెదను" అనుకొని ఈ గాథ పలికెను :

ఈతడు సఖుడైన హేతువుచేత
త్యజియింప జీవముల్ తలపెట్టినావు !
విడుతు నీ సఖు, వచ్చు వెంట నీతండు.

ఇట్లు పలికి ధృతరాష్ట్రుని వలలోనుండి లేవనెత్తి, కరుణతో నీటి యొద్దునకు గొనిపోయి, రక్తము కడిగి, నరములు సరిచేసెను. పారమితా ప్రభావముచే హంసపాదములపై చర్మము చక్కబడెను. కట్టువడిన తావున గురుతు లేకుండ పోయెను. సుముఖుడు బోధిసత్త్వుని గాంచి, ప్రసన్న చిత్తముతో అనుమోదనము చేయువాడై యీ గాథ పలికెను :

బంధన ముక్తుడౌ ప్రభువును గాంచి
హంస లన్నియు నేడు హర్షమ్ము నొందు
కరణిని లుబ్ధకా, జ్ఞాతులం గూడి
నీ వందెదవు గాక నిండుముదమ్ము !

విని వేటకాడు "స్వామీ, దయచేయుడు" అనెను. బోధిసత్త్వుడు "మిత్రమా, నీకొరకా, కాక అన్యులయానతి చొప్పుననా వల పన్నినావు?" అని యతని నడిగెను. వాడు జరిగిన సంగతి చెప్పగా బోధిసత్త్వుడు తనలో "నేను చిత్రకూటమునకు బోవుట మంచిదా, నగరమున కరుగుట మంచిదా? నగరమున కేగినచో వ్యాధకుమారునకు ధనము లభించును, దేవికోరిక తీరును, సుముఖుని మిత్రధర్మము ప్రకట మగును. నేను జ్ఞానబలముచే ఖేమ సరోవర ప్రాంతమును భయవిముక్తము చేయవచ్చును. కావున నగరము నకే పోవుట మంచిది" అని నిర్ణయించుకొని "వ్యాధకుమారా, మమ్ము కావడిలో పెట్టుకొని రాజసన్నిధికి గొనిపొమ్ము. ఇచ్ఛ వచ్చినచో రాజు మమ్ము విడుచును" అని చెప్పెను.

"స్వామీ, రాజులు కఠినస్వభావులు. మీ రచటికి పోవలదు."

"మిత్రమా మమ్ము జూచి నీవంటివాడు మెత్తబడినాడు. రాజును ప్రసన్నుని జేయుట కష్టమా? కావున మమ్మచటికే కొనిపొమ్ము."

ఆత డట్లే చేసెను. రెండు హంసలను జూచి నంతనే రాజు ప్రసన్న చిత్తుడై వానిని బంగరుపీటలపై గూరుచుండ బెట్టి మధురక్షీర మిచ్చి మధురజలము త్రాగించెను. అవల చేతులు జోడించి ధర్మోపదేశముకొరకు ప్రార్థించెను. హంసరాజు తొలుత కుశలప్రశ్న మడిగెను. ఇవి వారి ప్రశ్నోత్తరములు :

"కుశలమా ! మీకు ? లోకులకును సుఖమె ?
ధర్మపాలితమె విస్తారరాష్ట్రంబు ?"

"కుశలమే నాకు, లోకులకును సుఖమె
ధర్మపాలితమె విస్తారరాష్ట్రంబు."

"ద్రోహి లేడొక్కొ యమాత్యులయందు నొకడు?
దక్షిణచ్ఛాయావిధంబున నీదు
వైరులు దూరమై వర్ధిలకుండ్రె?"

"ద్రోహియే లే డమాత్యులయందు నొకడు;
దక్షిణచ్ఛాయా విధంబున నాదు
వైరులు దూరమై వర్ధిల్లకుండ్రు."

"నీకు సమానయే నీ భార్య రూప
వతి, పుత్రవతి, ప్రియభాషిణి యగునె?
అనుసరించునె ప్రీతి నాదేశములను?"

"నాకు సమానయే నా భార్య రూప
వతి, పుత్రవతి, ప్రియభాషిణి యగును:
అనుసరించును ప్రీతి నాదేశములను."

"బహుపుత్రు లున్నారె? ప్రజ్ఞలు కలిగి
శాంతముగా నెట్లొ చరియించువారు?"

"నా తనూజాతులున్నారు నూరుగురు:
వారి కర్తవ్యమ్ము వచియింతురేని
వ్యతిరేకముగ నీకు వర్తింపబోరు."

బోధిసత్త్వుడు రాజునకుపదేశమిచ్చువాడై ఈ గాథలు పలికెను:

జాతియు వినయంబు సంభృతం బైన,
వార్ధకంబున యత్నవంతు డౌ వాడు
ఆపత్తిలోన తథ్యమ్ముగా మున్గు.

అస్థిరచిత్తున కగు నుపద్రవము-
బాగుగా రాత్ర్యంధరోగి యౌవాడు
సూక్ష్మవస్తువులను చూడలేనట్లు
తెలియంగనేర దస్థిరుడు సూక్ష్మముల.

సారవంతమును నిస్సారమౌదాని
తలపోయు నెవ్వ డాతని బుద్ధిజారు,
దుర్గమం బగు కొండత్రోవను బోవు
శరభంబు నడుమనే ద్రస్త మౌనట్లు.

హీనజన్ముం డగు మానవుం డయ్యు
ఉత్సాహధృతులతో నొప్పునయేని
ఆచారగుణవంతు డైన సిమ్మటను
రాత్రివహ్నివిధాన రాజిల్లుచుండు.

ఈ యుపమానంబు లెల్ల గ్రహించి
పుత్రులకున్ విద్య బోధింపవలయు.
పెరిగెడు రీతిని బీజముల్ వాన
కారున, మేధావి కడువృద్ధి నొందు.

ఈ విధముగా బోధిసత్త్వుడు రాత్రి యంతయు ధర్మోపదేశము చేయుచుండెను. దేవికోరిక శాంతించెను. అరుణోదయముననే రాజును ప్రతిష్ఠిత శీలుని జేసి, అప్రమత్తుడవై యుండు మని యుపదేశ మిచ్చి, బోధిసత్త్వుడు సుముఖుని వెంటబెట్టుకొని ద్వారమువెంట నీవలకు వచ్చి, చిత్రకూటమునకు జనెను.

శాస్త యిట్లు ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, పూర్వజన్మమున గూడ నీతడు ప్రాణపరిత్యాగము చేసెను" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున వ్యాధుడు ఛన్నుడు, రాజు సారిపుత్రుడు, దేవి క్షేమాభిక్షుణి, హంసపరిషత్తు శాక్యగణము, సుముఖుడు ఆనందుడు, హంసరాజు నేనే.

503. సత్తిగుంబ జాతకము

శాస్త్ర ముద్దకుచ్చిలో మృగప్రదాయమున దేవదత్తుని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

దేవదత్తుడు శిలాఖండమును దొరలించిన పిదప పెంచిక యెగిరి భగవానుని పాదమున గ్రుచ్చుకొనెను. దానివలన చాలబాధ కలిగెను. చూడవచ్చిన భిక్షువులు గుమిగూడిరి. చూచి భగవానుడు "భిక్షువులారా, ఇచట శయనాసనములకు సౌకర్యము లేదు. గుంపు చేరినది, నన్ను మేనాలో ముద్దకుచ్చికి గొనిపొండు" అనెను. వారు చెప్పినట్లు చేసిరి. జీవకుడు తథాగతుని పాదము నయము చేసెను. భిక్షువులు శాస్త్రసన్నిధిని గూరుచుండగనే ప్రసంగము ప్రారంభ మాయెను. "ఆయుష్మంతులారా, దేవదత్తుడు స్వయముగా దుష్టుడు; అతని సంఘము కూడ దుష్టము. ఈ విధముగా నతడు దుష్టులతో గలిసి తిరుగువాడు" అనుచుండిరి. శాస్త్ర విషయము తెలిసికొని, "భిక్షువులారా, దేవదత్తు డిప్పుడేకాదు. పూర్వముకూడ దుష్టు; అతని సంఘముకూడ దుష్టము" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున పాంచాలనామక ప్రభువు ఉత్తరపాంచాల నగరమున రాజ్యము చేయుచుండెను. ఆ సమయమున బోధిసత్త్వుడు అరణ్యములో పర్వతముపై సేమరవృక్షమున శుకరాజపుత్రుడై పుట్టెను. అతనికి సోదరు డుండెను. ఆ పర్వతోపరిభాగమున ఐదువందలమంది చోరులకు నివాసస్థాన మైన గ్రామ ముండెను. క్రిందివైపున 500 మంది ఋషులకు నివాసస్థాన మగు ఆశ్రమ ముండెను. ఆ శుకశాబకములు బయటి కెగురువేళ సుడిగాలి చెలరేగినది. ఆయాఘాతమువలన ఒక చిలుకపిల్ల చోరగ్రామమున పడెను. శస్త్రములనడుమ పడుటచే దానికి గుంబశుక మని పేరు వచ్చెను. రెండవ చిలుక ఆశ్రమములో పుష్పముల నడుమ పడుటచే పుష్పకశుక మని

పేరు వచ్చెను. శక్తిగుంబశుకము చోరులనడుమను పుష్పకశుకము ఋషుల నడుమను పెరుగుచుండెను.

ఒకనాడు రాజు సర్వాలంకార భూషితుడై ఉత్తమరథ మెక్కి చాల మంది పరిజనులతో వేటకై బయలువెడలి నగరమునకు కొలదిదూరముననే ఉన్న పుష్పఫల రమణీయ వనములోనికి బోయి "ఎవని ప్రక్కగా మృగము పారిపోవునో వానిదే బాధ్యత" అని రథము దిగి, తనకొరకు నిర్ణయించి యున్నమాటున ధనుర్ధరుడై నిలువబడెను. జంతువులను లేపుటకై జనులు కోలాహలము చేసినప్పుడు ఒకానొకమృగము పారిపోవుటకు దారి లేక రాజు నిలిచియున్నతావున కొంచెము సందు దొరకుటచే నెగిరిదుమికి పరుగెత్తి పోయెను. ఎవరిప్రక్కగా మృగము పరుగిడినది అని అమాత్యులు పరిశీలింపగా రాజు ప్రక్కనుండి పోయిన దని తెలిసికొని నవ్వసాగిరి. అభిమానవంతు డగుటచే రాజు సహింపలేక, ఇప్పుడే ఆ మృగమును పట్టెద నని రథ మెక్కి శీఘ్రముగా నడుపు మని ఆనతిచ్చి మృగము వెంటనంటెను. అరదము శీఘ్ర ముగా పరుగిడుచుండుటచే పరిజనులు వెనుకబడిపోయిరి.

సారథిసమేతుడై రాజు మధ్యాహ్నమువరకును పోవుచుండెను. మృగము కానబడకుండ పోయినంతనే రథ మాపి, రమణీయకందరము కన బడగా అరద మటు పోనిచ్చి ఆగెను. అది చోరగ్రామమునకు సమీపమున నున్నది. రాజు క్రిందికి బోయి స్నానము చేసి నీరు త్రాగి పైకి వచ్చి, సారథి రథకంబళము తీసి వృక్షచ్ఛాయలో పరవగా దానిపై పండుకొనెను. సారథి ప్రక్కన కూరుచుండి రాజుపాదములు పట్టుచుండెను. రాజుకు నడుమ నడుమ నిద్ర పట్టుచు మెలకువ వచ్చుచుండెను. చోరులు అడవిలోకి పోయిరి. చోరగ్రామమున శక్తిగుంబశుకము, వంట చేయు పటికోలంబుడు మాత్రము మిగిలిరి. సత్తిగుంబుడు గ్రామము వెడలి రాజును చూచినంతనే "ఈతడు నిద్రించుచున్నపుడే ఇతనిని సంహరించి ఆభరణములు గైకొందును" అను కొని పటికోలంబునితో ఈ విషయము చెప్పెను.

ఈ విషయము ప్రకాశింప జేయుటకై శాస్త్ర యీ గాథలు పలికెను:

ఆఖేటలోలుపుం డైన పాంచాల
రాజు సైన్యముతో నరణ్యంబు జొచ్చి
త్రిమ్మరి యొంటిగా దిగబడిపోయె.

చోరకుటీరంబు జూచె, నందుండి
వెలువడి కటువుగా చిలుక యిట్లనియె :
పగటివేళను సూర్యుపగిది వెల్గొందు
రౌతు, వయస్థుడు, రక్తవర్ణంపు
తలపాగ, కుండలాల్ తాల్చినవాడు.

ప్రభువు సారథియును పండుకొన్నారు
మధ్యాహ్నవేళను : మనము వీరలను
ఆక్రమించి, గ్రహింత మాభరణాలు.

శూన్యంబు రాత్రిరిచొప్పున నిపుడు,
శయనించియున్నారు సారథి, రాజు
వధియించి, హరియించి వస్త్రముల్ కుండ
లమ్ములు, కప్పుము కొమ్మలతోడ.

ఈవలకు వచ్చి చూడగా రాజని తెలిసెను. అతడు తోడనే భయముతో నిట్లు పలికెను :

ఓ సత్తిగుంబ, నీ వున్మత్తువలెను
పలికెదు; జ్వలదగ్నిపార్శ్వముకైన,
జనపతినికటమైనను చేరలేదు !

శుక మాయనతో నిట్లు పలికెను :

ఓ వటికోలంబ, ఉన్మత్తువలెను
గర్జించితివి తొల్త ! కాని నగ్నముగ
ఇప్పు డున్నది తల్లి; ఏవగింపుదువె ?

రాజు కన్నులు తెరచెను. శుక మాతనితో మనుష్యవాక్కున సంభాషించుచుండుట గ్రహించి, అది అపాయస్థాన మని యెంచి, సారథిని లేపి, యిట్లు పలికెను :

సత్వరమ్ముగ లెమ్ము, సారథీ, బండి
కట్టుము; నచ్చ దీపిట్ట : వేగముగ
వేరొకచోటికి వెడలిపోవుదము.

అతడు శీఘ్రముగా లేచి, రథ మాయత్త పరచి యిట్లు పలికెను :

జతచేసినాడను శకటిహయాలు,
బండి యెక్కుడు మహాప్రభు, శీఘ్రముగను
వేరొకచోటికి వెడలిపోవుదము.

రాజు రథ మెక్కగానే సైంధవములు వాయువేగమున పరుగెత్తెను. రథము పోవుచుండుట చూచి సత్తిగుంబశుకము విభ్రాంతి చెంది, యిట్లు పలికెను :

ఎచటి కేగినవార లీయాశ్రమమున
వసియించు నాదుసేవకులు ? పాంచాల
భూపతి పయనించి పోయినవాడు
కనుచూపుమేరలో కానరాకుండ.

చాత, తోమరములు, శక్తులు కొండు :
విడవరా దతడు జీవించియుండంగ.

ఈ ప్రకారముగా శుక మిటు నటు పరుగెత్తుచు అరచుచుండగా రాజు ఋష్యాశ్రమము చేరెను. ఆ సమయమున ఋషులు కందమూలఫలములు తేబోయిరి. పుప్పకశుకము మాత్ర మాశ్రమమున నుండెను. రాజును చూచి శుకము మందరికి పోయి, స్వాగతము పలికెను.

ఈ యర్థమును ప్రకటీకరించుటకై శాస్త యీ గాథలు పలికెను :

శోణచంచువు కల్గు శుకము వీక్షించి
సంతుష్టచిత్తాన స్వాగతం బనుచు,
మేలు మహారాజ, మీర లిచ్చటికి
నరుదేర 'ఈశ్వరు' లందరి కిచట

తిందుకపుటములో తీయనిపండ్లు
గాలించి తిందువు గాని రాజేంద్ర !
శిఖరి కందరములో శీతలజలము
గ్రోలంగ వచ్చును కోరినయెడల.

ఆశ్రమసేవకు లడవికి జనిరి
కందమూలఫలాలకై ; స్వీకరింపు
మీవె, నాకు కరాలు లేవు కావునను.

స్వాగతమునకు ప్రసన్నుడై రాజు ఈ గాథలు పలికెను :

ఎంతయు ధార్మికం బీవిహంగమ్ము;
పల్కిన దెన్నియో పరుషవాక్యములు
పూర్వస్థలంబున పులుగు; కావునను
అరుగుదెంచితి నిట కచ్చోటినుండి.

రాజువాక్కులు విని పుష్పశుకము ఈ గాథలు పలికెను :

ఉభయులముగూడ నొకమాతృగర్భ
జాతుల, మొక్కవృక్షముమీద పెరిగి
నార, మిర్వురము నానావిధక్షేత్ర
సీమల మేత మేసితిమి! సోదరుడు
సత్తిగుంబడు చోరజనముల గూడె.
ఇటకు వచ్చితి నేను ఋషులసన్నిధికి :
నిజధర్మమును వాడు నెరపుచునుండు.

అంతట ఆ ధర్మమును వ్యాఖ్యానించుచు ఈ గాథలు పలికెను :

వధలు, బంధనములు, వంచనమ్ములును
మోసముల్, గ్రామసంత్రాసనమ్ములును
నేర్పుటయే వాని నిత్యధర్మమ్ము.

ఆసనం బతిధికి వేసెడివాడు
సలిల మిచ్చెడివారు సాకిరి నన్ను.

సంయమాహింసలు సత్యంబు ధర్మ
మెసగును భారత, ఈ యాశ్రమమున.

రాజుకు ధర్మోపదేశము చేయునదై యీ గాథలు పలికెను :

ఎట్టిసంగతి కల్గ అట్టివా డగును,
సత్పురుషుం జేర సజ్జనుం డగును
దుర్జనుం జేరిన దుష్టు డౌ నరుడు.

జను డెట్టివానితో సఖ్యంబు చేయు
అట్టివాడుగ మార్పు నందుట నిజము.

దుర్విషదిగ్ధంబు తూణీర మెల్ల
కలుషితం బొనరించు కరణిని దుష్ట
సేవ్యుండు చెరచును సేవించువారి.

కా దగు ధీరుండు : కాలుష్యభీతి
పాపిసంగతి యొనర్పండు మానవుడు
క్రుళ్ళిన మత్స్యంబు కుశలలో జిక్కి
వ్యాపించునట్టి దుర్వాసనవోలె
కుజనసంసర్గ జుగుప్సాకరంబు.

తగరు పలాశపత్రమునందు బెట్ట
పర్ణంబు పరిమళ భరిత మైనట్లు
ఉత్తమసంసర్గ మొప్పారుచుండు.

కావున భేదంబు గ్రహియించి నరుడు
సజ్జనసంగతి సలుపగా వలయు,
సజ్జనసంగతి స్వర్గదాయకము,
దుర్జనసంగతి దుఃఖదాయకము.

ధర్మోపదేశము విని రాజు ప్రసన్నచిత్తుడాయెను. ఇంతలో ఋషులరుదెంచిరి. రాజు వారికి ప్రణామము చేసి "పూజ్యులారా, నన్ననుగ్రహించి, నే నుండుతావునకు దయచేయుడు" అని ప్రార్థించి, వారి వాగ్దానము పొంది, నిజనగరమున కరిగి, శుకములను విడిచిపుచ్చెను.

ఋషులుకూడ నగరమున కరిగిరి. రాజు వారి నుద్యానమున దింపి, యావజ్జీవము సపర్యలు చేయించి తుదకు స్వర్గగామి యయ్యెను. ఛత్రము ధరించిన పిదప ఆయన పుత్రుడు కూడ వారికి సేవలు చేసెను. ఆ వంశపరంపరలో ఏడుగురు రాజులు దానధర్మములు చేసిరి. బోధిసత్త్వు డరణ్యావాసము చేయుచు, తుదకు కర్మానుసారముగా పరలోకమునకు జనెను.

శాస్త ఈ ధర్మోపదేశము చేసి "భిక్షువులారా, ఈ ప్రకారముగా పూర్వముకూడ దేవదత్తుడు దుష్టుడు; అతని సంఘముకూడ దుష్టము" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున సత్తిగుంబశుకము దేవదత్తుడు; చోరులు దేవదత్తుని సంఘము; రాజు ఆనందుడు; ఋషిగణము బుద్ధపరిషత్తు; పుష్పకశుకము నేనే.

504. భల్లాటియ జాతకము

శాస్త జేతవనమున విహరించుచు మల్లికాదేవిని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

శయనవిషయమై యామె యొకనాడు రాజుతో జగడ మాడెను. కోపమున రాజు ఆమెపైపునుండి ముఖము వెనుకకు త్రిప్పుకొనెను. (పెడ మొగము పెట్టెను). రాజు నాయెడ కోపము పూనినాడనుసంగతి శాస్తకు తెలియదా అని యామె అనుకొనెను. ఈ విషయము గ్రహించిన శాస్త మరునాడు నిజసంఘముతో భిక్షాటనము చేసి వచ్చినపిదప రాజద్వారము చేరెను. రాజు స్వాగతము పలికి భిక్షాపాత్రము చేత నందుకొని, ప్రాసాదము నకు గొనిపోయెను. భిక్షువులను వరుసగా గూరుచుండ బెట్టి శ్రేష్ఠభోజనము పెట్టించెను. వారిభోజనానంతరము తా నొకప్రక్క గూరుచుండెను "మహా రాజా, వార్త లేమి? మల్లికాదేవి కానబడదేల?" అని శాస్త యనెను. "నిజసుఖమున మైమరచుటచే" అని రాజు పలికెను. "మహారాజా, పూర్వ జన్మములో నీవు కిన్నరగర్భమున బుట్టి, ఒకరాత్రి నీ భార్య విడిగా నుండు టచే ఏడుసంవత్సరములపాటు వ్యధ చెంది దుఃఖంచుచుండ లేదా?" అని, శాస్త రాజుప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలము వారాణసిలో భల్లాటియ నామక ప్రభువు రాజ్యము చేయుచుండగా, అంగారముపై నుడకబెట్టిన మృగమాంసము తినవలె నని యొకనాడు కోరిక కలిగెను. రాజు ప్రభుత్వ మమాత్యుల చేతులలో బెట్టి, పంచాయుధములు ధరించి, సుశిక్షితము లైన జాతికుక్కలను వెంటగొనెను. నగరము విడిచి యాతడు క్రమముగా హిమాలయము చేరి, గంగాతీరము వెంట బోవసాగెను. ఆవల పైకి బోవజాలక గంగలో సంగమించు నొకా నొక యుపనదివెంట జనుచు, మృగములను అడవిపందులను జంపి మాంసము

వండించి తినుచు, క్రమముగా నొకానొక యున్నతప్రదేశము చేరుకొనెను. రమణీయ మైన ఆ నది నిండుగా నున్నప్పుడు రొమ్ముమవరకు నీరు వచ్చును; తక్కినవేళల మోకాటిబంటి లోతుండును. దానిలో రకరకముల చేపలు, తాబేళ్ళు తిరుగుచుండును నీటి కీవల తెల్లనివస్త్రమువంటి యిసుక, రెండు తీరములందును రకరకముల పుష్పఫలజాతులు కలవు. పుష్పఫలరసములతో మత్తెక్కిన నానావిధమృగములు, పక్షులు గుమిగూడుచుండును. ఇట్టి రమణీయమైన హేమవతీ నదీతీరమున కిన్నరీకిన్నరులు పరస్పరాలింగనములు, చుంబనములు చేయుచు నానాప్రకార విలాసములలో మునిగి తేలుచుండిరి. రాజు ఆ నదీతీరమువెంట గంధమాదన పర్వతము నెక్కి కిన్నర ద్వయమును చూచెను. వారు రోదనము చేయుచుండుట గమనించి రాజు కుక్క లున్నవైపు కరతాళధ్వని చేసెను. సుశిక్షితము లైన మేలిజాతి కుక్కలు పొదలో పండుకొనియున్నవి. అవి పరధ్యానముగా నున్నట్లు గ్రహించి రాజు ధనుస్సు, ఆయుధములు నిటారుగా నున్నచెట్టు కానించి, కాలిసవ్వడి కానీయక మెల్ల మెల్లన వానికడకు జేరి "యేల మీరు రోదనము చేయుచున్నారు" అని యడిగెను.

ఈ విషయము ప్రకటీకరించుటకై శాస్త యీ గాథలు పలికెను :

భల్లాటియుం డను పార్థివేశ్వరుడు
విడిచి రాజ్యంబును వేటకై వెడలి
దరిసెను గంధమాదన పర్వతంబు
కింపురుషావాస గిరి నిండుగాను
పుష్పముల్ ఫలములున్ పొలుపారుచుండు.

సారమేయగణంబు, చాప బాణములు
వెనుకనే దిగబెట్టి జననాయకుండు
కిన్నరసంఘంబు లున్నట్టితావు
ప్రాపించె వారితో భాషించుకొరకు.

చలినెలల్ నాలుగు చనినంత హేమ
వతినది యొడ్డున వర్తిలు చేదో

అన్యోన్యమును మాటలాడుచున్నారు
తెలుపుడు మానవ దేహధారులగు
మా మానవులు మిమ్ము నే మని యంద్రు ?

రాజువాక్కులు విని కిన్నరము మాటాడ లేదు. కిన్నర రాజుతో సంభాషించెను :

మసలు దేము త్రికూటాన మల్లగిరిని
పండరం బను ప్రోదినీ పార్శ్వములను
శీతలోదకమే యుండు నీతటినుల
మమ్ము నెంచును మృగములు మనుజులట్లు,
అయిన కిన్నరు లంద్రు వేటాడువాడు.

రా జిట్లనెను :

ఉండి గాటముగనె యుపగూహనంబుల
పడ్చి మొత్తుకొందు రేల ప్రియులు ?
ఆడుగువాడ మిమ్ము నడవిలో ని ట్లసం
తుష్టితోడ నేల దుఃఖ మొంద ?

ఇకముందు వచ్చు గాథలు వారిసల్లాపములు :

ఒక్కరాత్రి యంత సుఖయుల మిచ్ఛ లే
కున్న విడిగ విడిగనుండవలసె.
అట్టిరాత్రి మరల నరుదేరు నేమొ యన్
భీతివలన నిపుడు బెగ్గిలుదుము.

మిమ్ము నడిగెద మానిసిమేనివారి
ఒంటిగా చింతలో మీర లుందురేని
తల్లిదండ్రులు సోదరుల్, ధనము పోవు.

సకలప్రకార వృతుచ్ఛన్న మైన,
భూధరద్వయ మధ్యభూరిప్రవాహ

యైన యీనది దాటి యావలిగట్టు
ప్రియుడు చేరెను. తనపృష్ఠభాగమున
నేనును జనుచున్నదాననన్ మతిని.

దామముం గట్టి నాస్వామికి వేతు
నను నాశయంబుతో అంకోలకములు
అతిముక్తకము యూధికాది పుష్పనుల
నీవలితీరాన నేరుచునుంటి.

మరియు నుదాలక కురకవమ్ములును
పాటలమ్ములు, సిందువార పుష్పములు
ఈవలితీరాన ఏరుచునుంటి
దామమ్ము కట్టి నాస్వామికి వేయ.

స్వామికి వేయగా దామమ్ము వికచ
సాలిపుష్పంబులు నంతరించితిని.

నేటిరాత్రికి శయనీయ మౌనట్లు
దానిపై విహరింప దగినట్లు మేము
కుప్పవోసితి సాలికుసుమముల్ దెచ్చి.

శుక్లచందనమును శోణచందనము
అశ్మాన నూరితి నంగరాగంబు
రమియింపగా నిర్ద్వరము చర్చ చేసి.

అపుడు వచ్చెను ప్రవాహమ్ము శీఘ్రముగ,
కుసుమమ్ము లన్నియు కొట్టుకుపోయె.
తటిని నిండెను, నేను దాట లేనైతి.

ఒడ్డున నిల్చితి మొకరి నొక్కరము
వీక్షించుకొనుచు నావేళ నిర్ద్వరము,
ఒకసారి యేడ్చుచు, నొకసారి నగుచు,
గడపితి మారాత్రి కష్టమ్ముతోడ.

ఉదయింప సూర్యుండు నది దాటిపోయి
ఉపగూహానము చేసి, ఉభయుల మొక్క
సారి యేడ్చి మరొక్కసారి నవ్వుదుము.

విడివిడిగా నున్నవేళ భూపాల,
ఏడువందల యేండ్లు మూడు తక్కువగ
ఒక్కరో జిచోట్చటు నున్నపక్షమున
పట్టు జీవితమె ! ఎవ్వండు నిల్వంగ
జాలు నిక్కడ ప్రియురాలు లేకుండ ?

"విన్నచో నోసౌమ్య, వృద్ధులవలన
నైన జనశ్రుతినైనను గాని
నిష్కంపముగ జెప్పు నీవయ స్సెంత?"

"అస్మదాయువు వేయిహోయనాల్, పాడు
రోగమ్ము లుండవు; భోగంబు మెండు,
దుఃఖమ్ము స్వల్పమ్ము, తుదిదాక ప్రేమ.

విని రా జిట్లు తలపోసెను : "ఇవి పశుజాతియందు పుట్టియు, ఒక్క రాత్రి వియోగపరిణామ స్వరూపమున ఏడుసంవత్సరములు విలపించు చున్నవి. నేను మూడువందల యోజనముల రాష్ట్రమునకు ప్రభువు నైనను, రాజ్యసంపదలు విడిచి అరణ్యమున వ్యర్థముగా తిరుగుచున్నాను. ఓహో ! నా జీవితము నిష్ఫలము !" ఇట్లనుకొని వారాణసికి మరలిపోయెను. అమాత్యులు చూచి "మహారాజా, హిమాలయమున తాము చూచిన వింత లేమి ?" అని యడిగినపుడు రాజు సమస్తము వివరించి, దానాదిపుణ్యకార్యములు చేయుచు భోగము లనుభవించుచుండెను.

ఈ యర్థమును ప్రకటించుటకై శాస్త యీ గాథలు పలికెను :

విని భల్లాటియ విభుడు శీఘ్రముగ
వెనుకకు దిరిగెను వేటాడకుండ
అనుభవించుచు పురి నఖిలభోగములు
అంతమ్మువరకు దానాదిక మిచ్చె.

కలహించకుండ సుఖంబుగ నుండు,
డాత్మదోషముచేత ననుతాప మొంద
వలదు, కింపురుషులవలె నొక్కరాత్రి
దోషకారణమున దుఃఖించునట్లు.

మోదాన నుండుడు వాదముల్ లేక-
ఆత్మదోషముచేత ననుతాప మొంద
వలదు కింపురుషులవలె నొక్కరాత్రి
దోషకారణమున దుఃఖించునట్లు.

మల్లికాదేవి తథాగతుని ధర్మోపదేశము విని, పీఠమునుండి లేచి, తథాగతుని స్తుతి చేయునదై యీ గాథ పలికెను :

వింటిని భవదీయ వివిధార్థభరిత
వాక్కులు శ్రద్ధతో, వ్యర్థ పోవునట్లు
ఒసగుమా శ్రమణ ! నా కుపదేశ, మీవు
అగుము చిరంజీవి వానందదాత !

అప్పటినుండి కోసలనరేశుడు ఆమెతో కలసి మెలసి యుండెను.

శాస్త యీ ధర్మోపదేశనము చేసి, రెండు జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున కిన్నరుడు కోసలనరేశుడు, కిన్నరి మల్లికాదేవి, భల్లాటియ రాజు నేనే.

— ० —

505. సోమనస్స జాతకము

శాస్త జేతవనమున విహరించునపుడు దేవదత్తుడు చేసిన హత్యా ప్రయత్నమునుగూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున శాస్త "భిక్షువులారా, ఇతడు ఇప్పుడే కాదు, పూర్వముకూడ నన్ను వధించుటకై ప్రయత్నము చేసినాడు" అని పూర్వ జన్మ కథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున కురుదేశమున ఉత్తరపాంచాలనగరములో రేణు నామక ప్రభువు పరిపాలన చేయుచుండెను. ఆ సమయమున మహారక్షితు డను తపస్వి 500 మంది తాపసులతో హిమాలయమున నివసించుచు ఉప్పుపులుసు కొరకు విచరించుచు పాంచాలనగరము చేరెను. అచటి రాజోద్యానమున విడిసి అనుయాయులతో భిక్షాటనార్థము బయలువెడలి రాజ ద్వారముకడ నిలిచెను. ఋషిమండలిని చూచి వారి చర్యలను చూచి రాజు ప్రసన్నుడై వారిని కొనిపోయి అలంకృతమైన ఉన్నతస్థానమున కూరుచుండ బెట్టి సుష్ఠుగా భోజనము పెట్టించి "పూజ్యులారా, ఈ వర్షాకాలమున మా యుద్యానములో ఉండుడు" అని ప్రార్థించెను. ఆవల ఉద్యానమునకు జని నివాసము లేర్పరచి ప్రవ్రజితులకు వలసిన వస్తువులు సమకూర్చి ప్రణామము చేసి వెడలిపోయెను. నాటినుండి తాపసులు రాజభవనముననే భోజనములు చేయుచుండిరి.

రాజునకు సంతానము లేదు. పుత్రేచ్ఛ యెంత యున్నను కుమారుడు కలుగలేదు. వర్షాకాలము సమాప్తినొంది నంతనే మహారక్షితుడు రాజుతో "మహారాజా, ఇప్పుడు హిమాలయము రమణీయముగా నుండును. అచటికి

పోవుదుము'' అని సెలవు వేడెను. రాజు సన్మానపూర్వకముగా వారికి వీడుకోలిచ్చెను. మార్గమున పోవుచుండగా మధ్యాహ్నమగుటచే మహారక్షితుడు మహావృక్షముక్రింద శీతలచ్ఛాయలో అనుయాయులతో సహా కూరుచుండెను. తాపసులు ఇష్టాగోష్ఠిచేయుచుండిరి. 'రాజవంశమును రక్షించు పుత్రుడు లేడు; సుపుత్రుడు కలిగినచో పరంపర విచ్ఛిన్నము కాకుండును' అనుచుండిరి. మహారక్షితుడు విని రాజుకు పుత్రుడు కలుగునో కలుగడో యని ధ్యానింపగా కలుగు నని తోచినది. తోడనే వారితో ''మీరు చింతింపవలదు. నేటి తెల్లవారుజామున దేవపుత్రు డొకడు ఆ లోకమునుండి జారి పట్టపు రాణి కడుపున పడును'' అని పలికెను. ఈ మాటలు విన్న కుటిలతపస్వి యొకడు తనలో ''ఈ విషయము తెలిపి రాజపరివారమునకు విశ్వాసపాత్రుడ నగుదును'' అనుకొని తపస్వు లందరు ప్రయాణ మైనపుడు తనకు జబ్బుగా నున్నట్లు నటించి పండుకొనియుండెను. లేచి రమ్మని పిలుపు రాగా 'రాజాలను' అని అతడు పలికెను. మహారక్షితుడు తత్కారణము గ్రహించి రాగలిగినప్పుడే రమ్మని ఋషిగణమును తోడ్కొని హిమాలయమున కరిగెను.

ఆ మాయావి క్రమముగా రాజద్వారము చేరి మహారక్షితుని సేవక తపస్వి వచ్చినా డని వార్త పంపెను. రాజు తోడనే అతనిని ప్రాసాదము మీదికి పిలువనంపి వచ్చినపిదప, పరచిన ఆసనముపై కూరుచుండ బెట్టి, ఆ మోసగానికి ప్రణామము చేసి ఒకప్రక్క నిలిచి ఋషుల యోగక్షేమ మడిగి ''భన్తే, మిగుల శీఘ్రముగా మరలి వచ్చినారే! కారణ మేమి?'' అని యడిగెను.

''అవును మహారాజా, ఋషులు సుఖముగా కూర్చుండి ఇష్టాగోష్ఠి చేయుచు తమవంశ పరంపరాభివృద్ధి చేయుటకు పుత్రుడు కలుగునా కలగడా? అని విచారించుచుండిరి. ఆ మాటలు విని నేను ధ్యానము వహించి యోచింపగా మహాప్రతాపవంతు డగు దేవపుత్రు డొకడు ఆ లోకమునుండి చ్యుతుడై సుధర్మాదేవి గర్భమున ప్రవేశించును అని నా దివ్యచక్షువునకు కానవచ్చినది. అజ్ఞానవశమున గర్భము నష్ట మగునేమో యని జాగరూకత కొరకు మీకు సూచన లిచ్చుటకై వచ్చినాను. మంచిది. మహారాజా, ఇక నేను పోవుదును'' అని పలికెను. ''భన్తే, పోవుటకు వీలు లేదు'' అని రాజు

ప్రసన్నచిత్తముతో ఆ మాయావిని ఉద్యానమునకు గొనిపోయి నివాసస్థాన మేర్పాటు చేసెను. నాటినుండి ఆతడు రాజకులముననే భోజనము చేయు చుండెను. అతనికి దివ్యచక్షువు అని పేరు వచ్చెను.

ఆ సమయమున త్రయస్త్రింశభవనమునుండి చ్యుతుడై దేవపుత్రుడు రాణిగర్భమున బడెను. బిడ్డడు పుట్టి నామకరణమునాడు సోమనస్స కుమారుడు అని పేరు పొందెను. ఉద్యానములో కుటిలతపస్వి ఒకమూల కాయగూరలు పండించుచు వ్యాపారులకు అమ్మకము చేసి ధనము సమకూర్చుకొనుచుండెను. బోధిసత్త్వునకు ఏడుసంవత్సరముల ఈడు వచ్చినపుడు రాష్ట్రములో నొకచోట తిరుగుబాటు రేగెను. దివ్యచక్షుతపస్వియెడల ఔదాసీన్యము కలుగకుండునట్లు హితము చెప్పి రాజు సరిహద్దు ప్రదేశమును శాంతపరచుటకై బయలుదేరెను.

రాజకుమారు డొకనాడు దివ్యచక్షువును చూచుటకై ఉద్యానమునకు బోవగా కుటిలతపస్వి నడుము కట్టి రెండు చేతులలో నీళ్ళకుండలు పట్టుకొని పోయి కూరగాయమడులపై చల్లుచుండుట కానవచ్చెను. శ్రమణధర్మము మాని ఈ దుష్టుడు తోటమాలి పని చేయుచున్నా డని యేవగించుకొని "ఓయిగృహస్థూ, తోటమాలి యేమి చేయుచున్నాడు" అని వానిని సిగ్గుపరచి ప్రణామము చేయకుండనే వెడలిపోయెను. దుష్టతపస్వి తనలో "ఈ రాజకుమారుడు ఇప్పుడే వైరము పూనినాడు ముందుముందు ఏమి చేయునో! కావున వీనిని ఇప్పుడే సంహారింప జేయవలెను" అనుకొని, రాజు వచ్చినతరువాత రాతిముక్కతో జలఘటము పగులగొట్టి పర్ణకుటీరములో పచ్చగడ్డి యిటునటు విరజిమ్మి ఒడలిపై నూనె పూసికొని ముసుగు తన్ని బాధాగ్రస్తుడైనట్టు మంచముపై పండుకొనెను. రాజు నగరప్రదక్షిణము చేసి రాజభవనములోనికి జనకుండనే దివ్యచక్షుసందర్శనార్థము కుటీరద్వారము చేరెను అచట గందరగోళముగా నుండుటచే నేమిది యని లోనికి బోయి తపస్వి పండుకొని యుండుట గమనించి ఆయనపాదములు నొక్కుచు ఈ గాథ పలికెను :

నిను బాధపెట్టుచు నిందించె నెవడు?
కత మేమి యప్రసన్నతకు? ఈనాడు

ఎవ్వని తలిదండ్రుడు లేడ్వంగ వలయు
క్షితిమీద శయనించు మృతు డయి యెవడు ?

విని దుష్టతపస్వి ప్రేలుచు లేచి, యీ గాధ పలికెను :

సంతుష్టి దేవ, నీ సందర్శనమున !
బహుకాలమునకు భూపాల, దర్శనము !
నీతనూజాతుండు నిష్కారణముగ
దండించె నను రేణుధారుణీనాథ !

ఇక ముందు వచ్చుగాథల క్రమము స్పష్టము :

ద్వారపాలురు ఖడ్గధారు లేతెండు !
అంతఃపురములోని కరిగి ఘాతుకుడు
సౌమనస్య కుమారు సంహరింపుండు-
ఖండించి తన్మస్తకము కొని రండు !

అన నిట్లు, దూతలు చని, "రాజపుత్ర!
నిను త్యజించినవాడు నీ జనకుండు,
సంఘటిల్లును నీదు సంహారమిపుడు."

జోడించి చేతులు సోమనస్సుండు
పరిదేవనముతోడ పలికెను : "రాజ
సందర్శనము చేతు, చంపకుండంగ
నను గొనిపొండు భూనాయకుకడకు."

రాజకుమారుని రాజుసన్నిధికి
వారలు కొని పోయినారు; దూరంబు
నుండియే యిట్లనె : "ఓ మహారాజ,
ఖడ్గధారులు చోరఘాతకుల్ నన్ను
ఖండింప వచ్చును; కాని యీనాడు
ఏయపరాధాని కీశిక్ష నాకు ?"

రాజు "భవాగ్రుడు నీచుడు; నీదోషము వానిదోషముకన్న గొప్పది" అని అతని యపరాధమును జూపువాడై యీ గాథ పలికెను :

ఉభయవేళలయందు– ఉదయాన, సందె
నాచరించుచునుండు నగ్నికార్యంబు,
సలిలంబు గొని వచ్చు సంయమి, బ్రహ్మ
చారిని దూషింతె సంసారి వనుచు ?

అప్పుడు రాజకుమారుడు "దేవా, గృహస్థునే గృహస్థు అన్నాను. ఇందు నా దోష మేది ?" అని యీ గాథ పలికెను :

కందమూలఫలాదికము సంతరించి
సంయమి కుటిలోన చాటున దాచు,
పారు డైనాడు సంసారి యీ రీతి !

"నేనుగూడ ఇతనిని గృహస్థు అన్నాను. విశ్వాసము లేనియెడల నాలుగుద్వారములకడ నుండు తోటమాలుల నడిగింపుడు."

రాజు వారిని ప్రశ్నించెను. వారు "చిత్తము, మేము ఈయనకడ పత్రపుష్పఫలములు కొన్నా" మని విన్నవించిరి. తాము కొన్నసామగ్రులు తెచ్చి రాజు నెదుట బెట్టిరి. వస్తువుల నమ్ముటచే వచ్చినధనమును పర్ణశాలలో దాచిపెట్టిన దానిని సంచితో దెచ్చి జనులు రాజునకు జూపిరి. అందు కార్షాపణములు, మాషములు కలవు. బోధిసత్త్వుని నిర్దోషిత్వమును గ్రహించి రా జీగాథ పలికెను :

నిజమె పల్కితి వోయి నీవు కుమార !
బహువస్తు సంగ్రహ పాపంబువలన
సంసారి యైనాడు సంయమీంద్రుడు.

అపుడు బోధిసత్త్వుడు తనలో "మూర్ఖు డగు నిట్టి రాజుకడ నుండుట కంటె హిమాలయమునకు బోయి ప్రవ్రజించుట మేలు. జనులయెదుటనే యితని దోషము బహిరంగ పరచి, ఆనతి వడసి, నేడే పోయి ప్రవ్రజింతును" అనుకొని, జనులకు నమస్కారము చేసి, యిట్లు నివేదించెను :

జనపదంబులనుండి చనుదెంచినట్టి
జనులార! వినవలె : జనపతి మూర్ఖు
మాటలు విని నాకు మరణదండనము
విధియించినాడు వివేచనలేక.

ఇట్లు పలికి, రాజానుజ్ఞ వడయువాడై యీ గాథ పలికెను :

జనియించినాడ విశాలంబు, దృఢము
ప్రణదుర్ఘటం బగు వంశశాఖిని.
పాదాభివందన మోదేవ, యిందు
భవదనుజ్ఞను నేను ప్రవ్రజింపంగ.

ముందు వచ్చుగాథలు రాజుకు, కుమారునకు నడిచిన ప్రశ్నోత్తరములు:

అనుభవింపు కుమార, అన్నిభోగములు,
నిఖిలసంలిదలను నీ కొసంగెదను
రాజు జేతును కురు రాష్ట్రిని కిపుడె
ప్రవ్రజ్యవల, దది బాధాకరంబు.

ఇచ్చట మీకడ నేమి భోగములు ?
దేవ, కంటిని మున్నె దేవలోకమున
పంచేంద్రియానంద పారవశ్యంబు !

దేవలోకమునందు దేవ, పూర్వంబె
అఖిలభోగమ్ముల ననుభవించితిని
అచ్చట నాచుట్టు నప్సరోంగనలె,
బుద్ధులు మార్చు ప్రబుద్ధులే యిచట :
ఈ రాజకులమునం దే నుండజాల !

బోధిసత్త్వుడు రాజున కుపదేశ మిచ్చువాడై యీ గాథలు పలికెను:

అవిచారితమ్ముగా నైన కార్యంబు
అనుచిత భైషజ్యమట్లు లొసంగు
దుష్టవిపాకంబు తుది తప్పకుండ.

యోజించి చేసిన యుక్త కార్యంబు
ఉచిత వైద్యం బట్టు లొసగు సత్ఫలము.

యోజించి కార్యంబు లొనరింపదగును
క్షత్రియుం డైన, విశాంపతు లైన
అట్లు చేసిన యశం బభివృద్ధి యగును.

యుక్తదండన మిచ్చు టొప్పును రాజు:
త్వరపడి చేసిన దండనవలన
అవల పశ్చాత్తప్తు డగుట నిజంబు.

అనుతాప మొందగా నక్కర లేని
కార్యంబు చేయ విజ్ఞానులు మెత్తు,
రగు సుఖదాయకం బట్టికృత్యంబు-
బుద్ధానుమోదంబు పొందును కూడ.

కాషాయవస్త్రముల్ ఖడ్గముల్ దాల్చి
ద్వారపాలురు దేవ, తాపకీనాజ్ఞ
బడసి నన్ జనయిత్రి పార్శ్వంబునుండి
హేరాజ, బల్మిమై నీడ్చినవారు.

మరణభీతిని చవి చూచి మధురజీవి
తమ్ము బడిసితి, భూరికష్టమ్ముమీద
ఈ దినమ్మున వధ తప్పె: ఇంక నేను
పూనువాడను ప్రవ్రజ్య భూమిపాల!

తరుణవయస్కుండు కరుణాళు లితడు:
ఇతని సుధర్మ, నే నెంత వేడినను
నిష్ప్రయోజన మాయె: నీ వొకసారి
అరుగుము సముచితం బని తోచునెడల.

ప్రవ్రజ్య ప్రోత్సహించునదై యామె యీ గాథ పలికెను :

నాయనా, భిక్షాటనంబు చేయుచును
ధర్మప్రకారము తలపోసి మిగుల,
ప్రవ్రజ్య కావించి, పర్యటనంబు
సలుపుచుండుము బిడ్డ ! సర్వజీవముల
యెడ దండనము మాను నెడ ననిందితుడ
వై, బ్రహ్మలోకంబు నందుకో గలవు.

అంతట రా జిట్లనెను :

ఏమి వింత సుధర్మ, యిది ! నన్ను మిగుల
వ్యథితు జేసితివి, ప్రవ్రజ్య నూనుండు
మానునట్లుగ జేయుమా, అంటి; నీవో
పుత్రుని మిక్కిలి ప్రోత్సహించితివి.

బోధిసత్త్వుని ధర్మోపదేశానంతరము రాజు దేవిని బిలువ నంపి, ఈ గాథ పలికెను :

దేవి మరల నిట్లనెను :

ఎవ్వ రనవద్యు లాభోక్త, లెవరు ముక్తు
లట్టివారలు లోకమం దనుసరించు
నార్యమార్గము జేరిన యాత్మజాతు
వారణము చేయగా లేదు వాంఛ నాకు.

ఆమె వాక్కులు విని రాజీగాథ పలికెను :

ఎవరు బహుశ్రుతు, లెవ్వరు ప్రజ్ఞ
కలవారు, యోజనాకలితులు, వారి
సంసర్గ మెంతయు సముచితం బగును.
అట్టివారలవాక్కు లాలించి యితడు
స్వల్పేచ్ఛువును శోకవర్జితుం డయ్యె.

బోధిసత్త్వుడు తలిదండ్రులకు నమస్కరించి, తనవలన అపరాధమేమయిన జరిగినచో క్షమింపవేడి, జనులకు నమస్కరించి, హిమాలయాభిముఖుడయ్యెను. లోకులు వెడలిపోయిన పిమ్మట దేవత మానవ రూపమున వచ్చి యతనిని సప్తపర్వతశ్రేణులను దాటించి, హిమాలయమునకు గొనిపోయెను. అచ్చట విశ్వకర్మ నిర్మించిన పర్ణశాలలో జేరి యతడు ఋషిప్రవ్రజ్య పరిగ్రహించెను. దేవతామండలి పదునారేండ్ల రాజకులపరిచారికారూపమున నతనికి పరిచర్యాపరమై యుండెను.

దష్టతపస్విని జనులు కొట్టి చంపివేసిరి. బోధిసత్త్వుడు ప్రాప్తధ్యానుడై క్రమముగా బ్రహ్మలోకగామి యయ్యెను.

బోధిసత్త్వ డీ ధర్మోపదేశనము చేసి "భిక్షువులారా, ఈ ప్రకారముగా నితడు పూర్వజన్మమున కూడ నన్ను వధింప యత్నించెను" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున మాయావితపస్వి దేవదత్తుడు; మాత మహామాయ, రక్షితుడు సారిపుత్రుడు, సోమనస్సకుమారుడు నేనే.

———:():———

506. చంపేయ్య జాతకము

శాస్త జేతవనమున విహారించునపుడు ఉపోసథకర్మను గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ సమయమున శాస్త "ఉపాసకులారా, ఉపోసథ వ్రతముపూనుట మంచిపని. పురాణపండితులు నాగసంపత్తిని కూడ విడిచి, ఉపోసథవాసము చేసిరి" అని వారి కోరికపై పూర్వజన్మవృత్తాంతము చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున అంగరాష్ట్రమును అంగరాజు, మగధరాష్ట్రమును మగధరాజు పరిపాలన చేయుచుండిరి. ఆ రెండు రాష్ట్రములకును నడుమగా చంపానది కలదు. అచట నాగభవనమును చంపేయ్యనామక నాగరాజు పాలించుచుండెను. అంగరాజ్య మగధరాజ్యములు అప్పుడప్పు డొకదాని నొకటి జయించుచుండెను.

ఒకనాడు మగధరాజు అంగరాజుతో యుద్ధమున నోడిపోయి, గుర్ర మెక్కి పరుగిడుచుండ, అంగరాజు సైనికు లాతని వెన్నంటినట్లు తెలియుచే నిండుగా నున్న చంపానదిని జూచి "శత్రువుల చేత బడి మరణించుట కన్న నదీజలమున మరణించుట మంచిది" అనుకొని, గుర్రముతో నదిలోనికి దిగెను. ఆ సమయమున చంపేయ్య నాగరాజు సలిలములో నిర్మించుకొన్న రత్నమంటపమున పరివార మధ్యమున గూరుచుండి, పానగోష్ఠి చేయుచుండెను. రాజుతో గుర్రము నీట మునిగి, నాగరాజు సన్నిధిలో నిలిచెను. నిండు దుస్తులతో నున్న రాజును గాంచినంతనే స్నేహముప్పతిల్లి నాగరాజు "రాజన్, భయపడవలదు" అని పీఠమునుండి లేచి, నిజపీఠమున నాతనిని గూరుచుండబెట్టుకొని, జల ప్రవేశమునకు కారణమడిగెను. అప్పుడు రాజు జరిగిన దంతయు చెప్పెను. నాగరాజు ఆయన నూరడించి "రాజా, భయము

వలదు. నీకు నేను రెండు రాజ్యములను వశపరచెదను'' అని చెప్పి సప్తాహము పాటు అచ్చట వివిధభోగములతో కాలము గడిపి ఆవల రాజును వెంట గొనిపోయెను. నాగరాజ ప్రభావముచే మగధరాజు అంగరాజును పట్టి సంహరించి రెండు రాజ్యములను తానే పరిపాలింప సాగెను. నాటినుండి వారికిరువురకు మైత్రి గాఢ మయ్యెను. ప్రతి సంవత్సరము రాజు చంపానదీతీరమున రత్నమంటపము వేయించి బహుధనము వెచ్చించి నాగరాజుకు బలిపూజ చేయించెడివాడు. నాగరాజు చాలమంది అనుయాయులతో నాగభవనము వెలువడి బలి స్వీకరించు చుండెడివాడు. జనసమూహము నాగరాజు సంపదను విలోకించు చుండెడిది.

ఆ సమయమున బోధిసత్త్వుడు పేదకుటుంబమున పుట్టి పెరిగి రాజపరివారమువెంట ఆనాడు నదీతీరమునకు బోయి నాగరాజు వైభవము చూచి లోభగ్రస్తుడై ఆ సంపదపై కోరిక పెట్టుకొనెను. బోధిసత్త్వుడు దాన మిచ్చి శీలరక్షణము చేసి చంపేయ నాగరాజు చనిపోయిన యేడవనాడు చ్యుతుడై నాగరాజు నివసించు ప్రాసాదమున శయ్యాస్థానముపై జన్మించెను. అతని శరీరము పుష్పమాలికవలె వికసించియుండెను. చూచి పశ్చాత్తాపము చెంది మరణింపదలచి ''నేను చేసిన కుశలకర్మ ప్రభావము వలన ఆరుకామలోకములలో గదులలో నింపిన ధాన్యమువలె సంపద నిండియున్నది. నేను ఈ కీటకముగా జన్మించి బ్రతికియున్నను లాభ మేమి!'' అనుకొనెను. సుమన అను నాగకన్య అతనిని జూచినంతనే శక్రుం డిట్లు పుట్టె నని భావించి మిగిలిన నాగకన్యలకు సంకేతము చేసి వివిధవాద్యములతో ఆతనియెదుట గుమి గూర్చెను. అతనికొరకు నాగభవనము శక్రభవనముగా మారెను. అతడు సర్పశరీరము విడనాడి సమస్తాలంకారభూషితుడై శయ్యపై కూరుచుండెను. ఆతనికి మహైశ్వర్య మబ్బెను. అతడు నాగలోకమును పరిపాలించుచు ఒకనాడు పశ్చాత్తాపము చెందెను. ''నే నీకీటక శరీరమున నున్న లాభ మేమి. ఉపోసథవ్రత మవలంబించి ఈ లోకమునుండి విముక్తుడనై మానవలోకమునకుజని ఆర్యసత్యజ్ఞానలాభ మొంది దుఃఖము నంత మొందింతును'' అనుకొని ఆ ప్రాసాదముననే యుండి నాటినుండి ఉపోసథవ్రతము ప్రారంభించెను. అలంకృతనాగకన్యలు ఆతనిప్రక్కగా జనుచుండిరి. శీలరక్షణ మించుమించు భ్రష్ట మైన ట్లయ్యెను. అప్పు డతడు ప్రాసా

దము వెలువడి ఉద్యానమునకు పోవజొచ్చెను. నాగకన్యలు అచ్చటికిగూడ వచ్చుచుండిరి. ఉపోసథవ్రతము భ్రష్ట మయ్యెను. "ఈ నాగభవనము వెలువడి మానవలోకమునకు జని వ్రత మాచరించుట ఆవశ్యకము" అని తలపోసి వ్రతదినములలో ఆతడు నాగభవనము వెలువడి మానవలోకమున ఒకానొక సరిహద్దుగ్రామ సమీప మహామార్గమున పెద్దపుట్టలో దూరి ఉపవాసవ్రత మాచరించుచు "ఎవరైనను నా చర్మమును కోరినచో కోసికొని పోవచ్చును. ఎవరైనను నన్ను క్రీడాసర్పముగా కొనిపో దలచినచో అట్లే చేయవచ్చును" అనుకొని తన శరీరము దానము చేయువాడై పడగవాల్చి పండుకొనెను. మహామార్గమున పోవువారు నాగము కనపడినంతనె గంధ మాల్యాదులతో పూజ చేసి పోయెడివారు. సరిహద్దు గ్రామవాసులు అది సామాన్యసర్పము కాదనియు మహాప్రతాపవంతు డగు నాగరాజనియు గ్రహించి మండపము కట్టించి నాలుగుప్రక్కల ఇసుక చల్లి గంధాదులతో పూజించెడివారు. జనసామాన్యము బోధిసత్త్వుని యెడల శ్రద్ధాభక్తులు కలిగి పూజలు చేయుచు పుత్రసంతానము కొరకు ప్రార్థనలు చేయుచుండిరి. చతుర్దశి పూర్ణిమా తిథులలో బోధిసత్త్వుడు ఉపవాసవ్రత మాచరించుచు పుట్టమీదికి వచ్చి క్రమముగా నాగభవనమునకు బోయెడివాడు. ఈ విధముగా కాలము గడచుచుండెను.

ఒకనాడు సుమన పట్టపుదేవి "దేవా, తాము మానవలోకమునకు బోయి వ్రతమాచరించుచున్నారు. అది భయశంకలకు తావు. మీకు ఏదైన ఆపద కలిగినచో మా కెట్లు తెలియగలదు?" అనెను. ఆత డామెను మంగళ పుష్కరిణి యొద్దునకు గొనిపోయి "భద్రే, యెవరైనను నన్ను కొట్టి కష్ట పెట్టినచో ఈ పుష్కరిణీ జలము మలిన మగును. గరుడుడు నన్ను పట్టుకొని పోయినచో నీరు ఇగిరిపోవును. పాములవాడు నన్ను పట్టుకొనిపోయినచో నీరము రక్తవర్ణము దాల్చును" అని సూచనచేసి చతుర్దశి ఉపోసథవ్రతము పట్టి నాగభవనము వెలువడి పుట్టపైకి పోయి పండుకొనెను. నాగశరీర కాంతిచే వల్మీకము సుశోభిత మయ్యెను. వెండిగొలుసువలె ఆయన దేహము తెల్లగాను, శిరస్సు రక్తకంబళపు చుట్టవలెను ప్రకాశించుచుండెను.

అప్పుడు వారాణసీనివాసి తక్షశిలలో విద్యలు నేర్చి మంత్రవిద్య కూడ అభ్యసించి ఇంటికి తిరిగి వచ్చుచు మార్గముప్రక్క పుట్టపై బోధి

సత్త్వుని చూచి "ఈ సర్పమును పట్టుకొని గ్రామ, నిగమ నగరాదులలో ప్రదర్శించుచో ధనము సంపాదింప వచ్చును" అనుకొని దివ్యౌషధి కొని దివ్యమంత్రము జపించి సర్పముకడకు జనెను. దివ్యమంత్రము చెవి బడినంతనే బోధిసత్త్వునకు చెవులలో తప్తశలాక దూర్చినట్లయ్యెను, శిరస్సుపై నొక్కిన ట్లయ్యెను. అంత నాగము శిరసు పైకెత్తి యెవరని చూచి, పాములవా డని గ్రహించినంతనే తనలో "నా విషము మహాభయంకరము! నేను శీత్కారము చేసినచో నితని శరీరము భస్మీభూతమై గుప్పెడు ధూళిగా చెదరి పోవును. ఇట్లగుచో నా శీలము కొంత కుంటుపడును. కావున వీనివైపు చూడను" అనుకొని, శరీరము చుట్టచుట్టి, పడగ వాల్చి పండుకొనెను. అహితుండిక బ్రాహ్మణుడు ఓషధి మ్రింగి, మంత్రము జపించి, బోధి సత్త్వునిపై నుమిసెను. వాని ప్రభావమువలన ఉమ్మిపడినచోట బొబ్బలు లేచినట్లాయెను. బ్రాహ్మణుడు సర్పమును తోకపట్టి లాగి, పొడవుగా సాగ దీసి, మేకపాదమువంటి కట్టెతో కొట్టి, దుర్బల మగునట్లు చేసెను; శిరము గట్టిగా నొక్కెను. బోధిసత్త్వుని నోరు తెరవుపడెను. బ్రాహ్మణుడు సర్పము నోట నుమిసి, మంత్రము జపించి కోరలు లాగెను నోట రక్తము నిండెను. శీలభంగ మగునను భీతిచే బోధిసత్త్వుడు బాధలు సహించుచు వానివంక చూడ నైన చూడలేదు. అహితుండికుడు సర్పమును మిగుల దుర్బలము చేయుటకై తోక మొదలు తలవరకును మర్దించి పట్టీవలె చుట్టి, వింటినారినివలె మడత పెట్టి, తోక పట్టుకొని, కుస్తీలో దెబ్బకొట్టినట్టు కొట్టి నేలపై బడవైచెను. బోధిసత్త్వుడు మిగుల వ్యథ నొందుచు రక్తసిక్త శరీరుడై దుర్బలుడై యుండుట గ్రహించి బ్రాహ్మణుడు తీగలతో బుట్ట అల్లి, సర్పము నందులో నుంచెను.

ఆవల నతడు బయలుదేరి, సీమ దాటి, గ్రామములో లోకులయెదుట సర్పము నాడించెను. అహితుండికుడు కోరినరీతిని సర్పము వివిధనాట్యములు చేసెను. ఆనాడు వానికి వేయి కార్షాపణముల ధనము, అంతమూల్యముకల వస్తుసామగ్రి లభించెను. వేయి లభించినంతనే సర్పమును విడిచిపెట్టవలె నని తొలుత నతడనుకొనెను; కాని ధనము లభించుటచే ఆసపుట్టి, "సీమాంత గ్రామముననే యింత లభించినది. రాజధానికి బోయి అమాత్యుల యెదుట ప్రభువుల యెదుట నాగనాట్యము చేయించినచో విశేషధనము లభించును"

అనుకొని శకటమును రథమును సిద్ధము చేయించెను. సామానులు బండిలో మూటలు కట్టివేసి, తాను రథమెక్కి బ్రాహ్మణుడు గ్రామ నిగమములు తిరుగుచు నాగక్రీడ చేయించుచు తుదకు వారాణసి చేరెను. వారాణసీ ప్రభువగు ఉగ్రసేన మహారాజునకు నాగక్రీడ చూపి, సర్పమును విడిచిపెట్ట దలచెను. అతడు మండూకములను చంపి నాగరాజు కాహారముగా చేయు చుండెను. "ఇతడు నా కొరకు కప్పలను జంపుచున్నాడు" అని తలపోసి నాగరాజు వానిని ముట్టుకొనలేదు. అంతట తేనె మొదలగునవి తెచ్చిపెట్టెను. "ఈ యాహారము తినుచో ఈ బుట్టలోనే నాకు మరణము సంభవించును" అని తలచి నాగరాజు వానినిగూడ ముట్టుకొనలేదు. బ్రాహ్మణుడు వారాణసి చేరునప్పటికి మాసము పట్టెను, త్రోవలో చాల ధనము సంపాదించెను. రాజతనిని బిలువనంపి "మాకుగూడ వేడుక చూపు" మనెను.

"చిత్తము దేవా, రేపు పూర్ణిమనాడు తమకు వేడుక చూపెదను" అని యతడు విన్నవించెను. "రేపు నాగరాజు రాజాంగణమున నాట్యము చేయును. ఎల్లరును వచ్చి చూడవచ్చును" అని రాజు నగరమున చాట బంచెను. మరునాడు అంగణ మలంకరింపజేసి రాజు బ్రాహ్మణునకు వార్త పంపెను. ఆతడు రత్నపేటికలో బోధిసత్త్వని గొనిపోయి రత్నకంబళముపై పేటిక నుంచి, కూరుచుండెను ప్రాసాదము దిగి వచ్చి రాజు సింహాసనముపై గూరుచుండెను బ్రాహ్మణుడు నాగరాజును వెలికి దీసి, నృత్యము చేయించెను జనులు సంతోష మణచుకొనలేక ఉత్తరీయము నెగురవేసిరి. బోధిసత్త్వునిపై సప్తరత్నవర్షము కురిసెను. నాగరాజు పట్టుపడి నెలరోజు లయినది; కాని యింతవరకును ఆహారము ముట్టలేదు.

అక్కడ సుమన తనలో "నా ప్రియస్వామి వెడలిపోయి నెలరోజులు కడచినది. ఇంకను రాకుండుటకు కారణమేమో" యని తలపోసి, పుష్కరిణికి బోయి చూచెను. నీరము రక్తవర్ణము దాల్చెను. నాగరాజు పాములవాని చేత బడెనని గ్రహించి ఆమె నాగభవనము వెడలి, పుట్టకడకు బోయి, చూచి యేడ్చెను. ఆవల నామె సీమాంతగ్రామమునకు జని అడిగి తెలిసికొని, వారాణసి చేరి పరిషన్మధ్యముగా నాకసమున నిలిచెను. బోధిసత్త్వుడు ఆడుచు, ఆకసమువైపు చూచి, ఆమెను కనుగొని సిగ్గున తలవంచి పేటికలో

దూరెను. రాజు చూచి, కారణమేమో యనుకొని పైకిచూచి, ఆమెను గనుకొని యీ గాథ పలికెను :

చపలపోలిక, ఓషధిచందమునను
తారవలె భాసిలెదవు గంధర్వవనిత
వగుదువా, కాక దేవత వగుదు వొక్కొ !
మానవస్త్రీవి కా వని మదికి దోచు.

ఇక ముందు వచ్చుగాథలు ఉత్తర ప్రత్యుత్తరములు :

"కాను దేవిని, గంధర్వకాంత కాను,
కాను మానవి, నే నాగకాంత దేవ
ఇచ్చటికి కార్య మర్థించి వచ్చినాను"

"చెందితివి నీవు విభ్రాంతి, చిత్త మెంతో
ఆకులం బయి యున్నది, అశ్రులందు
బాష్పములు జారుచున్నవి, బాధ యేమి ?
ఏమి యాచించి వచ్చితి విటకు నీవు ?"

"ఉగ్రతేజస్వి యగువాని ఉరగు డంద్రు
నాగు డని కూడ నంద్రు, నానాథు డతడు.
వాని నెవ్వరో పట్టినవారు, మీరు
బంధనమునుండి విడిపింప ప్రార్థనమ్ము."

"అంత బలవంతుడును వీర్యవంతు డైన
నాగు డెటు చిక్కె నిర్భాగ్యనరునిచేత ?
నమ్మక మ్మెట్లు కల్గును నాకు చెపుమ !"

"అధికబలవీర్యవంతుడే యతడు, తలప
నగర మంతయు భస్మ మొనర్పగలడు.
అయిన నాగుడు ధర్మము నాచరింప
చేయుచున్నాడు తపను విచిత్రమూర్తి.

"ఇతడు దీని నెచట పట్టినాడు ?" అని రాజు ప్రశ్నింపగా. నామె తద్విషయము తెలుపునదై యీ గాథ పలికెను :

పూని చతుర్దశీ పూర్ణిమా తిథుల
నిత డుపోసథ వ్రతము, చతుష్ప
థము ప్రక్క వల్మీకధామమ్మునందు
శయనించియుండ, నీజనుడు జీవికకు
పట్టుకొన్నా; డింక బంధవిముక్తు
జేయింపవలె నాదు జీవితేశ్వరుని.

ఇట్లు పలికి మరల యాచించునదై యీ గాథలు పలికెను :

మహిళలు మౌక్తిక మణికుండలములు
దాలిచి, నీరము ధామమ్ము గాగ
కొలుచుచుందురు వేలకొలది నాగేశు.

తలపెట్ట కేలాటి బలవంత మైన
ధర్మమార్గమున నీతనికి విముక్తి
ఘటియింపవలయును; గ్రామమ్ము గాని
కొన్నినిష్కము లైన, గోశత మైన
దాన మొసంగుచు ధర్మాత్ము డైన
నాగుడు స్వేచ్ఛగా నడయాడు గాక !

రా జాతనితో నిట్లనెను :

ధర్మానుసార మీతని ముక్తు జేతు,
గ్రామమ్ము గాని, నిష్కమ్ములు గాని
గోశతమ్మును గాని కూర్మి నొసంగి.
పుణ్యాత్మునకు చెర పోవును గాక,
నాగుడు స్వేచ్ఛగా నడయాడు గాక !

నీకు మణికుండలమ్ములు నిష్కశతము
శయనమును లుబ్ధకా, నే నొసంగువాడ.

సమరూప లావణ్య జాయ లిర్వురను
గోవులు వృషభమ్ముగూడ నిచ్చెదను.
నాగుడు స్వేచ్ఛగా నడయాడు గాక,
పుణ్యాత్మునకు చెర పోవును గాక !

అహితుండిటు డిట్లు బదులు పలికెను :

జననాథ, యేల కై కొనకుండ, మీదు
వాక్కునుబట్టియే వదలుదు మితని
నాగుడు స్వేచ్ఛమై నడయాడు గాక,
పుణ్యాత్మునకు చెర పోవును గాక !

ఇట్లు పలికి అతడు బోధిసత్త్వుని బుట్టలోనుండి వెలువరించెను. నాగరాజు వెలువడి, పుష్పములలో దూరి, సర్పశరీరము విడిచి, బ్రాహ్మణకుమారుని వేషము దాల్చి, నేల బ్రద్దకొట్టి వచ్చినట్లు వచ్చెను. సుమనకూడ ఆకాశమునుండి దిగి, యాతనికడకు వచ్చి నిలిచెను. నాగరాజు చేతులు జోడించి, రాజుకు నమస్కరించుచు నిలిచెను.

ఈ యభిప్రాయమును ప్రకటీకరించుటకై శాస్త యీ గాథలు పలికెను :

చంపేయ్య నామక సర్పనాయకుడు
ఇటు విన్నవించెను : "హే కాశిరాజ !
చేతులు జోడించి చేయుచున్నాను
మీకు నమస్కృతి ! మీరొక్కసారి
అస్మద్గృహంబున కరుదేర వలయు."

"మనుజుండు కానివానిని మానవుండు
విశ్వసించిన, దుష్టవిశ్వాస మంద్రు.
అయినను నీవు నన్నడుగుటచేత
అరుదెంతు నీయింటి" కనె కాశిరాజు.

విశ్వాసము కలిగించుటకై బోధిసత్త్వు డీగాథలు పలికెను :

భూధరంబుల నూడ్చుక పోవుగాక
వాత, మర్త్యమ సోములు భూతలమున
జారి పడిపోవుదురు గాక, సకలనదులు
గూడ ప్రవహించినను ప్రతికూలముగను
పలుకజాల నసత్యంబు ప్రభువరేణ్య !

బ్రద్ద లైనను నభము, సంద్రంబు లెండి
పోయినను, భూమి ముడుచుక పోవుగాక,
కుదుటితో గూడ మేరువు కూలు గాక—
పలుకజాల నసత్యంబు ప్రభువరేణ్య !

బోధిసత్త్వు డిట్లు పలికినను రాజుకు విశ్వాసము కలుగలేదు. అత డిట్లు పలికెను :

మనుజుండు కానివానిని మానవుండు
విశ్వసించిన, దుష్టవిశ్వాస మంద్రు
అయినను నీవు న న్నడుగుటచేత
చనుదెంచువాడ నీ సదన మీక్షింప.

భూరిఘోర విషాగ్ని ధారివి నీవు
తీవ్రకోపనుడవు, నప్రతిమాన
తేజస్వి వీవు; ముక్తిని బొందినావు
మరవకుండుట లేని మంచిది మమ్ము.

రాజుకు విశ్వాసము కలిగించుటకై బోధిసత్త్వు డిట్లనెను :

పరచు నెవ్వడు పొందుపంచిని వాడు
ఘోర మౌనరకాన కూలును; చెంద
లేడు కాయికసుఖలేశంబు గాని
చిక్కి కరండాన జీవముల్ విడుచు.

రాజు విశ్వసించి, ఆయన నిట్లు స్తుతించెను :

నీవు చేయుప్రతిజ్ఞ నిక్కమ్ము సుమ్ము
అక్రోధనుండవు; నద్వేష్ట వీవు,
గ్రీష్మమునం దగ్నికిని నరుండట్లు
గరుడుడు దూరమ్ముగా నుండు గాక
సకలనాగకులంబు స్పర్శ లేకుండ.

బోధిసత్త్వుడుకూడ రాజును స్తుతించువాడై యిట్లు పలికెను :

దయ యుండునట్లు మాతకు నేకపుత్రు
నెడల నాగకులంబు నెడ నీకు రాజ !
కల దనుకంప; నాగకులంబుతోడ
నేను చేయుదు సేవ నిండుగా నీకు.

విని, రాజు నాగభవనమునకు బోవ కోర్కి కలిగి, సైన్యము సంసిద్ధము చేయింప నిట్లు పలికెను :

కట్టుడు శిక్షిత కంబోజ తురగ
ములను కాంచనరథమ్మునకు శీఘ్రముగ.
సజ్జీకరింపుడు స్వర్ణవర్ణంపు
కుథములతో భద్రకుంజరమ్ములను—
కనుగొన బోదు నాగనివేశమునకు.

ఇది అభిసంబుద్ధ గాథ :

మ్రోగసాగిన వుగ్రసేనుని
మ్రోల భేరులు మృదంగంబులు.
వెడలె స్త్రీజన పరివృతుం డయి
విభవమున నరపాలు డంతట.

రాజు నగరము వెలువడునప్పటికి బోధిసత్త్వుని ప్రభావమువలన నాగభవనముచుట్టును సర్వరత్నమయ ప్రాకారము, ద్వారప్రకోష్ఠములు సృష్టములై, భవనముకు బోవుమార్గముకూడ సిద్ధమాయెను. అనుయాయు

లతోగూడ ఆ మార్గముగ జని, రాజు రమణీయప్రదేశమును ప్రాసాదమును గనుగొనెను.

ఈ యభిప్రాయము ప్రకటీకరించుటకై శాస్త్ర యీ గాథలు పలికెను:

కాశీవిభుడు స్వర్ణ ఖచిత భూతలము,
కాంచన సౌధమ్ము కనుగొనినాడు.
మిహిరవిద్యుత్ప్రభల్ మిళిత మైనట్లు
జాజ్జ్వల్యమాన మౌ చంపేయ్య నాగ
భవనప్రదేశంబు ప్రాపించినాడు.
వివిధవిధంబుల వృక్షాలతోడ
బహువిధ పరిమళ భరిత మైనట్టి
సౌధంబు గాంచె; ఆ సమయంబునందు
వాద్యముల్ మ్రోగె దివ్యంబులు, నాగ
కన్యక లాడిరి కమనీయనాట్య :
మారోహణము చేసె నంతట రాజు
చందనలిప్త, పార్శ్వస్వర్ణ ఖచిత
పీఠంబుమీద ! సంప్రీతచిత్తమున.

ఆయన కూరుచున్నంత నే పదునారు వేల స్త్రీలకును పరివారమునకును ఉత్తమభోజన మాయత్త మయ్యెను. రాజు పరిషత్తుతో సప్తాహముపాటు దివ్యభోజ్యపానీయము లారగించి, సుఖాసనశయనము లనుభవించి మహా సత్త్వుని గుణములు స్తుతించి "నాగరాజా ! ఇట్టి సంపత్తి విడనాడి నీవు మానవలోకమున పుట్టలో పడియుండి, ఉపోసథవ్రత మేల పట్టినావు ?" అని యడుగ నాత డిట్లు ప్రతివచన మిచ్చెను :

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త్ర యిట్లు పలికెను :

అచట భుజియించి క్రీడించి యనియె కాశి
రాజు చంపేయ్యుతో : "నాగరాజ, లేదు
మాకు నాదిత్యవర్ణ విమానరాజి
ఇచట నీ కున్నయట్టిది : ఎందుచేత
చేయుచున్నాడవు తపస్సు చెప్పు మయ్య !

కాంచనాభరణముల్ కౌశేయములును
దాలిచి, శోణహస్తములు పాదములు
గోళాంగుళులు కల్గు వ్యాళకన్యకలు
సుర యిచ్చుచున్నారు సుందరీమణులు—
మానవలోకాన మాకు లే వివ్వి—
చేసెదు తప సేల చెపుము నాగేంద్ర !

స్రోతస్వినుల్ మహాశుభదాయకములు,
కల వందు పెద్దతోకల రోహితములు,
ఆదర్శనామ విహంగముల్ నదుల
యొడ్డులన్ కూజించుచుండు మెండుగను.
మానవలోకాన మాకు లే వివ్వి—
చేసేదు తప సేల చెపుము నాగేంద్ర !

క్రౌంచమయూరముల్ కలహంసములును
కోకిల లొక్కచో గూడు నిచ్చోట
మనుజలోకమునందు గన మిట్టివాని
చేసెదు తపమేల చెపుము నాగేంద్ర !

సాలముల్ తిలకముల్ జంబువు లామ్ర
పాటలోద్దాలక ప్రముఖవృక్షములు
మెండు వికసించి యుండు నిచ్చోట,
మనుజలోకమునందు గన మిట్టివాని—
చేసెదు తప మేల చెపుము నాగేంద్ర !

కుసుమసంభరిత మౌ కుజములనుండి
పరిమళం బెల్లెడ బర్వుచునుండు
మానవలోకాన మా కిట్టి వేవి ?
చేసెదు తప మేల చెపుము నాగేంద్ర !

చంపేయ్యు డి ట్లనెను :

తనయులకొరకును ధనముకోసరము
ఆచరింపను తపం బాయుస్సుకొరకు.

ఉద్భవింప మనుష్యయోనియం దేను
ఆగ్రహంబున తపం బాచరించెదను.

రాజిట్లనెను :

నాగరాజా, నీదు నయనంబులెరుపు,
అరుణచందనలిప్త మైనది తనువు,
గంధర్వరాజట్లు కడల నన్నిటిని
కావించుచున్నావు కాంతిమంతములు.

దేవర్ధి పొందితి వీవు మహాను
భావుండవు ప్రతాపవంతుడ వయ్య !
మీలోకమునకన్న మాలోక మెట్లు
శ్రేష్ఠతరం బగు చెవుము నాగేంద్ర !

నాగరాజిట్లు ప్రతివచన మిచ్చెను :

మానవలోకాన మాత్రము శుద్ధి
సంయమమ్ములు కడు సంభృత మగును
మనుజగర్భంబున జనియించి నేను
జాతంబు మరణంబు సమయింప జేతు.

విని రాజిట్లనెను :

ఎవరు బహుశ్రుతు, లెవ్వ రాలోచ
నాపరుల్, మిగుల ప్రజ్ఞాసమన్వితులు
అట్టివారలు సేవ్యు లగుట సత్యంబు,
నిన్నును నీనాగకన్నెలం గాంచి
ఎంచితి బహుపుణ్య కృతు లొనరింప.

అంతట నాగరాజిట్లు పలికెను :

ఎవరు బహుశ్రుతు లెవ్వ రాలోచ
నాపరుల్, మిగుల ప్రజ్ఞాసమన్వితులు
అట్టివారలు సేవ్యు లనుట సత్యంబు,

నన్నును నానాగకన్నెలం గాంచి
పుణ్యకార్యము లొనర్పుము మెండుగాను.

అపుడు రాజు "నాగరాజా, మే మెంతకాల మిట నుందుము ? నేడు పోవుదుము" అనునప్పటికి నాగరాజు "మహారాజా, మీకు వలసినంత ధనము గ్రహింపుడు" అనుచు, ధన మొసగు కోరిక కలవాడై యిట్లనెను :

ఇచట నున్నవి తాలవృక్షాలయెత్తు
పసిడి రాసులు, వాని బట్టుకు పోయి
కట్టించుకో రాజ, కాంచనమంది
రములు, చుట్టును వెండి ప్రాకారములును.

పంచసహస్రంపు భారమ్ము కలుగు
ముత్తెముల్ స్ఫటికమ్ము లెత్తించుకొమ్ము
పరపింపు మీయంతిపురి భూతలాన
నీరమ్ము పంకమ్ము నిలవకుండంగ.

రాజేంద్ర, మీదు వారాణసిలోన
అనుపమసుందర మౌ విమానంబు
నిర్మాణ మొనరించి, నిరుపమానమ్ము
కాశిరాష్ట్రమ్మును కావింప వలయు.

విని రాజు సమ్మతించెను అంతట నాగరాజు "తమకు వలసినంత ధనము, సువర్ణము రాజపురుషులు తీసికొనవచ్చును" అని నాగభవనమున చాటబంచెను. పిదప వందలకొలది బండ్లలో రొక్కము మూటలు వేయించి రాజుకడకు బంపెను రాజు మహావైభవముతో నాగభవనము వెలువడి వారాణసి చేరెను. అప్పటినుండి జంబూద్వీపమునకు సువర్ణభూమి యని పేరు వచ్చినది.

శాస్త యీ ధర్మోపదేశనము కావించి "ఈ ప్రకారముగా పురాణ పండితులు నాగసంపద నుపేక్షించి, ఉపోసథవ్రత మాచరించిరి. ఆ కాలమున పాములవాడు దేవదత్తుడు, సుమన రాహులమాత, ఉగ్రసేనుడు సారిపుత్రుడు, చంపేయ్యనాగరాజు నేనే.

———:():———

507. మహా పలోభన జాతకము

శాస్త జేతవనమున విహారము చేయునపుడు విశుద్ధ ప్రాణులకు గూడ మాలిన్య మంటుటను గూర్చి చెప్పినది. కథ యిదివరలోనే వచ్చినది. ఇందు శాస్త "భిక్షువులారా, స్త్రీలు పరిశుద్ధులను గూడ మలినపరతురు" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో...... చూళ పలోభన జాతకమున చెప్పినట్లు గ్రహింపవలెను. ఆ సమయమున బోధిసత్త్వుడు బ్రహ్మలోక చ్యుతుడై కాశీనరేశుని పుత్రుడుగా పుట్టెను. అతనికి స్త్రీవాసన గిట్టదు. బిడ్డడు స్త్రీలచేతులలో నుండెడివాడు కాదు. పురుషవేషము ధరించియే స్త్రీలు వానికి స్తన్య మీయవలసి వచ్చెడిది. అతడు ధ్యానభావనలో నుండ, స్త్రీలను చూచెడివాడు కాడు. ఈ యర్థమును ప్రకాశింప చేయుటకై శాస్త యీ గాథను పలికెను :

ఒంది విచ్యుతి యొకానొక బుద్ధిమంతు
డా బ్రహ్మలోకమునందుండి, దేవ
పుత్రుండు నృపతి పుత్రుడై పుట్టె.

కామ వికల్ప సంకల్పంబు లచట
కలుగ, వచ్చో బుట్టు కారణంబునను
ఆవ్వాని యెడల నత్యంతజుగుప్స.

అంతఃపురాన ధ్యానాగారమందు
అత డేకాంతాన ధ్యానంబు చేయు.

తన కొక్క పుత్రు, డాతనికి భోగాల
యెడ కాంక్ష లేదని యేడ్చెను రాజు.

ఇది రాజు విచారగాథ :

దీని కుపాయంబు తెలిపినవారు
ఎవ్వరే నితనికి నిచ్ఛ కల్గింప
జాలుదు రని రాజు చాల చింతించె.

ఇవి అభిసంబుద్ధ గాథలు :

నృత్యగానాదుల నేర్పరి యైన
వరవర్ణిని కుమారి వర్తిలు నచట.

అరుదెంచి, రాజుతో నామె యిట్లనియె :

"అవల నాభర్త యాట కాతండు
సమ్మతించున యేని సర్వభోగముల
నభిముఖు జేయుదు నాతని నేను."

విని యామె పల్కులు విభు డనె నిట్లు :
"గట్టిగాను ప్రలోభ పెట్టెదవేని
అవల కాగలడు నీ కాతడు భర్త."

ఇట్లు పలికి రాజు దీనికి చోటిమ్మని కుమారుని సేవకై పంపెను. ఆమె ప్రాతఃకాలముననే వీణ చేబూని, కుమారుని శయనగృహముకడ నిలిచి, గోటితీగతో వీణ మీటుచు, మధురస్వరమున పాడుచు, నతనిని ప్రలోభ పెట్ట సాగెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త యిట్లు పలికెను :

అంతిపురంబున కరిగి యా కన్య
హృదయంగమంబులు నెంతయు కామ
భరితంబు లుద్వేగకరములు నైన
యనురాగగాథల నతనికి జెప్పె.
అచటివారల నాత డడిగె నీరీతి :
"ఇట్టిగాథలు చెప్పునీమె యెవ్వతెయొ ?"

"క్రీడకు యోగ్య యాస్త్రీ యీమె దేవ !
మీరు భోగమ్ములు కోరుపక్షమున
అంత కంతకు ప్రియ యగును మీ కీమె."

"అటులైన చెంతకు నరుదెంచి యామె
ఆశ్రమ మధ్యంబు, నస్మదంతికము
చేరుచు గానమ్ము చేయును గాక."

అతని నివాసగృహమ్ము, కుడ్యంబు
దరిసి క్రమమ్ముగా తరుణి తదీయ
ధ్యాన నిర్మల కక్ష్యలోనికి జొచ్చె,
వెంట నంటెడురీతి విపినాన హస్తి
అతనిని క్రమముగా నంటి చరించె.

తామరసంబును గ్రహియించునతని
కీర్ష్యజనించిన; దీమె నెవ్వరును
స్పృశియింప రాదను పీడ జనించె.

ఖడ్గముం జేపట్టి క్రమముగా నతడు
బెదరింప జొచ్చెను పెరవార లామె
తోడ భోగించుచో త్రుంతు నటంచు.

జనులు నృపాలునిసన్నిధి కరిగి
"నిష్కారణము దేవ, నీ కుమారుండు
మనుజుల బాధించు" నని చెప్పుకొనిరి.

క్షత్రియప్రభువు రాజ్యంబులోపలను
తనయుడు నిల్వరా దని యాన తిచ్చె

అతడు భార్యాన్వితుం డై యబ్ధితటము
ప్రాపించి నిర్మించి వర్ణకూటమ్ము
కందమూలాలకై కానలో జొచ్చె.

అబ్ధిపై పైనుండి యరుదెంచి తపసి
భోజనవేళ కాపూరిల్లు జొచ్చె.

వనిత ఋషీశ్వరు వశవర్తి జేసి
కొనగ నాతడు బుద్ధి కోల్పోయినాడు—
బ్రహ్మచర్యాశ్రమ పతన హేతువున.

ఆశ్రమవాటిక కారాజసుతుడు
కావడి నిండుగా కందమూలాది
కములతోడ సందెకు క్రమ్మరి వచ్చె.

ఋషి క్షత్రియకుమారు నీక్షించినంత
పరుగెత్తినా డకూపారమ్ము వైపు:
గగనతలమ్మున నెగురంగ నెంచె,
పడె సముద్రలోన ప్రజ్ఞ కోల్పోయి.

ముని సముద్రములోన మునుగుచుండగ
కరుణ కుమారు డీగాథలు పలికె:
"నీటిలో తడియక నింగి మార్గమున
బుద్ధి బలంబున ఋషి యరుదెంచి
స్త్రీసంగమంబున చెడి యబ్ధి బడియె.

"బ్రహ్మచర్యం బన్న పడదు వీరలకు
మగవారి ముంచెడి మాంత్రికల్ వీరు,
మాయావినులు స్త్రీలు; మగవా రెరింగి
వీరి నుంచుట మేలు దూరమ్ముగానె.

"తీపిమాటలవారు, తృప్తిలేనట్టి
వార, లన్యుల ముంచువారలు స్త్రీలు
ఎంతకు పూర్ణత నెరుగనివారు
ఏటిపోలిక; నరుం డీసత్య మెరిగి
వీరి నుంచుట మేలు దూరమ్ముగానె.

విత్తంబు గాని యుద్వేగంబు గాని
లలనల వశవర్తినుల జేయుచుండు.
సేవింతు రప్పుడు స్త్రీ లెట్టివాని
నైనను దహియింతు రగ్నివిధాన."

ఆలకించినయంత నారాజపుత్రు
వాక్కు, లాతనికి వైరాగ్యంబు కలిగె,
వెనుకటిరీతిని వినువీధి జనియె.

ఆకసంబున జను నాఋషీశ్వరుని
వీక్షించుచుండ సంవేదంబు కలిగె,
ప్రవ్రజింపగ నిచ్ఛ ప్రభవించె నపుడె
రాజతనూజు ధీరం బైనమదిని.

ఆతండు త్యజియించి యఖిలకామములు
ప్రవ్రజ్య గ్రహియించి, బ్రహ్మలోకంబు-
బంధవిముక్తుడై ప్రాపించినాడు.

శాస్త "భిక్షువులారా, ఈ విధముగా స్త్రీలవలన విశుద్ధప్రాణులు కూడ మలినులై పోవుదురు" అని సత్యప్రకాశనము చేసి, జాతకములు సరి పోల్చెను. సత్యప్రకాశనానంతరము ఉద్విగ్నచిత్తభిక్షువు అర్హత్వము నొందెను. ఆ కాలమున స్త్రీ గంధము గిట్టని కుమారుడు నేనే.

—: o :—

508. పంచ పండిత జాతకము

పంచపండితజాతకము మహా ఉమ్మగ జాతకమున (546) వచ్చును.

509. హత్థిపాల జాతకము

శాస్త్ర జేతవనమున విహరించుచు నిష్క్రమణమును గూర్చి చెప్పినది. అప్పుడు శాస్త్ర "భిక్షువులారా, తథాగతు డిప్పుడే కాదు, పూర్వము కూడ నిష్క్రమణము చేసియుండెను" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో ఏసుకారి యనురాజు పాలనము చేయుచుండెను. పురోహితుడును రాజును చిన్నతనమునుండి మిత్రులు. ఉభయులు అపుత్రకులు. ఒకనాడు వారు ఇష్టాగోష్ఠిలో "మనకు ఐశ్వర్య మున్నది. పుత్రులు లేరు; పోనీ పుత్రియును లేదు. ఏమి చేయదగును" అను కొనిరి. అప్పుడు రాజు పురోహితునితో "మీ యింట పిల్లవాడు పుట్టినచో నా రాజ్యమునకు స్వామి యగును; మా యింట పుత్రుడు పుట్టినచో మీ సంపద కధికారి యగును" అని ఒప్పందము చేసికొనిరి.

ఒకనాడు పురోహితుడు తన జమీగ్రామమునకు బోయి అక్కడినుండి మరలి వచ్చుచు దక్షిణద్వార ప్రవేశసమయమున నగరమువెలుపల బహు పుత్రులు కల దరిద్రస్త్రీని గనుగొనెను. ఆమెకు ఏడుగురు పుత్రులు; అంద రును ఆరోగ్యవంతులే. ఒకనిచేతిలో వంటచట్టియు, ఇంకొకనిచేతిలో చాపయు కలవు. ఒకడు ముందు, వేరొకడు వెనుకను నడచుచుండిరి. ఒకడు తల్లివ్రేలు పట్టుకొని నడచుచుండెను; ఒక డామె చంకలోను మరియొకడు బుజముపైనను ఉండిరి.

పురోహితు డామెతో "భద్రే, ఈ పిల్లలతండ్రి యెచట?" అనెను. "స్వామీ, వీరికి ఒక్కతండ్రి నిశ్చితముగా లేదు." "ఇట్టి పుత్రులు నీ కెట్లు లభించినారు?" ఆమె యితరాధారములు చూపలేక, నగరద్వారమున నున్న మర్రిచెట్టు చూపి, "స్వామీ, ఈ వృక్షముపై నున్న దేవతను ప్రార్థిం పగా లభించినారు. ఈ దేవతవలననే పుత్రలబ్ధి" అని చెప్పెను. "మంచిది.

నీవు పొమ్ము'' అని పురోహితుడు రథము దిగి మర్రిచెట్టుక్రిందికి జేరి, కొమ్మ పట్టుకొని ఊపి, "హే దేవపుత్ర, రాజువలన నీ కేమియు ముట్టలేదా ? రాజు ప్రతివత్సరము వేయిముద్రలు వెచ్చించి నీకు బలిపూజాదులు చేయుచున్నాడే. నీ వాయనకు పుత్రునొసగలేదు. ఆ దరిద్రవనిత నీ కేమి యుపకారము చేసిన దని ఏడుగురు పుత్రుల నిచ్చినావు ? మా రాజుకు పుత్రు నొసగవేని ఏడవనాడు సమూలముగా వృక్షమును పెరికించి, ముక్కముక్కలు చేయించెదను'' అని వృక్షదేవతను బెదరించి వెడలిపోయెను. ఆతడు మరునాడు, ఆ మరునాడు వరుసగా ఆరురోజులు వృక్షముకడకు బోయి బెదరించెను. ఆరవనాడు బ్రాహ్మణుడు చెట్టుకొమ్మ పట్టుకొని "వృక్షదేవతా, ఇక ఒక్కరాత్రిమాత్రము మిగిలియున్నది. మా రాజుకు పుత్రు నొసగవేని రేపు నీ పని పూర్తి చేసెదను'' అనెను. వృక్షదేవత యోచించి దీనిలోని తోతు గ్రహించి "ఈ బ్రాహ్మణుడు నా విమానమును నాశము చేయును. ఇతనికి ఏవిధముగ పుత్రు నీయవచ్చును'' అనుకొని నలుగురు మహారాజుల కడకు బోయి ఈ విషయము చెప్పగా, మావలన కాదు అని వారు పలికిరి. అంతట వృక్షదేవత యక్షసేనాపతులకడకు బోయెను. వారును పై విధముగనే సమాధానము చెప్పిరి. అంతట దేవరాజ శక్రునికడకు బోయి చెప్పగా ఆయన యోగ్యపుత్రు డితనికి లభించునా అని విచారించుచు నలుగురుదేవపుత్రులను కాంచెను. వారు పూర్వజన్మలో వారాణసిలో సాలీలు. వారు తమకు లభించినదానిని ఐదుభాగములు చేసి నాలుగుభాగములు తా మనుభవించి ఐదవభాగము దానము చేయుచుండిరి. ఆవల వారు త్రయఃత్రింశభవనమున జన్మించిరి; ఆవల యామభవనమున ఈ ప్రకారముగా వారు క్రిందినుండి పైకి, పైనుండి క్రిందికి ఆరు దేవ లోకముల భోగము లనుభవించుచు విచరించుచుండిరి. ఆ సమయమున త్రయఃత్రింశభవనమునుండి చ్యుతులై యామభవనమునకు బోవనుండిరి. శక్రుడు వారిని సమీపించి "మిత్రులారా, మీరు మానవలోకమునకు బోవలసి యున్నది. అచటి ఏసుకారి ప్రభువు పట్టపుదేవి కడుపున పుట్టవలెను'' అని అనతిచ్చెను. వారు "దేవా, చిత్తము. కాని మావలన రాజకులమునకు ప్రయోజనములేదు. మేము పురోహితునియింట పుట్టుదుము. చిన్నతనముననే ప్రవ్రజింతుము'' అనిరి. శక్రుడు మంచి దని ప్రతిజ్ఞ చేయించికొని వృక్ష

దేవతకడకు వచ్చి ఆ విషయము తెలిపెను. దేవత సంతుష్టచిత్తముతో శక్రునకు నమస్కారము చేసి నిజవిమానమునకు జనెను.

మరునాడు పురోహితుడు కొందరు పనివాండ్రను వెంటబెట్టుకొని గొడ్డలి మొదలగు పనిముట్లతో వృక్షము క్రిందికి చేరి, కొమ్మ పట్టుకొని "దేవతా, నేను నిన్ను ప్రార్థించుటలో వారము గడచినది. ఇపుడు నీయంత మాసన్న మైనది" అనెను. అప్పుడు వృక్షదేవత వృక్షకోటరమునుండి మహా వైభవముతో బయలు వెడలి మధురస్వరమున పలుకరించి "బ్రాహ్మణోత్తమా, ఒక్కపుత్రునిమాట అటుంచుము. నీకు నలుగురు పుత్రులను ఇచ్చెదను" అనెను. "నాకు పుత్రులు వలదు. మా రాజుకు పుత్రుల నిమ్ము." "నీకే పుత్రులు లభింతురు "అట్లయినచో నాకు ఇరువురను రాజు కిరువురను ఇమ్ము." "రాజుకు లేరు, నీకు మాత్రమే నలుగురుపుత్రులు లభింతురు. వారు సంసారమున నుండక చిన్నతనముననే ప్రవ్రజింతురు." "నీవు పుత్రుల నిమ్ము. వారు ప్రవ్రజింపకుండ చూచుభారము మాది."

వృక్షదేవత వర మిచ్చి విమానమున ప్రవేశించెను. ఆవల వృక్షదేవతకు ఆదరసత్కారములు హెచ్చెను. జ్యేష్ఠ దేవపుత్రుడు పురోహితుని భార్యకడుపున బడెను. నామకరణమునాడు అతనికి హస్తిపాలు డని పేరు పెట్టి ఆతడు ప్రవ్రజింపకుండుటకై మావటీల కప్పగించెను. వా రతనిని తమపద్ధతులపై పోషింపసాగిరి. రెండవ దేవపుత్రుడు పట్టపురాణికడుపున బడెను. నామకరణము నాడు అశ్వపాలకు డని పేరు పెట్టి ఆ కులమువారి కిచ్చి పెంచు మనిరి. మూడవవాడు పుట్టినపిదప గోపాలు డని పేరు పెట్టి వానిని గొల్లల కిచ్చి పెంచు మనిరి. నాల్గవవాడు పుట్టినపిదప అజపాలకు డని పేరు పెట్టి గొర్రెలు మేపువాని కిచ్చి పెంచు మనిరి. వా రందరు పెరిగినపిదప సౌభాగ్యవంతులైరి.

బాలురు ప్రవ్రజింతు రనుభయముచే రాజు ప్రవ్రజితుల నెల్లరను రాజ్యసీమలో నుండి ఆవలకు పంపివేసెను. సమస్త కాశీరాష్ట్రమున ప్రవజితుని ఒక్కనిని గూడ నిలువనీయ లేదు ఆ కుమారులు కఠోరస్వభావులు. వారి నెటుకొనిపోయినను అటుపోవువారిని దోచుకొనజొచ్చిరి. పదునారు సంవత్సరముల వయసు వచ్చిన హస్తిపాలకుని జూచి రాజు, పురోహితు

డును "కుమారులు పెద్దవారైనారు. వారికి అభిషేకము చేయదగిన సమయము ఆసన్నమైనది. ఇప్పుడేమి చేయవలెను?" అని యోచించి "అభిషేకము చేసిన పిదప వీరు మరింత ఉద్దండు లగుదురు. అప్పుడు ప్రవ్రజితులు వచ్చినచో చూచి వీరుకూడ ప్రవ్రజింతురు. ఆవల జనసమూహము చెలరేగిపోవును. ఇప్పుడే బాగుగా యోచించి ఆవల అభిషేకము చేయుదము" అని తలపోసిరి.

ఇట్లు యోచించి ఉభయులును ఋషివేషములు దాల్చి భిక్షాటనము చేయుచు హస్తిపాల కుమారుని స్థానమున కేగిరి. అతడు సంతుష్టచిత్తుడై వారిసన్నిధికి వచ్చి ప్రణామము చేసి ఈ గాథలు పలికెను:

పంకదంత, జటాధర, భారవాహి
దైవతుల్య, భూమీసురదర్శనంబు
కల్గిన దదృష్టమున నింతకాలమునకు!

ధర్మనిరతులు కాషాయధారులైన
ఋషుల సందర్శనంబు ఘటియిల్లె నేడు.

ఒసగినా మాసనములు పాదోదకములు
ఈ పవిత్ర పదార్థంబు లెల్ల మీకు:
స్వీకరింపగ మీనిని వేడువాడ.

ఈ ప్రకారముగా అతడు వారిని మాటిమాటికి నడిగెను. అప్పుడు పురోహితుడు "బాబా, మేము ఎవ్వర మని నీవు ఇట్లు చేయుచున్నావు?" అని యడిగెను.

"హిమాలయవాసు లగు ఋషులని."

"బాబా, మేము ఋషులము కాము. ఈయన ఏసుకారి ప్రభువు, నేను మీ తండ్రి పురోహితుడను."

"అట్లగుచో ఋషివేషము లేల తాల్చినారు?

"నిన్ను పరీక్షించుటకై."

"నన్నేమి పరీక్ష చేయుదురు ?"

"నీవు మమ్ము గాంచి ప్రవజితుడవు కానిచో నీకు రాజ్యాభిషేకము చేయుటకై వచ్చినాము."

"బాబా, నాకు రాజ్య మక్కర లేదు. నేను ప్రవ్రజించెదను."

అంతట తండ్రి "నాయనా, హస్తిపాలా, ఇది ప్రవ్రజింపదగిన సమయము కాదు" అని రాజు తన యాశయానుసారముగా ఉపదేశ మిచ్చువాడై ఈ గాథ పలికెను :

వేద మభ్యసించి, విత్తంబు సమకూర్చి
సుతుల రాజ్యమందు సుస్థిరులను
జేసి, కాననంబు చేరుట యుక్తంబు :
సాధుజనులు దీని సమ్మతింత్రు.

అంతట హస్తిపాలు డిట్లనెను :

అవి యేల నాకు ? గంధాదిభోగములు
మూర్ఛాప్రదము లంచు మునుల నిర్ణయము
స్వీయకృత్యంబుచే సిద్ధించు ఫలము.

కుమారునివాక్కులు విని రా జిట్లనెను :

అవును, స్వయంకృత మైనయద్దాన
నే ఫలం బొదవును; నీతలిదండ్రు
లైరి వృద్ధులు, నూరుహాయనంబులకు
నిను జూడ వాంఛింత్రు నీరోగిగాను.

విని కుమారుడు "దేవా, ఇట్లనుచున్నా రేమి ?" అని యీ గాథలు పలికెను :

మరణముతో మైత్రి, జరతోడి చెల్మి
తనకు లే దని మృతి తలచెడివాని
నీరోగి యనవచ్చు నూరేండ్లదాక.

నావను నీటిలో నడిపెడివాడు
కూలము ప్రక్కగా గొనిపోవునట్లు
జరయును వ్యాధియు జనులను బట్టి
కొని, మిత్తివద్దకే కొనిపోవుచుండు.

అని యిట్లు జీవులసంసారము తుచ్ఛత ప్రకటించి "మహారాజా, తాము నిలువుడు. నేను మీతో మాటలాడుచుండగనే జరారోగములు, మృత్యువు సమీపించుచున్నవి. అప్రమత్తులై యుండుడు" అని రాజుకు తండ్రికి నమస్కరించి, తనవరిచారకులను వెంట నిడుకొని. ప్రవ్రజించు నుద్దేశముతో వారాణసీరాజ్యము వెలువడెను. ఈ ప్రవ్రజ్య సుందరము అని తలచి జనులు అతని ననుసరించిరి. యోజనముమేర పూర్తిగా ఊరేగింపు సాగెను. వారితో నాతడు గంగాతటము చేరి, జలము గాంచి యోగ మభ్య సించి, ధ్యానలబ్ధి యయినపిదప, "ఇచట జనులు గుమి గూడుదురు. నా సోద రులు మువ్వురు, తల్లిదండ్రులు, రాజు, దేవియు ప్రవ్రజింతురు. అను యాయులతోగూడ వారాణసి ఖాళీ యగును. వీర లందరు వచ్చువరకును నే నిచ్చటనే యుందును" అనుకొని జనసంఘమున కుపదేశ మిచ్చుచు నచ్చటనే యుండెను.

ఆవల నొకనాడు రాజు, పురోహితుడును కలిసి "హస్తిపాలకుమా రుడు రాజ్యము విడిచి, జనులను వెంట గొని, ప్రవ్రజించుతలపున గంగా తటమున నివసించుచున్నాడు. మనము అశ్వపాలుని పరీక్షించి, అభిషేకిం తము" అనుకొని, ఋషివేషములు ధరించి, ఆతని గృహద్వారముకడ నిలి చిరి. వారిని జూచి ఆతడు ప్రణామము చేసి, దగ్గరకు బోయి, ప్రసన్న చిత్తముతో "చిరస్సం వత" ఆదిగాథలు పలికెను అనంతరము హస్తిపాలు నితో సంభాషణ జరిగినట్లే ఇతనితోగూడ జరిగెను. అశ్వపాలుడు వారితో "నా సోదరుడు హస్తిపాలు డుండగా శ్వేతచ్ఛత్రమునకు ముందుగా నే నెట్లధికారి నగుదును?" అనెను. "బాబా, నీయన్న నాకు రాజ్య మక్కరలేదు, నేను ప్రవ్రజింతును అని వెడలిపోయినాడు." "ఇప్పుడాయన యెచట నున్నాడు?" "గంగాతటమున". "బాబా, నా యన్న విడిచిపోయిన యుచ్ఛిష్టముతో నాకు పనిలేదు. మూర్ఖుడగు తుచ్ఛప్రాణి యిట్టి క్లేశమును

విడువలేడు. నేను దీనిని విసర్జింతును" అని అశ్వపాలుడు వారల కుపదేశ మిచ్చువాడై యీ గాథలు పలికెను :

బురదవంటివి కామభోగాలు దుస్త
రములును సుమనోహరమ్ములు, మరణ
సౌఖ్యమ్ము నొసగును జనునకు తుదిని.

అనుభవింతును నేను వెనుకజన్మమున
గావించు భీకరకర్మఫలంబు
దాన మోక్షము లేదు, దమియించువాడ
నిప్పుడు వాక్కు, కర్మేంద్రియమ్ములను,
క్రమ్మర దుష్కృతుల్ కావింపకుండ.

"మీరు నిలువుడు. నేను మీతో మాటాడుచుండగనే జరారోగములు, మృత్యువు సమీపించుచున్నవి" అని వారి కుపదేశ మిచ్చి, యోజనప్రదేశము నిండు జనమును వెంట గొని, బయలుదేరి హస్తిపాలకుమారునికడకె బోయెను. ఆత డాకసమున గూరుచుండి ధర్మోపదేశ మిచ్చుచు "సోదరా, ఇచట జనము పెద్దగుంపుగా గూడుదురు. ఇక్కడనే మనము ప్రస్తుత ముందము" అనెను. అశ్వపాలు డంగీకరించెను.

ఆవల నొకనాడు రాజు, పురోహితుడును గోపాలకుమారుని యింటికి బోయిరి. ఆతడు స్వాగతము చెప్పినపిదప, తాము వచ్చినపని తెలిపిరి. ఆతడు అశ్వపాలకుమారునివలెనే నిరాకరించి, పోయిన వృషభమును వెదకువాని వలె "నేను చాలరోజులనుండి ప్రవ్రజ్యకై అన్వేషించుచున్నాను. వృషభ పాదచిహ్నములవలె నాకును సోదరులు చన్నమార్గము గోచరించుచున్నది. నే నిప్పు డాత్రోవనే పోవుదును" అని యత డీగాథ పలికెను :

కనబడకుండంగ జను వృషభంబు
కై వెదకెడునట్లు కాటను జనుడు,
నాదు ప్రవ్రజ్యా ధనంబు గోల్పోవ
దాని నన్వేషింప కే నెట్టు లుందు ?

"నాయనా, గోపాలా, ఒకటి రెండు దినములు వేచియుండుము. మేము కుదుటబడిన పిదప నీవు ప్రవ్రజింపవచ్చును" అని వారు చెప్పగా గోపాలుడు "మహారాజా, నేడు చేయదగినపని రేపు చేయుదునని చెప్ప రాదు. శుభకర్మ నేడే చేయదగును" అని యీ గాథ పలికెను :

కర్తవ్యమును వేగ కావింపకుండ
తామసించెడివాడు తప్పక చెడును.
భావికాలము తీరు బాగుగా నెరిగి
ఆలసింపడు ధీరు డాచరణాన.

ఇట్లు ధర్మోపదేశము చేసి, "మీరు నిలువుడు. నేను మీతో మాట లాడుచుండగనే జరావ్యాధులు, మరణము సమీపించుచున్నవి" అని యతడు యోజనము మేర నిండిన జనమును వెంటగొని, బయలుదేరి, ఇరువురు సోద రులకడకు బోయెను. అశ్వపాలు డాకసమున నుపవిష్టుడై అతనికి ధర్మోప దేశము చేసెను.

ఆవల రాజు, పురోహితుడును అజపాల కుమారుని గృహమునకు జని స్వాగతానంతరము తాము వచ్చిన కారణము తెలిపి, ఛత్రధారణము చేయు మనిరి. అతడు "నా సోదరు లెచటనున్నారు" అని యడిగెను. "వారు మాకు రాజ్యముతో పనిలేదు, అని శ్వేతచ్ఛత్రము విడిచిపెట్టి మూడు యోజన ములవరకును జనులు తమ్ము ననుసరించుచుండ బయలుదేరి గంగాతటము నకు బోయి నివసించుచున్నారు'' అనిరి. "అట్లయిన నా సోదరులు ఉచ్ఛిష్టము వలె విసర్జించి పోయినదానిని నేను వహించి తిరుగుదునా? నేనుకూడ ప్రవ్రజింతును" అనెను. "బాబా, ఇంకను నీవు చిన్నవాడవు. మా తోడ్పాటు నీకుండును. పెద్దవాడవైన పిదప ప్రవ్రజింప వచ్చును." "ఏమను చున్నారు? ప్రాణులు చిన్నతనములోను పెద్దతనములోను చనిపోవుట లేదా? ఇతడు చిన్నతనమున పోవును, ఇతడు వార్ధకమున పోవును అని చేతులలో నైనను కాలిలో నైనను ప్రమాణములులేవు. నా మరణకాలము నాకు తెలియదు. కావున నిప్పుడే ప్రవ్రజించెదను" అని అతడు ఈ గాథలు పలికెను :

భోగ మెరుగక, కేతకీ పుష్పనాస
కలిగి హాసవిలాస సంకలిత యగుచు
మత్తమైన కుమారిని మిత్తి మొదటి
వయసునం దెత్తుకొనిపోవు నయములేక.

సుందరుండు, కులీనుండు, కుందనంపు
రంగుమేనివాడును, కేసరములు వోలె
దాడి వ్యాపించి యున్నట్టి తరుణు మిత్తి
ఎత్తుకొనిపోవు చెప్పక యెప్పుడైన-
కావునం ద్యజియించి భోగములు నేను
ప్రవ్రజింపగ దయచేయవలె ననుజ్ఞ.

ఇట్లని "మీరు నిలువుడు, నేను మీతో సంభాషించుచుండగనే జరా వ్యాధులు, మరణము సమీపించుచున్నవి" అని వారికి ప్రణామము చేసి, యోజనమువరకు జనులు తన ననుసరించుచుండగా బయలు వెడలి గంగా తటము చేరెను. హస్తిపాలుడు ఆకసమున గూరుచుండి ధర్మోపదేశము చేసి ఇక్కడ జనసమూహము కూడుననగా విని అచటనే నిలిచిపోయెను.

మరునాడు పురోహితుడు సుఖాసీనుడై "నా పుత్రులు ప్రవ్రజించినారు. ఇప్పుడు నేను మానవరూపమున నున్న మ్రోడువలె నైనాను. నేను కూడ ప్రవ్రజింతును" అనుకొని బ్రాహ్మణితో ఈ విషయము విమర్శించుచు ఈ గాథ పలికెను :

శాఖాసహితమైన సమయమ్మునందె
అగును వృక్షము వృక్ష, మటు కానిదాని
బోదె యందురు, నాకు పుత్రులు లేమి
నే ప్రవ్రజించుట నేడె యుక్తంబు.

ఇట్లని ఆతడు బ్రాహ్మణులను పిలువనంపెను. అరువదివేల మంది బ్రాహ్మణులు గుమి గూడిరి, ఆతడు వారితో "మీ రేమి చేయుదురు?" అనెను. "ఆచార్యా, మీ రేమి చేయుదురు?" "నేను పుత్రుల కడ ప్రవ్ర

జించెదను.'' ''కేవలము మీకే నరకము వేడి యెక్కలేదు. మేముకూడ ప్రవ్రజింతుము.'' బ్రాహ్మణు డెనిమిదికోట్ల ధనమును బ్రాహ్మణికిచ్చి, యోజనము మేర బ్రాహ్మణులు వెంటవచ్చుచుండగా పుత్రుల సమీపము నకు జనెను. హస్తిపాలుడు ఆ జనసమూహమును చూచి ఆకాశమున నిలిచి ధర్మోపదేశము చేసెను.

మరువాడు బ్రాహ్మణి ''నా పుత్రులు నలుగురు శ్వేతచ్ఛత్రమును విడిచి ప్రవ్రజింపబోయినారు. ''బ్రాహ్మణుడు కూడ రాజపురోహిత పదవిని వదలి యెనుబదికోట్ల ద్రవ్యము విడిచి కొడుకులకడకు జనినాడు. ఇచట నే నేమి చేయుదును ? నేను కూడ పుత్రుల ననుగమించెదను'' అను కొని వెనుకటి యుదాహరణములు స్మరించుచు ఉల్లాస గాథ పలికెను :

గగన సీమను క్రౌంచంబు లెగురునట్లు
మంచు రాలెడి వేళల నంచగములు
జాలములు త్రెంచికొని పోవు చందమునను
నాదు పుత్రులు పతియును నన్ను విడిచి
చనిన వా, రేను వారల ననుసరింతు.

''నేనెట్లు తలపోయుచున్నదాన నైనను ప్రవ్రజింపగూడదా'' అను కొని నిర్ణయించుకొని బ్రాహ్మణస్త్రీలను పిలువనంపి ''మీరేమి చేయుదురు'' అనెను. ''ఆర్యా, మీరేమిచేయుదురు. ?'' ''నేను ప్రవ్రజింతును.'' ''మేము కూడ ప్రవ్రజింతుము''. ఆమె మహాసంపదను విసర్జించి యోజనము మేర నిండు వారు వెంట వచ్చుచుండగా పుత్రులకడకు జనెను. హస్తిపాలుడు ఆ సంఘమును చూచి ఆకసమున కూరుచుండి ధర్మోపదేశము చేసెను.

మరునాడు రాజు ''పురోహితు డెక్కడ'' అనెను ? ''దేవా, పురో హితుడు, ఆయన భార్య సమస్తధనమును విడిచి రెండు మూడు యోజన ములు వ్యాపించు జనమును వెంటగొని పుత్రులకడకు పోయినారు'' అని అచటివారు విన్నవించిరి. 'యజమానుడు లేని ధనము రాజుకు చెందును' అనుకొని రాజు వారి యింటనుండి ధనము తెప్పించెను.

పట్టపుదేవి, 'రాజుగారు ఏమిచేయుచున్నా' రనెను. "పురోహితుని ఇంటినుండి ధనము తెప్పించుచున్నారు" "పురోహితు డెక్కడ ?" "భార్యతోగూడ ప్రవ్రజ్యకై బయలువెడలినారు."

ఈ మాటలు విన్నతోడనే పట్టపుదేవి తనలో బ్రాహ్మణుడు, బ్రాహ్మణి, నలువురు పుత్రులు విడిచిపోయిన మలమువంటి ధనమును మోహమున తన యింటికి రాజు తెప్పించుకొనుచున్నాడు. రాజాంగణమున ధనరాసులు పోయుచున్నారు. ఈయన ఋజుమార్గమును విడిచి వల పన్నినాడు. దూరమునుండి చూచి గ్రద్ధ మాంసముకొరకు లేచును. బుద్ధిగలిగిన గ్రద్దలు వల పన్నియుండుటకని తమ భారమును గమనించి యెగురలేక తిన్న మాంసమునుకూడ విడిచి వలలో చిక్కుకొనక సూటిగా నెగిరిపోయినవి. కాని అంధులు, మూర్ఖులు నగువారు ఉచ్ఛిష్టమును తిని బరువెక్కి సూటిగా నెగురలేకున్నారు. వారు పోయి వలలో చిక్కుకున్నారు." అని నిదర్శనముగా ఒక గ్రద్దను తెప్పించి పట్టపురాణి రాజుకడకు పోయి "మహారాజా, దయచేయుడు. రాజాంగణమున వినోదము చూతురుగాని" అని పంజరము తెరచి "మహారాజా, ఈ గ్రద్దలను చూడుడు" అని ఈ గాథలు పలికెను.

తిని యెర, వాంతి చేసిన విహంగములు
ఎగిరిపోవుచు నున్న వెర క్రక్క నట్టి
పక్కు లెతెంచుచు చిక్కు నా చేత.

భూమీసుర త్యక్త భోగముల్ రాజ,
అనుభవించెదవు; వాంతాశన మెవడు
భుజియించు, వానిని పొగడుదు రెవరు ?

విని రాజు పశ్చాత్తాపము చెంది మూడు జన్మల వ్యథ గ్రహించి నేడే రాజ్యము విడిచి ప్రవ్రజింపవలయును అనుకొని, వైరాగ్య ముదయించుటచే దేవిని ప్రశంసించుచు ఈ గాథ పలికెను :

పంకంబునన్ జారిపడ్డ దుర్బలుని
బలవంతు డుద్ధరింపగ జాలినట్లె
పాంచాలి, నీదు సుభాషిత గాథ
లుద్ధరించినవి నన్నూబిలోనుండి.

ఇట్లని అమాత్యుల పిలువనంపి "మీ రేమి చేయుదురు ?" అనెను. "దేవా ! తామో ?" "నేను హస్తిపాలునికడ ప్రవ్రజింతును." "దేవా, మేముకూడ ప్రవ్రజింతుము."

రాజు వారాణసీ రాజ్యము విడిచి 'కావలసినవారు శ్వేతచ్ఛత్రము ధరింపవచ్చును' అని చాట బంచెను. అవల మూడు యోజనముల వరకు అనుయాయులు వెంట వచ్చుచుండ కుమారునికడకు జనెను. ఆతడు పరిషత్తును చూచి అకసమున కూరుచుండి ధర్మోపదేశము చేసెను.

రాజు ప్రవ్రజించిన విషయము ప్రకటించుచు శాస్త ఈ గాథ పలికెను :

ఇట్లు పలికి దిశాంపతి యేసుకారి
ప్రభువు రాజ్యంబు విడనాడి ప్రవ్రజించె
బంధనము త్రెంపుకొని హస్తి పరచునట్లు.

మరల నొకనాడు నగరములో మిగిలినజనులు సమావిష్టులై రాజద్వారముచేరి దేవికెరుకపరచి రాజభవనమున ప్రవేశించి దేవికి నమస్కరించి ఒక ప్రక్క నిలిచి ఈ గాథ పలికిరి :

సరిపడె ప్రవ్రజ్య జనపతి, కరిగె
వీరుండు రాజ్యంబు విడనాడి; ఇంక
మా 'రాజువై' నీవు మా రక్షణమున
శాసింపు రాజ్యమ్ము జనసమ్మతముగ.

ఆమె జనుల వాక్కులు విని ఈ గాథలు పలికెను :

సరిపడె ప్రవ్రజ్య జనపతి, కరిగె
వీరు డుత్తమభూమి విడనాడి : నేను
విడిచి మనోహర వివిధ భోగముల
నేకాకినిగ చరియింతు లోకమున.

వివిధ భోగంబుల విడనాడి నేను
ఏకాకినిగ చరియింతు లోకమున.

కడచుచున్నది కాలమ్ము, రాత్రు
లెన్నియో చనుచున్న వెరుక లేకుండ,
ఆయుస్సు క్రమముగా వ్యయ మగుచున్న,
దేకాకినిగ చరియింతు లోకమున.

సంగమ్ము విడనాడి శాంత చిత్తమున
ఏకాకినిగ చరియింతు లోకమున

ఈ విధముగా ఆమె జనులకు ధర్మోపదేశమిచ్చి అమాత్యుల భార్యలను పిలువనంపి 'మీ రేమి చేయుదురు' అనెను. "ఆర్యా, తా మేమి చేయుదురు ?" "నేను ప్రవ్రజింతును." "మేముకూడ ప్రవ్రజింతుము " మంచిదని ఆమె రాజభవనములోని సువర్ణాగారాదులు తెరపించి ఫలాని స్థానమున పెద్ద ఖజానా పాతిపెట్టియున్నది అని బంగరు పట్టామీద చెక్కించి, కావలసినవారు వచ్చి తీసుకొనుడు అని నగరమున చాట బంచి, యెత్తయిన కంబముపై బంగరు పట్టిక బంధించి, సంపదలు విడిచి నగరము వెలువడెను. నగరమున కోలాహలము చెలరేగెను. రాజు, దేవియు రాజ్యము విడిచి ప్రవ్రజించుటకై వెడలిపోయిరి. ఇప్పుడు మనమేమి చేయుదము ? అని లోకులు భవనములు విడిచి బిడ్డలను చంకనెత్తికొని బయలుదేరిరి. తెరచిన దుకాణములన్నియు తెరచినట్లేయుండెను. వెనుకు వచ్చి చూచినవారు లేరు. నగరమంతయు నిర్మానుష్యమయ్యెను. దేవియు మూడు యోజనములు నిండు జనములను వెంట గొని హస్తిపాలకుమారుని కడకు జనెను. అతడు ఆకసమున గూరుచుండి ధర్మోపదేశము చేసి పంద్రెండు యోజనముల పొడవున అనుయాయులను వెంటగొని హిమవంతమువైపు చనెను. హస్తిపాలకుమారుడు పంద్రెండు యోజనముల వారాణసి ఖాళీ చేయించి జనమును హిమాచలమువైపు కొనిపోవుచున్నాడు మన దొక లెక్కయా" అనుకొని కాశీరాష్ట్రిమం దంతటను కలకలము చెలరేగెను. క్రమముగా

ముప్పది యోజనముల పొడవున అనుయాయులు వచ్చుచుండి అతడు హిమాలయమున ప్రవేశించెను.

శక్రుడు ధ్యానదృష్టితో జూడగా హస్తిపాల కుమారుడు అభినిష్క్రమణము చేసి బయలు వెడలె నని తోచెను. జనసమూహము మెండగు ననియు నివాసస్థానము సమకూర్పవలెననియు తలచి శక్రుడు విశ్వకర్మను బిలువనంపి "పోయి ముప్పదియారు యోజనముల పొడవు, పదునారు యోజనముల వెడల్పు కల యాశ్రమము నిర్మించి, వలయు సామగ్రి అన్నియు సమకూర్పుము" అని ఆనతిచ్చెను. అతడు చిత్తమని, చని గంగా తటమున తత్ప్రమాణములు కల యాశ్రమము రమణీయస్థానమున నిర్మించెను. ఆశ్రమము లన్నింటను వలసిన వస్తువులు సమకూర్చెను. ప్రతి కుటీరమునకు చంక్రమణ ప్రదేశము, మొగదల ఫలవృక్షము, మంచినీటి బావి, వివిధ సుగంధి పుష్పలతలు పర్పరించెను. ఆ కాలమున గూడ దేవతా ప్రభావముచే వృక్షములు ఫలములతోను, లతలు పుష్పములతోను నిండి యుండును. ఆశ్రమ నిర్మాణానంతరము విశ్వకర్మ ప్రతి పర్ణశాలలో ప్రవ్రజితులకు వలసిన వస్తుసముదాయము సమకూర్చెను. గోడపై "ప్రవ్రజింప దలచువారు ఈ యీ ముఖ్యవస్తువులను గొనిపోవచ్చును" అని లిఖించి, మృగ, పక్షి, అమనుష్యప్రభృతికి దుర్దర్శనీయ జీవులను భయంకర నాదముతో, గర్జతో, దూరీకరించి, వెడలిపోయెను.

హస్తిపాలకుమారుడు దండధారియై ఆశ్రమములోనికి జని అక్షరములు చూచి "శక్రుడు నా మహాభినిష్క్రమణము గ్రహించియుండును" అనుకొని, ద్వారము తెరచి, పర్ణశాలలోని కరిగి, ఋషిప్రవ్రజ్యకు వలయు వస్తువులు గొని యీవలకు వచ్చి చంక్రమణ స్థానమున దిగి, కొన్నిసారు లిటు నటు పచారు చేసి, అందరను ప్రవ్రజితులను కావించి, ఆశ్రమ విషయము యోచించెను. చిన్నబిడ్డలకు స్త్రీలకు నడుమనున్న పర్ణశాల లిచ్చి ఆవల వృద్ధ స్త్రీలకు, తరువాత వంధ్యలకు, అనంతరము నాలుగు వైపులను పురుషులకు పర్ణశాల లిచ్చెను.

వారాణసిలో రాజు లేడని యొకానొక రాజు విని, యచటికి వచ్చి అలంకృత రాజభవనమున ప్రవేశించి, ఎటు చూచినను రత్నరాసులను గమ

నించి, "ఇట్టి గొప్పనగరమును విడిచిపోయి జరిపిన ప్రవ్రజ్య గొప్పదయి యుండును" అని తలచి, ఒకానొక త్రాగుబోతు నడిగి, మార్గము తెలిసి కొని హస్తిపాలకుమారునికడ కరిగెను. రాజు వనము మొగదలకు వచ్చినట్లు విని హస్తిపాలకుమారుడు స్వాగతము పలికి, ఆకాశమున గూరుచుండి, ధర్మోపదేశము చేసి, ఆశ్రమమునకు గొనివచ్చి, ఎల్లరను ప్రవ్రజితులను జేసెను. ఈ విధముగా మరి యారుగురు రాజులను ప్రవ్రజితులను జేసెను. ఏడుగురు రాజులు సంపదలు విడిచిపెట్టిరి. ముప్పదియారు యోజనముల యాశ్రమము నిండిపోయెను కామాది సంకల్పములచే తర్కవితర్కములలో పడినవారికి మహాపురుషుడు ధర్మోపదేశమిచ్చి, బ్రహ్మవిహారమును యోగ విధిని జూపుచుండెను. వారిలో ననేకులు ధ్యానాభిజ్ఞలు పొంది, మూడు వంతులలో రెండు వంతులమంది బ్రహ్మలోకమున బుట్టుచుండిరి. మరల మూడవ వంతులోనుండి ఒక భాగము బ్రహ్మలోకమునను, ఒక వంతు ఆరు కామలోకములలోను, ఒకవంతు ఋషిసేవ చేసి మానవలోకమునను, ఒక వంతు కుశల సంపత్తులలోను జన్మించుచుండిరి. హస్తిపాలుని శాసనమున ఒకరును నరకమున జన్మింపలేదు, పశు జన్మ మెత్తలేదు, అసుర ప్రేత జన్మము లెత్తలేదు.

ఈ తామ్రపర్ణీ ద్వీపమున పృథ్వీచాలక ధర్మగుప్తస్థవిరుడు, కటకన్ధ కారవాసి పుష్యదేవస్థవిరుడు, ఉపరిమండల కమలవాసి మహా సంఘరక్షిత స్థవిరుడు, మతిమహాదేవస్థవిరుడు, భగ్గిరివాసి మహాదేవస్థవిరుడు వామంత పచ్చారవాసి మహాసీవస్థవిరుడు, కాళవల్లి మండపవాసి మహానాగస్థవిరుడు, కుదాల సమాగమమున, మూగపక్ష సమాగమమున, చూళసుతసోమ సమా గమమున, అయోఘరపండిత సమాగమమున, హస్తిపాల సమాగమమున అందరకంటె వెనుక వెలువడిన పురుషులు. ఇందుచేతనే భగవాన్ ఇట్లు చెప్పినాడు :

శీఘ్రు శీఘ్రుంబుగా చేయంగ వలయు
మంచి కార్యము, లాలసించుట తగదు.

శాస్త యీ ధర్మోపదేశనము చేసి, "భిక్షువులారా, కేవల మిప్పుడే కాదు; పూర్వముకూడ తథాగతుడు అభినిష్క్రమణము చేసినాడు" అని జాతకములు సరి పోల్చెను.

ఆకాలమున ఏసుకారి శుద్ధోదనమహారాజు; దేవి మహామాయ; పురోహితుడు కాశ్యపుడు; బ్రాహ్మణి భద్రకాపిలాని; అజపాలుడు అనురుద్ధుడు; గోపాలుడు మౌద్గల్యాయనుడు; అశ్వపాలుడు సారిపుత్రుడు; శేష పరిషత్తు బుద్ధపరిషత్తు; హస్తిపాలుడు నేనే.

——:():——

510. అయోఘర జాతకము

శాస్త జేతవనమున విహారము చేయు నపుడు మహాభినిష్క్రమణమును గూర్చి చెప్పినది. "భిక్షువులారా, కేవలమిప్పుడేకాదు, పూర్వముకూడ తథాగతుడు మహాభినిష్క్రమణము చేసి యుండెను" అని, శాస్త పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు చుండగా ఆయన పట్టపుదేవి గర్భము ధరించి ఒకానొక ప్రాతఃకాలమున పుత్రుని కనెను. వెనుక జన్మలో ఆమెసవతి వంధ్య యగుటచే పుత్రవతి యగు నామె బిడ్డలను మ్రింగ ప్రతిన చేసెను. మరణానంతర మామె యక్షిణి యయ్యెను. రెండవయామె రాజుకు పట్టపుదేవియై పుట్టి పుత్రుని గనెను. అదను చూచి ఆ యక్షిణి బీభత్సాకారముతో వచ్చి, దేవి చూచు చుండగనే శిశువు నెత్తికొని పరుగెత్త సాగెను. దేవి ఎలుగెత్తి "యక్షిణి నా శిశువు నెత్తికొని పరుగెత్తుచున్నది" అని యరచెను. యక్షిణి శిశువును మ్రింగి దుంపను నమలునట్లు నమిలి తిని, చేతులతో దేవిని బెదరించి వెడలి పోయెను. రాజు విని, యక్షిణి నేమి చేయవలెనో తోచక మిన్నకుండెను.

రెండవ మారు దేవి ప్రసవించు కాల మాసన్న మయినపుడు గట్టి రక్షక దళము నియుక్తమయ్యెను. దేవి పుత్రుని ప్రసవించెను. యక్షిణి వచ్చి శిశువును భక్షించెను. మూడవ మారు మహాసత్త్వ డామె కడుపున బడెను రాజు జనులను బిలిచి "దేవి సంతానమును యక్షిణి భక్షించు చున్నది. ఏమి చేయవలెను?" అనెను "యక్షిణి తాటియాకు లన్న బెద రును. దేవి చేతులకు, పాదములకు తాటియాకులు కట్టవలెను" అని యొక రనిరి. వేరొకరు "యక్షిణి ఇనుపయిల్లు చూచిన భయపడును అయో గృహము నిర్మింపవలెను" అనిరి. రాజు మంచిదని లోహ మందిరము

నిర్మింప జేసెను. నగరములో రమణీయస్థలమున నిర్మాణము జరిగెను. స్తంభములు మొదలు మందిరములోని వస్తువులన్నియు అయోమయములే. తొమ్మిది నెలలలో పెద్ద చతుష్కోణ భవనము సిద్ధమయ్యెను. అది నిత్య ప్రజ్వలిత దీపమువలె నుండెను.

దేవికి నెలలు నిండినవని తెలిసినంతనే రాజామెను సుసజ్జిత లోహ మందిరమున జేర్చెను. సౌభాగ్య పుణ్య లక్షణములు గల కుమారుడు పుట్టెను. శిశువునకు లోహగృహకుమారుడని పేరు పెట్టిరి. శిశువును దాదుల కప్పగించి, గట్టి పహారా యేర్పాటుచేసి, రాజు దేవిని వెంటగొని నగర ప్రదక్షిణముచేసి, సుసజ్జిత ప్రాసాదములోని కేగెను. యక్షిణికి నీరు కొనిపోవు వంతు వచ్చెను. ఆమె కుబేరునకు నీరు కొనిపోవుచుండగా మృత్యువు వాత బడెను.

బోధిసత్త్వుడు లోహగృహములోనే పెరిగి పెద్దవాడై, బుద్ధి వచ్చి సమస్త విద్యలు నేర్చెను. అమాత్యులతో రాజు "నా పుత్రు డెప్పుడు యుక్తవయస్కు డగును ?" అనెను. వారు "దేవా, పదునారు వర్షములవా డయినపుడు శూరుడు, శక్తిశాలియు నగును. వేయిమంది యక్షులను నైత మాపగలుగును" అని విన్నవించిరి రాజు కుమారునకు రాజ్య మీయ దలచి నగరమంతయు నలంకరించి, కుమారుని అయోగృహమునుండి తోడ్కొని రండని ఆనతిచ్చెను. చిత్తమని వారు పన్నెండు యోజనముల వారాణసి నలంకరించి, సర్వాభరణ భూషితమైన మంగళహస్తిని గొనివచ్చి, కుమారు నలంకరించి, భద్రగజముపై గూరుచుండబెట్టి, "కులప్రాప్త నగరమునకు ప్రదక్షిణము చేయుడు, కాశీరాజగు తమ తండ్రికి నమస్కరింపుడు, నేడే తాము శ్వేతచ్ఛత్రము ధరింతురు" అని విన్నవించిరి. బోధిసత్త్వుడు నగర ప్రదక్షిణము చేయు సమయమున రమణీయారామములను, పుష్కరిణులను, రమ్యప్రాసాదాదులను జూచి, అమాత్యులతో "మా నాయనగారు నన్నింత కాలము కారాగారమున నుంచి, ఇట్టి చక్కని నగరమును జూడనీయలేదు. నా యపరాధమేమి ?" అనెను. వారు "దేవా, మీ యపరాధ మేమియు లేదు. మీ సోదరుల నిరువుర నొకానొక యక్షిణి యెత్తుకొనిపోయి భక్షించి నది. అందుచే మిమ్ము నాయనగారు లోహగృహమున నుంచిరి. దీనివలన

మీ ప్రాణరక్షణ జరిగినది'' అని వివరించిరి. అంతట బోధిసత్త్వుడు తనలో "పదిమాసములు లోహకుంభనరకమున నున్నట్లు, మలనరకమున నున్నట్లు తల్లికడుపున నుంటిని, మాతృగర్భము వెడలినది మొదలు పదునారు వర్షముల పాటు ఈ కారాగారమున నుంటిని. బాహ్య ప్రపంచము చూచుటకు వీలు కలుగలేదు. నేడు యక్షిణినుండి రక్షితుడనైనను అజరామరత్వము లేదు. రాజ్యము గైకొని యేమిచేయుదును? అభిషిక్తుడ నైన వెనుక రాజ్యము విడుచుట కష్టము. నేడే నాయనగారికడ ననుజ్ఞ గైకొని, హిమాలయమునకు బోయి ప్రవ్రజింతును'' అనుకొని, నగర ప్రదక్షిణముచేసి, రాజభవనమున ప్రవేశించి, తండ్రికి నమస్కరించి ఒక ప్రక్క నిలిచెను. రాజాతని శరీరశోభ గాంచి, ప్రీతితో నమాత్యులవంక జూచెను. "దేవా, ఏమి యాజ్ఞ?'' అని వా రడిగిరి. "నా కుమారుని రత్నసింహాసనముపై గూరుచుండబెట్టి, మూడు శంఖోదకములతో నభిషేకించి, స్వర్ణహారము వేసి, శ్వేతచ్ఛత్రము పట్టుడు'' అని రాజానతిచ్చెను. బోధిసత్త్వుడు తండ్రికి నమస్కరించి "నాకు రాజ్యము వలదు. ప్రవ్రజింతును. అనుజ్ఞ దయచేయుడు'' అని విన్నవించెను.

"నాయనా, రాజ్యము విడిచి, యేల ప్రవ్రజింతువు?"

"దేవా, నేను తల్లికడుపున పదిమాసము లుంటిని. పుట్టినది మొదలు యక్షిణీభయముచే పదునారు వర్షములు లోహ కారాగారమున నుంటిని. ఆ కాలమున బాహ్యప్రపంచమును తొంగిచూడనే లేదు. యక్షిణినుండి తప్పించుకొన్నను నాకు అజరామరత్వములు లభింపలేదు. మృత్యువు నెవ్వరు జయింపలేరు. నేను మూడు పుట్టువులనుండి విరక్తుడను. వార్ధకము, మృత్యువు రాకముందే ధర్మ మనుసరింతును. నాకు రాజ్యము వలదు. అనుజ్ఞ యిండు'' అని యాతడు తండ్రికి ధర్మోపదేశము చేయువాడై యీ గాథలు పలికెను :

ఒక్కరాతిరి తల్లి యుదరంబులోని
మానవుండు నుదీయమానాభ్రమట్లు
చను ముందరికె. కాని వెనకకు రాడు.

బలవంతు లైనను బలు యోధులైన
జరకు లోనౌదురు, చచ్చిపోవుదురు,
జర కధీనము సర్వ జాతియం చెంతు :
నెరవుదు ధర్మంబు నే నిందుచేత.

అన్నివైపుల శత్రు వాక్రమించినను
భూపు డొక్కొక్కడు పొందును జయము.
దమయింప మృత్యువున్ దలపోయలేదు;
నెరవుదు ధర్మంబునే నిందుచేత.

బ్రదుకు నొక్కొక్కడు పరచతురంగ
బలము చుట్టిన నన్ని పార్శ్వంబులందు :
దమియింపు మృత్యువుం దలపోయలేదు.

వైరిపక్షంబును ధ్వంసము చేయు
చతురంగ బలముతో సాహసికుండు,
తలచునే మృత్యు విధ్వంస మాతండు ?

మదము స్రవించెడి మత్తగజంబు
నగరమున్ మర్దించు, నరులను జంపు
మరి మిత్తి నాహస్తి మర్దింపగలదె ?

ధీరుండు, కుశలుండు. దూరలక్ష్యంబు
వేధింప గలిగిన విలుకాడు కూడ
గురి పెట్టి మృత్యువున్ కొట్టంగలేడు.

సరసులు, విపినముల్, శైలముల్ పొందు
క్షయమెప్పుడో యొక సమయంబు నందు
అన్నియుంగూడ కాలాధీన మగును.

స్త్రీ పురుషాదుల జీవముల్ చంచ
లమ్ములు మత్తుచేలమ్ము విధాన,
తటిని యంచున నున్న తరువు చందమున.

బిడ్డలు, మధ్యముల్, పెద్దలు సర్వ
జనులు మృత్యువునోట జారిపోవుదురు,
ఫలము వృక్షమునుండి పడిపోవునట్లు.

వృద్ధి నొంద దీ యాయువు విధువువోలె :
గతము గతమౌను, మరి వార్ధకమ్మునందు
సమసిపోవును కాంతులు సౌఖ్యములును.

ఊర్పునను మానవుల జంపు నేర్పు కలదు
ప్రేత యక్ష పిశాచాది భూతములకు
క్రోధ ముదయించుచో నవి గూడ మిత్తి
నుత్సహింపవు హరియింప నూర్పుతోడ.

క్రుద్ధ యక్షపిశాచముల్ గూడ శాంతి
గాంచు బలికర్మచే, మిత్తి కనదు శాంతి.

దోషులను నిందితుల నన్య దుష్టజనుల
క్షితిపులు విచారణమున శిక్షింపగలరు.
కాని మిత్తిని దండింపగలరె వారు ?

దోషులును, నిందితులు, నన్య దుష్టజనులు
వేడవచ్చు క్షమాపణ విభుని కడను :
మృత్యుదేవత యెపుడు క్షమింపదెవని.

క్షత్రియు చేతను బ్రహ్మాసురు చేత
బలవంతుచేతను బహుధని చేత
మిత్తి రాజునకు నాపత్తి లేదెందు.

సింహముల్, వ్యాఘ్రముల్, చిరుతలు కాని
బల్మిని మృగములం బట్టి భక్షించు;
కాని మిత్తిని బట్టి కబళింపలేవు.

జనుల కన్నులు కట్ట జాలుదు రైంద్ర
జాలికుల్ రంగాన : సమ్మోహ పెట్ట
నేరరు మృత్యువున్ వారలు కూడ.

క్రుద్ధ సర్పములు లోకులను కాటందు,
చంపు నొక్కొకయెడ సత్వరంబుగనె :
కాని మృత్యువు నవి కాటందలేవు.

క్రుద్ధ సర్పవిషంబు గూడ దింపుదురు
జాంగలికులు, మృత్యు సర్పవిషంబు
నిర్వీర్య మొనరింప నేర రెన్నండు.

ధన్వంతరియును, వేతరణియు, భోజ
నామ జాంగలికులు నష్టంబు చేసి
విషవీర్యమును, తుదిన్ విష నష్టులైరి.

ఘోర విద్యల నెట్లో నేరిచి, ఓష
ధీ మహత్త్వమున నదృశ్యుడై నరుడు
శత్రుల గికురింప జాలును; కాని
మృత్యువుకడ కృతకృత్యుండు కాడు.

ధర్మచారిని రక్షించు ధర్మమెపుడు,
ధర్మ మాచరితము సుఖదాయకంబు
యుక్తముగ ధర్మమార్గాను సక్త జనుని
దుర్గతికి ధర్మ ముంచును దూరముగను.

ఫలము ధర్మాధర్మములకు భిన్నంబు,
నడపు నధర్మమ్ము నరకమ్ము దెసకు,
సద్గతికిం గొని చనును ధర్మంబు.

బోధిసత్త్వు డీవిధముగా తండ్రి కుపదేశమిచ్చి "మహారాజా, తమ రాజ్యము తమకే ఉండనిండు. నాకు దీనిపై మక్కువ లేదు. మీతో నేను

సంభాషించుచుండగనే జరావ్యాధులు, మృత్యువు సమీపించు చున్నవి. తాము నిలువుడు'' అని, ఇనుపగొలుసులు త్రెంపివేయు మదేభమువలె బంగరువన్నె పంజరము భేదించుకొనిపోవు సింహ శాబకమువలె కామాదులను భేదించి, తలిదండ్రులకు సమస్కరించి, కదలి పోయెను.

రాజుకూడ తనకు రాజ్య మక్కర లేదని రాజ్యము విడిచి, అతని వెంట జనెను. రాజు బయులుదేరిన పిదప దేవి, అమాత్యులు, బ్రాహ్మణులు, సంసారులు, అఖిల ప్రజలును ఇళ్లువదలి, బయలుదేరిరి. గుంపు పెద్దది యయ్యెను. అనుయాయులు పన్నెండు యోజనముల పొడవున నుండిరి. బోధిసత్త్వుడు వారితో హిమాలయమున ప్రవేశించెను.

శక్రుడీ విషయము గ్రహించి, విశ్వకర్మను బిలువనంపి, ''పన్నెండు యోజనముల పొడవు, ఏడు యోజనముల వెడల్పుకల యాశ్రమము నిర్మింపుము'' అని యానతిచ్చెను. ఆశ్రమమునకు వలయు సదుపాయములు సమకూర్పబడెను. బోధిసత్త్వుని ప్రవ్రజ్య, ప్రవచనము, బ్రహ్మలోక గమనము, నరకలోకమునుండి పరిషద్రక్షణము, మొదలగునవి పూర్వమువలెనే జరిగినవి.

శాస్త యిట్లు ధర్మదేశము చేసి, ''భిక్షువులారా, తథాగతుడు పూర్వము కూడ మహాభినిష్క్రమణము చేసెను'' అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున మాతాపితలు రాజకులములోని వారే; పరిషత్తు బుద్ధపరిషత్తు; అయోఘర పండితుడు నేనే.

—— :(): ——

511. కించంద జాతకము

శాస్త జేతవనమున ఉపోసథ వ్రతమును గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఒకనాడు చాలమంది ఉపాసకులు, ఉపాసికలు, ఉపోసథ వ్రత ధారులు, ధర్మము వినుటకై వచ్చి కూరుచున్నప్పుడు శాస్త "ఉపాసకు రాలా, ఉపోసథవ్రత మవలంబించితిరా ?" అనెను. "భన్తే, చిత్తము" అని వారనగా, శాస్త "మంచిపని చేసితిరి. పురాణపండితులు, అర్ధోపోసథ వ్రతము పూనినందులకే యశము నొందిరి." అని వారి ప్రార్థనపై పూర్వ జన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయునపుడు శ్రద్ధావంతుడు, దానశీలుడు. ఉపోసథవ్రతమున అప్రమత్తుడు నగు పురుషు డుండెను. ఆత డమాత్యాదుల చేతగూడ దానానుమోదనము చేయించెను. కాని అతని పురోహితుడు కొండెగాడు, లంచగొండి, అభియోగములలో తప్పు తీర్పు లిచ్చెడివాడు. ఉపోసథవ్రత దినమున రాజు అమాత్యాదులను బిలువనంపి, వ్రతము పూనుడని చెప్పెను. పురోహితుడు వ్రతము పూన లేదు. ఆ నా డతడు లంచములు పుచ్చుకొని, తప్పు తీర్పులు చెప్పెను. అంద రును దర్శనార్థము వచ్చినపుడు అమాత్యుల నడిగినట్లే రాజు పురోహితుని గూడ "ఆచార్యా, తాము ఉపోసథవ్రత మవలంబించితిరా ?" అని అడిగి నప్పుడు చిత్తమని యాత డసత్యము పలికి, ప్రాసాదమునుండి దిగెను.

అమాత్యు డొకరు తనపై దోషారోపణ చేయగా పురోహితుడు "నేను వేళకు భోజనము చేసినాను. ఇప్పు డింటికి బోయి ముఖము కడుగు కొని, వ్రతమూని, రాత్రిభోజనము చేయుదును. రాత్రి శీలరక్షణము చేయు

దును. ఈ విధముగా అర్థ వ్రతపాలన మగును" అనెను. అమాత్యుడు మంచి దనెను. పురోహితు డింటికి జని ఆ ప్రకారమే చేసెను.

ఒకనా డాతడు న్యాయాధీశ స్థానమున నున్నపుడు ఆచారవతి యగు స్త్రీ అభియోగమున జిక్కుకొని యుండుటచే నింటికి బోజాలకుండెను. వ్రతభంగము కాకుండవలె నని యామె సమయ మాసన్న మయినంతనే ముఖప్రక్షాళనాదిక మారంభించెను. బ్రాహ్మణునికడ నున్న మామిడి పండ్లలో నొకటి యామెకు జేరెను. దీనిని భక్షించి వ్రతము నిలుపుకొనుమని బ్రాహ్మణు డనగా, నామె యటులే చేసెను. బ్రాహ్మణుడు చేసిన యుత్తమ కర్మ మిదియే.

కాలక్రమమున నాతడు మరణించి, హిమాలయ ప్రదేశమున, కౌశికీ నదీతీరమున, మూడు యోజనముల సహకారవనమున, రమణీయస్థానమున సౌభాగ్య స్థలమున, సువర్ణ వర్ణ విమానమున, అలంకృత శయనాగారమున పండుకొని లేచినట్లు జన్మించెను. ఆతడు బాగుగా నలంకృతుడై, ఉత్తమ రూపము కలిగి, పదునారువేలమంది దేవకన్యకలచే పరివేష్టితుడై యుండెను. రాత్రివేళనే యీ శారీరక వైభవ మనుభవించుచుండెను. వైమానిక ప్రేతభావమున కనుగుణముగా ప్రతిఫల మనుభవించుచుండెను. అందుచే అరుణోదయ మయినంతనే యతడు ఆమ్రవనమున ప్రవేశించును. తోడనే ఆతని దివ్య జన్మ మంతర్ధానమగును. శరీరము ఎనుబది తాడిచెట్ల యెత్తున పెరుగును. ఒడలంతయు మోదును పూలు పూచినట్లు వెలుగుచుండును. చేతికి ఒక్క వ్రేలుమాత్ర ముండును. కుద్దాలములవలె నుండు నఖములు మొలుచును. ఆత డా గోళ్ళతో వీపు గోకుకొని, కండలు లాగి తినుచు, వెను బాధచే నిటు నటు తిరుగుచు పెద్ద పెట్టున రోదనము చేయుచుండును. సూర్యు డస్తమింపగనే యా దేహ మంతర్ధాన మగును. తోడనే దివ్యదేహ ముద్భూత మగును. అలంకృత దేవకన్య లతనిని పరివేష్టించి, వివిధ వాద్యములతో నాట్య మాడుదురు. మహా విభవముతో నతడు దివ్యామ్రవనమున, దివ్య ప్రాసాద మెక్కును.

ఉపోసథ వ్రత మవలంబించిన స్త్రీకి మామిడి పండిచ్చుటచే మూడు యోజనముల ఆమ్ర వనము లభించినది. లంచము పట్టి, తప్పు తీర్పు చెప్పు

టచే నిజమాంసమును పీకి తినవలసి వచ్చెను. అర్ధవ్రత మవలంబించుటచే నర్తకి జన పరివేష్టనము, రాత్రి భోగము సమకూరెను.

ఆ సమయమున వారాణసీ నరేశుడు కామభోగాదుల సేవగించి, ఋషి ప్రవ్రజ్య నవలంబించి గంగాతటమునకు దిగువ రమణీయ ప్రదేశమున పర్ణశాల నిర్మించుకొని, గింజ లేరి తినుచు, కాలక్షేపము చేయుచుండెను.

ఒకనా డాయామ్ర శాఖనుండి ఘట పరిమాణమున పండిన మామిడి పండు నదిలో పడి, ప్రవాహమున తేలిపోవుచు, ఆ తపస్వికి పీ లగు తట మును చేరెను. ముఖ ప్రక్షాళనము చేసికొని ఆయన నీటిలోనికి దిగి, యీది పోయి మామిడి పండును పట్టుకొని తెచ్చి, అగ్ని గృహమున నుంచెను. అవసరము వచ్చినప్పుడు కోసి తినుచు, మిగిలినది అరటి యాకులో చుట్టి దాచుచుండెను. అది సమాప్తమైన పిదప ఆయనకు మరి యే పండు రుచింప లేదు. రస తృష్ణకు వశీభూతుడై యాతడు నదీతటమునకు బోయి చూచుచు ఫలము లభించువరకు నచ్చటనే కూరుచుండ నిశ్చయించుకొనెను. ఆత డచటనే నిరాహారుడై ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు రోజులు జలమువైపు చూచుచుండెను. ఏడవనాడు నదీదేవత యోచించి గ్రహించి "ఇతడు తృష్ణావశవర్తియై సప్తాహము పాటు నిరాహార దీక్ష పూని జలము వంక జూచుచు కూరుచున్నాడు. ఈ తపస్వికి ఫలమీయకుండు టనుచితము. ఫలము లభింపనిచో మరణించును. నే నతనికి ఫల మొసంగు దును" అనుకొని, వచ్చి, నదీతటముపై నాకసమున నిలిచి, ఆయనతో సంభా షించునదై యీ గాథ పలికెను :

ఏమి తలచెదు బ్రాహ్మణా, ఇంటిలోన
ఒంటిగా నేల నిటు పడియున్న వాడ ?
వేమి కోరెదు నీమతం బేమి చెపుము !

విని తపస్వి యీ గాథలు పలికెను :

కమ్ర నిర్మిత జలపూర్ణ కులశమట్లు
ఒప్పి, వన్నియ, రసగంధయుక్తమైన
ఆమ్ర ఫలమును నేను రత్నాకరమున

కొట్టుకొని పోవు దాని జేపట్టి తెచ్చి
అరటి యాకులలో నుంచి, అవల దాని
దినుచు, నాకలి దప్పికల్ తీర్చుకొంటి.

వ్యధ తొలగిపోయె, ఫలము సమాప్తి నొందె,
చింత హెచ్చిన దేది రుచింప దయ్యె !

సలిలమున గొట్టుకొని పోవు స్వాదు మధుర
ఫలము దెచ్చితి; అయ్యది ప్రకృతమందు
నాదు శుష్కతకుం గారణంబు, నన్ను
నిశ్చయంబుగ మృత్యు సన్నిధికి లాగు.

నిండి మత్స్యాలతో రమణీయ మైన
యీ విశాల నదీతటి నేను కూరు
చుండు హేతువులం దెల్పియున్నవాడ.

దేవి ! యెవ్వరో నీవు తెలుపగదవె !
ఇచ్చటికి నీదు రాకకు హేతు వేమి ?

పైడి బొమ్మను, వ్యాఘ్రిని, పర్వతాత్మ
జాత బోలెడు దాన ! ఆ స్వర్గమందు
మర్త్యలోకమునందు సమస్త రూప
వతులలో నొక్కతేని నీవంటి దేది ?

అడిగితిని నిన్ను నే సుందరాంగి, యింక
నాకు జెప్పుము నీ గోత్ర నామములను.

అంతట దేవి యీ గాథలు పలికెను :

రమణీయ కోసి తీరమ్మున నీవు
ఉపవిష్టుడవు బ్రాహ్మణోత్తమా, నాదు
వాసమ్ము భూరి ప్రవాహిని నదిని.

వివిధ భూరుహ పరివృత కందరముల,
ఎంచుచు, ప్రముఖగా నేతెంచు దరికి
వనములలో నుండి వచ్చుచు, నీల
నీరముల్ గొనితెచ్చు నేరులు, నాగ
సుప్రసన్నములు చొచ్చు నాలోన.

ఆమ్ర జంబూ పనసౌదుంబరాది
ఫలములం దెచ్చు నా పజ్జకు నెపుడు.

ఉభయ తటంబుల నున్న వృక్షముల
ఫలములు నీటిలో బడి, తప్పకుండ
కొన్ని ప్రవాహాన కొట్టుకపోవు.

రాజోత్తమా, బహు ప్రజ్ఞ, మేధావి,
ఇచ్ఛ నెపుడు నిగ్రహించుట మేలు.

ఆమ్ర ఫలార్థివై అసువులు బాయ
తలపెట్టు నీ చిన్నతనము గ్రహించి
అలోచనా శీలు డని యెంచ నిన్ను
రాజ్య వర్ధనుడవు; రాజర్షి వగుము.

గ్రహియింత్రు పితరులు గంధర్వ దేవ
తలు, సంయతాత్ములు, తాపసుల్, తప్ప
కుండంగ విజితేంద్రియుం డైన వాని.

అంతట తపస్వి యిట్లనెను :

జీవహింసను గూర్చి యోచింపనట్టి
నరుడు సర్వ ధర్మంబుల నెరిగి కూడ
కనుగొనడు పాపవృద్ధికి కారణంబు.

కాంచి ఋషిగణకీర్తి లోకమున నట్టి
యశము పొంది, అశోభన మైన నుడుల
పాప మారోపణము చేయ భావ్య మగునె ?

ఓ సుమధ్యమ, నేను యుష్మత్తటాన
మరణించుచో "అసినరకంబు" నాకు
సంప్రాప్త మగును నిస్సందేహముగను.

విని, దేవకన్య యీ గాథలు పలికెను :

సహించువాడ దుస్సహ మైనదాని !
విదిత మైనది భవద్విషయంబు నాకు.
ఆమ్ర ఫలమ్ముతో నాత్మార్పణమ్ము
నే జేయుచున్నాను నీకునై రాజ !

త్యాగమ్ము చేతను భోగముల్ విడిచి
శాంతి నొందగ వచ్చు, సద్ధర్మమందు
పూర్వ బంధవిముక్తి పొందినవాడు
మరల వాంఛా బద్ధమతి యగునేని
అతం డధర్మ కార్యమ్ములు చేయ,
ఆతని పాపమ్ము లభివృద్ధి నొందు.

రావోయి, ఉత్సుకరహితుండ వగుచు,
శీతల స్థలికి నే జేర్చెద నిన్ను
విడిచి యౌత్సుక్యంబు విహరింపవచ్చు

కుసు మాసవంబులు గ్రోలి మత్తెక్కు
ఖగ నివాసం బడి క్రౌంచ మయూర
కోయష్టికాదులు కూజితాల్ చేయు,
కూయును హంసలు, కోకిలల్ పాడు.

అచటి శాఖలు వంగు నామ్ర ఫలాల
భారమ్ముచే, తాళఫల సమానములు
మామిడి పండ్లు కొమ్మల వ్రేలుచుండు.

ఈ ప్రకారముగా ఆమ్రవన ప్రశంస చేసి, తపస్విని దింపెను. దింపి "ఈ తోటలో మామిడి పండ్లు తిని మీ కోర్కె నెరవేర్చుకొనుడు" అని పలికి

వెడలిపోయెను. తాపసి పండ్లు తిని సంతృప్తి చెంది అచటనే విశ్రమించెను. అచట ప్రేతము దుఃఖము నొందుచుండుట చూచి యేమియు చేయజాలకుండెను. కాని సూర్యాస్తమయ మయినంతనే ప్రేతము నటీపరివృతమై దివ్యభోగ ననుభవించుట గాంచి తాపసి యీ గాథలు పలికెను :

దివ్య భూషణముల దివ్యాంబరముల
దివ్య మాలికలను దివ్యాంగ రాగ
మాదిగా దాలిచి, యామినులందు
విహరించుచున్నావు వివిధ భోగముల.

అయినను వాసరంబందు పొందుదువు
వేదన; పదునారు వేలు స్త్రీ లున్న
తోడనే భయదంపు పీడ తప్పనిదె.

బాధల పెట్టగా పరుల నెందరనో
పూర్వ జన్మమున, నిప్పుడు తప్ప దాయె
నిజమాంస భక్షణ, నీకు విప్రుండ !

ప్రేత మాతని గురుతించి "మీరు నన్ను గురుతించుట లేదు. నేను మీ పురోహితుడను. మీ యాశ్రమమున నేను చేసిన అర్ధ—ఉపోసథ వ్రత ఫల పరిణామముగా ఈ రాత్రి మీరు చూచిన నా సుఖానుభూతి. పగటివేళ నా దుఃఖానుభూతి నా పాపకర్మము వలననే. మీరు నన్ను న్యాయాధీశ పదవి యందు నియోగించిన పిదప లంచము తీసికొని, అసత్య నిర్ణయము చేసి నాను. ఆనాడు చేసిన పాపమునకు ప్రతిఫలముగా ఈ దుఃఖ మనుభవించు చున్నాను" అని యీ గాథలు పలికెను :

చేసి అధ్యయనంబు, చిక్కి కామాది
విషయోప భోగాల విహితంబు కాని
పనులు చేయుచునుంటి పరజనంబులకు.

కొండెముల్ చెప్పెడి కుజనుండు తినును
పృష్ఠ మాంసమ్మును పీకి ముక్కలుగ
ప్రకృతమ్ము నే వ్యధ పడుచున్నయట్లు,

ఇట్లు పలికి "తమ రేల యిచటికి వచ్చినారు ?" అని తాపసి నడిగెను. అతడు జరిగిన దంతయు సవిస్తరముగా తెలిపెను.

"భన్తే, తాము ఇటనే యుండుడు, పోవలదు."

"ఉండను. ఆశ్రమమునకే పోవుదును."

"భన్తే, మంచిది నేను తమకు పక్వామ్ర ఫలములను నిరంతరము చేర్చుచుందును" అని ప్రేతము నిజప్రభావమున తాపసిని గొనిపోయి ఆశ్రమమున దింపెను. దింపి, ఉత్కంఠ లేకుండునట్లు ఆయన ప్రతిజ్ఞ గైకొని వెడలిపోయి, నియమ పూర్వకముగా మామిడిపండ్లు తెచ్చి యిచ్చుచుండెను. తపస్వి వానిని తినుచు, యోగవిధి సాహాయ్యమున లబ్ధ ధ్యానుడై క్రమముగా బ్రహ్మలోకగామి యయ్యెను.

ఉపాసకులకు శాస్త యీ ధర్మోపదేశనము చేసి, ఆర్య సత్యాదులను ప్రకాశింపజేసి, జాతకములు సరిపోల్చెను. అపుడు కొందరు స్రోతాపన్నులు కొందరు సకృదాగాములు, కొందరు అనాగాములు నయిరి.

ఆ సమయమున దేవత ఉత్పలవర్ణ, తపస్వి నేనే.

512. కుంభ జాతకము

శాస్త జేతవనమున విహరించునపుడు సురాపానము చేయు నయిదువందల విశాఖ చెలికత్తెల విషయమై చెప్పినది.

వర్తమాన కథ

శ్రావస్తిలో సురాపానోత్సవము ప్రకటించిన పిదప యజమానులతో క్రీడోత్సవము ముగిసినపిదప ఆ 500 మంది స్త్రీలు ఘాటుగల సుర సిద్ధము చేసి ఉత్సవము సంకల్పించి విశాఖకడకు జని "సఖి, మనము ఉత్సవము చేయుదము" అనిరి. ఆమె "యిది సురాపానోత్సవము. నేను సుర త్రాగను" అనెను. చెలికత్తెలు "మీరు సమ్యక్‌- సంబుద్ధునకు దాన మొసగుడు. మేము ఉత్సవమున పాల్గొందుము" అనగా, ఆమె మంచిదని, వారిని ప్రోత్సహించి, శాస్తను నిమంత్రించి మహాదాన మిచ్చి విశేషగంధమాల్యాదులు కైకొని, సాయంకాలమున ధర్మకథ వినుటకై చెలికత్తెలతో జేతవనము చేరెను. వారు సురాపానము చేసి ఆమెవెంట జనిరి. ద్వారప్రకోష్ఠమున నిలిచి సురత్రాగి, విశాఖవెంట వారు శాస్తసన్నిధికి చేరిరి. విశాఖ శాస్తకు నమస్కరించి ఒకప్రక్క గూరుచుండెను. ఆమెచెలికత్తెలలో కొందరు శాస్తయెదుట నృత్యము చేయసాగిరి; కొందరు పాడజొచ్చిరి. కొందరు కాలుచేతులు ఆడింప దొడగిరి. మరికొందరు జగడ మాడసాగిరి. వారిమనసులలో భీతి గొల్పుటకై శాస్త తన కనుబొమ వెంట్రుకలలోనుండి ఒక్క కిరణము ప్రసారించెను. తోడనే గాఢాంధకారము వ్యాపించెను. వారు బెదరి మరణభయముకూడ చెందిరి. త్రాగిన మద్యపుమత్తు దిగిపోయెను. తాను కూర్చున్నపీఠమున అంతర్ధానము నొంది శాస్త సుమేరు పర్వతముపై నిలిచి ఊర్ణలోమమునుండి కిరణము ప్రసారించెను. వేయి చంద్రులు వెలిగిన ట్లయ్యెను. శాస్త అచటనే నిలిచి వారలమనసులలో త్రాసము పురికొల్పుటకై ఈ గాథ పలికెను :

అగ్ని మందు నిత్య మానంద మేటికి ?
హాస మేల ? చుట్టి యన్ని యెడల
నంధకార ముండ నధికమ్ముగా; నరుల్
దీపమునకు వెదక నోప రేమి ?

తోడనే 500 స్త్రీలు స్రోతాపత్తిఫలమున ప్రతిష్ఠితు లయిరి. శాస్త వచ్చి గంధకుటిచ్ఛాయలో బుద్ధాసనముపై నుపవిష్టు డయ్యెను. చూచి "భర్తే, సిగ్గు, భయము, పోగొట్టు ఈ సురాపానము ఎప్పటినుండి ప్రారంభ మైనది ?" అనెను. శాస్త ఆమెప్రశ్నమునకు ప్రత్యుత్తర మిచ్చువారై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు నప్పుడు సుర నామకు డగు అడవిమానిసి సామగ్రులు తెచ్చుకొనుటకై హిమాలయమువైపు పోయెను. అక్కడ ఒకానొకవృక్షము నాలుగైదు మూరలయెత్తు పెరిగి మూడువైపుల విభక్తమయ్యెను. ఆ మూడిటినడుమ భాండమంత గుంటలో దైవవశమున వాన పడుటచే నీరు నిండెను. ఆ గుంట చుట్టును మామిడిచెట్టు మిరప మొక్కలు కలవు. అవి పండినపిదప గుంటలో రాలుచుండెను. గోతి కనతిదూరమున స్వయముగా మొలిచిన ధాన్యపు మొక్క లున్నవి. చిలుక లందుండి గింజలు తెచ్చి చెట్టుమీద వాలి తిను చుండునపుడు కొన్నిగింజలు తండులములు గుంటలో రాలుచుండెను. సూర్య రశ్మి పడుటచే వేడియెక్కి పక్వమై నీర మెర్రబారెను. ఎండవేళ దాహము తీర్చుకొనుటకై పిట్టలు వచ్చి నీరు త్రాగి, మత్తిల్లి పడిపోయి, త్వరలోనే తెలివి వచ్చి కలకిలలాడుచు ఎగిరిపోవుచుండెను. కోతులకు గూడ ఈ స్థితియే పట్టుచుండెను. అడవివాడు చూచి "ఇది విషమైనచో ఇవి యన్నియు మర ణింపవలెను. కాని కొంతసేపు పండుకొని, ఆవల సుఖముగా పోవుచున్నవి. కావున ఇది విషపానీయము కాదు" అని యోచించి, కొంచెము నీరు త్రాగి మత్తిల్లి, కొలదిసేపటికి మాంసము మీదికి మనసు పోవగా, చెట్టుక్రింద బడిన తిత్తువులను, కోళ్ళు మొద లగువానిని చంపి నిప్పుచేసి, కాల్చి, ఒకచేతితో

నాట్యభంగి ప్రదర్శించుచు, రెండవచేతితో మాంసము పట్టుకొని కొరికి తినుచు, రెండురోజు లచనే యుండెను.

అచటికి కొలది దూరములో వరుణ నాము డగుతపస్వి యుండెను. అడవిమానిసి అప్పు డప్పు డాయనకడకు బోయెడివాడు. ఆయనకీ పదార్థము సమర్పింపవలె నని అడవివానికి తోచినది. వాడు వెదురుగొట్టమునిండ పానీయము నింపి, వండినమాంసమును గూడ పట్టుకొని, పర్ణశాలకు బోయి, "భన్తే, ఈ పదార్థమును స్వీకరింపుడు" అనెను. ఉభయులును మాంసము తిని, పానీయ మారగించిరి సుర నాముడును, వరుణ నాముడును కనుగొనుటచే దానికి సుర యనియు, వారుణి యనియు పేర్లు వచ్చెను. ఈ పదార్థము బ్రదుకుదెరువున కాధార మని వారు గ్రహించి, వెదురు గొట్టములలో పానీయము నింపి, కావడిలో పెట్టుకొని, సరిహద్దునగరము చేరి, యీ విషయము రాజున కెరుకపరచిరి. వారిని బిలువ నంపి రాజు మూడుసారు లది యాస్వాదించునప్పటికి మత్తు తలకెక్కెను. రెండురోజులకు మత్తు దిగగా రాజు వారితో "ఇంకను పానీయము కలదా ?" యనెను. "చిత్తము. దేవా !" "ఎక్కడ నున్నది ?" "హిమాలయమున నున్నది." "అగుచో కొనిరండు."

వారు పోయి రెండుమారులు తెచ్చిరి. విడువకుండ తెచ్చుటకు వీలు కాక, అందలి వస్తుసామగ్రులను గూర్చి విచారణ చేసి, ఆ చెట్టు బెరడు మొదలు తక్కినవస్తువులను సమకూర్చుకొని వచ్చి, నగరమున సుర కాచిరి. నాగరకులు సురాపానము చేసి, మత్తెక్కి నశించిరి. నగర మించుమించుగా శూన్య మయ్యెను.

సురాపాచకులు పారిపోయి, వారాణసి చేరి, రాజుకు పానీయ విషయము తెలియపరచిరి. రాజు వారిని పిలువ నంపి, ధన మిచ్చెను. వారు మద్యము సిద్ధముచేసి, నాగరకుల కిచ్చిరి. నగరము నష్ట మయ్యెను.

అచటినుండి వా రిరువురు సాకేతమునకు, సాకేతమునుండి శ్రావస్తికి జనిరి. ఆ సమయమున సర్వమిత్రనాము డగు రాజు అచట పరిపాలనము చేయుచుండెను. "మీ కేల కావలెను ?" అని రాజు వారి నడిగెను. "సాము

గ్రికి మూల్యము, బియ్యపుపిండి, అయిదువందల ఘటములు" అని వారు చెప్పగా రాజు వలసినవన్నియు నిప్పించెను. వారు సుర కాచి, ప్రతిఘటము కడను పిల్లిని రక్షార్థము కట్టివేసిరి. సుర పొంగి క్రిందికి కారగా దగ్గర తోనే కట్టివేసియున్న ప్రతి మార్జాలము దానిని నాకి మత్తిల్లి పడిపోయెను. ఎలుకలు వచ్చి వానిచెవులును, ముక్కులు, మీసములు, తోకలు కరచి పోయినవి. రక్షకభటులు పోయి, పిల్లులు సురాపానము చేసి మృతి నొందిన వని రాజుకు విన్నవించిరి. సుర కాచువారు విషము తయారు చేసిరని భావించి, రాజు వారికి శిరశ్ఛేద శిక్ష విధించెను. వారు "సుర కావలెను, అమృతము కావలెను" అని యరచుచు ప్రాణములు విడిచిరి.

ఆ ఘటములు పగుల గొట్టుడని రాజాజ్ఞ యయ్యెను. మత్తు తగ్గిన పిదప పిల్లులు లేచి గంతులు వేయుచు నిటు నటు పరుగెత్త జొచ్చెను. ఈ విషయము తెలియగా రాజు "అది విషమైనయెడల పిల్లులు చనిపోయె డివి. నిజముగా అది మధురపేయపదార్థమే త్రాగుదును" అనుకొని నగర మలంకరింపజేసి, రాజాంగణమున మండపము నిర్మించి, అందు శ్వేతచ్ఛ త్రముక్రింద రాజసింహాసనమున గూరుచుండి, అమాత్యులు పరివేష్టించి యుండ సురాపానము చేయ నుద్యమించెను.

లోకములో మాతృసేవాది సుకృతకార్యత్రయ మెవ్వరెవ్వరాచ రించుచున్నారో చూడ దలచి, దేవేంద్రశక్రుడు వచ్చి, రాజు సురాపానో ద్యుక్తు డగుట గమనించి "ఈతడు సురత్రాగుచో సమస్త జంబూద్వీపము నష్ట మగును. కావున నితడు త్రాగకుండ వారించెదను" అనుకొని, బ్రాహ్మణవేషము ధరించి, సురాభాండము నరచేత దాల్చి, రాజున కెదురుగా నాకసమున నిలిచి "ఈ ఘటము గొనుడు, ఈ ఘటము గొనుడు" అని యెలుగెత్తి పలికెను. సర్వమిత్ర ప్రభువు చూచి "నీ వెచటనుండి వచ్చి నావు ?" అని ప్రశ్నించువాడై యీ గాథలు పలికెను :

త్రిదివమందుండి క్రిందికి దిగినవాడ !
ఇందుపోలిక నిశి వెలిగించువాడ !
వెడలును 'సతేరతా' నామ విద్యుదాభ
తావకాంగమునుండి నాతమ్మునతోడు

లేక నిలుతువు, తిరుగుదు వాకసమున
దేవతల బుద్ధిబలము పొందితివో నీవు !

ఘటము గొను మంచు పలికెదు గగనతలము
నందు నిలిచియె, ఏ ముందు నిందు ? నాకు
నెవ్వరవో నీవు బ్రాహ్మణా, యెరుకపరచు.

అంతట శక్రుడు 'అట్లయిన వినుము' అని దోషములు చూపువాడై యీ గాథలు పలికెను :

శర్కర ఘృతంబు తైలంబు సర్పి మధువు
కాని నింపినఘట మిది కానె కాదు :
ఎన్నొదోషాలు నింపిన దీఘటమ్ము !

తొట్రిలును దేని గ్రాగిన దొరలిపడును
గుంటలోన తటాకాన గోతిలోన
మానవుడు, తినగూడనివాని దినును
అట్టిసురతోడ నిండిన యట్టిఘటము.

క్రోలగా దేని చిత్తంబు కోలుపోవు
స్థైర్య మంతయు, మనుజుడు సంచరించు
పసరమట్టులు దేనినో మెసపుచుండి,
వివశు డై పాడు, గంతులు వేయు, అట్టి
మద్యపరిపూర్ణ మైనకుంభంబు గొనుమ !

త్రాగి దేనిని నరుడు వస్త్రంబు జార
నగ్ను డై సందుగొందుల నాట్య మాడు,
మెండు నిద్దుర పోవును బండవారి,
అట్టి మద్యముతో నిండినట్టి ఘటము.

పాన మొనరించి దేని కంపమ్ముతోడ
కాలుసేతులు కడుపును కాష్ఠపుత్రి

పోల్కి, నట్టిసురారస పూర్ణ మైన
కుంభ మియ్యది, దీనిని గొనుమ నీవు !

దేని గ్రోలిస నరుడు నదీజలాన
గాంచు మరణమ్ము. తినును సృగాలవితతి,
బంధనమ్మున ద్రోయు, సంపద హరించు,
అట్టి సురతోడ నిండిన మట్టికడవ.

దేని ద్రాగిన, సభలోన మానవుండు
స్రస్తచేలు డగుచు నవాచ్యములు పలుకు,
చెందు తబ్బిబ్బు, నిష్ఠీవమందు దొరలి,
అట్టి సురతోడ నిండిన మట్టికడవ.

క్రోలి యెర్రాని నభిమాన ఘూర్ణమాన
రక్తనేత్రాలతోడ ధరాతలంబు
సర్వమును స్వీయ మని యెంచి, చక్రవర్తి
తనకు తుల్యుడు కా డని తలచు నరుడు,
అట్టి మద్యముతో నిండి నట్టిఘటము.

పెంచు నభిమాన కలహముల్, పిశునవృత్తి
కారణంబు, వివర్ణత కలుగజేయు,
చోరధూర్తులకుం గతి, సురను నింపు
కుంభ మియ్యది, దీనిని గొనుము నీవు.

భూరిసంపత్తి కలిగినవారి కోట్ల
కొలది హరియించె నెయ్యది, కులము వెలయు
వారి నాశము చేసిన వారుణి యిది !

నాశ మొనరించు నేది, ధాన్యంబు, ధనము,
పసిడి, రజతము, క్షేత్రముల్, పశుగణముల,
నట్టి మద్యముతో నిండి నట్టిఘటము.

త్రాగి మానవు డెదాని. తండ్రి, తల్లి
దిట్టు, పట్టును వావి కానట్టిస్త్రీల,
అట్టి మద్యముతో నిండి నట్టిఘటము.

త్రాగి దేనిని, తిట్టు దుర్మార్గురాలు
పతిని మామను పెద్దల, పట్టుకొనును
అధమపరిచారకుల దుష్టహ_స్త మైన,
అట్టి వారుణితో నిండి నట్టిఘటము.

త్రాగి మానవు డెద్దాని, శ్రమణు గాని
బ్రాహ్మణుని గాని జంపగా బాలుపడునో,
ప్రతిఫలమ్ముగ జేరునో భయదనరక,
మట్టి వారుణితో నిండి నట్టిఘటము.

దేని ద్రాగిన చేయును త్రికరణముల
నరుడు దుష్కర్మముల, దుది నరక మొందు
నట్టి సురతోడ నిండిన యట్టిఘటము.

అనృత మెవ్వనిచేత నాడింపలేదొ
బండనిద్దుర పుచ్చి, పలుక నాతండు
అనృతవాక్కులు దేని నాస్వదించుచును
అట్టి సురాపూర్ణ మౌ ఘట మిద్ది.

ఆవశ్యకం బై నయట్టి కార్యంబు
చేయ బంపినవాడు చేసి యద్దాని
స్మరియింప డెద్ది యాస్వాదన చేసి,
అట్టిసురాపూర్ణ మౌ ఘట మిద్ది.

క్రోలి దేనిని లజ్జగూడ త్యజించు,
దేనిమైకంబున ధీరుండు కూడ
అధికమ్ముగా మాటలాడచు నుండు
అట్టివారుణి నిండి నట్టిఘటమ్ము.

దేని ద్రావుచు నన్నపానీయములను
త్యజియించి పురుషుండు స్థండిలశయను
డగును, వైవర్ణ్యంబు నయశంబు నొందు
అట్టి వారుణి నిండి నట్టిఘటమ్ము.

దేనిని సేవించి మానవుం డిలను
గళలోహశృంఖల గల పశువట్లు
తిండి లేక, శిరంబు తిరిగి పరుండు,
తట్టుకోజాల డెద్దాని తీవ్రతను
అట్టి సురాపూర్ణ మైనకుంభంబు.

తోచినంతనె యెది దూరదూరముగ
సర్వముం గాంచిన సరణి నేగుదురో
తొడరి యెవ్వడు విషతుల్య మైనట్టి
ద్రవపదార్థంబును ద్రావగా నేర్చు?

దేని ద్రావి సముద్రతీరమ్మునందు
విచరించు చంధక వృష్ణిపుత్రకులు
అన్యోన్యముసల ప్రహారాల మడసి
రట్టి సురాపూర్ణ మైనట్టిఘటము.

ఎది యాస్వదింపంగ మదమత్తు లగుచు
పోయిరో భ్రష్టు లై పూర్వదేవతలు
త్రిదివంబునందుండి, తెలిసి యెవ్వండు
బహునిరర్థక మద్యపానంబు చేయు?

ఇందు దధి మధువులలేమి నెరిగి, కొనుము
సర్వమిత్రమ, ఘట్టగత సకలగుణ వి-
శేషములు నీకు విశదము చేసినాను.

విని, రాజు సురాదోషములు గ్రహించి ప్రసన్నచిత్తు డై శక్రుని స్తుతించువా డయి యీ గాథలు పలికెను:

లేదు జనకుండు, తల్లియు లేదు నాకు
నీవలె హితంబు కోరగా నెవరు లేరు.
ఆచరించెద నీచెప్పినట్లు నేడు.

ఉత్తమ గ్రామపంచక మొసగువాడ,
శతము దాసీగణంబును, సప్తశతము
గోగణము, నుత్తమము లైనఘోటకముల
తోడ పదియరదంబులగూడ నిత్తు.

విని శక్రుడు తన దేవత్వమును ప్రకటించువాడై, ఆకసమున నిలిచి యీ గాథలు పలికెను :

రాజ, దాసీశతమ్మును, గ్రామములను,
గోవులను, శ్రేష్ఠహాయములు గూర్చునట్టి
యరదములగూడ నుండనిమ్ము :

అమరవిభుడ

శక్రుడను నేను; నీవు మాంసమ్ముతోడ
ఓదనము నారగింపుమీ మోదమునను !
దుగ్ధమును, ఘృతము, మధువుతో నపూప
ములను, త్రాగుచు భక్షింపుము నృప, యిట్లు
రతుడ వై ధర్మమం దనిందితుడ వగుచు
మున్నవఠాన స్వర్గంబు నొందగలవు.

ఈ విధముగా శక్రు డుపదేశ మిచ్చి నిజనివాసస్థానమున కరిగెను. అతడు కూడ సురాపానము చేయక, సురాభాండములను తొలగించి, శీల ప్రతిష్ఠితుడై, దానాదు లిచ్చి, స్వర్గపరాయణు డయ్యెను. జంబూద్వీపమున క్రమముగా సురాపానము పెరిగిపోయెను.

శాస్త యీ ధర్మోపదేశనము చేసి, జాతకములు సరిపోల్చెను. ఆ సమయమున రాజు ఆనందుడు; శక్రుడు నేనే.

—[o]—

513. జయద్దిస జాతకము

శాస్త జేతవనమున విహరించునపుడు మాతృసేవాపరాయణుడగు భిక్షువును గూర్చి చెప్పినది. వర్తమానకథ సామజాతకముతో (540) సరిపోలును. ఆ సమయమున శాస్త "పురాణపండితులు బంగరుజాలరు కల శ్వేతచ్ఛత్రమును విడిచియు తలిదండ్రుల సేవచేసిరి"అని వారిప్రార్థనపై పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున కాంపిల్యరాజ్యమున ఉత్తరపాంచాల నామకుడగు రాజు పరిపాలన చేయుచుండెను. ఆయనపట్టపురాణి కుమారుని కనెను. పూర్వజన్మమున ఆమె సవతులతో నొకతె సవతికయ్యమున ఈమెకు పుట్టిన బిడ్డలను మ్రింగుదు నని వాంఛించి చనిపోయిన పిదప యక్షిణిగా పుట్టెను. ఇప్పు డామె పట్టపురాణి చూచుచుండగనే వచ్చి మాంసపు ముద్దవలె నున్న శిశువును ఎత్తుకొనిపోయి కరకర నమిలి మ్రింగెను. రెండవపర్యాయముకూడ అట్లే జరిగెను. మూడవమారు ప్రసూతిగృహము చుట్టును రక్షకులను కట్టుదిట్టముగా కావలా ఉంచిరి. శిశువు జన్మించిననాడు యక్షిణి వచ్చి బిడ్డను లేవనెత్తెను. యక్షిణి అని రాణి బిగ్గరగా కేకలు వేసెను. రాణిచూపిన త్రోవన మావటీలు యక్షిణివెంట పరుగెత్తిరి. బిడ్డను తినుటకు యక్షిణికి అవకాశము లేదు. అది పరుగెత్తి చిన్నవాగులో దాగుకొనెను. శిశువు మాత యనుకొని దానిస్తనము నోట బెట్టుకొనెను. యక్షిణిమనసున పుత్రస్నేహ ముదయించెను. అది అచటినుండి పరుగిడి శ్మశానము చేరి అచ్చటి కొండగుహలో శిశువును దాచి పోషించుచుండెను.

బాలుడు క్రమముగా పెరిగి తల్లి తెచ్చిన మనుష్యమాంసము తినసాగెను. ఇరువురును మానవమాంసము తినుచు అచటనే నివసించుచుండిరి. తాను మానవసంతాన మని వానికి తెలియదు; తాను యక్షిణీపుత్రు డనియే

వానివిశ్వాసము. శాలునకు నిజరూపము విడిచి అంతర్ధాన మగుశక్తి లేదు. యక్షిణి అందులకై వానికి మూలిక ఇచ్చెను. వాడు మూలికా|ప్రభావముచే పరులకు కనబడకుండ మానవమాంసము తినుచు తిరుగుచుండెను. వై|శ్రవణ మహారాజు సేవ చేయుయక్షిణి ఒకసారి ఆయనసేవకై పోయి అచటనే మరణించెను.

పట్టపురాణి నాల్గవమారు పుత్రుని కనెను. యక్షిణి లేకుండుటచే శిశువు ఆరోగ్యముతో నుండెను. శత్రుయక్షిణిని జయించి పుట్టుటచే అతనికి జయద్దిశ నామ ముంచిరి. అతడు పెరిగి పెద్దవాడైనపిదప సమస్తవిద్యలు నేర్చి ఛత్రధారణము చేసి రాజ్యపాలన మారంభించెను.

ఆ సమయము బోధిసత్త్వుడు జయద్దిసుని పట్టపుదేవికడుపున జన్మించెను. వానికి అలీనశత్రుకుమారు డని పేరుపెట్టిరి. అతడు పెద్దవాడై విద్యలు నేర్చి ఉపరా జయ్యెను.

ఆ యక్షిణీకుమారుడు కాలక్రమమున అజాగ్రత్తవలన మూలిక పోగొట్టుకొనెను; కావున అంతర్ధానశక్తి నశించెను. వాడు నలుగురు చూచుచుండగనే శ్మశానమున మనుష్యమాంసము తినసాగెను. జనులు చూచి భయపడి రాజుకడకు వచ్చి "దేవా, యక్షు డొకడు నలుగురు చూచుచుండగనే శ్మశానమున మానవమాంసము తినుచున్నాడు. క్రమముగా వాడు నగరములో ప్రవేశించి జనులను చంపవచ్చును కావున వానిని పట్టించుట ఆవసరము" అని విన్నవించిరి.

రాజు మంచి దని వానిని పట్టుటకై ఆన తిచ్చెను. సైన్యము పోయి శ్మశానము చుట్టు ముట్టెను. యక్షిణీపుత్రుడు దిగంబరుడై సేనను చూచి భయపడి మృత్యుభయముచే కేకలు వేయుచు జనులనడుమ దూరెను. వాడు యక్షు డని తెలిసికొని సేన రెండు పాయలయ్యెను. వాడు కూడ పరుగెత్తి అడవిలో దూరెను. ఆవల వాడు బస్తీవైపు రాక, పెద్ద తెరువువెంట అడవికడ తిరుగుమానవులలో ఒక్కొక్కనిని పట్టుకొని అడవిలోని కీడ్చుకొని పోయి అచట సంహరించి తినుచు పెద్ద మర్రిచెట్టుక్రింద నివసించుచుండెను.

సార్థవాహ బ్రాహ్మణుడు అరణ్యరక్షకులకు వేయినాణెము లిచ్చి, 500 బండ్ల బిడారుతో ఆ మార్గమున బోవుచుండెను. మానవయక్షుడు ఘీంకారము చేయుచు అచటికి దుమికెను.

వాడు బ్రాహ్మణుని బట్టుకొని పరుగెత్తెను.

వనరక్షకులు వాని వెంట నంటిరి. వాడు బ్రాహ్మణుని విడిచిపెట్టి, తాను వసించుచెట్టుకడకు బరుగెత్తెను. అచట వాడు ఏడుదినములు పడి యుండెను.

ఆనాడు జయద్దిస నరేశుడు వేట కాన తిచ్చి నగరము వెలువడెను. తక్షశిలానగరవాసి, మాతృపోషక నందనామక బ్రాహ్మణుడు ప్రాణులకు కల్యాణప్రదము లగు నాలుగు గాథలు తెచ్చి, రాజు బయలుదేరునప్పటి కెదురు వచ్చెను జయద్దిస ప్రభువు తిరిగి వచ్చినతరువాత విందునని చెప్పి, అతనికి నివాసస్థాన మేర్పాటు చేయించి వేటకై వెడలిపోయెను. వేటపొలము చేరి, ఏ మృగమైనను ఎవరికడగా తప్పించుకొని పరుగెత్తునో దానికి వారు బాధ్యు లగుదురు అని ఆనతిచ్చెను. వన్నెవన్నెల మృగము లేచి, రాజు కెదురుగా పారిపోయెను అమాత్యులు మందహాసము చేసిరి. రాజు ఖడ్గము గైకొని దాని వెన్నంటి మూడు యోజనములు పోయి కత్తితో దానిని తుండెములు చేసి, కావడిలో కొనివచ్చుచు యక్షు డున్నచెట్టుక్రిందికి జేరి, దర్భలపై కొంచెముసేపు విశ్రమించి, మరల నడువసాగెను. మానవయక్షుడు లేచి "ఆగు. ఎచటికి బోవుదువు ? నీవు నాఖాద్యపదార్థమవు" అని అతనిని చేతితో బట్టుకొని, యీ గాథ పలికెను :

ఏడుదినములు గడవగా నేడు నాకు
నొదవె భోజనసామగ్రి యుత్తమమ్ము.
వత్తు వెచ్చోటనుండి ? యెవ్వడవు నీవు ?
ఎట్టిదో చెప్పుమా, భవదీయజాతి.

రాజు యక్షుని గాంచి భీతిల్లెను, కాని ఒడలు గరిపొడుచుటచే పరుగెత్త లేదు. ధైర్యము చిక్కబట్టి రాజు ఈ గాథ పలికెను :

నా పేరు వినియుండ నోపుదు వీవు :
పాంచాల దేశంబు పాలించువాఁడ,
పేరు జయద్దిశుం డారణ్యభూమి
నాఖేటమున దిరుగాడుచున్నాను-
నను విడనాడుము తిని యీ మృగమ్ము.

యక్షు డిట్లనెను :

ఆడుదువ బేర మీవు నాతోడ ? భోజ
నేచ్ఛ గలిగినపిమ్మట నీ మృగమును
స్వీకరింతు, నిద్ది విలాపవేళ కాదు :

నంద బ్రాహ్మణుని జ్ఞప్తికి తెచ్చుకొని రా జిట్లనెను :

వినిమయమ్మున కొప్పవేని నీకడకు
మరలి వచ్చెద నన్నమాట గ్రహించు.
బ్రాహ్మణోత్తమునకు బ్రతిన చేసితిని,
నీకడ కరుదెంతు నెరవేర్చి దాని.

విని యక్షు డిట్లు పలికెను :

వజ్జ నున్నను మృత్యువు బ్రతిన యేదో
తీర్చి వచ్చెద నందువు, తెలుపు మద్ది :
ఒక్కవేళ నమజ్ఞ నీ కొసగవచ్చు.

ఈ ప్రశ్నమునకు బ్రత్యుత్తర మిచ్చువాడై రా జిట్లు పలికెను :

చూపినాడ ధనాశ భూసురునకు మును
మాట దక్కించుకొని నేను మరలివత్తు.

యక్షు డిట్లనెను :

నీవు చేసినబ్రతినను నిర్వహించి,
భూసురోత్తముకడ ముక్తి పొంది రమ్ము.

ఇట్లు పలికి వాడు రాజును వీడ్కొనెను. రాజు వాని నోదార్చి, చింతింపకు మని, ఉదయమే వత్తు ననెను. అని, శ్రోవగురుతులు కనబడగా నిజసైన్యమును చేరుకొనెను. సేనాపరివృతుడై రాజు నిజనగరమున ప్రవేశించి, నందబ్రాహ్మణుని బిలువ నంపి, ఉత్తమాసనమున గూరుచుండ బెట్టి గాథలు విని, నాలుగువేల నాణెము లిచ్చెను; అవల నతనిని బండి యెక్కించి తక్షశిల చేర్పుడని పరిజనుల కాన తిచ్చి వీడు కో లిచ్చెను.

రాజు మరునాడు వెడలిపోవు కోరికతో పుత్రుని బిలిచి, అనుశాసించెను. ఈ యర్థమును విశదపరచుటకై శాస్త యీ గాథలు పలికెను :

యక్షహస్తవిముక్తుడై యతడు రాజ
భవనముం జేరి వెనుకటి బ్రాహ్మణునకు
ఇచ్చిధనమును, మాట దక్కించుకొనియె
భూపతి అలీనశత్రుని పుత్రు నవల
బిలువనంపి యీరీతిని పలికినాడు :
"నీకు రాజ్యాభిషేకంబు నేడె జరుగు;
అన్నినగరాల ధర్మమ్ము నాచరింపు.
పొందకుము బాబ, రాష్ట్రమ్మునం దధర్మ
చారి యనియెడి పేరు; నే జనవలయును
నేడె పూరుషయక్షుని నికటమునకు.

విని కుమారు డిట్లనెను :

తెలుపవలయును నే నేమి సలుపు కతన
పొందితివో అప్రసన్నత ? ఎందునలన
నాకు రాజ్యమ్ము నొసగుచున్నారు నేడు ?
మీరె కావలె, రాజ్య మేమిటికి నాకు !

విని రా జిట్లనెను :

మాటలందున గాని కర్మముల గాని
ఎట్టిదోషము చేసినయట్టు లేదు

ఎన్నడును నీవు బాబ ! నే నేగవలయు
నిలుపుకొన మాట, యక్షునినికటమునకు.

విని కుమారు డిట్లనెను :

ఇచట నుండుడు మీరు, నే నేగువాడ;
అరుగుచో ప్రాణములతోడ తిరిగిరాము !
దేవ, మీరలు పోవక తీరదేని
అచ్చటికి, నేను సైతము వచ్చువాడ :
మిగుల మిర్వురముంగూడ మేదిని పయి !

విని రా జిట్లనెను :

నిశ్చయమ్ముగ నాయనా, నీ పలుకులు
సజ్జనవిధానమున ధర్మసమ్మతములు.
భీకరము కాదు మరణమ్ము నాకు; తీక్ష్ణ
యష్టిశూలమ్ముతోడ నీ యవయవములు
చీల్చి, యక్షుడు వండి భక్షించు నన్న
భావ ముదయించుచో మహాబాధ కలుగు.

కుమారు డిట్లనెను :

నీకు బదులుగ పోవుదు నేను యక్షు
సన్నిధికి, నీవు పోవద్దు : చావె శ్రేష్ఠ
తరము జీవముక న్నని తలచువాడ.

విని రాజు కుమారునిబలము తెలిసికొని, మంచిదని, నాయనా, పొమ్మనెను. అతడు తలిదండ్రులకు నమస్కరించి, నగరము వెలువడెను. ఈ విషయమును విశదీకరించుటకై శాస్త్ర యీ గాథ పలికెను :

అవలం దల్లిదండ్రి పాదాభివంద
నము చేసెను రాజతనయుడు ధృతిని

అతనివెంట తల్లి, తండ్రి, సోదరి, భార్య, అమాత్యులు, సేవకులును చనిరి. కుమారుడు తండ్రిని త్రోవచొప్పు అడిగి తెలిసికొని, తలిదండ్రులకు నమస్కరించి, తక్కినవారికి ఉపదేశ మిచ్చి, బెదరు లేని సింహకిశోరమువలె మార్గారూఢుడై, యక్షుని నివాసస్థానము చేరెను. అతడు చన్నపిదప తల్లి సంబాళించుకొన లేక నేలపై వ్రాలెను. తండ్రిచేతులలో తల పెట్టుకొని తీవ్రముగా నాక్రందనము చేయసాగెను. ఈ యర్థమును వెలువరించువాడై శాస్త ఈ గాథ పలికెను :

తల్లి దుఃఖించుచును వ్రాలె ధరణి, తండ్రి
బాహువులు పట్టుకొని విలాపమ్ము చేసె.

కుమారునికి తండ్రియిచ్చిన యాశీర్వచనము, తల్లి, సోదరి, భార్య చేసిన సత్యక్రియను ప్రకటించుటకై శాస్త యీ గాథలు పలికెను :

పరునివాతను తప్పక పడును పుత్రు
డని యెరిగి తండ్రి ఘటియించి హస్తయుగళి
సోమ వరుణ ప్రజాపతి సూర్యులకును.

"రమ్ము, నాయన. దేవతారక!" ననియె.

దండకారణ్యమున కేగు తనయు రాము
జనని యాశీర్వదించిన సరణి, తల్లి
మంగళము గోరు దేవతల్ మరవకుండ్రు
గాత నీ సత్యమును ! అనుజ్ఞాతుడ వయి
అడిగి బిడ్డడ, సుఖముగా మరలి రమ్ము !

స్పష్టముగా గాని చాటున గాని
నేను క్రోధము చెందనేలే దలిన
సత్యవాక్కునియెడ; స్మరియించి దీని
దయచేయుచో దేవతలు నీకనుజ్ఞ
అరిగి సోదర, నీవు తిరుగ రావలయు.

స్వామి, పతీవ్రతశ్రద్ధపై నీకు
ప్రీతి యున్నది; నాదుచేతమ్మునందు
ఎన్నండు నప్రియం బన్నది లేదు.
దేవతల్ స్మరియించి దీని, ననుజ్ఞ
దయచేయ మరల భద్రమ్ముగ రమ్ము !

తండ్రి చెప్పినమార్గమువెంట జని రాజకుమారుడు యక్షుని నివాసము చేరెను. "క్షత్రియులు మాయావులు, ఏమి జరుగునో యెవ రెరుగును" అనుకొని యక్షుడు చెట్టెక్కి రాజురాకకై యెదురు చూచుచు కుమారుని రాక కనుగొని, తండ్రి నాపి, కుమారుడు వచ్చినా డనుకొని, తనకు ఎట్టి భయము లేదని భావించి, వృక్షము దిగి, రాజకుమారునివైపు వీపు పెట్టి కూరుచుండెను. కుమారు డాతని కెదురుగా బోయి నిలిచెను. యక్షు డిట్లనెను :

ఏగుదెంచుచునున్నాడ వెచటినుండి ?
ఉన్నతంబును, ఋజువైనయొడలివాడ,
ఎంతో సుందరవదనుండ, వీవనమున
తిరుగు రౌద్రుని నరఖాది నెరుగవొక్కొ !
వచ్చునే మేలుకోరెడివా డిచటికి ?

కుమారు డిట్లనెను :

నీవు నరభక్షకుడ వని నే నెరుగుదు :
ఓయి రౌద్ర, యెరుంగుదు నుందు విచట
ననియు, నేను జయద్దిస తనయుడ జుమి,
నన్ను భక్షించి విడువుము నాజనకుని.

యక్షు డీగాధ పలికెను :

తనయుడవు జయద్దిసున కీ వని తెలియును :
ఉభయముఖమై ఖరులు గూడ నొక్కరకమె.

జనకు రక్షించి, స్వయముగా చావ నెంచు
దుష్కరం బైనకర్మకు తొడరినావు.

కుమారు డిట్లనెను :

జనకుముక్తికి స్వీయ జీవనము విడుచు
చేత దుష్కరకర్మగా చింత సేయ.
తల్లిదండ్రులకై బలిదాన మొసగు
వానికి సుఖమ్మగా నగు స్వర్గలబ్ధి.

అప్పుడు యక్షుడు "కుమారా, మృత్యు వన్న భయపడని ప్రాణి లేదు, నీకు భయ మేల లేదు ?" అనగా అతనికి ప్రత్యుత్తర మిచ్చువాడై కుమారు డీగాథలు పలికెను :

నిశ్చయమ్ముగ బహిరంగ నిభృతపాప
కర్మ లొనరించినట్టులు జ్ఞప్తి లేదు.
జనన మొందినవానికి చావు తప్పు :
దిచట నా కున్నయట్టులే యచట నుండు.

ఉపకరించును గాక ఈయొడలు నీకు :
నీవు కోరినపక్షాన నీసమక్ష
మందు, వృక్షమునుండి మహానుభావ,
అవనిపై బడి నీకు ఖాద్యమ్ము నగుదు.

"భయభ్రాంత చిత్తమున ఈతనిమాంసము తిననేర కున్నాను, కావున ఉపాయముచే నితనిని పారద్రోలెదను" అనుకొని యక్షు డిట్లనెను :

తండ్రి బ్రతికింపగా నిజతనువు విడుచు
ధర్మమే నచ్చునెడల, సత్వరము నీవు
నిప్పు ముట్టింపవలె పేర్చి కట్టియలను.

అట్లు చేసి రాజకుమారుడు యక్షునికడకు వచ్చెను. ఈ విషయము ప్రకాశింప జేయుటకై శాస్త్ర యీ గాథ పలికెను :

అవల, ధృతిమంతు డైన రాజాత్మజుండు
ప్రోగుచేయుచు కాష్ఠముల్ భూరివహ్ని
వెలుగజేసి యక్షునకును దెలిపె వార్త.

రాజకుమారుడు నిప్పు వెలిగించి తనదగ్గరకు వచ్చినపుడు యక్షుడు తనలో "ఇతనికి మరణభయములేదు. ఇతడు సింహము వంటివాడు. ఇట్టి నిర్భీకుని నే నింతవరకును చూడలేదు" అనుకొని, తనకు ఒడలు గగుర్పొడువగా కూరుచుండి, రాజకుమారుని మాటిమాటికిని చూడసాగెను. కుమారుడది గ్రహించి యీ గాథ పలికెను :

వోయి దుస్సాహసిక, చూచుచుంటి వేమి
నిండురోమహర్షమ్మున ? నేడు నీవు
ఆన తిచ్చిన దంతయు నాచరింతు :
సరసముగ మాంసభక్షణ సలుపవచ్చు.

యక్షు డీ గాథ పలికెను :

ఎవడు భక్షింపగా నేర్చు నిట్టిధర్మ
సంస్థితుని, సత్యవాదిని, సత్పురుషుని ?
ఇంతటివ రేణ్యుని భక్షించు నెవడు, వాని
శిరసు సప్తఖండము లయి చిదికిపోవు !

విని కుమారుడు యక్షునితో "నీవు నన్ను భక్షింప దలవనిచో, కట్టెలు తెప్పించి, యేల నిప్పు చేయించినావు ?" అనెను.

"నీవు పరుగెత్తుదువో పరుగెత్తవో చూచుటకు."

"నేను పశువుకడుపున బుట్టినపుడు దేవేంద్ర శక్రుడు సైతము నన్ను పరీక్ష చేయలేక పోయినపుడు, ఇపుడు నీవు నన్ను ఏమి పరీక్ష చేయగలవు?" అని కుమారు డీగాథ పలికెను :

అతని బ్రాహ్మణుగా నెంచి యాత్మతమవు
శశము దానము చేయ నచ్చటనె నిలిపె.

దేవపుత్రుడు చంద్రుడు దీనివలన
యక్ష, ప్రియరూపు డై కీర్తి నందినాడు.

యక్షుడు కుమారుని విడిచిపెట్టుచు ఈ గాథలు పలికెను:

పూర్ణిమానిశి చంద్రుని పోల్కి గాని,
రవివిధంబున నైనను రాహుముక్తి
నంది వెలిగెడిరీతి మహానుభావ,
పెల్లుగా వెల్గు మీవు కాంపిల్యమందు.

అతని వినమ్రుని కావించి, పంచశీలము లిచ్చి, రాజకుమారుడు తనలో "ఇతడు నిజముగా యక్షు డగునా కాడా? యక్షుల నేత్రములు ఎర్రగా నుండును, కనుపాపలు ప్రకాశింపవు, నీడపడదు, ఒడలు గగుర్పాటు చెందదు... ఇతడు యక్షుడు కాడు, మానవుడే... మా నాయనగారి ముగ్గురుసోదరులను యక్షిణి పట్టుకొని, అం దిరువురను భక్షించి, మూడ వానిని పుత్రస్నేహముచే పోషించి యుండవచ్చును. ఇత డాతడు కానోపును. ఈయనను కొనిపోయి నాయనగారికి చెప్పి రాజ్యమున ప్రతిష్ఠింప జేతును" అనుకొనిరి. "రా, నీవు యక్షుడవు కావు. మా నాయనగారి జ్యేష్ఠ సోదరుడవు. నావెంట వచ్చి కులక్రమాగత మగురాజచ్ఛత్రము ధరింపుము" అనెను.

"నేను మానవుడను కాను."

"నీవు నా మాటలు విశ్వసింపనిచో విశ్వసింపదగినవా డెవడైన ఉన్నాడా?"

"ఫలానిచోట దివ్యచక్షువు కల తపస్వి ఉన్నాడు"

రాజకుమారుని అత డచటికి గొనిపోయెను. తపస్వి వారిని చూచి "తండ్రికొడుకులు ఏమి చేయుచు అడవిలో తిరుగుచున్నారు?" అని వారి సంబంధము ప్రకటించెను. యక్షుడు తాపసిమాటలు నమ్మి కుమారునితో "బాబా, నీవు పొమ్ము. ఒక జన్మములోనే నాకు రెండుపుట్టుకలు వచ్చినవి.

నాకీ రాజ్యము వలదు. నేను ప్రవ్రజింతును" అనెను. తపస్వి ఆతనికి ఋషి ప్రవ్రజ్య అనుగ్రహించెను. కుమారుడు ప్రణామము చేసి నగరమునకు వెడలిపోయెను. ఈ విషయమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథ పలికెను :

అంత, ధృతిమంతు డైన రాజాత్మజుండు
యతునికి వందనము చేసి, యతనివలన
సమ్మతిం బొంది సుఖముగా జనె అలీన
శత్రు రాజపుత్రుండు పాంచాలమునకు.

ఈ గాథ పలికి, నగర నిగమాది జనులకు కర్తృత్వము ప్రకటించుటకై యీ గాథ పలికెను :

అఖిల జనపదవాసులు నఖిలనిగమ
వాసులుంగూడ రథ హస్తి వాహనులయి,
అంజలి ఘటించి, ఆతనియంతికమ్ము
దరిసి "దుష్కరికారి, మాదండ" మనిరి.

కుమారుడు వచ్చినట్లు విని రాజు ఎదురుపోయి స్వాగతము చెప్పెను. జనపరివేష్టితు డైన కుమారుడు తండ్రికి నమస్కారము చేసెను. రాజు ఆతనితో "బాబా, మానవభక్షకు డైన యతునివలన నెట్లు విముక్తి పొందితివి ?" అనెను.

"అతడు యతుడు కాడు, మీ పెద్దన్నగారు, నాపెత్తండ్రిగారు." అని కుమారుడు సమస్తవృత్తాంతము వివరించి, "మీరు బాబయ్యగారిని కలిసికొనవలెను" అనెను.

రాజు నగరమున చాట బంచి అనేకులు వెంటరా తాపసి కడకు జనెను. యక్షిణి తనను కొనివచ్చుట, చంపక పోషించుట మొదలగు విషయము లన్నియు తాపసి తెలిపెను. రాజు "వచ్చి రాజ్యము చేయుము" అనెను.

"వలదు." "అట్లగుచో ఉద్యానమున నుండుము. అన్నియుపచార ములు చేయుదును."

"వలదు."

అతనియాశ్రమమునకు కొలదిదూరములో కొండమాటున శిబిరము నెలకొల్పి రాజు పెద్దతటాకము త్రవ్వించి, పొలములు ఏర్పరచి వేయిమంది జనులను రప్పించి గ్రామము నిర్మించెను. అచట తాపసులకొరకు భిక్షావ్యవస్థ చేసెను. ఆ గ్రామమునకు చిన్న కమ్మాస దమ్మ నిగమము అని పేరు పెట్టిరి. సుతసోమబోధిసత్త్వుడు యక్షుని దమనము చేసినపిదప ఇట్టిప్రదేశ మేర్పడుటచే "మహాకంభా దంభ నిగమ" మని గ్రహింపవలెను.

శాస్త ఇట్లు ధర్మోపదేశనము చేసి సత్యక్రియ కావించి జాతకములు సరిపోల్చెను తోడనే మాతృపోషక స్థవిరుడు శ్రోతాపత్తిఫలమున ప్రతిష్ఠితుడయ్యెను. ఆ కాలమున మాతాపితలు మహారాజకులము; తపస్వి సారిపుత్రుడు; మనుష్య భక్షకుడు అంగుళిమాల; చెల్లెలు ఉత్పలవర్ణ; పట్టపుదేవి రాహులమాత; అలీనసత్త్వ కుమారుడు నేనే.

———:():———

514. ఛద్దంత జాతకము

శాస్త్ర జేతవనమున విహరించు సమయమున తరుణ భిక్షుణిని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

శ్రావస్తీ నివాసిని యగు కులపుత్రిక గృహస్థ జీవనము నెడ హేయ భావము కలిగి బుద్ధశాసనమున ప్రవ్రజించినది. ఒకనా డామె భిక్షునులతో పాటు ధర్మ ప్రసంగము వినబోయెను. ధర్మాసనముపై కూరుచుండి ప్రసంగము చేయుచున్న దశబలధారి గాంచి అనంతపుణ్య ప్రభావయుక్తము, ఉత్తమ సౌందర్య సంయుతము నగు ముక్తస్వరూపము గనుగొని ఆమె తనలో "సంసారమున తిరుగుచు నెన్నడయిన పూర్వజన్మమున నేను ఈ మహాపురుషునకు పాదదాసిగా నుంటినా, ఉండలేదా?" అనుకొనునప్పటికి పూర్వజన్మ సంబంధ మగు జ్ఞాన మామెకు లభించెను. ఛద్దంతగజజన్మ సమయమున తా నీ మహాపురుషునకు పాదదాసిగా నున్నట్లు జ్ఞప్తికి వచ్చి మిగుల సంతసించెను. ఈ ఆనంద ప్రభావమున ఆమె బిగ్గరగా నవ్వినది. అంత ఆమె మనసులో "కొలది మంది స్త్రీలు మాత్రము స్వామికి హితము కోరుదురు. చాలమంది అహితము కోరుదురు. ఇందు నేను హితచింతకురాలనా, అహిత చింతకురాలనా?" అనుకొను నప్పటికి "నేను కొలదిగా కోపము కలుగుటచే ఛద్దంతమహాగజేశ్వరుని సోనత్తరనాము డగు వేటగానిని పంపి విషములో ముంచిన శల్యముతో కొట్టి చంపించితిని" అను విషయము జ్ఞప్తికి రాగా శోక ముత్పన్నమై గుండె వేడి యెక్కి దుఃఖము నాపుకొనలేక నిట్టూర్పు విడిచి బిగ్గరగా రోదనము చేసెను. చూచి శాస్త మందహాసము చేసెను. దానికి కారణ మేమని భిక్షుసంఘము అడుగగా శాస్త "భిక్షువులారా, ఈ తరుణభిక్కుని పూర్వజన్మమున నాయెడ చేసిన అపరాధము జ్ఞప్తికి తెచ్చుకొని రోదనము చేయుచున్నది" అని పూర్వజన్మ కథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున హిమాలయ ప్రదేశమున ఛద్దంత సరోవరము కడ ఎనిమిదివేల యేనుగు లుండెను. అవి బుద్ధిమంతములు; ఆకాశమార్గమున విహారము చేయగలవి. ఆ సమయమున బోధిసత్త్వుడు జ్యేష్ఠగజమునకు పుత్రుడై పుట్టెను. ఒడలు తెలుపు-ముఖము, పాదములు ఎరుపు. పెరిగిన తరువాత ఎనుబది యెనిమిది మూళ్ళ యెత్తు నూట యిరువది మూళ్ళ వెడల్పు. వెండిదండతో సమానమైన 58 మూరల తుండము. దంతముల చుట్టు కొలత 15 మూరలు, పొడవు 30 మూరలు, వానినుండి ఆరు రంగుల కాంతులు వెలువడుచుండెను. 8 వేల యేనుగులకు ఆహస్తి నాయకుడు; 500 మంది ప్రత్యేక బుద్ధులకు పూజచేయుచుండును. ఆ గజరాజమునకు రెండు పట్టపు టేనుగులు కలవు; చిన్న సుభద్ర, పెద్ద సుభద్ర. గజరాజము పరివారములో కాంచన గుహాలో నివసించుచుండెను.

ఆ ఛద్దంతసరోవర వైశాల్యము ఏబది యోజనములు. దాని నడుమ 2 యోజనముల స్థలమున నాచు గాని, బురద కాని లేదు. అందలి నీరు మణి వర్ణముతో సమానము. దాని కావల ఆ జలములో నలువైపుల యోజనముమేర సుందరవనము కలదు. దాని కావల నలువంకల యోజనముమేర నీలోత్పల వనము కలదు. దాని కావల రక్తపద్మములు, దాని కావల శ్వేతపద్మములు, దానికావల కుముదవనము చుట్టుకొని యున్నవి. ఈ సప్తవనముల కావల వీని నన్నిటిని యోజనము యోజనముమేర మిశ్రమవనములు చుట్టుకొని యున్నవి. దాని కావల ఏనుగుల నడుము వరకు నీటిలో యోజనముమేర ఎఱ్ఱని శాలివనము కలదు. దాని కావల నీటి సరిహద్దున నీల, హారిత, రక్త, శ్వేత వర్ణములు కలిగి పరిమళముతో కూడిన చిన్ని, చిన్ని పూవుల చెట్ల వనము కలదు. ఈ ప్రకారముగా ఈ పదివనములు యోజనము యోజనముమేర నున్నవి. దాని కావల చిన్న చిన్న పెసర పొలములు కలవు. దాని కావల ఆనపకాయ, గుమ్మడికాయల తీగలు, బూడిద గుమ్మడి తీగలు కలవు దాని కనంతరము పోకచెట్లంత ఎత్తు గల చెరుకుతోటలు కలవు. దానికావల ఏనుగుదంతము లంత పెద్ద పెద్ద అరటి తోటలు కలవు. దానికి పిమ్మట సాలవనము దాని కవతల కుంభము

లంతటి కాయలు గల పనసతోట. దాని కావల తీయని కాయలు గల చింత చెట్లు, ఆవల వెలగతోట, ఆవల కలగలుపుగా నున్న మహావనఖండము, దాని కావల వేణువనము. ఆ సమయమున ఇంత పుష్పఫల సంపద కలదు. "సంయుక్త నికాయ"ము లోని అర్ధకథలో కేవల మిప్పటి సంపద మాత్రము ఉల్లేఖింపబడినది. వేణు వనమునకు నలుప్రక్కల ఏడు పర్వతములు కలవు. వెలుపలినుండి చూచుచో మొదటి పర్వతమునకు క్షుద్రకాల మనియు, రెండవ దానికి మహాకాల మనియు నామములు. దాని కావల నున్నది ఉదకపశ్య పర్వతము, తరువాతిది చంద్రపశ్యము, ఆ తరువాతిది సూర్యపశ్యము, అనంతరము మణిపశ్యము, ఏడవ పర్వతము స్వర్ణపశ్యము. దీని యెత్తు ఏడు యోజనములు, ఛద్దంత సరోవరమునకు నలువైపుల గిన్నె పెట్టిన ట్లుండెను. దాని లోపలి భాగము బంగరు కాంతితో నుండెను. అందుండి వెలువడు కాంతులచే ఛద్దంతసరోవరము ఉదితబాలసూర్యుని వలె నుండెను. వెలుపలి పర్వతములలో ఒకదాని యెత్తు ఆరు యోజనములు, ఇంకొకదానియెత్తు ఐదుయోజనములు, వేరొకదానియెత్తు నాలుగు యోజనములు, మరియొక దానియెత్తు మూడు యోజనములు. ఒకదానియె— రెండు యోజనములు, ఇంకొకదానియెత్తు ఒక యోజనము. ఈ విధముగా ఏడు పర్వతముల చుట్టును గల ఛద్దంత సరోవరమునకు పూర్వోత్తర కోణమున నీరు గాలి తగులుచోట పెద్ద మర్రిచెట్టు కలదు. దాని బోదె చుట్టు కొలత ఐదు యోజనములు, ఎత్తు ఏడు యోజనములు. నలు దిక్కుల వ్యాపించిన నాలుగు కొమ్మలు, ఆరు యోజనములపైకి వెలువడుశాఖ కూడ ఆరు యోజనములు. ఈ విధముగా వేరు మొదలు దాని యెత్తు పద మూడు యోజనములు, శాఖల నుండి పైకి నలువైపుల 12 యోజనములు. ఎనిమిదివేల చిన్నకొమ్మలతో కూడిన ఆ మర్రిచెట్టు పర్వతము శిఖరమున మణి వలె వెలుగుచుండెను. ఛద్దంతసరోవరమునకు పశ్చిమదిక్కున స్వర్ణపశ్య పర్వతమున పన్నెండు యోజనముల కాంచనగుహ కలదు. వర్షాకాలమున ఎనిమిదివేల యేనుగులతో కూడి ఛద్దంతనాగరాజు ఆ కాంచన గుహలో నివసించుచుండును. గ్రీష్మకాలమున నీరు, గాలులకు ఆనందించుచు ఆ పెద్ద మర్రిచెట్టు నీడలో శాఖల క్రింద నివసించుచుండును.

సాలవనము పుష్పించినదని ఒకనాడు నాగరాజుకు తెలిపిరి. అనుచరు లందరతో నాగరాజు క్రీడార్థము సాలవనము చేరెను. చిన్నసుభద్ర గాలి కెదురుగా నిలుచుండెను. దాని శరీరమున ఎండు రెమ్మలతో నిండిన పురా పర్ణములనుండి ఎర్రచీమలు రాలినవి. పెద్దసుభద్ర గాలివాలున నుండెను. దాని శరీరముపై పుప్పొడి, కేసరములు, చిగురుటాకులు రాలినవి- చూచి సుభద్ర తనలో ఈ గజరాజు తన ముద్దులభార్య శిరసుమీద పుప్పొడి, కేసరములు చిగురాకులు రాల్చినాడు; నా నెత్తిమీద ఎండు రెమ్మలు, పండుటాకులు, ఎర్రచీమలు రాల్చుచున్నాడు. మంచిది, ఏమి చేయుదునో చూతము" అనుకొని బోధిసత్త్వునియెడ మనసులో వైరము పూనెను.

మరునాడు కూడ గజమండలితో గజరాజు స్నానార్థము ఛద్దంత సరోవరమున దిగెను. రెండు గున్నయేనుగులు తొండములతో నీరు పట్టి కైలాస శిఖరమును పరిశుభ్రము చేసినట్లు గజరాజును స్నానము చేయించినవి.

ఆవల ఆడయేనుగులు రెండు స్నానము చేయించి, ఈవలకు వచ్చి బోధిసత్త్వుని ప్రక్కన నిలిచినవి. ఆవల ఎనిమిదివేల యేనుగులు జలక్రీడ చేసి సరోవరమునుండి నానావిధ పుష్పములు తెచ్చి అలంకరించి ఆడ యేనుగులను కూడ అలంకరించి ఆడయేనుగులను కూడ అలంకరించినవి. అప్పుడొక యేనుగు సరోవరములో తిరుగుచు సత్త్వోదయ మను మహాపద్మము లభింపగా దానినితెచ్చి బోధిసత్త్వున కిచ్చెను. ఆయన కేసరములు శిరముపై చల్లుకొని పెద్దసుభద్ర కిచ్చెను. చిన్నసుభద్రచూచి 'ఈ సత్త్వోదయ పత్రము తన ముద్దుల పెద్దభార్య కిచ్చుకొన్నాడు: నా కీయలేదు.' అనుకొని మరింత వైరము వహించెను. ఒకనాడు బోధిసత్త్వుడు మధురఫలములు, బిసకాండములు, కమల పత్రములలో నుంచి 500 మంది ప్రత్యేక బుద్ధులకు వడ్డించుచుండెను. చిన్నసుభద్ర తనకు లభించిన పండ్లు మొదలగునవి ప్రత్యేకబుద్ధులకు పెట్టుచు తనలో ''ఇచటనుండి మృతినొంది మద్రరాజకులమున సుభద్ర అను పేరరాజకన్యకనై పుట్టవలెను. ఆవల పెద్దదాన నైన పిదప వారాణసీ నరేశునకు పట్టపుదేవినై ప్రియపత్నినై మనసునకు నచ్చుదానను

కావలెను. ఆయన నా మాట బాగుగా వినునప్పుడు వేటకానిని పంపి విష ములో ముంచిన బాణముతో ఈ గజేంద్రుని కొట్టి చంపించి ఛద్దంతములను తెప్పించుకొనవలెను'' అని కోరుకొనెను.

ఆ తరువాత గుహ వదలి చిన్నసుభద్ర శుష్కించిపోవుచు అచిరకాల మున మృతినొందెను. తరువాత మద్రదేశనరేశుని పట్టపుదేవి కడుపున పుట్టెను. శిశువుకును భద్ర అని పేరు పెట్టి ఆమె పెరిగి పెద్దదయిన పిదప వారాణసీ నరేశునకు ఇచ్చి పెండ్లి చేసిరి. ఆమె రాజుకు ఇష్టురాలై, మనసు నకు నచ్చినదై ౧౬ వేల మంది స్త్రీలకు జ్యేష్ఠురాలై యుండెను. ఒక నా డామెకు పూర్వజన్మ జ్ఞానము కలిగి ''నా సంకల్పము కొంతవరకు నెరవేరి నది. ఇక ఆ యేనుగు దంతముల జత కావలె నందును'' అనుకొని ఒడలికి నూనె పూసికొని మలిన వస్త్రము ధరించి రోగివలె మంచముపై పండు కొనెను.

''సుభద్ర యెక్కడ ?'' అని రాజడిగెను.

''ఆమెకు జబ్బుగా నున్నది''

అతడు శయనాగారమునకు జని, మంచముపై గూరుచుండి వీపు నిమురుచు, యీ గాథ పలికెను :

ఓసి వరవర్ణినీ, యిట్టు లుంటి వేమి
పాండురోగి విధమ్మున పాలిపోయి ?
ఓ విశాలాక్షి, యేమిటి కుంటి విట్లు
మర్దితంబైన పుష్పదామమ్ము వోలె ?

విని యామె యీ గాథ పలికెను :

ఓ మహారాజ, స్వప్నమం దుప్పతిల్లె
కోర్కె యొక్కటి, శ్రమతోడ గూడినట్టి
దగును నిక్కముగా నది ధారుణీశ !

రాణీ గాథ పలికెను :

లోకమున భోగ్యవస్తువుల్ నాకడ గడు
హెచ్చుగా నున్నయవి ప్రియా, యేదో కోర్కి
విశద మొనరించుచో నెరవేర్చువాఁడ.

విని దేవి "మహారాజా, నా కోరిక నెరవేరునది కాదు. అది యేదో యిప్పుడు చెప్పలేను. తమ రాజ్యములో నున్న వేటకాండ్ర నందరను సమావేశ పరపుడు. వారినడుమ తెలిపెదను" అని చెప్పునదయి యీ గాథ పలికెను :

మీరు నేల్బడిలో నున్న మేటిమగల
వేటకాండ్రను నిట సమావేశ పరుప,
వారియెదుటను వివరింతు వాంఛ రీతి.

రాజు మంచిదని, శయనాగారము వెలువడి మూడువందల యోజనముల కాశీరాష్ట్రమున నున్న వేటకాండ్రందరును ఇచ్చట సమావేశమగునట్లు చాటింపు చేయ మంత్రుల కానతిచ్చెను. వా రటులే చేసిరి. అచిర కాలములోనే వేటకాండ్రు సమావిష్టులై రాజునకు తెలియపరచిరి. విని, రాజు కిటికీ తెరచి, చేతులు తట్టి, రాణికి వారి రాక తెలియ జేయువాఁడై యీ గాథ పలికెను :

వేటలో దేవి, నిపుణులు వివిధ విపిన
దేశమందలి మృగముల తెర గెరిగిన
వీర, లసువులు నాకునై విడువగలరు.

దేవి విని, వారిని సంబోధించునదై యీ గాథ పలికెను :

వేటకాండ్రెల్ల శ్రద్ధతో వినవలయును :
ఆరు వన్నెల దంతము లమరియున్న
శుక్లహస్తిని స్వప్నాన చూచినాను,
కావలయు దానిదంతముల్ ; జీవితంబు
దుర్ఘటం బగు నయ్యవి దొరకవేని !

విని, వేటకాం డ్రిట్లనిరి :

మాదు పితరులు మా పితామహులు కాని
ఎన్నడుం గూడ జూడలే దిట్టి హస్తి;
స్వప్నగత గజవర్ణన సలుపు దేవి!

ఈ తరువాతి గాథ కూడ వారు పలికినదే :

అన్నియుం గూడి దశదిశ, లందులోన
ఏదిశ న్నిల్చియుండె నా యిభవిభుండు ?

సుభద్రాదేవి వా రంవరను శ్రద్ధతో చూచెను. అందు సోణుత్తరుడు కానవచ్చెను. అతని పాదములు బాగున్నవి, పిక్కలు స్థాలివలె నున్నవి; మోకాళ్ళు పెద్దవి; రొమ్ము విశాలము, గడ్డము మీసము నల్లనివి; నేత్రము లెఱ్ఱనివి. చూడగానే వాడు బోధిసత్త్వునకు పూర్వశత్రువువలె దోచును. రాణి వానిని గనుగొని తాను చెప్పిన పని చేయువా డని తలచి, రాజాజ్ఞ పొంది, ఏడంతస్తుల మేడ మీదికి వానిని రప్పించి, ఉత్తరపు వైపు కిటికీ తెరచి, ఉత్తర, హిమాలయము వైపు చేయి చాపి, యీ గాథలు పలికెను :

ఇచ్చటికి నుత్తరమ్మున నేడు కొండ
లగపడును సూటిగా, వాని కవ్వటి దెస
స్వర్ణపార్శ్వనామకము, పుష్పములతోడ
నిండియుండెడి యొక పెనుగొండ కలదు.

కిన్నర నివాసమైన యా గిరి చివరకు
నేగి వీక్షించుచో నిమ్న భాగమందు
మేఘవర్ణములో నెనిమిది సహస్ర
సంఖ్య కలిగిన యూడలన్ సాంద్ర మగుచు
గొప్ప వటవృక్ష మొక్కటి గోచరించు.

ఆరు వన్నెల దంతాల హస్తి యచట
నుండు తెల్లని, దద్దాని నొరు లధీన

పరుచుకొనజాల రత్రశమ భంగి; దాని
అష్ట సాహస్రిక గజమ్ము, లరదధురుల
వంటి దంతాలు కలవియు, వాయువేగ
ఘట్టనమ్ములు కలవియు కాచుచుండు.

మానవుం డెవ్వడేనియు గానబడిన
ఫూత్కరించుచు నవి వాని బూది చేయు !
పవన వశమున మిగులదు భస్మ మైన.

వివి సోణుత్తరుడు మరణభీతి చెంది యీ గాథ వలికెను :

రాజకులమున గలవు స్వర్ణంపు నగలు,
మణిమయ విభూషణంబులు మౌక్తికములు
ఏన్గుదంతాలతో దేవి, యేమి చేతు ?
విభమునా, మమ్మునా చంప నెంచినావు !

దేవి యిట్లు బదులు పలికెను :

ఎప్పటి విరోధముననొ నే నీర్ష్య చేత
పీడ నొందుచు శుష్కించి పోవుదాన !
చెప్పుపని చేయుదువయేని శ్రేష్ఠ మైన
గ్రామముల నైదిటిని నీకు కాన్కయిత్తు.

ఇట్లు పలికి "ఓయి వేటకాడా, నేను పూర్వ జన్మములో ప్రత్యేక బుద్ధులకు దానము లిచ్చుచు, ఆరురంగుల దంతములుకల యేనుగును సంహరించి దాని దంతములు రెండును తెప్పించుటకై ప్రార్థన చేసినాను. నేను కలవరింపలేదు. నా సంకల్పము నెరవేరవలెను. నీవు భయపడక పొమ్ము" అని వాని నూరడించెను. చిత్తమని నాడు సమ్మతించి "ఆర్యే, దాని నివాసస్థానము స్పష్టముగా తెలుపవలెను" అని యిట్లు పలికెను :

ఉండు నెచ్చట : తిరుగుచునుండు నెచట ?
తాన మెచ్చట నాడు దంతావళంబు ?
దీనిగతి మాకు నేరీతి దెలియగలదు ?

ఆమె పూర్వజన్మ వృత్తాంతము జ్ఞప్తికి తెచ్చుకొన గలుగుటచే తనకు స్పష్టముగా కనబడుచున్న తావు వర్ణించుచున్నదై యిట్లు పలికెను :

అనతి దూరాన రమ్య జలాశయమ్ము,
భ్రమరములు వ్రాలు పుష్పిత పాదపములు
అన్ని దిక్కుల, నద్దాని నావరించు :
నాగరా జందులోనె స్నానమ్ము చేయు,

పుండరీకము బోలు వేదండరాజు
జలక మాడిన పిమ్మట సరసిజములు
మస్తకమ్మున దాలిచి మహిషి సర్వ
భద్ర ముందిడుకొని మహావైభవమున
తాము నివసించు చోటికి తరలిపోవు.

సోణుత్తరుడు విని "చిత్తము! ఆ హస్తిని సంహరించి దాని దంతములు తమకు సమర్పింతును" అని విన్నవించెను. ఆమె సంతుష్టచిత్తయై వానికి వేయి నాణెము లిచ్చి "నీ యింటికి పొమ్ము. నేటి కేడవనాడు దాటకుండగనే అచటికి బయలుదేరుము" అని ప్రోత్సహించెను. ఆవల రాణి కర్మకారులను పిలువనంపి "కత్తి, గొడ్డలి, పలుగు, గునపము, చిన్నసుత్తె కొడవలి, ఖడ్గము, ఇనుపదండము, రంపము, గూటము, ఇనుపచక్రము కావలెను. త్వరలో కొని రావలెను" అని శిల్పులను, చర్మకారులను బిలువనంపి చర్మముతో జేసిన కొన్ని వస్తువులకై ఆనతిచ్చెను. వారా వస్తువులు శీఘ్రముగా గొనివచ్చిరి. వేటకానికి వలయు సామగ్రి యంతయు పాథేయము, నిప్పు తరచెడి కర్రలు మొదలు, తినెడి పిండి మొదలగు భోజన పదార్థములవరకు— తోలుసంచిలో వేసిరి.

సోణుత్తరుడు సంసిద్ధుడై, యేడవనాడు వచ్చి దేవికి ప్రణామము చేసి నిలిచెను.

"సౌమ్యా, నీ ప్రయాణమునకు కావలసిన వస్తువు లన్నియు ఈ పెద్ద సంచిలో నున్నవి, తీసికొనుము."

వేటకాడు అయిదు ఏనుగులబలము కలవాడు. అంతబరువు గలసంచిని పూరీలబుట్ట నెత్తిన గ్లైత్తి చంకను తగిలించుకొని నిలుచుండెను. వాని కుటుంబమునకు కావలసిన ధన మిచ్చి, రాజుతో చెప్పి, రాణి వారికి సెల విచ్చెను. రాజుకు రాణికి నమస్కరించి వాడు రాజమహాలు దిగి, రథములు విడిచి, అనేకులు వెంట రా నగరము వెలువడి, సరిహద్దుసీమ చేరి, జానపదు లను ఆపి, సీమాంతజనముతో అరణ్యమున ప్రవేశించెను. ఆవల వారినికూడ వెనుకకు బంపి వా డొకడే పయనము చేసెను. ఇట్లు ముప్పదియోజనములు దాటి, దర్భలవనము, కాశవనము, తృణగహనము, తులసీవనము, శరగహ నము, దంతివృతకాననము, మొద లగు ఆరు కంటకగహనములు, కుంజవన ములు దాటెను. ఆవల వేత్రవనము, మిశ్రితగహనము, నల (గడ్డి)వనము, శరవణగహనము, పొట్టపై ప్రాకిపోవుటకును శక్యము కాని కాననము, చెట్లయడవి, వెదుళ్ళయడవి, చిత్తడినేల, పర్వతారణ్యములు క్రమముగా నెదు రయ్యెను. వాడుదర్భలు కత్తితో కోసి, తులసి మొదలగునవి కొడ వలితో నరకెను; చెట్లు గొడ్డలితో కొట్టెను. ఈ విధముగా త్రోవ చేసికొనుచు పయనము సాగించెను. వెదురుబొంగులతో మెట్లు కట్టి, వెదురు పొదలపై కెక్కి, వానిని కోసి, వేరుకుంజములపై బారవేయుచు, వెదుళ్ళపైనుండియే బురదనేలలపై కర్రబల్ల వేయుచు, వెనుకబల్లను ముందరికి వేయుచు దాటు చుండెను. ఆవల చిన్ననావ సిద్ధము చేసి, జలమయప్రదేశము దాటుచుండెను. ఆవల పర్వత మెదు రయినపుడు మొగదల నిలిచి, లోహముతో చేసిన చతు ష్కోణమునకు త్రాడు కట్టి పైకి విసరెను. పోయి అది పర్వతమునకు పట్టు కొనెను. దానిపట్టువలన త్రాటిమీదుగా వాడు కొండమీది కెగబ్రాకెను. అచట గట్టిమైన గల యినుపగూటముతో పర్వతమును భేదించి, అచట గట్టిమేకు కొట్టి దానిపై నిలిచి, ఆలోహచతుష్కోణమును వదలించి పైకి లాగి మరల మీదికి విసరివేయగా అది మరల ఒకచోట గట్టిగా పట్టుకొనెను. దానికి వ్రేలాడుచున్న తోలుపట్టీ తొడ్పాటుతో నెక్కెను; ఆ పట్టీని క్రింది మేకుకు కట్టి ఎడమచేతి వైపున నున్న పట్టీ పట్టుకొని కుడిచేతితో ముద్గ రము పట్టుకొని పట్టీపై కొట్టెను ఈ విధముగా మేకు ఊడ బెరుకుచు మరల పై కెక్కెను. ఈ విధముగా వాడు కొండకొన కెక్కి క్రమముగా రెండవవైపు దిగెను. మరల పూర్వక్రమానుసారముగా పర్వతము లెక్కి

దిగుచు కొంతమేర సాలెపురుగు దారము విడిచిపోవునట్లు పోవుచు చర్మము పట్టా ఎత్తుచు దింపుచు ప్రయాణము చేసెను.

సుభద్రాదేవి చెప్పినట్లు వేటకాడు నగరము వెలువడినది మొదలు పదునేడుగహనములు దాటి తుదకు పర్వత గహనప్రదేశము చేరుకొనెను. అచటినుండి కూడ ఆరుపర్వతములు గడచి వాడు స్వర్ణపర్వతముపైకి ఎక్కిన విషయము ప్రకటీకరించుచు శాస్త ఇట్లు చెప్పెను :

వేటకా డమ్ముల పొదిని వింటి దాల్చి
పర్వతమ్ముల దరియుచు, స్వర్ణపార్శ్వ
భూధరం బేదొ యని తలపోయ సాగె.

కిన్నరావాస మైన యాగిరిశిఖరము
నెక్కి క్రిందికి జూడగా నిమ్నభూమి,
నీలమేఘంపుచాయతో వేలకొలది
ఊడలం గూడిన మహావటోర్విరుహము-

ఆరువన్నెల దంతాల హస్తిరాజు
మహితగజయూధ మండలమధ్యమందు
వానికిం గానబడియె నావటముకడను.

తోచె దానికి నించుక దూరమందు
హస్తివిభుడు జలకమాడు నట్టిసరసి.

ఇభరహస్యములు గ్రహించిన వేట
కాడు కుత్తుకగా త్రవ్వె కందకమ్ము.

క్రమానుకూల మగు కథ యిట్లున్నది. వేటకాడు ఏడుసంవత్సరముల, యేడుమాసముల, యేడుదినములకు బోధిసత్త్వుని నివాసస్థానము చేరి, ఆలోచించి, యిచ్చట గుంట త్రవ్వి నిలిచి, హస్తిరాజమును బాణముతో కొట్టి సంహరింపవచ్చు నని నిర్ణయించుకొనెను. ఆవల వాడు అడవిలో జొచ్చి, స్తంభాదులకై చెట్లు కొట్టి, వలయువస్తువులు సమకూర్చుకొని,

ఏనుగులు స్నానము చేయబోయినపుడు పెద్దపలుగుతో వాని స్థావరమున గుంట త్రవ్వెను. అవల బీజములు చల్లునట్లు త్రవ్వినభూమిపై నీరు చల్లెను; బోలురాళ్ళమీద స్తంభములునిలిపి, వానిపై వాసములు కర్రచెక్కలు నుంచి, నడుమ బాణియంతటి బెజ్జము విడిచి, దానిపై మన్ను, చెత్త చెదారము చల్లెను. తాను దాగియుండుట కొకప్రక్కన తావర మేర్పరచుకొనెను. ఈ ప్రకారముగా సిద్ధ మయిన పిదప, వాడు ప్రాతఃకాలముననే వస్త్రముతో శిరస్సు, ముఖము కనబడకుండ కప్పుకొని, కాషాయాంబరము ధరించి, విషములో ముంచిన బాణము, విల్లు పట్టుకొని, గుంటలోనికి దిగి, నిలుచుండెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త యిట్టు పలికెను :

కందకమ్మును పలకలం గప్పి, లోన
దాగి విలుకాడు పార్శ్వాన నేగుదంతి
నిడివిబాణమ్ముతో గొట్టె నిష్ఠురముగ-

నాటుకొన్నంత బాణమ్ము నాగరాజు
ఘోరఘీంకార మొనరించె; కుంజరములు
బొబ్బపెట్టుచు పరు గిడి పోయె దెసల.

దాయను మారింప నెంచిన తరుణమందు
కరికి కాషాయవస్త్రంబు కానవచ్చె.

అర్హతధ్వజ ధారి సంహార యోగ్యు
డెట్టు లగు నని బాధలో నెంచె హస్తి.

అత డాతనితో సంభాషించువాడై యీ గాథలు పలికెను :

చిత్తకాషాయ మెవడు త్యజింపలేడొ
అతడు కాషాయధారణ మాచరించె,
సత్యసంయమములకును చాలదూర
మయినవాడు తద్ధారణ కర్హు డగునె?

చిత్తకాషాయయుక్తుడై శీలమందు
సుప్రతిష్ఠితుడై సత్త్వశోధతోడ
సంయమముతోడ గూడినసజ్జనుండు
అందు కాషాయధారణార్హత నిజమున

ఇట్లు పలికి బోధిసత్త్వుడు తన మనస్సులో వానియెడ ఎట్టి వైర భావము రానీయక, "మిత్రమా, నీవు నన్ను బాణముతో ఏల కొట్టితివి? నీ కొరకా? కాక అన్యప్రేరణ చేతనా?" అనెను.

ఈ యర్థమును స్పష్టముచేయుటకై శాస్త యిట్లనెను:

పొడమనీయక క్రోధమ్ము భూరిబాధ
నిభవిభుడు విలుకానితో నిట్లు పలికె:
"నన్ను బాణముతో గొట్టినావు సౌమ్య!
కారణం బేమి? ఎవ్వరిప్రేరణమ్ము?"

ప్రత్యుత్తర మిచ్చువాడై వేటకా డిట్లనెను:

కనుగొనె భదన్త, నన్ను ఆ కాశిరాజ
పట్టమహిషి సుభద్ర స్వప్నమ్మునందు
ఆమె నీదు దంతాలకై యానతిచ్చె.

విని బోధిసత్త్వుడు ఇది చిన్న సుభద్రపని యనుకొని, బాధ సహించుచు ప్రకటము కానీయక "ఆమెకు నాదంతములతో పని లేదు. నన్ను సంహారించుటకే యితనిని పంపినది" అని తలపోసి యీ గాథలు పలికెను:

అవగతంబె సుభద్రకు నస్మదీయ
పితృపితామహ దంతముల్ వెల్గిచ టని
కాని క్రోధవశమ్మున పూనె పగను
మూర్ఖురాలు నా జీవితమును హరింప

నేను మరణించుటకు మున్నె నీవు రంప
మునను దంతములం గోసి మోసికొనుచు

క్రుద్ధురాలికి జెప్పుము కుంజరమ్ము
అంత మొందిన, దివి దానిదంతము లని.

వా డావాక్కులు విని, అక్కడనుండి లేచి, దంతములు కోయుటకై రంపము చేకొని, గజమువద్దకు పోయెను. ఏనుగు 88 మూరలయెత్తు. పర్వతాకారమున నున్న యా మహాగజదంతములు వాని కందలేదు. అందుచే హస్తి శరీరము, శిరసు వంచి పండుకొనెను. రజతదండము వలె నున్న గజతుండము త్రొక్కుచు, వాడు కైలాసశిఖరసదృశమైన తలపై కెక్కి, పెదవులలో మోకాళ్ళు పెట్టి, దిగి, రంపము నోటిలో దూర్చెను. నోటి వెంట రక్తము కారి, గజమునకు బాధ పుట్టెను. ఇటు నటు లాగినను రంపము తెగలేదు. హస్తి బాధ సహించుచు "మిత్రమా, కోయలేకున్నావా?" అనెను. "చిత్తము స్వామీ!" చిత్తము గట్టి చేసికొని మహాగజము వానితో "మిత్రమా, తొండ మెత్తి రంపము కొనతో పట్టి యుంచుము. నాయంత నేను తొండ మెత్తజాలకున్నాను" అనెను. వాడు అటులే చేసెను. హస్తి తుండముతో రంపము పట్టుకొని యిటునటు లాగెను. దంతములు చిగురుటాకుల వలె తెగెను.

"మిత్రమా, దంతములు నా కప్రియములై నీ కిచ్చుట కాదు. శక్రత్వము, మారత్వము, బ్రహ్మత్వము కోరి యిచ్చుట లేదు. సర్వజ్ఞతా జానరూప దంతములు ఈ దంతములకన్న లక్ష గుణములు గొప్పవి. వాని కొరకై వీనిని నీ కిచ్చుచున్నాను. మిత్రమా, నీ విచ్చటి కెంతకాలమునకు రాగలిగితివి?" అనెను.

"ఏడు సంవత్సరముల, యేడు మాసముల, యేడు దినములకు."

"పొమ్ము. ఈ దంతముల ప్రభావమున నీ వచటికి ఏడు రోజులకు ముందే చేరగలవు."

అని బోధిసత్త్వుడు వాని సంరక్షణార్థము ప్రార్థన చేసి సెలవిచ్చెను. అవల సుభద్రతో గూడ తక్కిన యేనుగులు రాకపూర్వమే మృతి నొందెను:

ఈ యర్థమును ప్రకటీకరించువాడయి శాస్త యిట్లనెను :

కుంజరశ్రేష్ఠు దంతముల్ గొని ముదమున
అతులనీయ సుందరికడ కరిగినాడు
వేగిరమ్ముగ నాశమేటి వేటకాడు.

వేటకాడు వెడలిపోయిన పిమ్మట శత్రువు కానబడకుండుటచే తక్కిన గజములు వెనుదిరిగి వచ్చినవి.

ఈ యర్థమును ప్రకటించువాడయి శాస్త యిట్లనెను :

నాగరాజుకు దిగ్ధంబు నాటుకొన్న
యపుడు ఘీంకార మొనరించు చన్ని దెసల
కెంతయును భీతి బరుగిడు నేన్గు లెల్ల
క్రమ్మరిల్లిన వట వైరి కానరామి.

ఆయన వెంట సుభద్రకూడ వచ్చెను. అందరును ఏడ్చి మొత్తుకొని, బోధిసత్త్వునకు విశ్వాసపాత్రులైన ప్రత్యేక బుద్ధులకడ కేగి "పూజ్యులారా, మీ యక్కరలను తీర్చుదాత విషాక్తమైన బాణముచే మరణించినాడు. కళే బరమును చూచుటకు రావలెను" అని చెప్పిరి. అప్పుడు 500 మంది ప్రత్యేక బుద్ధులు ఆకాశమార్గమున వచ్చి అంగణమున దిగిరి. ఆ సమయముననే రెండు గున్న యేనుగులు గజరాజ శరీరమును దంతములతో నెత్తి, ప్రత్యేక బుద్ధులకు వందనము చేయించినవి. కళేబరమును చితిపైనుంచి అగ్ని యంటిం చిరి. చితి ప్రక్కన రాత్రి యంతయు ప్రత్యేకబుద్ధులు సూత్రపాఠము చేయుచుండిరి. ఎనిమిదివేల యేనుగులు చితి నార్పి, స్నానములు చేసి, సుభద్రను ముందు పెట్టుకొని, బయలుదేరి, తమ తమ నివాసములకు జేరినవి.

ఈ యర్థమును ప్రకటించుటకై శాస్త యిట్లు పలికెను :

మొత్తుకొను చేడ్చుచును ధూళి నెత్తిమీద
జల్లుకొనుచు దంతావళసంఘ మెల్ల

గజవిభునిరాణి యగ్రభాగమున నడువ
నిజ నివాసమ్ములకు జేరె నెగులు తోడ.

సోణుత్తరుడు ఏడవనాటికి ముందే దంతములతో వారాణసి చేరెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త యిట్లు పలికెను:

కాంచనద్యుతి దిశల వ్యాపించుచుండ
కరివిభుని దంతములతోడ కాశి జేరి
రాజపుత్రికి వాని నర్పణము చేసి
వృత్త మంతయు జెప్పెను వేటకాడు.

వీనిని గొనిపోయి, నేను పోయినట్లు తెలిపి, "ఆర్యే, నీ మనసులో నున్న స్వల్ప ద్వేషము వలన నేను హస్తిని సంహరించితిని అని చెప్పుము" అనెను.

వాడు రాణి కాదంతముల నిచ్చి "గజము చనిపోయెను, ఇవి దంతములు" అనెను. బోధిసత్త్వుని షడ్వర్ణ కాంతుల దంతముల నామె మణుల వీవనపై గొనిపోయి, తన రొమ్ముపై బెట్టుకొని, పూర్వజన్మములలో తన ప్రియస్వామి దంతములను విలోకింపసాగెను. "ఇట్టి సౌభాగ్యశీలి యగు గజేంద్రుని విషాక్త బాణముతో కొట్టించి, ప్రాణములు తీయించి దంతములు కోయించి తెప్పించితిని" అని బాధపడెను. బోధిసత్త్వుని జ్ఞప్తికి తెచ్చుకొని, ఉత్పన్నశోకమును సహింపజాలక, గుండె బ్రద్దలు కాగా నామె యానాడే మృతి నొందెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త యిట్లు పలికెను:

వెనుక జన్మమునం బ్రియ విభు గజేంద్రు
దంతముల గాంచినంతనే తరుణి యటనె
గుండె లవియగ ప్రాణముల్ కోలుపోయె.

చెంది సంబుద్ధి బుద్ధుడు చేసినాడు
మందహాసము పరిషత్తు మధ్యమందు.

చేయరెన్నడు బుద్ధులు స్మిత మహేతు
కముగ నని ముక్త భిక్షు సంఘమ్ము పలికె.

కాషాయ వస్త్రంబు గట్టించి యెవతె
కనదారికావృత్తి నబ్బజేసితివో,
వివిధ ప్రదేశాల విచరించె నెవతె
యా సమయంబునం దామె రాకన్నె.
ఆ కాలమున నెను హస్తినాథుండ.

కాశి జేరుచు శ్రేష్ఠ గజ దంతములను
అనుపమ సుందరి కర్పించినట్టి
యా విలుకాడల దేవదత్తుండు

గత జన్మమున బహుకాలాన జేసి
నట్టి కర్మలు- మంచి వైనను గాని,
చెడ్డ వైనను గాని- స్మృతికి దెచ్చుకొని
పలుకును బుద్ధుండు, బాధలు వ్యధలు
వివిధ మనశ్శల్య వితతి వర్జించి.

ఆ కాలమున నేను హస్తినాథుండ:
మీరు భిక్షువులార, ధారణ చేయు
డీ ప్రకారమ్ముగా నీ జాతకమును.

ఈ గాథలను దశబలధారి బుద్ధుని గుణానువాదము చేయువారును, ధర్మ గానము చేయువారును అగు స్థవిరులు భద్రము చేసినారు.

ఇట్లు ధర్మోపదేశనము విని యనేకులు స్రోతాపన్నాది ఫలములందు ప్రతిష్ఠితు లయిరి. భిక్షుణి క్రమముగా విదర్శన-భావన అభ్యాసము చేసి అర్హత్వము పొందెను.

—:o:—

515. సంభవ జాతకము

పూర్వకాలమున కురురాష్ట్రమున ఇంద్రప్రస్థనగరమున ధనంజయ కౌరవ్యుడు అను రాజు పరిపాలన చేయుచుండెను. ఆయనకు సుచరితుడు అను బ్రాహ్మణ పురోహితుడు అర్థ ధర్మానుశాసకుడు. రాజు దానాది పుణ్యకార్యములు చేయుచు ధర్మమార్గమున రాజ్యము నడపు చుండెను. ఒక నాడాతడు ధర్మయజ్ఞమను ప్రశ్న ఉదయింపగా సుచరితుని పీఠముపై కూర్చుండబెట్టి సత్కరించి ప్రశ్న మడువాడై ఈ గాథలు పలికెను :

రాజ్యము లభించినది : కురురాష్ట్రమందు
పలుబడి చిక్కినది నాకు; ఇంకమీద
మహి సమస్తము గెలిచెడి మహిమ కొరకు
నలుప గోర్కి సుచీరతా, జతనములను.

ధర్మ పూర్వకముగ జేయ దలతు కార్య
ముల, అధర్మంబు నచ్చదు మొదలె నాకు,
నిఖిల జనులకు ననుకరణీయ మగును
ధరణిపతి యాచరించెడి ధర్మకర్మ.

నేడు, ముందునుగూడ ననింద్య మగుచు
అమరులందును, మానవులందు యశము
గొలుపు కార్యమె బ్రాహ్మణా, సలుప నెంతు.

కావునను బ్రాహ్మణోత్తమా, నీవు నాకు
తెలుపవలయును ధర్మార్థములను గూర్చి.

ఈ ప్రశ్నయు గంభీరము, బుద్ధవిషయము. ఈ ప్రశ్న కేవలము సర్వజ్ఞ బుద్ధుని అడుగవలసినది. తనకు లేకుండుటచే సర్వజ్ఞత్వము నన్వేషించి నపుడు బోధిసత్త్వుడు జ్ఞప్తికి వచ్చెను. సుచీరతుడు బోధిసత్త్వుడు

కాకుండుటచే ప్రత్యుత్తర మీయజాలకుండెను. ఆయన పాండిత్యాభిమానము నటింపక తనయశక్తిని వెల్లడించువాడై ఈ గాథ పలికెను :

క్షత్రియ నృపాల, నీ యీప్సితమ్ము లైన
కార్యముల నొక్క విదురుండు కాక పరుడు
సత్యముగ నిర్వహింపగా జాలడు సుమి !

ఆతని వాక్కులు విని రాజు "బ్రాహ్మణోత్తమా, నీవు శీఘ్రముగా ఆయన కడకు పొమ్ము" అని అతనిని పంపువాడై ఈ గాథ పలికెను :

పంపుచున్నాను విదురుని పజ్జకు నిను :
అర్థ ధర్మాను శాసకు నంతికమున
ఉంచుము సువర్ణ నిష్కంబు నుడుగరగను-
వెడలు మింక సుచీరకా, విదురు కడకు.

ఆ ప్రశ్నమునకు సమాధానము వ్రాయుటకై లక్షవిలువ గల బంగరు పట్టము, పోవుటకై శకటము, తోడుగా సైన్యము ఇచ్చి రాజతనిని తక్షణమే పంపెను. ఆతడు ఇంద్రప్రస్థ నగరము వెలువడి సూటిగా వారాణసికి చనక, పండితులున్న తావుల నాగుచు జంబూద్వీప మెల్లెడల పర్యటించి ఈ ప్రశ్నమునకు సమాధానము చెప్పువారెవ్వరును లభింపక పోవుటచే క్రమముగా వారాణసి చేరి ఒకచోట నివసింపజొచ్చెను. ఒకనాడు ప్రాతర్భోజనము చేయువేళకు విదురుని యింటికి జని తనరాక నెరింగించెను. తిరిగి వార్త వచ్చునప్పటికి యజమానుడు భోజనము చేయుచుండెను.

ఈ విషయమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథ పలికెను :

ఆవల సుచీరకుడు విదురాంతికమున
కరిగె : విదురుడు స్వీయ గృహమ్మునందు
భోజనం బయ్యేడం జేయ బోవుచుండె.

అత డాయనకు చిన్ననాటి చెలిమికాడు. ఇరువురును ఒకే ఆచార్యుని కడ విద్యాభ్యాసము చేసినవారు. అందుచే ఇరువురును ఒక పంక్తినే భోజ

నము చేసినారు. భోజనానంతరము విశ్రాంతి తీసికొనుచు కూరుచున్న పిదప "మిత్రమా, యేల వచ్చితివి ?" అని ఆయన అడుగగా సుచీరతుడు కారణము వివరించువాడై ఈ గాథ పలికెను :

నన్ను దూతగ కౌరవ్యనాథు డంపె :
అతడు ధర్మార్థములగూర్చి యడిగినాడు
చెప్పు మవ్వాని, నిన్ను ప్రశ్నించువాడ.

ఆ సమయమున బ్రాహ్మణుడు లోకుల మనస్సులను ప్రసన్నము చేయుటకై అభియోగములు విచారణ చేయుచుండెను. ప్రశ్నమునకు సమాధానము చెప్పు నవకాశము లభింపక పోవుటచే ఆ విషయమును ప్రకటించుటకై ఈ గాథ పలికెను :

జనులు చిత్తము వచ్చిన సరణి నన్ను
ప్రశ్నరూప గంగానదీ ప్రబలవారి
గప్పివేయుదు; రింక నాకడలిలోని
ధర్మమర్మమ్ములను విప్ప దరము కాదు.

"నా కుమారుడు పండితుడు, నాకన్న అధికజ్ఞాని- అతడు నీకు విశదము చేయగలడు. అతని కడకు బొమ్ము" అని బ్రాహ్మణుడు డీ గాథ పలికెను :

ఔరసుం డుత్తముడు భద్రకారు, డెరుగు
నద్ధర్మములంగూర్చి యడుగు మతని.

విని సుచీరతుడు విదురుని యిలు వెడలి భోజనము చేసి, భద్రకారుడు నిజమండలి మధ్యమున కూరుచున్న సమయమున నాతనికడకు జనెను.

ఈ భావమును ప్రకటించుటకు శాస్త్ర ఈ గాథ పలికెను :

భద్రకారునికడ కేగె బ్రాహ్మణుండు :
అతడు కూర్చుండి యుండె గృహమ్మునందు.

సుచీరతు డచటికి చేరి భద్రకారమాణవకుడు తన్ను పీఠమున గూరు చుండబెట్టి సత్కరించిన పిదప ఆగమనకారణ మడుగగా ఈ గాథ పలికెను :

నను యశస్వి కౌరవ్య భూనాయకుండు
అంపి, దూతగ, నిన్ను ధర్మార్థములను
గూర్చి ప్రశ్నించి తెలిసికో గోరినాడు—
అందుచే భద్రకార, ని న్నడుగువాడ.

అప్పుడు భద్రకారుడు "నాయనా యిన్నాళ్ళును వేరొక స్త్రీతో కూడియున్నాను. కావున నా చిత్తము వ్యాకులముగా నున్నది. నీకు సమాధానము చెప్పజాలను. నా తమ్ముడు సంజయకుమారుడు నాకంటెను అధికజ్ఞాని. ఆతని నడుగుము. నీ ప్రశ్నమున కాతడు సమాధానము చెప్పును" అని సుచీరతుని పంపువాడై ఈ గాథలు పలికెను :

ఇంట నున్నట్టి స్త్రీ నుజ్జగించి యన్య
వనిత వెంటను బడిపోవువాని వలెను.
విడిచి యచ్చంపు మృగమాంస ముడుము వెంట
చన్నవాని విధమ్మున నున్నవాడ :

అర్థ ధర్మాలు దెల్ప నసమర్థుడ జుమి !
ఓ సుచీరత, సంజయు డున్నవాడు
అవరజుండు, ధర్మాదిక మడుగు మతని.

తోడనే యతడు సంజయుని యింటికి బోయి సత్కృతుడై రాకకు కారణ మడిగిన పిదప వివరించెను.

ఆ విషయమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథలు పలికెను :

అంత సంజయుకడ కేగె : నాతడపుడు
స్వీయ పరిషత్తు నడుమ నాసీను డయ్యె

నను యశస్వి కౌరవ్య భూనాయకుండు
అంపె దూతగ, నిన్ను, ధర్మార్థములను

గూర్చి ప్రశ్నించి తెలిసికో గోరినాడు :
అందుచే సంజయా, నిన్ను నడుగువాడ.

ఆ సమయమున వేరొక స్త్రీతో కూడియున్న సంజయకుమారు డాతనితో "బాబా, నేను ఆమెకొరకు గంగానది దాటి ఆవలియొడ్డునకు బోయి మరలి వచ్చుచుందును. రెండువేళల మరణ మాసన్నమై యుండుటచే నా చిత్తము వ్యాకులముగా నున్నది. కావున నీకు సమాధానము చెప్పజాలను. నా చిన్నతమ్ముడు సంభవకుమారుడు ఏడేండ్ల వయసువాడైనను నా కంటె వేయిరెట్లు అధికజ్ఞాని. ఆతడు నీకు సమాధానము చెప్పగలడు. పోయి ఆతని నడుగుము" అనెను.

ఈ భావమును ప్రకటీకరించుటకై శాస్త ఈ గాథలు పలికెను :

మృత్యు వుదయాన సంధ్యను మ్రింగుచుండు
నన్ను : ప్రశ్నించినంగూడ నర్థ ధర్మ
వివరణము చేయజాలను, వెడలి పొమ్ము
సంజయుడు తమ్ము, డాతని సవిధమునకు :
అర్థ ధర్మములం గూర్చి యడుగు మతని.

విని సుచీరతుడు తనలో "ఈ లోకములో ఈ ప్రశ్నము బహుశః అద్భుతము కావచ్చును. దీనికి సమాధానము చెప్పగలవాడు లేడనిపించు చున్నది" అనుకొని ఈ గాథలు పలికెను :

పెద్దవాడైన సోదరుల్ పితయు గూడ
దేని నాత్మీయ శక్తిచే తెలిసి కొనగ
వలను పడలేదో,- నే చిన్నవాడ- దాని
నడిగినం గూడ దెల్పగా నగునె నాకు ?
ఇట్టి ధర్మ మద్భుతము నా కెంతయేని.

విని సంజయకుమారుడు "బాబా, సంభవకుమారుడు బాలకు డని తలపవలదు. మరి యెవడైనను దీనికి సమాధానము చెప్పలేనిచో ఆతనికడ కరిగి అడుగుము" అనెను.

ఈ యభిప్రాయమును వ్యక్తముచేయు నుపమానముల ద్వారా కుమారుని గుణగానము కావించువాడై ఈ గాథలు పలికెను :

బాలకుండని తలపకు ప్రశ్న వేయ
కుండ సంభవు : నాతని కోరనంత
అర్థ ధర్మ విజ్ఞానంబు లబ్బును సుమి !

అంబరంబున నరుగు హిమాంశువు తన
కాంతిచే సర్వతారకా గుణముల రుచి
నతకరించెడి రీతి నా యర్భకుండు
సంభవుడు మించు నాత్మీయ శక్తిచేత.

చైత్ర మేరీతి నన్ని మాసములకంటె
అందగించునో గ్రీష్మర్తువందు మిగుల
ప్రసవ శోభల చేతను, బాలుడయ్యు
సంభవుం డెల్లరను మీరజాలువాడు.

వివిధ వృక్ష సంఛన్నమై వివిధ జీవ
వాసమౌ గంధమాదన పర్వతంబు
ఓషధీకాంతులన్ దిక్కు లుజ్వలములు
చేయునటు సంభవుడు కూడ కాయు రుచుల.

పరుగుచే నుత్తమాశ్వంబు, భారవహన
శక్తిచే బలీవర్ధము, యుక్తదోహ
దమ్మునను ధేనువును, భాషణమ్మ వలన
పండితోత్తము గ్రహింప వలను పడును :
ఇట్టులే సంభవుని గ్రహియింప వచ్చు,

చనె సుచీరతు డంతట సంభవుకడ-
కతడు నగరమ్ము వెలుపల నాడుచుండె.

ఈ ప్రకారముగా సంభవకుమారుని గుణగానము విని సుచీరతు డాతనిని ప్రశ్నింప దలచి, "మీ తమ్ము డెక్కడ ?" అనెను. అతడు గవా

తుము తెరచి చేతితో జూపుచు "స్వర్ణవర్ణ సౌధద్వారముకడ సందులో బాలకులతో నాడుచున్నాడు. పోయి వానిని ప్రశ్నింపుము. బుద్ధ లీలలనుండి వాడు నీకు సమాధానమిచ్చును" అనెను. సుచీరతుడు మేడ దిగి, కుమారునికడకు జనెను. ఏ సమయమున ? కుమారుడు తన వస్త్రములు నెత్తికి చుట్టి, రెండు చేతులలో ఇసుక పట్టుకొన్న సమయమున-

ఈ భావమును స్పష్టీకరించుటకై శాస్త పలికిన గాథ :

నను యశస్వి కౌరవ్య భూనాయకుండు
అంపి దూతగ, నిన్ను ధర్మార్థములను
గూర్చి ప్రశ్నించి తెలిసికో గోరినాడు-
అందుచే సంభవా, నిన్ను నడుగువాడ.

బ్రాహ్మణుడు వచ్చి యెదుట నిలవగా బోధిసత్త్వుడు, "తాతా, ఏల వచ్చితివి ?" అనెను.

"జంబూద్వీపము పర్యటించినను నా ప్రశ్నమున కెవరును సమాధానము చెప్పలేకపోవుటచే, నీ కడకు వచ్చినాను."

కుమారుడు సిగ్గుపూని చేతులలోని యిసుక క్రిందికి విడిచి, తలపైనున్న వస్త్రములు కట్టుకొని, సర్వజ్ఞునివలె నిమంత్రించి "బ్రాహ్మణోత్తమా, అడుగుము. బుద్ధలీలనుండి నీకు సమాధాన మిత్తును" అనెను.

అంతట బ్రాహ్మణు డీగాథ పలికెను :

నను యశస్వి కౌరవ్య భూనాయకుండు
అంపె దూతగ, నిన్ను ధర్మార్థములను
గూర్చి ప్రశ్నించి, తెలిసికో గోరినాడు :
అందుచే సంభవా, నిన్ను నడుగువాడ.

గగన మండలమున పూర్ణచంద్రుడు కానబడినట్లు సంభవ పండితునకు సమాధానము స్పష్టముగా గోచరించెను. అటు లయిన విను మని సంభవ

పండితుడు ధర్మజ్ఞ సంబంధ ప్రశ్నమునకు సమాధాన మిచ్చువాడై యీ గాథ పలికెను :

నిశ్చయమ్ముగ పల్కెద నేను గూడ
బుద్ధదేవుడు చెప్పిన పోల్కి ; మీదు
ప్రభువు గ్రహించు రీతిని పలుకువాడ :
తదనుసరణమ్ముగా భవద్ధరణిపుండు
చేయునో చేయడో యాతడే యెరుంగు.

సందులో నిలుచుండి బాలుడు చేసిన ధర్మోపదేశము వారాణసి నగరమున పండ్రెండు యోజనములు మధురముగా వ్యాపించెను. రాజు, ఉపరాజు మొదలగువారు సమావిష్టులయిరి. బోధిసత్త్వుడు జనసమూహమున ధర్మదేశనము స్థాపించెను.

ఇట్లు గాథారూపమున ప్రశ్నవిషయమై చెప్పి యాతడు, ధర్మయజ్ఞ వర్ణనము చేయుచు నిట్లు పలికెను :

అడిగిన సుచీరతా, తన నపుడు చేయ
వలయు కార్యము మరునాడు సలుపుమనుచు
నెవ్వడేనియు నుపదేశ మిచ్చునెడల
తెలిసికోవలె నిజము యుధిష్ఠిరుండు.

ఎవ్వడేనియు నుపదేశ మిచ్చినపుడు
అడిగినంతనె, నరపాలు డనుసరింప
వచ్చు దానిని, మూఢునివలె కుమార్గ
వర్తి కారాదు యోజన వదలిపెట్టి.

దాటగూడదు హద్దు, నధర్మకార్య
మాచరింపగ రాదు, స్నానాదికమ్ము
చేయగూడ దతీర్థంపు సీమలందు,
కలుగగూడ దనర్థ సంగతులు తనకు.

వీని కనుగుణముగ నే వివేకవంతు
డాచరించునో క్షత్రియుం, డాకసమున

శుక్ల పక్షాన చంద్రుని శోభవోలె
ఆత డెంతయు నభివృద్ధి నందుచుండు.

బంధు జనులకు గడు ప్రీతిపాత్ర మగుచు
మిత్రులందు ప్రకాశించి, మృత్యువు గని
స్వర్గలోకాన నాత డుత్పన్ను డగును.

ఈ విధముగా బోధిసత్త్వుడు బుద్ధలీలనుండి సమాన ధానము చెప్పెను. జనసమూహము సంతోషించి సాధువాదములు చేసి, ఉత్తరీయము లెగుర వైచి, అంగుళీయకములను చేతుల నున్న యాభరణములను విసిరివేసి కోలాహలము చేసెను. విసరివేసినవాని విలువ కోటికొలది యుండును. రాజు ప్రసన్నుడై బోధిసత్త్వునికి విశేషధన మొసగెను. సుచీరతుడు కూడ వేయి నికషములతో పూజించి బంగరు పట్టాపై ప్రశ్నోత్తరములు సిందూరముతో లిఖించి ఇంద్రప్రస్థమునకు జని, రాజుకు సమాధానము చెప్పెను. ఆ ధర్మముల ననుసరించి రాజు పరిపాలన చేసి, తుదకు స్వర్గలాభ మొందెను.

శాస్త యీ ధర్మదేశనము చేసి "భిక్షులారా, తథాగతు డిప్పుడే కాదు, పూర్వము కూడ మహాప్రజ్ఞావంతుడు" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున ధనంజయరాజు ఆనందుడు; సుచీరతుడు అనురుద్ధుడు; విదురుడు కాశ్యపుడు; భద్రకారుడు మౌద్గల్యాయనుడు; సంజయ మాణవకుడు సారిపుత్రుడు; సంభవ పండితుడు నేనే.

—(o)—

516. మహాకపి జాతకము

శాస్త జేతవనమున విహరించు దేవదత్తుని విషయమై చెప్పినది.

వర్తమాన కథ

దేవదత్తుడు ధానుష్కులను బంపి, ముందుగా పోయి శిలా ఖండము విసరించెను. భిక్షువులు దేవదత్తుని నిందించుచుండిరి. శాస్త "భిక్షువులారా, దేవదత్తు డిప్పుడేకాదు, పూర్వముకూడ నాపై రాయి వేయించెను" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుని పరిపాలనమున నొకానొక బ్రాహ్మణుడు కృషి చేయుచు, ఎద్దులను విడిచి పొలముపని చూచుచుండెను. అవి పొదలలో ఆకులు మేయుచు క్రమముగా నడవిలో దూరి సాగిపోయినవి. త్రవ్వకము ముగించి బ్రాహ్మణుడు చూచునప్పటికి ఎద్దులు కానరాలేదు. విచారముతో నతడు వానిని వెదకుచు క్రమముగా హిమాలయము చేరి, త్రోవ తప్పి యేడురోజు లాహారము లేకుండ తిరిగి తిరిగి తుదకు తిందుకవృక్షమును చూచి, దానిపై కెక్కి పండ్లు తినుచుండగా కాలుజారి యేడు మూరల గోతిలో పడి, పది దినము లచటనే యుండెను.

ఆ సమయమున బోధిసత్త్వుడు కోతి కడుపున పుట్టి, ఫలాదులకై తిరుగుచు బ్రాహ్మణుని గాంచి, రాళ్ళు పేర్చి ఉద్ధరించెను. వానరము నిద్రించుచుండ నాతడు దాని నెత్తిపై రాయి విసరెను తనకు కష్టము కలుగునని తెలిసినంతనే వానర మెగిరి చెట్టుకొమ్మపై కెక్కి కూరుచుండి, "ఓయీ, నీవు నేలపై నడచుచుండుము. నేను తరుశాఖల మీదుగా వచ్చుచు త్రోవ చూపుదును" అని అతనిని అరణ్యము దాటించి, మంచి మార్గమున బెట్టి, తాను కొండ మీదికి బోయెను. బోధిసత్త్వునెడ నపరాధము చేయు

టచే నతడు కుష్ఠురోగియై మానవప్రేతమువలె నయ్యెను. బాధతో నేడు సంవత్సరముల కాలము దేశమున దిరుగుచు. వారాణసిలో మృగోద్యానము చేరి, గోడమాటున అరటాకులు పరచుకొని వ్యథతో పండుకొనెను. అవేళ వారాణసీనరేశు డుద్యానమునకు జని, పడియున్నవానిని జూచి, "ఎవరు నీవు? ఏల ఈ స్థితికి వచ్చినావు?" అని యడుగగా, నతడు యావద్వృత్తాంతము తెలిపెను.

ఈ విషయము ప్రకాశింప జేయుటకై శాస్త్ర పలికిన గాథలు :

కల డొకానొక నరపతి కాశిరాష్ట్ర
వర్ధనుండు వారాణసీ పత్తనమున,
ఒక్కనాడు మిత్రామాత్య యుక్తు డగుచు
దరిసె నతడు మృగాచిర దావసీమ.

బ్రాహ్మణుం గాంచె నచ్చట- పాండుదేహు,
శబలితుని, కుష్ఠరోగిని, శక్తిహీను.
సన్న యెమ్ముల పోగుగా నున్నవాని.

అచ్చెరువుతోడ. దయతోడ, ననియె రేడు :

యకులం బెవ్వడవు నీవు? హస్తపాద
ములును, శిరమును పాండురమ్ములు, శరీర
మెంతయుం జిత్రితము, కుష్ఠ మెనసియున్న (ది)-

అంగకమ్ములు నలుపు, నీయట్టివాని
నెన్నడుం జూడలేదు.
నిన్ గన్నతల్లి
యెవ్వరో? ఆమెసైత మీక్షింపలేదు
నీ భయంకర రూపమ్ము!
నీదు పూర్వ
కర్మచే నిట్టి యాకృతి కలుగనోపు.
చెప్పు మెచ్చోటి నుండి వచ్చితివో కాని!

అప్పుడు బ్రాహ్మణు డిట్లనెను :

పలికెదను బుద్ధ భగవానువలె నిజమ్ము
నిశ్చయమ్ముగ : పండితుల్ నిఖిల జగతి
సత్యవాది ప్రశంసయే సలుపుచుంద్రు.

వృషభాల వెదకుచు విపినంబు జేరి
ఏకాకిగా అట నెన్నొ రకాల
మత్తగజా లుండు, మానవుల్ లేరు.

పోవుచు నందులో త్రోవ కోల్పోయి
ఆకలి దప్పుల వ్యధతోడ, ఏడు
దినము లెట్టెట్టులో తిరుగుచునుంటి.

ఒక్క ప్రపాతంబు ప్రక్కగా గంటి
ఫల భర తిందుక పాదపం బొకటి.

గాలిచే నేలపై రాలిన పండ్లు
భక్షించినా, నవి బాగుగా నుండె.

తృప్తి తీరక నేను తిందుకం బెక్కి
కడుపు నిండగ తిన కాంక్షించినాను.

చెట్టెక్కి యొకపండు మెక్కి, రెండవది
కోయు తలంపుతో చేయి చాపితిని.
గొడ్డలి పెట్టున గూలిన రీతి
ఆకస్మికమ్ముగా నా కొమ్మ విరిగె.

ఆలంబనము లేక యాశాఖ పడియె
కొండల లోయలో నిండు జలాన :
తల క్రిందులుగ నేను దానిలో బడితి.

గాయముల్ తగులవు గాత్రమ్మునందు-
పది రాత్రు లచటనే పడియుంటి నెట్లొ.

కాననచారి మర్కటము వచ్చినది;
ఎద్దు తోకంతటి పెద్దది దాని
వాలంబు, దూకుచు వానర మవల
కొమ్మ కొమ్మను పండ్లు కూరిమిం దినియె.

చిక్కి శల్యంబైన శ్వేతదేహుడను
నను గాంచి యిట్లనె ననుకంపతోడ :

"ఓయి, యిచ్చట వ్యథ నొందెడి నీవు
నరుడవా, కావ ? నీనామధేయంబొ ?
వివరింప వలయు నీ వృత్తాంత మెల్ల."

చేతులు జోడించి చెప్పితి నిట్లు :
"దురదృష్టవంతుడ, నరుడను నేను
నిస్తార రహితుడ : నీక, మే లగుత !
ఇందుండి నన్నుద్ధరింపగా వలయు !"

అచలంబు మీదను విచరించి తెచ్చి
కపి శిలాఖండముల్, క్రమవిధానమున
నిర్మించి సోపానశ్రేణి, యనియె;

ఏతెమ్ము ; నావీపు నెక్కి, బాహువుల
గట్టిగా నామెడ పట్టుకోవలయు :
ఉద్ధరింతును నిన్ను నొక్క దాటునను."

ధీరుడా వానరాధీశుని మెడను
పట్టి బాహుల, వీపుపై నెక్కినాను.

తేజస్వి వానరాధీశుండు నన్ను
గిరి లోయలో నుండి క్లేశమ్ముతోడ
ఉద్ధరింపగ జాలె నొక్క దాటునను.

అవల మహాకపి యనియె నాతోడ ;
"ఓ చెలికాడ, ముహూర్త మాత్రమ్ము
కన్ను మూసెద, నన్ను కనిపెట్టియుండు.

సింహముల్, వ్యాఘ్రముల్, చిరుతలు, నెలుగు
బంట్లు నే నిద్రించు పట్టున నాకు
హాని చేయగ వచ్చు ; నందుచే చూచి
వాని నిరోధింపవలయును సుమి !"

కావించి రక్షకు కపిరాజు నన్ను,
శయనించె; కొంచెము సమయమ్ము గడవ
పొడమె నా మనసులో చెడుతలం పొకటి.

"ఖాద్యంబె యగు గద కపికూడ నితర
జంతువు లట్టులు జనులకు; కాన
దీని జంపి బుభుక్ష తీర్చుకోవచ్చు.

మాంసమ్ము భక్షించి మరల బలమ్ము
చేకూర్చుకొని, కొంత చేత బట్టుకొని
పాథేయముగ, వన పారంబు గాంతు."

ఆవల రాతితో నా కపిరాజు
తలమీద గొట్టితి, బలము లేకుంట
హాస్తాల, పెద్దగాయంబు కాలేదు.

తోడనే లేచి యా దొడ్డ మృగమ్ము-
శిరమున రక్తమ్ము చిందుచుండంగ
నేత్రాల బాష్పముల్ నిండుచుండంగ
వీక్షించి నన్ను, ఈ విధముగా బలికె :

"ఆర్య, నా యెడ నిట్టు లాచరించితివె !
అడ్డుకొందువు నీవె అన్య మృగాల

నని తలంచితి; నిట్టి యాచరణంబు
ఇంచుక యైన నూహింపనే లేదు !

నీకు మేలగుగాక ! నీవు నూరేండ్లు
బ్రదికి యుందువు గాక ! పరలోక వాసు
పైకి లాగినయట్లు భయద ప్రపాత
తలమునందుండి నిన్ వెలువరించితిని.

పాపకార్యమ్మును భావించినాడ
వో యధార్మిక, దుఃఖ మొందకు నీవు !
పాపకృత్యము నిన్ను పరిమార్చకుండు."

కపి యిట్టులనియెను క్షమ వేడినంత
"నమ్మకమ్మిక లేదు నాకు నీ యెడల
పయనింతు కొమ్మల పై భాగమునను
నడచుచుండుము నేల నా వెనువెంట.

వనమృగమ్ముల భీతి గన వింక నీవు
గ్రామోప కంఠంబుకడకు జేరితివి.
అదె త్రోవ, సుఖముగా నరుగుము పాపి !"

అచటి సరోవరమందు వానరము
రక్తసిక్తమ్ము శీర్షమ్మును కడిగి
నేత్రాల నశ్రువుల్ నిండు చుండగ
ఆరోహణము చేసె నచ్చటి గిరిని.

దాహపీడితుడై తాపమ్ముచేత
నా తటాకము చేర, నందలి జలము
నిండిపోయినట్లు నెత్తుటి తోడ
అగ్నిచే తప్త మైనట్టులు తోచె.

నా శరీరంబు పైనను బడ్డ నీటి
కణముల మూలాన గాయంబు లయ్యె
చీము, నెత్తురు, నందు చేరె నిండుగను.

నేను గ్రామంబుల నిగమంబులందు
సంచరించెడివేళ జనులు దండములు
గైకొని దూరమ్ముగా దోలువారు
పూతిగంధమువాడ, పొమ్ము శీఘ్రముగ
చను మటువైపుగా ననియెడివారు,

చేసినదానికి శిక్షాస్వరూప
ఫలితమ్ముగా బాధ పడుచున్నవాడ
పదేండ్లనుండి నే నీ విధమ్ముగను.

తగదెన్నడును జనుల్, తగదు మిత్రద్రోహ,
మది మహాపాతకం బాపాపి దేహమ్ము
కుష్ఠ రోగమ్ముతో క్రుళ్ళిపోవుట నిజము.
నానావ్యథల్ చెంది, నరకాన బడువాడు-
ఎవ్వారు కనిపింప, నిది బోధ చేయుదున్.

రాజుతో నాతడు మాట లాడుచుండగనే భూమి నెఱ్ఱ వారెను. తోడనే యాతడు విగతజీవు డయి, అవీచీనరకమున జన్మించెను. అతడు భూమిలో మునిగిపోయిన పిదప రా జుద్యానము వెలువడి నగరమున ప్రవేశించెను.

శాస్త యీ ధర్మోపదేశనముచేసి, "భిక్షువులారా, దేవదత్తు డిప్పుడే కాదు, పూర్వము కూడ రాతితో గొట్టినాడు" అని జాతకములు సరిపోల్చెను. ఆ సమయమున మిత్రద్రోహి దేవదత్తుడు, కపిరాజు నేనే.

---

517. దకరక్ష జాతకము

ఇది యంతయు మహా ఉమ్మగ్గ జాతకమున (546) వచ్చును.

518. పండర జాతకము

శాస్త జేతవనమున విహరించుచు, దేవదత్తు డసత్యము పలికి భూమిలో దిగబడిపోయిన విషయమును గూర్చి చెప్పినది. అప్పుడు భిక్షువులు దేవదత్తుని నిందించుచుండిరి. శాస్త వారితో “భిక్షువులారా, దేవదత్తు డిప్పుడేకాదు, పూర్వముకూడ నన్నృతము పలుకగా భూమి వానిని మ్రింగివేసినది” అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయు నపుడు 500 ల మంది వ్యాపారులు పడవలెక్కి, సముద్రమున బయలుదేరిరి. ఏడవనాడుకూడ వారికి తీరమెచ్చటను కానరాలేదు. నౌకలు బ్రద్దలయి పోయినవి. ఒక్కడు తప్ప తక్కినవారు మత్స్యముల వాత బడిరి. వాయు వశమున నాతడు కరింబియ పట్టణముదరికి కొట్టుకొని పోయెను. ఆతడు నగ్నముగానే నగరములోనికి భిక్షార్థము పోయినపుడు లోకులు చూచి, ఆతడు శ్రమణుడనియు, అల్పేచ్ఛువు, సంతుష్టచిత్తుడు ననియు భావించి సత్కరించిరి. తనకు జీవిక దొరికినట్లు లతడు తలచి లోకులిచ్చిన వస్త్రములు పుచ్చుకొనలేదు. ఇంతకన్నను కోరిక లేనివాడెవ్వడును లేడని వారు ప్రసన్నులై అతని కాశ్రమము నిర్మించి అతని నచట నిలిపిరి. కరంబియ-అచేలుడని అతనికి ప్రసిద్ధి వచ్చినది. అచట నాతనికి లాభ సత్కారములు హెచ్చినవి. ఒక నాగరాజు, ఒక గరుడరాజు అతనిని సేవింపవచ్చుచుండిరి.

ఒకనాడు గరుడరాజు అతనిని సమీపించి ప్రణామము చేసి, ఒక ప్రక్క నిలిచి “భన్తే, మా సంబంధులు చాలమంది నాగులను పట్టుకవచ్చి, నాశము పొందుచున్నారు. వీనిని పట్టుకొను పద్ధతి మాకు తెలియలేదు. తాము వానిపై ప్రేమ ప్రకటించుచు, ఆ రహస్యము గ్రహింపగలరా ?” యనెను.

ఆతడు మంచిదని యంగీకరించెను. గరుడ రాజు ప్రణామము చేసి వెడలి పోయెను.

నాగరాజు వచ్చి ప్రణామము చేసి, కూరుచున్నంతనే అచేలకుడు "నాగరాజా, మిమ్ములను పట్టుకోవచ్చిన గరుడులు వినాశము చెందుచున్నా రేల ? వారు మిమ్మెట్లు పట్టుకొనగలరు ?" అని ప్రశ్న చేసెను.

"భన్తే, అది చాల గుహ్యామైన మారహస్యము, అది బయలు చేసినచో మా జ్ఞాతి వర్గమువారు మృత్యువు నాహ్వానించిన వా రగుదురు."

"ఆయుష్మన్, ఈ విషయ మెవరితో నైనను చెప్పుదు నను భయమా ? ఎవరికిని తెలుపను. కేవలము నేను తెలిసికోవలె నను కోరికతో నడుగుచున్నాను. నన్ను నమ్మి నీవు నిర్భయముగా చెప్పవచ్చును."

"భన్తే, చెప్పుదును" అని నాగరాజు వెడలిపోయెను. మరునా డచేలకుడు ప్రశ్నించినను నాగరాజు చెప్పలేదు. మూడవనాడు నాగరాజు వచ్చి కూరుచున్నప్పుడు శ్రమణుడు "నాగరాజా, ప్రశ్న మడుగుట మూడవ సారి, సమాధానము చెప్పవేమి ?" అనెను.

"భన్తే, తమరు మరి యెవ్వరితో నైన అందురేమో యన్న భయముచేత."

"చెప్పను. నిర్భయముగా పలుకుము."

"అటులయిన భన్తే, మరెవ్వరితోడను అనగూడదు" అని ఒట్టుపెట్టి "భన్తే. మేము రాలు మ్రింగుటచే బరువెక్కి పండుకొందుము. గరుడులువచ్చి మమ్ము పట్టనెంచినపుడు శిరములు ముందరికి జాపి, కోరలు తెరచి కరవ బోవుదుము. వారు మా శిరసులు పట్టుకొందురు. భారముగా నుండుటచే మమ్ము ఈడ్చుకొని పోవ యత్నింతురు; కాని లాగలేరు. మేమే వారిని పట్టి నీటిలోని కీడ్చుకొని పోవుదుము. వా రక్కడనే మరణింతురు. ఇందు వలన గరుడు లనేకులు మృతి నొందుచున్నారు. మూర్ఖులగుటచే వారు మా తలలు పట్టుకొందురు. తోకలు పట్టి మమ్ము తలక్రిందులు చేసినచో కడుపులోని రాలు రాలిపోవును; శరీరములు తేలిక యగును" అని నాగరాజు రహస్యమా దుర్మార్గునకు వెలువరించెను.

అతడు వెడలపోయినంతనే గరుడరాజు వచ్చి నమస్కరించి "భన్తే, నాగరాజును రహస్యమును గూర్చి యడిగితిరా?" అనెను, అవునని అచేలకుడు అంతయు వివరించెను. నాగరాజు చేసిన దనుచితమని గరుడు డనుకొని, నిజజాతికి అపకారము కలుగు నుపాయమును వెల్లడింపరాదని తలచి, గరుడవాయువు వీచి తొలుత నాగరాజునే పట్టుకొనుట యుక్తమని, అట్లే చేసి, తోకపట్టి పైకెత్తి కడుపులోని రాలు రాల్చి, ఆకసమున కరిగెను. శిరము వాల్చి ఆకసమున వేలాడుచు నాగరాజ పండరుడు "స్వయముగా వ్యథ నాహ్వానించితిని" అని విలపించుచు నిట్లు పలికెను :

సంయుతుడు కానివాడు, రహస్యగుప్తి
చేయనేరని తెరపెడు వాయి వాడు,
దేనినైన పరీక్షింప లేనివాడు,-
అట్టి మూఢుని భీతి వెన్నంటి యుండు
పండరక నాగపతికి సుపర్ణు నట్లు.

చెప్పు వాక్కును, రక్షణ చేయదగిన
దాని నెవ్వడు ప్రకటించు; దాని నింద
చేయువానిని భీతి గ్రసించియుండు
పండరకనాగు గరుడుని పగిది నెపుడు.

పైపైని మైత్రితో వర్తించువాడు
సుహృదుడే యయ్యును శుద్ధమూర్ఖుండు
స్నిగ్ధధీమంతుడై చెడు చేయువాడు-
అర్హులు కారు రహస్యంబు వినగ.

ఎంచి యచేలకు మంచివానినిగ
చాల పేర్వడ్డట్టి శ్రమణునిగాను
బయలు పెట్టితి గుప్త భాషణమ్ములను;
కోల్పోయి యర్థంబు కుందుచున్నాను.
దాచలేనైతి నాతనికడ మంత్ర
మావైపునుండియే హాని కల్గినది :
కోల్పోయి యర్థంబు కుందుచున్నాను.

వశవర్తియై ద్వేష భయరాగములకు
నీచు లౌ వారల నికటమ్ము నందు
ప్రకటించును రహస్య భాషణ మ్మెవడు
అమ్మనుజుని పతనమ్ము నిశ్చయము !

ఎవడు మంత్రము గ్రహించి కాపురుష
సంగతి దాని బ్రచారమ్ము సేయు,
తుల్యుండు పాముతో, దుష్టముఖుండు
అని పేరు పడిపోవు, నట్టి దుష్టునకు
దూర దూరమ్ముగా తొలగి పోవలయు.

ఖాద్యములు, పేయములు, మాలికలును, కాశీ
చందనము, వస్త్రములు, మేలి యందగత్తె
లాదిగా గల్గు సర్వ భోగ్యములు విడిచి
అరుగుచున్నార; మింక నీ హస్తగతము
లస్మదీయ జీవములు విహంగరాజ !

గరుడు డతని విలాప వాక్కులు విని, నిందించి "నాగరాజా, అచేల కునకు నీ రహస్యము వెలి బుచ్చి, యిప్పు డేల విలపింతువు" అని యీ గాథ పలికెను :

అస్మదాదుల ముగ్వురయందు నింద్యు
డెవడు ? శ్రమణుడో, గరుడుడో, యీవొ ? చెప్పు
పండరక, నాగపతి, యెట్లు పట్టుబడితొ !

విని పండరకు డీ గాథ పలికెను :

శ్రమణు డెంతయు హితుడని సజ్జనుడని
తలచి నాదు రహస్యంబు తెలిపినాను.
కాని నాకు లభించిన హాని చేత
నిపుడు వ్యథ జెంది కడు విలపించువాడ.

అంతట గరుడు డీ గాథలు పలికెను :

మహిని నరు డెవ్వడైన నమర్త్యు డగునె ?
కాడు నింద్యుడు ప్రజ్ఞలు కలుగువాడు.
సత్యమున, ధర్మమున, బుద్ధి సంయమముల
లబ్ధమగు దుర్లభము లైన లాభములును.

జనని జనకుండు నుత్తముల్ జ్ఞాతులందు
వీరలను మీరి దయజూపువాడు లేరు.
తన రహస్యము భేదిల్లు ననెడు శంక
వారికేని రహస్యంబు వలదు తెలుప.

తల్లియైన జనకుడైన చెల్లెలయిన
సోదరుండైన నత్యంతసుహృదు డయిన
స్వీయపక్షమువాడైన చెప్పరాదు
నిజ రహస్యంబు శంకచే నెవ్వరికిని.

ప్రియము పల్కు కుమారితో ప్రియతనూజు
తోడ, రూపయశస్సులతోడ, బంధు
బాంధవుల బృంద మున్నట్టి భార్యతోడ
వెల్లడింప రహస్యంబు వీలు కాదు.

ఇక ముందరి గాథలు ఉమ్మగ్గ జాతకమున, పంచపండిత ప్రశ్నలలో గూడ గానవచ్చును :

నిధిని గాపాడు చుండెడి విధి రహస్య
రక్షణము చేయవలయును ప్రాజ్ఞ జనుడు-
ప్రకటనము చేయ మంత్రంబు పాడికాదు.

స్త్రీకి, పుత్రుడు కానివానికిని, లోభి
యైన వానికి, నమ్మగా రానివాని
కిని రహస్యము ప్రకటించు టనుచితంబు.

ఆదిలో మూర్ఖునకు రహస్యంబు తెలిపి,
వెల్లడించును వా డను వెరపు తోడ
తిరుగు మానిసి బానిస తీరువాడు.

గుట్టు పరజనముల కెంతవట్టు తెలియు,
నంత యుద్వేగ మొదవును; నుంతయేని
అన్యులకు ప్రకటించుట యనుచితంబు.

పగటి వేళల నేకాంత భాషణంబు
తగు, విభావరివేళను తగ, దసమయ
మద్ది, గుప్తిభేదనచణు లట్లు నిట్లు
సంచరించుచు నుండుటచే సత్వరముగ
లోకమందు రహస్యంబు ప్రాకుచుండు,

భద్రశాలలతో గూడి, బహుళ లోహ
నిర్మితంబయి, పరిఖచే నిఖిల దిశల
పరివృతంబగు నగరంబు పగిదినుండు
నిజరహస్యంపు గోపన నెరపువాడు.

పండరక, మంత్రమున్ గుప్త పరచువారి
భద్రవాక్కులను, సవర్థపటుల గాంచి
సర్పమున కట్లు దూరాన జనుడు మెలగు

ఇట్లు గరుడుడు ధర్మోపదేశము చేసిన పిదప పండరకు డిట్లనెను :

ఇతడు ప్రవ్రజ్య పూని ముండితుడు నగ్ను
డయి యనాగరికుడు భిక్షాటనంబు
సలుపుచుండుటచే రహస్యంబు చెప్పి
నాడ ప్రశ్నింప, ధర్మార్థహాని యయ్యె.

ఎట్టి శీలము వ్రతము చేపట్టు నెడ
శ్రమణుడు మమత్వమును వీడి సంచరించు ?
సలుపగా నెద్ది యొదవును స్వర్గలబ్ధి ?

గరుడు డిట్లనెను :

శాంతి సహనము లజ్జయు సంయమంబు
తోడ నుండి, క్రోధము విడనాడి, మమత
వీడి, భిక్షువు పైశునవృత్తి లేక
తిరుగుచుండును; వానికి త్రిదివ మబ్బు.

ఇట్లు గరుడుని వలన ధర్మోపదేశము విని, పండరకుడు ప్రాణభిక్ష వేడువాడయి యీ గాథ పలికెను :

జనని యౌరసు గాంచి ప్రసన్నయైన
విధమునన్ నీవు ప్రాదుర్భవించినావు
నాకొరకు; తల్లివలె నీవు సాకవలయు.

గరుడు డతనికి ప్రాణదానము చేయువాడై యీ గాథ పలికెను :

పండరక, తప్పినది నీకు ప్రాణభయము!
ఔరసుడు, దత్తుడును శిష్యు, డనగ బరగు
వారు ముగ్వురు పుత్రులు : వారిలోన
శిష్యపుత్రుడ; విక సంతసింపవచ్చు.

గరుడు డిట్లు పలికి పండరకుని ఆకసమునుండి నేలమీదికి దింపెను :

ఈ విషయమును ప్రకటించుటకై శాస్త యీ గాథలు పలికెను :

పండరకు నుంచి ధరణిపై పలికె గరుడు
డిట్లు : భయముక్తుడైనాడ వీవు నేడు :
నీవు మద్రక్షితుండవు నీట, నేల

దాహ పీడితునకు శీతల తటాక
మట్లు, రోగికి వైద్యునియట్లు, శిశిర
శీత పీడితునకు గిముభాతి, నేను
నాగరాజ, శరణ మయినాను నీకు,

ఇట్లు పలికి నీవు పొమ్మని వీడుకో లిచ్చెను. అతడు నాగభవనమునకు జనెను. రెండవనాడు గరుడభవనమునకు బోయి "నేను పండరక నాగుని ప్రతిజ్ఞ చేయించి, శ్రద్ధాళువును జేసి విడిచితిని. అతని చిత్తము నా యెడ నెట్లున్నదో పరీక్ష చేయుదును" అనుకొని నాగభవనముచేరి గరుడవాయువు విడిచెను. తనను పట్టుకొనుటకై గరుడరాజు వచ్చెనని నాగరాజు తలచి, తన శరీరము వేయిరెట్లు పెంచి రాలు యిసుక మ్రింగి భారము దాల్చి, తోక వాల్చి ఫణము పైకెత్తి, మీద పడి గరుడరాజును కరచువాని వలె నుండెను :

చూచి గరుడ రాజీ గాథ పలికెను :

అండజంబులతో సంధి యయ్యె నీకు,
కోరలను దెరచియె పండుకొంటి వేల ?
భయము నీ కెటనుండి సంప్రాప్త మయ్యె ?

విని నాగరాజీ గాథలు నలికెను :

శంకలో నుండవలయును శత్రుల యెడ,
స్నిగ్ధులను గూడ గడు విశ్వసింపరాదు.
నిర్భయ స్థానమందుండి నెగులు పుట్టి
జీవనపు వేరు నాశము చేసివేయు.

జగడమాడిన వానిని శంక విడిచి
నమ్ముటెట్టులు ? వైరిని నమ్మ దగునె ?
వైరి ? సాశంకముగ నుండి తీరవలెనె ?

పరునకుం దాను విశ్వాస పాత్రుడగుచు
తాను వానిని నమ్ముట తగదు సుమ్మ.
ఒదులు నిజభావము గ్రహింప కుండునట్లు
ప్రాజ్ఞు డగువాడు వర్తింపవలయు నెపుడు.

ఇరువురును సంభాషించుచు, కలసిమెలసి శాంత చిత్తములతో అచేలకుని యాశ్రమమున కేగిరి. దీనిని ప్రకటించుచు శాస్త యిట్లనెను :

ఇరువురును పుణ్యవంతులు నేకశరీరు,
లధిక సుకుమార రూపులు, నమరవర్ణు,
లశ్వము, రథమ్మువలె నొక్కటైన వారు,
ఆ యచేలకు పొంతకు నరిగినారు.

అంత నచేలకు నంతికమ్మునకు
పండరకుం డేగి పలికె నీ రీతి :
"అఖిల భీమ కృష్ణుడ నైతి నీ నాడు,
ఇంక నీ యెడ స్నిగ్ధమే నాయెడంద !"

అంతట నగ్నసాధు విట్లనెను :

గరుడుండు నాకు పండరకుని కంటె
అధికముగా నిష్టు డౌట సత్యమ్ము.
అనురాగ వశమున నాచరించితిని
తెలిసియే, దుష్కర్మ తెలియక కాదు.

విని నాగరాజీ గాథలు పలికెను :

ఇహ పరలోకాల యీ ఋణమ్మునను
ప్రియముగా గాని, అప్రియముగా గాని
కనిపింప దేదియు; కాని సంయుతుని
వేషమ్ము ధరియించి విచరించు చున్న
వాడ వసంయుతువలె లోకమందు.

ఆర్య వేషాన అనార్యుడ వీవు,
సంయుత రూపి, వసంయుతుండవును.
కృష్ణస్వభావుడ వీ వనార్యుడవు !
చేసియున్నావు విశేష పాపములు !

ఇటు నిందించి శాపమిచ్చువాడై యీ గాథ పలికెను :

నిర్దోషి యగు వాని నీవు ద్వేషించి
కొండెముల్ చెప్పిన కూళవు, దుష్ట

జనుడవు, సత్యవజ్ర ప్రభావమున
ఏడుగా నీ తల యెరియును గాక !

ఈ విధముగా నాగరాజు సమక్షమునవే నగ్నసాధువు శిరము నూరు వ్రక్కలయ్యెను. ఆతడు కూరుచున్న చోట భూమి నెర్రె విచ్చెను. అతడు నేలలో దిగబడి అవీచీనరకమునకు బోయెను. గరుడరాజు, నాగరాజు తమ తమ నివాసములకు బోయిరి.

సాధువు భూ ప్రవేశము పొందుటను ప్రకటించుచు శాస్త ఈ గాథ పలికెను :

అందుచే మిత్రు నెడల ద్రోహమ్ము తగదు;
లేదు దానిని మించు కిల్బిషమె : ఇంద్రు
వాక్యమును బట్టి కాదె సంకరుడు మడిసె !

శాస్త యీ ధర్మోపదేశము చేసి, "భిక్షువులారా, దేవదత్తు డిప్పుడే కాదు, పూర్వము కూడ అసత్యము పలికి భూ ప్రవేశము చేసెను" అని జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున అచేలకుడు దేవదత్తుడు; నాగరాజు సారిపుత్రుడు; గరుడరాజు నేనే.

——:():——

519. సంబుల జాతకము

శాస్త జేతవనమున విహరించుచు మల్లికాదేవి విషయమై చెప్పినది.

వర్తమాన కథ

కథావస్తువు కుమ్మాసపిండ జాతకమున వచ్చినది. ఆమె మూడు కూష్మాండములు దానము చేసిన ప్రభావమువలన ఆనాడు రాజుకు పట్టపు దేవి యయినది. ఆమె పతిభక్తి నగర మంతటను వ్యాపించెను. ఒకనాడు ధర్మసభలో ఇష్టాగోష్ఠి జరుగుచుండెను. "ఆయుష్మంతులారా, మల్లికాదేవి వ్రతనిష్ఠయు, పతిభక్తియు కలది" అనుచుండిరి. అప్పుడు శాస్త యచటికి వచ్చి సంగతి తెలిసికొని, "భిక్షువులారా, కేవల మిప్పుడే కాదు; పూర్వము కూడ మల్లిక పతిభక్తిపరాయణ" అని పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తనరేశునకు సోత్థిసేను డను పుత్రు డుండెను. అతనికి వయసు వచ్చినంతనే రాజు వానిని ఉప రాజును జేసెను. అతనిభార్య సంబుల పట్టపుదేవి. ఆమె రూపవతి. ఆమెశరీర ప్రభ గొప్పది. వాయురహిత ప్రదేశమున వెలుగు దీపశిఖవలె సంబులాదేవి కానవచ్చుచుండెడిది.

కొంతకాలమునకు సోత్థియసేనుడు కుష్ఠురోగి యయ్యెను. వైద్యులు చికిత్స చేయ లేకపోయిరి. వ్యాధివలన శరీరమున పగుళ్ళు చూపినపు డతనికి విచారము కలిగినది. "రాజ్యము చేకొని నే నేమి చేయుదును ? అరణ్యము నకు బోయి అనాథునివలె మృతి నొందెదను'. అనుకొని యతడు రాజుకు సూచన చేసి, రాణివాసమును విడిచెను. సంబులను వివిధవిధముల నాప జూచెను; కాని యామె వినక "అరణ్యమున నా స్వామికి సేవ చేసెదను" అని అతనివెంటనే చనెను. వా రడవికి బోయి, కందమూలఫలములు సులభ

ముగా లభించునట్టియు, జలము, వృక్షచ్ఛాయయు బాగుగా నున్నట్టియు తావున పర్ణశాల నిర్మించుకొని నివసింపజొచ్చిరి. రాజకుమారి యాతనికి సేవలు చేయుచుండెను. ఎట్లు ? ఆమె ప్రాతఃకాలముననే ఆశ్రమ మూడ్చి, స్నానపానములకు తగు నీరు తెచ్చిపెట్టి, పల్లు దోముపుల్ల యిచ్చి. దంత ధావనానంతరము నానావిధౌషధులు నూరి గాయములమీద పూయును. అతడు మధురఫలాదు లారగించినపిదప ప్రక్షాళనోదక మిచ్చి "స్వామీ, అప్రమత్తులై యుండుడు" అని చెప్పి, బుట్టయు, పలుగును బట్టుకొని కంద మూలాదులు త్రవ్వి తెచ్చి, ఒకమూల నుంచును. మరల నీరు తెచ్చి నానా విధ చూర్ణములతో, మృత్తికలతో నతనిని స్నానము చేయించి, మధురఫలా దుల నెదుట బెట్టును. భోజనానంతరము సుగంధజల మిచ్చును. కర్రపెరళ్ళు తెచ్చి శయన మమర్చి, అతడు పండుకొన్నపిదప కాళ్ళు కడిగి ఒడలు పట్టి, నొక ప్రక్కగా పరుండును. ఈ విధముగా నామె పతికి ఉపచారములు చేయు చుండెను.

ఒకనా డామె ఫలములు తెచ్చుచు గిరికందరము చూచి నెత్తిపై బుట్ట క్రిందికి దింపి, స్నానము చేయదలచి దిగి, శరీరమున పసుపు రాచుకొని స్నానము చేసి, పైకి వచ్చి వల్కలములు ధరించి కందరతటమున నిలిచి యుండెను. ఆమె శరీరకాంతి కాననమున వ్యాపించెను. ఆ సమయమున నొకానొక దానవుడు ఆహారము నన్వేషించుచు నామెను చూచి ఆసక్త చిత్తుడై యీ గాథలు పలికెను :

ఓసి, చక్కనిపిక్కల యువతి, నిలిచి
కందరపుటంచునన్ గడుకంపమునను
నీట పాదంబు పెట్టగా నేర, వదుగు
దేమి నీపేరు ? బందుగు లెవరు నీకు ?

సింహ శార్దూల వనమృగ సేవిత మగు
కాననంబున కెంతయు కాంతి నొసగు
మధ్యమాకార, యెవ్వనిమహిళ వీవు ?
దానవుడ నేను, కల్యాణి, దండ మిడుదు !

ఆమె వానివాక్కులు విని యీ గాథలు పలికెను ;

సోత్థిసేనుని భార్యను, సూను డతడు
కాశిరాజునకున్, ఖ్యాతి కలుగువాడు,
సంబులను, నీకు నానమస్కార మయ్య !

శుభ మగుత నీకు ! వైదేహసుతుడు రోగి
కాననంబున నుండు నొక్కండె, నేను
సైత మొకతనె, పరిచర్య సలుపుదాన.

వెదకి తెత్తును కందముల్, వ్రేళ్ళు, పండ్లు,
మధువు, వ్యాఘ్రాదికము వీడు మాంసఖండ
ములను, భుజియించు నాతడు మోదమునను
నేడు మ్లానిమ గాంచుట నిక్కువంబు.

దానవు డిట్లనెను :

రాజసుతునకు, రోగి, కరణ్యమందు
సంబులా, ఫల ముండునె సలుప సేవ ?
నీకు పతి నయ్యెదను, నన్ను స్వీకరించు.

సంబుల యిట్లనెను :

దుఃఖితకు, శోకతప్తకు, దొడ్డరూప
మమరు టెట్టులు ? నాకన్న నధికరూప
వంతురాలి నన్వేషింప వలదొ నీవు ?
ఓయి దానవ, శుభము నీకొదవు గాక !

దానవు డిట్లనెను :

పర్వతము నెక్కి రమ్ము నాపార్శ్వమునకు,
నాల్గువందల భార్య లున్నారు నాకు.
సర్వవాంఛలు తీర్పగ జాలుదాన !
ఎల్లరకు తలమానిక మీ వగుదువు.

పసిడి వన్నియదాన, మానసమునందు
మెలగుకోర్కుల దీరుప గలను నేను.
కలదు వస్తుసంభార మఖండముగను
నేడు రమియింపవలయు నాతోడ నీవు.

పట్టమహిషీత్వ మొల్లని పక్షమందు
సంబులా, అయ్యేదవు నాకు చలిదిముద్ద.

శాస్త్ర యిట్లనెను :

మిట్టవన్నులు గల్గు నట్టి రాక్షసుడు,
సత్త్వజటలవాడు, సంబుల నవుడు
పాపపాశంబుల బట్టుకొన్నాడు-
కానలో రక్షకుల్ లేనట్టిదాని.

లుబ్ధకుండు, పిశాచి, లోలుపుం డైన
పరునిపాపముల జిక్కుపడినదే యయ్యు
సంబుల భర్తనే స్మరియించుచుండె.

నను రక్కసుడు మ్రింగు ననెడిదుఃఖమ్ము
లేశమాత్రం బైన లేదు నా, కైన
ఆర్యపుత్రునిమన స్సన్యథా పోవు
ననెడిదుఃఖము మాత్ర మత్యధికంబు.

ఈమె శీలమున శక్రభవనము కంపించెను. పాండుకంబళ శిలాసనము వేడి యెక్కెను. శక్రుడు ధ్యానమున తత్కారణము గ్రహించి, వజ్రము చేబూని, శీఘ్రముగా వచ్చి దానవుని శిరముపై నిలిచి యీ గాథ పలికెను :

శాంతురాలు, యశస్విని, జ్వలనతుల్య,
అతివమిన్న, పతివ్రత యైన యీామె
నీవు రాక్షస, భక్షింతువేని యిపుడె
నిక్కముగ నీశిరం బేడు వ్రక్క లగును!
అడ్డగింపక విడువు మీ దొడ్డసతిని.

విని దానవుడు సంబులను విడిచిపెట్టెను. వాడు మరల వచ్చి ఈమెను బాధించు నేమో యని శక్రుడు దానవుని దేవబంధనమున బంధించి, మూడు పర్వతములు దాటించి విడిచెను. అప్రమత్తురాల నై యుండు మని రాజకన్య కుపదేశ మిచ్చి, నిజస్థానమున కరిగెను. రాజకన్యయు సూర్యాస్తమానము పిదప చంద్రునివలె ప్రకాశించుచు ఆశ్రమము చేరెను.

ఈ యర్థమును ప్రకాశింప జేయుటకై శాస్త ఈ గాథలు పలికెను :

ముక్తురా లయి యాశ్రమమునకు జేరె
దూడకై గోవు గోష్ఠంబు దూరునట్లు
ఫలినము కులాయముం జేరుపగిది నామె.

రక్షణ కాన కరణ్యంబునందు
సంబుల విలపించెను : "శ్రమణ విప్రులకు
ఆచార్యఋషులకు నాచరించెదను
వందనంబులు!- రాజవల్లభుం డిచట
లేకుండుటచే మీరలే శరణంబు !

తృణలతాదులకును, వనశైలములకు
వందనంబులు ! రాజవల్లభుం డిచట
లేకుంటచే మీరలే శరణంబు.

నదులను గ్రహించు నట్టి గంగమ్మ
వందనంబులు !.......

తృణలతాదులకును వనశైలములకు
వందనంబులు !......

ఇందీవరంబుల చందాన శ్యామ,
తారకామాలికాధారిణీ, రాత్రి,
వందనంబులు !.......

సకలపర్వతముల సార్వభౌముండు
ఎత్తునెత్తము కల్గు హిమవంతునకును
వందనంబులు !......

ఆమె విలపించుట విని సోత్థిసేనుడు తనలో "ఈమె మిగుల విలపించుచున్నది. ఈమెభావ మేమో తెలియదు. నాయెడ స్నేహభావముతో నిటు చేయుచున్నచో ఈమె గుండె లవియును. ఈమెను పరీక్షింతును" అనుకొని, పోయి పర్ణశాలాద్వారమున గూరుచుండెను. ఆమె యేడ్చి మొత్తుకొనుచు పర్ణశాలాద్వారము చేరి, ఆతని పాదములు పట్టుకొని "దేవా, యెచటికి పోతిరి ?" అని యడిగెను. "భద్రే, అనుదినము నీ వింత యాలసించెడిదానవు కావు. నేడు ఇంత చీకటి పడినతరువాత వచ్చినావు" అని ప్రశ్నించువాడై యీ గాధ పలికెను :

రాజపుత్రి యశస్విని, రాత్రి యెంతో
ప్రొద్దుపోయెను ! కారణ మెద్ది ? భర్త
కన్న ప్రియతము డెవ రేని కానబడెనె ?

"దేవా, నేను కందమూలఫలాదులు తెచ్చుచుంటిని. దానవుడు చూచి ఆసక్తచిత్తుడై నాచేయి పట్టుకొని తనమాట విననిపక్షమున నన్ను మ్రింగుదు ననెను. ఆ క్షణము జ్ఞప్తికి రాగా ఇట్లు విలపించుచున్నాను" అని యామె ఈ గాధ పలికెను :

నన్ను శత్రువు పట్టుకొన్నపుడు గూడ
తలచుచుంటిని నిట్టు లీదానవుండు
భక్షణము చేయు ననియెడి బాధ లేదు :
మీర లేమందురో యని మెండుబాధ.

ఆమె మిగిలిన విషయ మంతయు నివేదింప దలచి యిట్లనెను : "దేవా, ఆ దానవుడు నన్ను పట్టుకొన్నపుడు విడిపించుకొన లేకపోతిని. అంతట నేను దేవతలను నిందింప సాగితిని. అపుడు శక్రుడు వజ్రహస్తుడై ఆకాశమున నిలిచి దానవుని బెదరించి నన్నువిడిపించి, వానిని దేవబంధమున బంధించి మూడవపర్వతమున కావల విసరివైచి వెడలిపోయెను. ఇట్లు శక్రుని

దయవలన నా ప్రాణములు దక్కినవి.” విని సోత్థిసేనుడు “భద్రే, కావచ్చును. స్త్రీలు సత్యవాదిను లగుట దుర్ఘటము. హిమాలయున చాల మంది వనచారులు, తాపసులు, విద్యాధరులు మొదలగువా రుందురు. నిన్ను విశ్వసించువా రెవరు ?” అని ఈ గాథ పలికెను :

నీట జొచ్చిన మత్స్యంబువాట మట్లు
మరగి చౌర్యము, తెలివితో దిరుగు వనిత
భావమున్ గ్రహియించుట బహుకఠినము :
అందు సత్యము దుర్లభం బగును సుమ్ము !

ఆ వాక్కులు విని రాజకన్య “ఆర్యపుత్రా, నీవు నన్ను నమ్ముట లేదు. నా సత్యబలముచే నీకు చికిత్స కావింతును” అని ఘటమునిండ సలిలము గొనివచ్చి, యాతనిశిరముపై నీరు చిలుకుచు ఈ గాథ పలికెను :

నీకన్న ప్రియతము నే జూడలేదు
నాసత్యవాక్కులు నన్ను రక్షించు !
వ్యథపెట్టురోగమ్ము వదలుత నిన్ను
మత్సత్యవాక్కుల మహిమమూలమున !

ఈ విధముగా నామె సత్యక్రియ చేసి, నీరు చిలికినంతనే యతని కుష్ఠు రోగము చింతపండుతో తోమిన రాగిచెంబు చిలుము పోయినట్లు అదృశ్యమయ్యెను. వా రచట కొలదిదినము లుండి, యావల నడవి విడిచి, వారాణసి చేరి, యుద్యానవనమున ప్రవేశించిరి. ఈ వార్త తెలిసినంతనే రాజుద్యానమునకు జని సోత్థిసేనుని శిరముపై రాజచ్ఛత్రము పట్టి సంబులాదేవిని పట్టపుదేవిని చేసెను. ఆవల వారిని నగరమునకు గొనిపోయి రాజ్యమిచ్చి తాను ఋషిప్రవ్రజ్య గ్రహించి ఉద్యానమున నివసింపజొచ్చెను. నియమప్రకారముగా రాజభవనమునుండి వచ్చుభోజనము గ్రహించుచుండెను. సోత్థిసేనుడు సంబులను నామమాత్రముగా పట్టపుదేవిగా పరిగ్రహించెను కాని ఆమెకు ఆదరసత్కారములు ఏమాత్రములేవు. ఆమె కున్నను,

లేకున్నను ఒకటే. కాని రాజు అన్యస్త్రీలతో కలిసియుండుట వల్ల ఆమెకు సవతికోపము కలిగి, పాలిపోయి అస్థిపంజరమువలె నుండెను. ఒకనా డామె వినోదార్థము వచ్చిన శ్వశురతపస్వికడకు జని ఆయన భోజనము చేసినపిదప ప్రణామము చేసి ఒకప్రక్క నిలుచుండెను. ఆమె మ్లానముఖము గాంచి మామ ఈ గాథ పలికెను :

పదువందల యేన్గు లెల్ల వేళలను
పదునారు నూర్ల చాపమ్ముల వారు
రక్షించుచుండ వారాణసి, యెట్టి
వైరి గన్గొని మ్లానవదన వైనావు ?

విని "దేవా, తమపుత్రుని వ్యవహారము పూర్వమువలె లేదు" అని ఈ గాథలు పలికెను :

సరసీరుహమువంటి చర్మంబు కలుగు
వారిని, హంసరవంబుల వారి
అతుల భూషణ విభూషిత లైనవారి
కామినీజనులను గాంచు నాతఁడు
వారలగీతముల్ వాక్కులు వినుచు
వెనుకటివలె నన్ను నీక్షింప డిపుడు.

అచ్చరలకునుండు నంగసౌష్ఠవము
చక్కదనంబును, సకలభూషలును
కలిగిన క్షత్రియకన్యకా మణులు
చాలమంది లభింత్రు శయనీయమునకు.

వెనుకటివలె నేను విపినమ్మునందు
కందమూలఫలాదికంబుతో నతని
కుపచర్య చేయుచు నున్నపక్షాన
ఆదరం బైన ననాదరం బైన
గణియింపఁ ఈస్థితికన్న మే లదియె.

నిండుగా నన్నపానీయంబు లున్న.
ధరియింప నెన్నొ యాభరణము లున్న,
పతికి నప్రియ యైనపతాన యువతి
శ్రేష్ఠంబు మరణంబు జీవించుకంటె.

ధనము లేనిది యైన, దయనీయ యైన
అతినీల యైనను పతియనురక్త
పాత్రురా లైనచో, పతిరక్తి లేని
సౌందర్యవతికన్న చాల శ్రేష్ఠంబు.

తపస్వి ఆమెమాటలు విని రాజును పిలువనంపి "నాయనా, సోత్థి సేనా, నీవు కుష్ఠురోగముతో బాధ పడుచు అడవిలో నున్నపుడు ఈమె నీవెంట వచ్చి నీకు పరిచర్యలు చేసి, సత్యబలముచే నీవ్యాధి నయము చేసి మరల రాజ్యప్రతిష్ఠితుని చేసినది. ఇప్పుడు నీవు ఈమె యెక్కడనుండునో కనుగొన నైన కనుగొనవు. నీవు చేసినది అనుచితము, మిత్రద్రోహము, పాపకర్మ" అని పుత్రున కుపదేశ మిచ్చువాడై ఈ గాథ పలికెను :

పురుషహితైషిణి తరుణియె యరుదు,
తరుణిహితైషియౌనరుడు దుర్లభుడు.
నీమేలు కోరెడి నిర్మలచరిత
సంబుల నీభార్య, జననాథ, నీదు
ధర్మప్రవర్తన తగు నామెయెడల.

తపస్వి ఈ విధముగ పుత్రున కుపదేశ మిచ్చి లేచి వెడలిపోయెను. తండ్రి వెడలిన పిదప రాజు సంబులను పిలువనంపి "భద్రే, నేటివరకు నేను చేసిన అపరాధముక్షమింపుము. నేటినుండి సమస్తైశ్వర్యములు నీకు సమర్పించు చున్నాను" అని ఈ గాథ పలికెను :

ఇంతసంపద పొంది యీర్ష్య లేకుండ
వర్తించుచో నీవు, వనితలతోడ
నే నెరవేర్తును నీయానతులను.

నాటినుండి యిరువురును కలిసి మెలిసి దానాది పుణ్యకార్యములు చేయుచు కర్మానుసారముగా కాలక్రమమున పరలోకమున కేగిరి. తపస్వి ధ్యానాదులు పొంది బ్రహ్మలోకమునకు జనెను.

శాస్త ఈ ధర్మదేశనము చేసి "భిక్షువులారా, ఇప్పుడే కాదు, పూర్వముకూడ మల్లిక పతిని దేవతగా భావించెడిది" అని జాతకములు సరి పోల్చెను. ఆ కాలమున సంబుల మల్లిక; సోత్థిసేనుడు కోసలనరేశుడు; రాజ తపస్వి నేనే.

—[o]—

520. గండతిందు జాతకము

శాస్త జేతవనమున విహరించుచు, "రజోవాదము"ను గూర్చి చెప్పినది. దీని వర్ణనము పూర్వమే వచ్చినది.

అతీత కథ

పూర్వకాలమున కంపిల్ల రాష్ట్రమున ఉత్తర పాంచాల నగరమున పాంచాల నామకుడగు రాజు అనుచితమార్గము ననుసరించి అధర్మము వలన ప్రమత్తుడై రాజ్యపాలనము చేయుచుండెను. అమాత్యాదులు గూడ అధార్మికులైరి. పన్నులబాధ పడలేక రాష్ట్రవాసులు కుటుంబములతో కూడ అడవులలో వన్యమృగములవలె నివసించుచుండిరి. పశువులు ఉండవలసిన తావులలో నుండుటలేదు. జనులు రాజపురుషుల వలని భయముచే పగటివేళ గృహములలో నుండక, ఇండ్లచుట్టును ముండ్లకంపలు వేసి సూర్యోదయ మైనంతనే అడవిలోకి పోయి దాగుకొనుచుండిరి. పగటివేళ రాజపురుషులును, రాత్రివేళ చోరులును ఇండ్లు దోచుచుండిరి.

ఆ కాలమున బోధిసత్త్వుడు నగరము వెలుపల గండతిందుక వృక్షదేవత యయ్యెను. రాజు ప్రతి సంవత్సరము వేయి నాణెములు వెచ్చించి వృక్షదేవతకు బలిపూజాదులు చేయుచుండెను వృక్షదేవత తనలో ఈ "రాజు అపమార్గమున పరిపాలన చేయుచున్నాడు. రాష్ట్రమంతయు నష్టమగుచున్నది. రాజును సక్రమ మార్గమున పెట్టగలవారు నాకన్న వేరుగా లేరు. ఈతడు ప్రతి వత్సరము వేయి ముద్రలు వెచ్చించి బలి పూజాదులు చేయుచున్నాడు. కావున ఈతడు నా కుపకారి. ఈతని కుపదేశ మిత్తును" అనుకొనెను.

ఆవల వృక్షదేవత రాత్రివేళ రాజు శయనాగారమునకు బోయి ఆతని తలపైపున నిలిచి కాంతి వెదజల్లుచు ఆకసమున నిలిచి యుండెను. బాలసూర్యునివలె వెలుగుచున్న దేవతను జూచి రాజు "నీ వెవరవు? ఏల వచ్చి

తివి ?'' అనెను. "మహారాజా, నేను గండతిందుక వృక్షదేవతను. నీ కుప దేశమిచ్చుటకై వచ్చినాను" "ఏమి యుపదేశ మిత్తువు ?" "మహారాజా, నీవు ప్రమత్తతతో పరిపాలనము చేయుచున్నావు. కావున రాజ్యము నష్ట మగుచున్నది. రాజు ప్రమత్తతతో పరిపాలనము చేయునెడ రాష్ట్రమున కంతకును స్వామియుండడు. అట్టి రాజు ఈ జన్మమున వినాశము పొంది, మరణానంతరము మహానరకమున పుట్టును. అతడు ప్రమత్తుడైనచో ఆతని అంతరంగికులు, లోకులు, ప్రమత్తులై పోదురు. కావున రాజు విశేషముగా అప్రమత్తుడై యుండవలయును'' అని వృక్షదేవత ధర్మోపదేశ స్థాపన చేయుచు ఈ గాథలు పలికెను :

అమృత పదంబగు నప్రమాదంబు,
ఇంక ప్రమాదంబో మృత్యుపదంబు.
మరణంబు లే దప్రమత్తులో వారి,
కిక ప్రమత్తు లనంగ మృత్యులతో సములు.

మదమూలముననె ప్రమాదంబు పుట్టు
దానిచే గల్గును హాని, తద్దాన
కలుగును దోషముల్ : కాన ప్రమాద
పతనంబు భరతర్షభా, అయుక్తంబు.

ఎందరో కోలుపోయిరి రాష్ట్రములను
ధనసంచయము ప్రమాదమున క్షత్రియులు,
గ్రామముల్ పోయెను గ్రామముఖ్యులకు
నష్టము పొంది రనాగారికులును.

అఖిలభోగ వినష్టి యగును ప్రమత్త
ధరణీధవునకు; అధర్మాత్ము డంద్రు
రాజ్యవర్ధన, అన్యరాజులు వాని.

రాజ, కా దిద్ది పురాతన ధర్మ,
మెంతో ప్రమాదాని కీవు లోబడితి,

విట్టి రాష్ట్రంబున నెగబడి చోరు
లున్న దంతయు నాశ మొనరించినారు.

ధనధాన్యములు గాని, తనయులు గాని
మిగుల రప్పుడు. రాష్ట్రమే క్షయ మొంద,
నమసి పోవును సుమీ సర్వభోగములు !

క్షీణభోగుండైన క్షితిపాలు నప్పు
డాదరింపరు జ్ఞాతు లైనను, మిత్రు
లైన సుహృద్రాజు లైన నృపాల !

ఆశ్రితు లైనను— హస్తిపాలకులు,
రథిక పదాతులు, రక్షక భటులు—
క్షత్రియుగా వాని గణియింప లేరు.

దుర్మంత్రి సహితుండు, దుర్మేధసుండు
సంశయ హీనుండు, జడు, డైన వాని
జీర్ణనిర్మోక మాశీవిషం బట్లు
తప్పకుండగ సిరి త్యజియించి పోవు.

విహిత కర్ముని, కాలవేత్త, సతంద్రి
తుని, సర్వ భోగముల్ తుందిల మగును
ఉత్తమ వృషభ సంయుత గోవు లట్లు.

జ్ఞానాభివృద్ధికై జనపదంబునను
సంచరింపుము రాజ, సముచిత సరణి,
ననుసరింపుము కాంచు, చందందు వినుచు.

ఇట్లుపదేశ మిచ్చి "శీఘ్రముగా పోయి రాజ్యము సంబాళించు కొనుము. నాశము కానీయకుము" అని నిజస్థానము కరిగెను. వృక్షదేవత వాక్కులు విన్నంతనే రాజుకు వైరాగ్యము కలిగెను.

ఆతడు మరునాడు రాజ్యము అమాత్యుల కప్పగించి, పురోహితుని వెంటబెట్టుకొని, యుక్త సమయమున నగరపు తూర్పు వాకిట వెలువడి, యోజన దూరము పయనించెను. గ్రామవాసి వృద్ధుడు ముండ్లకంప తెచ్చి మూసిన గృహద్వారమున కడ్డువేసి, సకుటుంబముగా నెచటికో పోయి, సాయంకాలము రాజపురుషులు వెడలిపోవగా మరలి వచ్చెను. ఆతడు గొంతు కూర్చుండి కాలిలో దిగిన ముల్లు తీయుచు నిట్లనెను :

సంగ్రామమందు పాంచాలుండు బాణ
ఘాతమ్ముచే వ్యధ గాంచును గాక !
నేను కంటకముచే నేడు విద్ధుండ
నగుచు మహాపీడ నందుచున్నట్లు.

ఈ విధముగా నాతడు బోధిసత్త్వుని ప్రభావముచే రాజును దూషించెను. బోధిసత్త్వ గృహీతు డగుటచేత నే యాత డిట్లు చేసెను. మారువేషములతో రాజు, పురోహితుడును బయలు పడక ఆ సమయమున వానికడనే నిలిచియుండిరి. వాని వాక్కులు విని పురోహితు డీ గాథ పలికెను :

వృద్ధుండ వయినావు, వీక్షింప లేవు
బాగుగా రూపముల్, బలహీన మయ్యె
చూపు, కంటకము గ్రుచ్చుకొనిన యప్పుడు
తప్పేమిటో బ్రహ్మదత్తుని యందు ?

విని వృద్ధు డీ గాథలు పలికెను :

కంటకము గ్రుచ్చుకొనుట మార్గమ్మునందు
బ్రహ్మదత్తుని లోపమ్ము బయలు పెట్టె.
జనపదమ్ము లరక్షిత స్థానము లయి
దుష్ట బల పీడితమ్ములై నష్టమొందె.

మ్రింగుదురు రాత్రి చోరులు, మ్రింగుచుంద్రు
పన్నులం గుంజువారలు పగటివేళ,
మెంపు రాష్ట్రమ్మునం దధార్మిక జనమ్ము.

భయము చెంగటనుండ, భయభీతులై
వారు కంపలు తెచ్చి వనములో నుండి
గుప్త కుటుల్ వేసికొనుచున్నారు.

విని రాజు పురోహితుని సంబోధించి "ముసలివాడు సరిగా పలికినాడు. దోషము మనదే. మరలిపోయి ధర్మానుసారముగా పరిపాలన చేయుదము" అనెను. బోధిసత్త్వుడు పురోహితునిలో ప్రవేశించి ముందు నిలిచి "మహారాజా, ఇంకను చూత" మనెను. వా రన్యగ్రామము పోవుచు త్రోవలో వృద్ధురాలి గొంతు వినిరి. ఆమె పేదది, తన కన్యల సంరక్షణ భావముతో వారి నడవికి బోవనీక తానే పోయి కూరలు, కట్టెలు తెచ్చుచుండును. ఒకనా డామె చెట్టెక్కి చిగురు కోయుచు తల క్రిందులై క్రింద పడుచు, రాజు నిట్లు దూషించెను :

ఎప్పుడు మృతినొందు నీ బ్రహ్మదత్తు ;
డీతని రాష్ట్రాన నెల్ల కన్యకలు
భర్తలు లేకుండ బ్రదుకంగ వలయు !

పురోహితుడు నిషేధించుచు ఈ గాథ పలికెను :

ఓసి దుర్మార్గురాల, నీ యుక్తులెల్ల
ననుచితంబు లనర్థదాయకము, లెచట
వరుల కన్యలకుం గొనివచ్చు రాజు ?

విని వృద్ధురా లీ గాథలు పలికెను :

పలుక నేను దుర్భాషలు బ్రాహ్మణుండ,
పదపదార్థము లెరుగుదు బాగుగానె-
జనపదంబు లరక్షిత స్థానము లయి
దుష్ట బలపీడితమ్ములై నష్టమొందె.

వివిధ కష్ట భూయిష్ఠ జీవితమునందు
దారపోషణమే యెంతొ భారమయ్యె:
వరులు కన్నెల కెచ్చట దొరకగలరు ?

విని వారు 'సరిగా చెప్పుచున్నది' అని ముందరికి పోవగా, రైతు గొంతు వినబడెను. నాగలితో నేల దున్నుచున్న రైతు వృషభము చురుకైన ములికి దెబ్బ తగులుటచే భూమిపై కొరగుచుండెను. దాని పేరు శాలీయము. రైతు రాజును దూషించుచు ఈ గాధ పలికెను :

శక్తిచే నాహతుండయి సంగరమున
పడును గావుత నేలపై పుడమిరేడు-
తగుల గూడని చోటను తగిలి ములికి
పాప మీ యెద్దు పుడమిపై బడినయట్లు.

పురోహితుడు నిషేధించుచు నిట్లనెను :

క్రుద్ధు డయ్యెద వేల దుర్బుద్ధి, బ్రహ్మ
దత్తునెడ కారణము లేక ? తప్పు నీది !
ఐన దూషించుచున్నావు మానవేంద్రు.

విని యాత డీ గాధలు పలికెను :

కోపము యుక్తమే భూపతి యెడల !
జనపదంబులయందు సంరక్ష లేదు
బలిమిమై పన్నులు పట్టెడివారికి
పీడయు, చోరుల భీతి రాతిరుల-
వండి నాకై తిండి రెండవసారి
ఆడుది కొనివచ్చునంతలో, మర్మ
మున ఘాత ఘటియిల్లె ననరుహంబునకు.

ఆవల వా రొకానొక గ్రామమున నిలిచిరి. మరునాడు ప్రాతఃకాలముననే దెబ్బతిన్న గోవు పాలవానిని తాపు తన్ని పాలతో గూడ పడవైచెను. వాడు బ్రహ్మదత్తుని దూషించుచు నిట్లనెను :

సంగరమందు పాంచాలుండు ఖడ్గ
హతిచేత తలక్రిందులై పడుగాక

ఈ దుగ్ధ పాత్రిక యీ దినమ్మునను
తలక్రింద లైనట్లు తగిలి పాదంబు.

విని బ్రాహ్మణు డిట్లనెను :

పాల్పడ హింసకు పాలిచ్చు పశువె,
దీన నేమున్నది మానవేశ్వరుని
దోష ? మూరకె ఊని దూరుచున్నావు.

బ్రాహ్మణు డిట్లు పలికిన పిదప నతడు మరల నీ గాథలు పలికెను :

బ్రాహ్మణా, నింద్యుండు బ్రహ్మదత్తుండు ;

చండ స్వభావాన మెండుగా పరుగు
వారు గోవుల పిండువారము కాము
బ్రాహ్మణా, పూర్వము, ప్రస్తుత మట్టి
యాలను బంధించి పాలు పిండుదుము
గోక్షీరముల బల్మి గోరువారలకు.

వారు సరిగా పలుకుచున్నారని వారు గ్రామము వీడి రాజ మార్గమున నగరమువైపు చనిరి. ఒక గ్రామములో పన్నులు వసూలు చేయు వారు క్షత్రియొరలకై చిత్రవర్ణము కల ఆవు దూడను చంపి చర్మ మొలిచిరి. పుత్రశోకమున తల్లిగోవు గడ్డితినక, నీరు త్రాగక విలపించుచు నిటు నటు తిరుగుచుండెను. దానిని జూచి గ్రామములోని పిల్లలు రాజును దూషించిరి :

కోల్పోయి బిడ్డను, కుందుచు నెండి
యిటు నటు దిరుగాడు నీ యావు వోలె
కోల్పోయి పుత్రుని కుందును గాక
పాంచాల రాజు శుష్కించి పోవుచును.

అప్పుడు పురోహితు డిట్లనెను :

ఎవ్వడి పశువైన నిటు నటు తిరుగు

చున్నను, వాపోవుచున్నను, బ్రహ్మ
దత్త మహీపాలు తప్పేమి దాన ?

అంతట గ్రామములోని పిల్ల లీ గాథలు పలికిరి :

బ్రాహ్మణా, అపరాధి బ్రహ్మదత్తుండు :

... ...

... ...

మెండు సుమ్మి యధార్మికులు రాష్ట్రమున,
కాని పక్షమునందు ఖడ్గధారకును,
బలి యెట్టులయ్యెను పాల్ త్రాగు దూడ ?

చక్కగా పలుకుచున్నారని వారు బయలు వెడలిరి. త్రోవలో ఎండిన చెరువులో కాకులు మండూకములను ముక్కులతో బొడిచి చంపి తినుచుండెను, బోధిసత్త్వుడొకానొక కప్పలో ప్రవేశించి, దానిచే రాజును నిందింప జేసెను :

పుత్రులతో యుద్ధభూమీ స్థలాన
పాంచాల నరపతి పడిపోవుగాక.
అటవీ నివాసుడనైన నన్నిపుడు
గ్రామ కాకమ్ములు కబళించునట్లు
తినుగాత పులుగు లాతని కళేబరము.

విని పురోహితుడు మండూకముతో సంభాషించుచు ఈ గాథ పలికెను :

సర్వ భూతములకు సంరక్షు రాజు
లీ లోకమున ఘటియింపనే లేరు,
నీవంటి వారల జీవముల్ పోవ,
మేదినీపతి యధార్మికుడు కాబోడు.

విని మండూక మీ గాథలు పలికెను :

నీవు ధార్మికుడవు కావోయి, క్షత్రి
యానుకూలమ్ముగా నాడితి విపుడు—

క్రొల్ల గొట్టెడివాని నెల్ల లోకులను
జననిందితు ప్రశంస సలుపుచున్నారు.

బ్రాహ్మణా, యిచట సత్పరి పాలనమ్ము
... ...

సాగి. రాష్ట్రమునందు శాంతి, సమృద్ధి
వరలెడు పఖాన వాయస మగ్ర
పిండాలు బలులును మెండుగా దినుచు
ముట్టకేయుండు మాయట్టి ప్రాణులను.

రాజ పురోహితులు ఈ వాక్కులు విని 'అడవి జంతువులు కప్పవరకును మనను దూషించు చున్నవి' అనుకొని నగరమునకు బోయిరి. నాటి నుండి ధర్మమార్గమున పరిపాలన చేయుచు, బోధిసత్త్వుడు చెప్పినట్లు నడచుకొనుచు వారు దానాది పుణ్యకార్యములు చేయ జొచ్చిరి.

శాస్త కోసల నరేశునకు ఈ ధర్మోపదేశనము చేసి, "మహారాజా రాజు అగతులపాలు కాక, ధర్మానుసారముగా రాజ్యము చేయవలెను" అని జాతకములు సరిపోల్చెను. ఆ సమయమున గండతిందుక వృక్ష దేవత నేనే.

———:():———

521. తేసకుణ జాతకము

శాస్త జేతవనమున విహరించుచు కోసల నరేశున కుపదేశించు రీతిని గూర్చి చెప్పినది.

వర్తమాన కథ

ఆ రాజు ధర్మోపదేశము వినుటకై వచ్చినపుడు శాస్త అతనితో "మహారాజా, ధర్మానుసారముగా రాజు పరిపాలనము చేయవలెను. రాజులు అధార్మికులైనపుడు రాజపురుషులు కూడ అధార్మికు లగుదురు" అని నాలుగవనిపాతమున చెప్పినట్లు ఉపదేశ మిచ్చి, అగతిగమన దోషమును, అగత్యగమన లాభమును గూర్చి తెలిపి కామభోగములకు స్వప్నాదికము నుండి విస్తరపూర్వకముగా నిదర్శనము లిచ్చి ఇట్లు పలికెను :

మృత్యువునకు లంచ మిచ్చుట యైన
పెనగుట యేనియు, అనిసేత యేని
విజయ మేనియు లేదు; విధివిధానమున
పడకతప్పదు మిత్తివాత నెల్లరును.

ఇట్లు పలికి శాస్త పరలోకమునకు పోవువారికై తమ శుభకర్మల కన్న వేరేమియు ఆధారములు లేవనియు, క్షణభంగుర మగుసంసారము నెడ ఆసక్తి విడువవలె ననియు స్పష్టీకరించి, విభవము పొందుటకు అప్రమత్తులై యుండవలె ననియు నిరూపించి "బుద్ధుడు ప్రాదుర్భవింపకపూర్వము ప్రాచీనరాజులు పండితుల యుపదేశానుసారముగా నడచుచు ధర్మానుగుణముగా రాజ్యము చేసి దేవలోకమున కేగిరి" అని ప్రార్థించినపిదప పూర్వజన్మకథ చెప్పెను.

అతీత కథ

పూర్వకాలమున వారాణసిలో బ్రహ్మదత్తుడు రాజ్యము చేయుచుండెను. రాజు ప్రార్థించినను కొడుకు కాని, కూతురు కాని కలుగలేదు.

ఒకనా డాయన చాలమంది యనుచరులతో ఉద్యానమునకు జని పగ లంతయు వేడుకలతో గడిపి మంగళసాలవృక్షము క్రింద ప్రక్క పరపించి కొలదిసేపు దానిపై బండుకొనెను. లేచినపుడు ఆతనిదృష్టి సాలవృక్షముపై బడెను. అందు పిట్టగూడు కానవచ్చెను. చూచినంతనే ఆయనకు ప్రీతి జనించెను. తోడనే రాజొకనిని బిలిచి "ఈ చెట్టెక్కి గూటిలో ఏమైన నున్నవో లేవో చూడు" అనెను. వాడు వృక్ష మెక్కి గూటిలో మూడుగ్రుడ్లున్నవని తెలియజేసెను. తోడనే బుట్టలో దూది పరచి అందు గ్రుడ్ల నుంచి మెల్లగా దిగి రమ్మని చెప్పెను. ఆ ప్రకారమే చేసి వాడు దిగినంతనే రాజు అమాత్యులతో ఇవి వేనిగ్రుడ్లు అనెను. "దేవా, మాకు తెలియదు. వేటకాండ్రకు తెలియును" అని వారు బదులు చెప్పగా ప్రభువు వెంటనే పిట్టలవాండ్రను పిలిపించి అడిగెను. "దేవా, ఒకటి గుడ్లగూబగ్రుడ్డు, రెండవది గోరువంకది, మూడవది చిలుకది" అని వారు విన్నవించిరి. "ఒకగూటిలో మూడురకముల పిట్టల యండము లుండునా?" "దేవా, చిత్తము! అపాయము లేనపుడు పెట్టిన అండములు సురక్షితముగా నుండును." రాజు సంతుష్టచిత్తుడై ఈ మూడు అండములు నా బిడ్డలే అనుకొందును అని తల వోసి వానిని ముగ్గు రమాత్యులకిచ్చి "ఇవి నా సంతాన మగును. వీనిని మీరు బాగుగా పెంచవలెను. గ్రుడ్లు చితికి పిట్టలు పైకి వచ్చినపుడు నాకు తెలుపవలెను" అని రాజు ఆనతిచ్చెను.

వారు వానిని చక్కగా కాపాడుచుండిరి. మొదట గ్రుడ్డు చితికెను. తోడనే అమాత్యుడు పిట్టలవానిని పిలిపించి. 'ఇది మగదా యాడుదా' అని యడిగెను. వాడు బాగుగా పరిశీలించి మగది అని చెప్పగా, అమాత్యుడు రాజసన్నిధి కరిగి "దేవా, తమకు పుత్రుడు లభించినాడు" అని విన్నవించెను. రాజు సంతుష్టచిత్తుడై ఆతనికి బహుధన మొసగి పుత్రుని బాగుగా పెంచి వేస్సంతరుడు అని పేరు పెట్టుమని పీడ్కొలిచ్చెను. ఆత డాప్రకారమే చేసెను.

తరువాత కొలదిరోజులకు గోరువంకగ్రుడ్డు చితికెను. అమాత్యుడు పిట్టలవానిని పిలువనంపి, వాడు ఆడుది అని చెప్పగా రాజసన్నిధికి పోయి "దేవా, తమకు పుత్రిక లభించినది" అని విన్నవించెను. రాజు సంతుష్ట

చిత్తుడై ఆయనకు ధన మొసగి నా పుత్రికను బాగుగా పెంచి కుండలిని అని పేరు పెట్టుమని వీడ్కొనెను. రాజు చెప్పినట్లే ఆతడు చేసెను.

కొలదిరోజులకు చిలుకగ్రుడ్డు చితికెను. అమాత్యుడు వేటకానిచే పరీక్ష చేయించి, అది మగదని నిర్ధారణ అయినపిదప రాజసన్నిధి కరిగి "దేవా, తమకు పుత్రుడు లభించినాడు" అని విన్నవించెను. సంతుష్టచిత్తుడై రాజు ఆయనకు ధన మొసగి, నా కుమారునకు వైభవముతో పోషణ జరుపుము, జంబుకు డని పేరు పెట్టుము అని వీడ్కొలిచ్చెను. అమాత్యు డట్లే కావించెను. ఆ మూడుపిట్టలు ముగ్గు రమాత్యుల మందిరములలో రాజ కుమారులవలె పెరుగుచుండెను. రాజు వారిని నా పుత్రులు, నా పుత్రిక అనుచుండెను. అమాత్యులు పరస్పరము నవ్వుకొనుచు "రాజుగారి చర్య చూడుడు. పక్షులను తనబిడ్డ లనుచు తిరుగుచున్నాడు!" అనుకొనుచుండిరి. రాజు తనతో "అమాత్యులకు వీని బుద్ధికుశలత తెలియదు. నేను ప్రకటీకరింతును" అనుకొనెను.

ఒకనాడు రాజు అమాత్యు నొకనిని వేస్సంతరునికడకు బంపి, "మీ నాయనగారు నిన్ను ఏవో అడుగగోరుచున్నారు. ఎప్పుడు రావొచ్చునో కనుగొని రమ్ము' అని పంపెను. అమాత్యుడు వేస్సంతరునికడ కరిగి నమస్కరించి, సందేశము తెలిపెను. నిజపోషకు డగు అమాత్యుని సంబోధించి వేస్సంతరుడు "మా నాయనగారు నన్నేవో అడుగదలచినారు. వా రిక్కడికి వచ్చినప్పుడు సమాదరింపవలెను. ఎప్పుడు రావచ్చు నని వారు కోరినారు" అనెను. "నేటి కేడవనాడు" అను మాటలు విని వేస్సంతరుడు వచ్చిన అమాత్యునకు ఇట్లు విన్నవించి వీడ్కొలిచ్చెను. ఆతడు చని ప్రభువునకు విన్నవించెను. ఏడవనాడు రాజు నగరమున చాటబంచి పుత్రుని నివాసమున కరిగి ఆతనిసత్కార మందుకొని అతనియింటనే భోజనము చేసి, మహానందముతో నిజనివాసమునకు మరలి వచ్చి, రాజాంగణమున పెద్దమంటపము సిద్ధము చేయించి, నగరమున మరల చాటబంచి, అలంకృత మంటపమునబహుజనమధ్యమున కూరుచుండి, వేస్సంతరుని కొనిరావలయు నని అమాత్యునకు సందేశ మంపెను. అమాత్యుడు బంగరుపీఠముపై వేస్సంతరుని కొనివచ్చెను. పిట్ట తండ్రియొడిలోనికి జేరి కొంచెము తడవు క్రీడించి మరల స్వర్ణాసన

ముపై వాలి కూరుచుండెను. ప్రభువు మహాజనసమ్ముఖమున పిట్టను రాజ ధర్మము లడుగువాడై ఈ గాథ పలికెను :

వేస్సంతరా, ప్రశ్న వేయుదు : నీకు
భద్రమయ్యెడుగాక ! పరిపాలనేచ్ఛ
లెట్టి కార్యము లాచరించుట మేలు ?

విని వేస్సంతరుడు ప్రశ్నమునకు సమాధానము చెప్పక, రాజు ప్రమత్తుడు కావచ్చు నను దోషారోపణము చేయువాడై యీ గాథ పలికెను !

కంసుతండ్రి ప్రమత్తుండు కాశిరాజు
ఎన్నడో పూర్వమం దడిగించినాడు
సూనుచే అప్రమత్తుండ నైన నన్ను.

ఇట్లు దోషారోపణము చేసి, "మహారాజా, మూడుధర్మములలో స్థిరుడై రాజు పరిపాలనము చేయవలెను" అని రాజధర్మము లుపదేశించు వాడై వేస్సంతరు డీగాథలు పలికెను :

అనృతమును, క్రోధమును, పరిహాస మాది
లో నివారించి కార్యముల్ పూనవలయు-
క్షత్త్రియా, దీని వ్రత మండ్రు ఋష్మవిభులకు.

తాను మును జేయుపని కనుతాప ముందు
తప్పకుండగ నన్నచో, దాని మరల
రాగమున, ద్వేషమున జేయరాదు బాబ !

రాజ్యవర్ధన, మత్తునిరాష్ట్రమందు
తొలగు భోగము, లాతని దుష్టు డండ్రు.

ఎవ్వ డుత్థానవీర్యుడో యెవ డసూయ
నెరుగడో, వానికడ నుండు మిర్వురమును
అనిరి శ్రీయును లక్ష్మియు నడిగినపుడు.

దుష్టహృదయు, డీర్ష్యాళువు, దుష్టకర్ము
డైనవానిని పెద్దమ్మ ఆశ్రయించు
సకలకల్యాణ భంజనశక్తి, రాజ!

సకల హితచింతకుండవు, సహృదయుడవు
నగుచు లక్ష్మీనివాసుడ వగుము రాజ!
పారద్రోలి అలక్ష్మిని దూరముగను.

శ్రీయుతుండును, సముదారచిత్తుడు, ధృతి
మంతుడగువాడు నిజశత్రుమండలమును
కాశిరాజ, సమూలమ్ము పెకల్చు.

శక్రు డైన, పరాక్రమశాలియెడల
నెట్టికష్టము తలపెట్ట, డిద్ధవీర్య
వంతు డగువాడు శుభకర్మ సంతరించు
చున్నయెడ ననురక్తుడై యుండు రాజ!

స్థిరచిత్తు డగురాజు దేవగంధర్వ
పితరుల రక్షలో విహితు డై యుండు.
అప్రమత్తుండు వీర్యాన్వితుం డైన
రాజును దేవతల్ రక్షింతు రెపుడు.

కాన, ననిందితకార్యముల్ చేయు
మప్రమత్తతతోడ: అలసప్రయత్న
కారికిసౌఖ్యముల్ కలుగవు రాజ!

ఇదె యనుశాసన, మిదియే వ్రతంబు
సఖులకు భద్రంబు, శత్రుసంతతికి
సంతాప మొసగగా జాలు నియ్యదియె.

బుద్ధునివలె వేస్సంతరు డిట్లు పలుకగా జనసమూహ మాశ్చర్యచకితమై బహువిధముల సాధువాదము చేసెను. రాజు ప్రసన్నుడై మంత్రులను పిలుపనంపి "అమాత్యులారా, నా కుమారుడు వేస్సంతరుడు చెప్పినది యెవరి

కాచరణీయము ?" అనెను. "దేవా, మహాసేనరక్షకునకు యోగ్యమైనది."
"అగుచో ఇతనిని మహాసేన రక్షకపదవియందు నియోగింతును" అని రాజు
అటులే కావించెను. వేస్సంతరుడు తండ్రిపనువులు నెరవేర్చుచుండెను.

[వేస్సంతర ప్రశ్న సంపూర్ణము]

కొలదిదినముల కావల వెనుకటివలెనే కుండలినికడకు దూత నంపి,
పడవనా డచటికి జని, మరలి వచ్చి, రాజు ఆ మంటపముననే గూరుచుండి
కుండలినిని బిలిపించెను. బంగరుపీఠమున నాసీనయైన కుండలినిని రాజ
ధర్మము లడుగువాడై రాజు ఈ గాథ పలికెను :

ప్రశ్నకు ప్రత్యుత్తరంబు నీయంత
ఈయ గల్గినశక్తియే యున్న, కుండ
లిని, క్షత్రియసహోదరీ, రాజ్యపాల
నేచ్ఛవు చేయుట యేవనుల్ మేలు ?

కుండలిని "నాయనగారూ, స్త్రీజాతి ప్రత్యుత్తరము చెప్పగలుగునా
యని తమరు యోచించియుందురు. సమస్త రాజధర్మములను రెండుశబ్ద
ములలో అంతర్గతము చేసి చెప్పుదును" అని యీ గాథలు పలికెను :

అప్రాప్తవస్తుసంప్రాప్తియు, ప్రాప్త
వస్తురక్షణ యనువాని రెండింటి
నాధారముగ నుండు నఖిలప్రతిష్ఠ.

నీయమాత్యులయందు నేరుపుతోడ
పానము, ద్యూతము, వంచనలేని
వారల, యోగ్యుల, ధీరుల, నర్థ
కోవిదులను నేరికోవలె బాబ !

రథహయంబులను సంరక్షణ చేయు
నట్టిసూతుల బోలు నర్థరక్షకుల
చేతనే కార్యముల్ చేయింపవలయు.

ఆంతరంగికులనే అంతికమందు
నిలుపుకోవలయును; నిధిలోన ధనము
వేయుట, తీయుట స్వీయకార్యములు-
అన్యవాక్కులబట్టి యాచరింపకుము.

ఆదాయమును, వ్యయం, బాదరణీయ
సంభావనము, దండ్యజన దండనమ్ము
స్వయముగా నొనరింపవలయు కృత్యములు.

స్వయముగా జనపదవాసుల కీవు
ధనమార్గదర్శకత్వము వహింప
నప్పు, డధార్మికు లౌ కరగ్రాహు
లర్థ, రాష్ట్రవినాశ మాచరించెదరు.

త్వరపడగూడదు తాను కృత్యముల,
పెరవారలం ద్వరపెట్టగా రాదు;
శీఘ్రమ్ముగా పనుల్ చేయుమూర్ఖుండు
ఆవల పరితాప మందగా వలయు.

కావల దెన్నండు నీవు క్రుద్ధుడవు
ఒడలుపై నెరుగక; చెడిపోయినారు
కులవంతు లౌవారె క్రోధవశాన.

సర్వాధికారినన్ సంభ్రమమ్మునను
కాబోకుమి అనర్థకారి వస్తువులకు,
నారీజనులకైన నరులకునైన
ఘటియిల్లరాదు దుఃఖమ్ము నీవలన.

కామానుసారి యాభూమీశుభోగ
సంజాత మంతయు నమసిపోవు
అన్యరాజులు వాని నందురు పాపి.

కావున నిది నీకు కర్తవ్య మగును,
అనుశాసనముగూడ నగును నీ కిద్ధి.
కావించుచును పుణ్యకార్యంబు లింత,
దక్షుండ వగుచు. బాధలుపెట్ట కొరుల,
మానుచు మద్యంబు, మంచియాచార
ముల ననుష్ఠింపుము; మూర్ఖుండు పోవు
నరకమ్మునకు దురాచరణవశాన.

రాజు సంతుష్టచిత్తుడై అమాత్యులను బిలిచి "అమాత్యులారా, నా పుత్రిక కుండలిని చెప్పినది ఎవరికర్తవ్యము ?" అని యడిగెను. "దేవా, ఖజాంచీ కర్తవ్యము" అని వారు చెప్పగా రాజు "అట్లయినచో ఆమెను అర్థమంత్రిపదవియందు నియోగింతును" అని ఆ పదవి యామె కిచ్చెను. నాటినుండి యామె తండ్రిపనుపు నెరవేర్చుచుండెను.

[కుండలినీ ప్రశ్న సంపూర్ణము]

ఆ తరువాత కొలదిరోజులకు రాజు వెనుకటివలెనే జంబుక పండితుని కడకు దూతను బంపి, యేడవనాడు అచటికి బోయి, ఆనంద మనుభవించి వచ్చి, మంటపమధ్యమున గూరుచుండెను. అమాత్యుడు జంబుకపండితుని బంగరుపీఠమున నునిచి శిరముపై మోసి తెచ్చెను. జంబుకపండితుడు తండ్రి యొడిలో వాలి, క్రీడించి, మరల స్వర్ణపీఠమున జేరెను. అతనిని ప్రశ్నించు వాడై రాజు ఈ గాథ పలికెను :

వేస్సంతరుని ప్రశ్న వేసినవాడ,
అట్లు కుండలినిని అడిగినవాడ,
బలములం దుత్తమబల మేదో యిపుడు
జంబుకా, వివరింపు చక్కగా మాకు.

సామాన్యులవలె గాక విశేషరూపమున రాజు తనను ప్రశ్నించె నని తలచి జంబుక పండితుడు "అట్లయినచో ప్రభూ, సావధానముగా వినుము. అంతయు వివరింతును" అని చాపినచేతిపై వేలకొలది నాణెముల సంచిని నిలుపువిధమున ధర్మోపదేశము ప్రారంభించెను :

బలము లోకంబున పంచవిధంబు :
భూరినిమ్నంబు శారీరకబలము,
అగును రెండవది భోగ్యద్రవ్యబలము
ప్రభువరేణ్యా, అమాత్యబలము మూడవది
ఆభిజాత్యం బగు నావలిబలము
విబుధులు గ్రహియింత్రువీని నన్నిటిని.

ప్రథమగణ్యం బగు ప్రజ్ఞాబలంబు
ప్రజ్ఞాబలాన్విత పండితోత్తముడు
సకలార్థసంగ్రహ శక్తిమంతుండు.

ఒకవేళ మందబుద్ధికి ధనధాన్య
పరిపూర్ణమౌభూమి ప్రాప్తించెనేని
ఆయనిచ్ఛకు బట్టి, అభిభూతు జేసి
ప్రజ్ఞ కల్గినవాడు బల్మి హరించు.

ఆభిజాత్యము కల్గి నట్టిక్షత్రియుడు
వంశపరంపరా ప్రాప్త రాజ్యంబు
నైనను ప్రజ్ఞావిహీను డైనపుడు
కనుగొన లేడు యోగక్షేమములను.

ప్రజ్ఞచే వినబడువాక్య నిర్ణయము,
ప్రజ్ఞచే కీర్తి ప్రపంచిత మగును.
బాధాపరంపర పైకొనువేళ
నైతము ప్రాజ్ఞుండు శాంతితో నుండు.

ప్రజ్ఞ బహుశ్రుత పరిచర్య చేయ
కెవ్వని కేనియు నెట్లు లభించు ?
మరి ధర్మబోధ మే తెరగున నగును ?

ఎవడు ధర్మవిభాగ మెరిగి సకాల
మందు లేచుచు నిద్ర ఆలసింపకయ
చేయు కర్మలు, వాడు సిద్ధిని గాంచు.

ఎవడు దురాచారు లవువారితోడ
సాంగత్య మొనరించి, స్వయముగ మంచి
యాచారముల నెన్న డనుసరింపండో
వానికర్మలు ఫలప్రదములు కావు.

అధ్యాత్మచింతనమందు మనస్సు
నిల్పి, పొందుచును తన్నిష్ఠాత్ము లైన
వారి సంగతి, సదాచారు లైనట్టి
వారికర్మలు ఫలవంతంబు లగును.

కరణీయశక్తి, సంగ్రహణసంరక్ష-
పాలించుచుండుమీ బాబ, యీ జంట
అడగు దుర్కర్మల నఖిలవైభవము,
కూలిపోవును గడ్డికొంప విధాన.

ఈ విధముగా బోధిసత్త్వుడు పంచబలముల వర్ణనము చేయువాడై ప్రజ్ఞాబలమును చంద్రమండలమువర కెత్తుచు ఈ గాథలద్వారా రాజున కుపదేశ మిచ్చెను :

తల్లిదండ్రులయెడ ధర్మంబు నెరప,
క్షత్త్రియా, లభియించు స్వర్గపదమ్ము.

దారపుత్రులయెడ ధర్మంబు నెరప
క్షత్త్రియా, లభియించు స్వర్గపదమ్ము.

నీదు మిత్రామాత్య నివహంబునెడల
భవదీయ వాహనబలముల యెడల
నీదుగ్రామంబుల నిగమాలయెడల
శ్రమణ భూమీసుర సంఘాలయెడల
పశువులయెడలను పక్షులయెడల
కరణీయముల నెల్ల కావించునెడల
క్షత్త్రియా, లభియించు స్వర్గపదమ్ము.

అగు సుఖదాయి ధర్మాచరణమ్ము
స్వర్గమునకు జేరువాడ వద్దాన.
ధర్మముచేత నే ధాత, శక్రుండు,
దేవతల్ పొందిరి దివ్యలోకములు.

ఇట్లు పలికి ఇంకను ఉపదేశ మిచ్చువాడై జంబుక పండితు డీగాధ పలికెను :

ఇదె యనుశాసన, మిదియే వ్రతంబు
శుభకర్మలను చేయుచుండుము, కమ్ము
సర్వవేత్తవు ప్రాజ్ఞసాంగత్యమునను.

ఇట్లు బోధిసత్త్వుడు ఆకాశగంగను అవతరింపజేయు బుద్ధునివలె ఉపదేశ మిచ్చిన పిదప జను లాయనను సత్కరించి బహువిధముల సాధువాదము చేసిరి. రాజు సంతుష్టచిత్తుడై అమాత్యులను పిలిచి "అమాత్యులారా, ఎర్రని నేరేడుపండు వంటిముక్కు గల నా పుత్రుడు జంబుక పండితుడు చెప్పినది ఎవరికర్తవ్య మగును ?" అనెను. "దేవా, సేనాపతిది." "అగుచో ఈతనికి సేనాపతిపదవి నిత్తును" అని రాజు జంబుక పండితుని సేనాపతిపదవిలో నియోగించెను. నాటనుండి అతడు తండ్రిపనుపు నెరవేర్ప సాగెను. మూడు పిట్టలకును సమాదరము కలిగెను. మువ్వురును ధర్మార్థములను అనుశాసించిరి. బోధిసత్త్వుని యుపదేశానుసారముగా రాజు ప్రవర్తించుచు దానాది పుణ్యకార్యములు చేయుచు తుదకు స్వర్గగామి యయ్యెను. అమాత్యులు రాజునకు అపరకర్మలు చేసి పక్షులను పిలిచి, "స్వామీ, జంబుకపండితోత్తమా ! రాజు మీకు రాజ్యాధికారము ఈయవలసిన దని చెప్పినారు" అని విన్నవించిరి. బోధిసత్త్వుడు "నాకు రాజ్యముతో పనిలేదు. మీరు అప్రమత్తులై యుండి పరిపాలనము చేయుడు" అని, లోకులను శీలముల యందు ప్రతిష్ఠించి, ఇట్లు న్యాయుగా నడుచుకొనుడు అని, న్యాయధర్మములు బంగారుపట్టికపై వ్రాయించి అడవిలోని కెగిరిపోయెను. ఆయన యుపదేశము 40 వేల సంవత్సరముల వరకును నడచెను.

శాస్త రాజు కుపదేశము చేయు రీతిపై ఈ ధర్మోపదేశనము చేసి రెండు జాతకములు సరిపోల్చెను. ఆ కాలమున రాజు ఆనందుడు; కుండలిని ఉత్పలవర్ణ; వేస్సంతరుడు సారిపుత్రుడు; జంబుకపక్షి నేనే.

— (o) —